# వ్యాసములు - 1

## స్వామి ఓంకార్

**శ్రీ శాంతి ఆశ్రమం**
శాంతి ఆశ్రమం పోస్ట్
(వయా) శంఖవరం - 533 446
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్
(మొ) 7382009962
ewmail : srisanthiashram@gmail.com
www.srisantiashram.org.in

# విషయసూచిక


1. అతిథి దేవోభవ - రాత్రి దైవము వచ్చెను 2
2. అసాధ్యము - దుర్లభము 7
3. అద్భుతమైన ఆధ్యాత్మికానుభవము 12
4. అసూయ 14
5. అవ్యక్తము - వ్యక్తము 17
6. అభిమన్యు విహారము 20
7. అయి! మురళి! 24
8. అందరికంటె భాగ్యవంతుడు 26
9. అత్యధిక సుఖవంతుడు 31
10. అద్భుతము 38
11. అమూల్య శాంతి నిధి 40
12. అంధత్వము 44
13. అహం బ్రహ్మో-స్మి 45
14. ఆశ్రమ స్థాపనలు 49
15. ఆరు తాడిచెట్లు 51
16. ఆశ్రమ సందర్శనము 54
17. ఆదర్శ జీవితము 58
18. ఆత్మోద్ధరణ పద్ధతి 59
19. ఆవేదన 61
20. ఆనందాశ్రమము 63
21. ఆశ్రమావస్థలు 67
22. ఆశ్రమ సంపదలు 73
23. ఆత్మీయులకు ప్రత్యేక లేఖ 79
24. ఆనంద వార్త 81
25. ఆనందము 83
26. ఆత్మజ్యోతి 84



# విషయసూచిక



27. ఆదివరాహము 89
28. ఇసుక మేడలు 91
29. ఇదియును వెళ్ళిపోవునదే 94
30. ఇతరమార్గమేదియు లేదు 96
31. ఈ శరీరమును వదలిన తర్వాత 98
32. ఈ విశ్వమంతా నా గృహము 105
33. ఊరేగింపులు 108
34. ఉపదేశములు 111
35. ఉపవాసము నుండి విందు 117
36. ఎన్నికల సంరంభము 120
37. ఏమని పిలుతునురా ! 124
38. ఏబది రూపాయలు 128
39. ఏమని పిలుతునురా? 130
40. ఏకాదశి 133
41. ఐదు క్షణములలో బ్రహ్మ సాక్షాత్కారము 136
42. ఒకే కాలము -ఒకే పని 139
43. ఓ యువకుడా ! ముదుసలివలె నడచుచుంటివి అదియేల? 141
44. ఓంకారుని మనోవేదన 143
45. ఆకాశయానము 146

# అతిథి దేవోభవ - రాత్రి దైవము వచ్చెను

'ఇందుగలడందు లేడని
సందేహమువలదు; చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందేకలడు, దాన వాగ్రణివింటే'

–శ్రీమద్భాగవతము.

గతరాత్రి భగవంతుడు నిర్వాణాశ్రమమునకు విచ్చేసెను. ఎంత యానందము! ఎంత యదృష్టము! అయినను, ఆయన నెవరును గర్తించకుండుట మిక్కిలి దురదృష్టము. ఆయన చీకటిలో వచ్చెను. వచ్చిన చోటికే తిరిగి వెడలిపోయెను. వెడలిన తరువాత ఆయనకొఱకు పరితపించితిమి. ఆయన వెడలిన దారి ననుసరించితిమి. చీకటిలో వెదకితిమి. ఎంత పిలిచినను, అఱచినను లాభము లేకపోయెను. భాగ్యవశమున నొకసారి యియ్యబడిన యవకాశము మఱల నియ్యబడదుగదా! అట్టి మహత్తరమయిన అవకాశమును జారవిడుచుకొనువారెంత మందభాగ్యులు! నిన్న మధ్యాహ్నము కొందరు ఆశ్రమవాసులు, భక్తులు నిర్వాణాశ్రమమున నాకడకు వచ్చిరి. ప్రార్థన, ధ్యానము, ప్రణవగానము అయిన పిమ్మట, వారు ఆశ్రమ వ్యవహారములను గురించి వాద ప్రతివాదములు జరిపి బిగ్గరగ కేకలుకూడ వేసికొనిరి. నాకు మిక్కిలి సిగ్గయ్యెను. వారు, తమ కెదరుగనున్న శ్రీకృష్ణ, బుద్ధ, ఏసు, గాంధి విగ్రహములను చూచియయినను తమ ప్రాపంచిక ధోరణిని కట్టిపెట్టరయిరి. అవతారమూర్తులు కూడ వారి నడతకు చింతించుచుండిరని తలంచుచు, నేను విగ్రహములనే చూచుచు నుండిపోయితిని.

నిర్వాణ మందిరములో నిశ్శబ్దముగ జరుగవలసిన ప్రార్థన ధ్యానాదులకు బదులు, వాదప్రతివాదములు, అల్లరి జరిగెనని నాకు హృదయభారము కలిగెను. మనసు చింతాకులితమయ్యెను. నిర్వాణమందిరమును మరల పవిత్రము చేయుటెట్లని యాలోచించి, సాయంకాలము శాంతి సమావేశము నేర్పరచి, ఉపాహారములతో, సంగీతముతో నాధ్యాత్మిక విందు నారగించుట కందరి నాహ్వానించితిని. భక్తబృందమంతయు వచ్చెను. శ్రీ డాక్టరుగారు, శ్రీ రాజా బెన్నయ్యగారు, పిఠాపురపు భక్తులు, మొదలైనవారు, అందరును వచ్చిరి. శ్రీ దాదాజీ గానముతో సభ యారంభమయ్యెను. శ్రీ డాక్టరు మార్కండేయులు గారొక యుద్గ్రంథము నుండి, **'వైద్యుడా! మొదట నిన్ను నీవు బాగుచేసికొనుము'** అను నధ్యాయమును చదివి, తెనుగులోని కనువదించి చెప్పి యెల్లర నానందపరచిరి. దాని సారాంశమిది : 'ఆహారమును మితముగ, నియమముగ, సకాలమునకు తీసికొనవలయును. మితములేని భోజనమే సర్వవ్యాధులకు మూలము ప్రతిదినము వ్యాయామవ

సరము. దానిచే శరీరమునకు కదలిక కలుగును. ఆహారమెంత స్వల్పమయినను, బాగుగ నమిలి మ్రింగవలెను. సాత్వికాహారము శ్రేష్టము, కాఫీ, టీ, సారాయము మొదలగువానిని దూరముగ నుంచవలెను. ఇవి చక్కని యారోగ్య సూత్రములు. ముఖ్యముగ, కోపము, గర్వము, భయము అనునవి, రక్తమును విషముగ మార్చును. వానినెన్నడును, ఎట్టి స్థితి యందయినను దరికి రానీయరాదనియు, ప్రేమ, శాంతి, ఆనందములతో నిండియుండి, తఱచు నవ్వుటచే, ఆరోగ్యమునకు, చిరజీవితమునకు తోడ్పడుననికూడ నొక్కిచెప్పిరి.

పిమ్మట శ్రీ దాదాజీ హిందూస్థానీగానము చేసిరి. గురుకుల బాలికలు పాడిరి. చి॥ ఇందిర శాంతిప్రార్థన చేసెను. బృందప్రణవగానముతో సభ సమాప్తమయ్యెను. బాలబాలికలకు ఆకలి వేయుచుండెను. చీకటిపడెను. ఫలహారములు వచ్చినవి. కుమారి జ్ఞానేశ్వరి, చి॥ శాంతి మొదలగువారు వడ్డన చేయుచుండిరి. ఇదియంతయు నిర్వాణ మందిరపు పయిభాగమున జరిగెను. నక్షత్రములు భక్తులవిందు నానందముతో లెక్కిం చుచున్నవో యనునట్లు దగ్గఱగ నున్నట్లు ప్రకాశించుచుండెను. అంతలో దూరమున పర్వతము మీది నుండి యొక యార్తనాదము వినవచ్చెను. ఏదో పశువు, మేక, గొఱ్ఱె తప్పిపోవుటచే, కాపరి దానిని వెదకుచు కేకలు వేయుచుండెనని తలంచితిని. కాని మరల మరల నార్తనాదము వినబడుచునే యుండెను. భయముతో కూడిన కేకలుకూడ వినపడుచున్నవి. అచటనొక ముసలివాడు, పొట్టపోసుకొనుటకు మామిడితోట నొకదానిని కాపుగాయుచున్నాడు. చీకటిలో రెండు ఎలుగుగొడ్లు పోరాడుచు, తనను సమీపించ నతడు భయపడి కేకలు వేసెను. భక్తులందరును తృప్తిగ ఫలహారముల నారగించి, ప్రణవగానముతో క్రిందికి దిగిరి.

భక్తులలో కొందరు పిఠాపురము మొదలగు స్వగ్రామములకు వెడలిపోవుచు న్నందున, వారికి చెప్పవలసిన విషయములను చెప్పుచు నేను పనితొందరలో నుంటిని. కొండపైన ఎలుగులను చూచి భయపడి యఱచిన ముదుసలి క్రిందికి వచ్చి, వసారాలో పండుకొనుటకు స్థలమిమ్మని యడిగెనట. వెలుపలనున్న మరల నేవయిన నడవిజం తువులు రావచ్చుననియు, అతనిని ఆశ్రమమునకు గొనిపోయి, భుజింపచేసి పండుకొను మని యాశ్రమవాసులతో చెప్పి మరల నేను నాపనిలో నిమగ్నుడనయితిని.

మొదట నంగీకరించియు, పిమ్మట నాశ్రమమునకు పోవుట కిష్టపడక యా ముదుసలి, తోటవదలి రానని చెప్పి కటిక చీకటిలో తన దారిన పోయెను. శ్రీ జగదీశ్ అను నాశ్రమభక్తుడు, లాంతరు సహాయముతో నతనిని వెనుకకు రమ్మని బ్రతిమాలసాగెను. అతడు నిరాకరించి, తన తోటవంక పోవుచు కొండ నెక్కెను.

నాపని పూర్తియయిన పిమ్మట, ఆ ముదుసలి బీదనారాయణున కేమయిన ఫల హారము నిచ్చితిరాయని యడిగితిని. అప్పటికందరును వెడలిపోయిరి. పనితొందరలో

నతనికి ఫలహారము నిచ్చుట మరచిరని తెలియవచ్చెను. అందరును సుష్టుగ నారగించిరి. కాని భయభ్రాంతుడయి వచ్చిన బీదవానిని మఱచిపోయిరి. అతనికి దాహోపశాంతికి మంచినీరయిన నిచ్చినట్లు లేరు. అతని చుట్టును చేరి ఎలుగుగొడ్లను గురించి ప్రశ్నించుచు పరిహాసము చేయుచున్నట్టు నాచెవిని పడుచుండెను. పిమ్మట నాలోచించగ, గొప్ప యపరాధము చేసినట్లు తోచి నా హృదయము బరువయ్యెను. మనసు చింతలోపడెను. భగవంతుడనేక నామరూపములతో, కుంటి, గ్రుడ్డి, ముసలి, రోగి రూపములతో వచ్చి మనను పరీక్షించుచుండును. అంత నా బీదనారాయణుని వెదుక నారంభించి కేకలు వేసితిమి. మరల రావచ్చునని సగము రాత్రివరకు వేచియుంటిమి. నిద్రరాదయ్యెను. ఎంతగొంతు చించుకొని యరచినను, నారాయణ స్వరూపుడు రాడయ్యెను.

భక్తవిజయము మున్నగు గ్రంథములలో, భగవంతుడు, శునకవరాహ రూపములలో కూడ పరీక్షించుచుండునని వ్రాయబడియున్నది. కొందరు భక్తులు **"భగవాన్! నేను నీకొఱకయి పరితపించుచుండ నేలదర్శనమియ్యవు"**? అని యాక్రోశించుచుండ, **భగవానుడు, 'నేను శునకరూపముననో వరాహరూపముననో, నిరుపేదరూపముననో వచ్చియుంటిని. నీవు నన్నాదరించుటకు బదులు, కొట్టి తరిమివేసితివి.'** అని సమాధానమిచ్చినట్లు చెప్పబడియున్నది.

శ్రీ భగవద్గీతలో, శ్రీకృష్ణభగవానుడు, భక్తుడు, నిజమయిన భక్తిశ్రద్ధలతో, ప్రేమతో నర్పించిన దేనినయినను, తుదకు, పత్రము, పుష్పము, ఫలము, తోయమునయినను, ప్రేమతో స్వీకరింతునని సెలవిచ్చియున్నాడు.

**బైబిలులో, 'నీయొద్దకు వ్యాధిగ్రస్థునివలె, నిరుపేదవలె నాకలిగొని వచ్చితిని, వస్త్రహీనుడుగ వచ్చితిని, నాకు భోజనమిడక, వస్త్రమియ్యక, నిరాదరించి తరిమివేసితివి'** అని క్రీస్తుప్రభువు చెప్పియుండెను. ఈ మహాపురుషుల మహావాక్యములను స్మరిచుటచే మనసులో నారాటమినుమడించెను. మండుచున్న అగ్నిలో నెయ్యివేసినట్లు, దగ్గరనున్న యొక శ్రీసాయి భక్తురాలు, శ్రీ సాయికూడ శునకరూపమున వచ్చి నిజభక్తులను పరీక్షించుచుండెనని శ్రీసాయిసచ్చరిత్రములో వ్రాయబడినట్లు చెప్పెను. అపుడు మాయెదుట నొక శునకము కనుపించెను. అదృష్టహీనులమయి యొక సదవకాశమును పోగొట్టుకొంటిమి. ఈ యవకాశమయినను చేయివిడువరాదని యెంచి, శునకరూపమున నున్న యా దైవమునకు ఫలహారమర్పించి కొంత తృప్తిపడితిమి. మరల మేడమీదికి మనుష్యులను పంపి యా ముసలి తాతకొరకు బిగ్గరగ నెన్ని కేకలు వేయించినను, అతడు పలుకడయ్యెను. ఎన్నిసారులు పిలిచినను పలుకపోవుటచే అసలు కొండమీద మామిడితోట యున్నాదా? ఉండిన దానికొక కాపరి యున్నాడా? ఆ వచ్చిన ముసలివాడతడేనా?' యని నాకు మొదటికే సందేహము కలిగెను.

కొందరి జీవితములలో, పూర్వసుకృతముచే సదవకాశములు లభించినను, మానవులుతాత్కాలికమగు పనితొందరలో, వానిని చేయజారవిడుచుచుందురు. గతించిన క్షణము మరల వచ్చునా? ప్రవాహములో విడచిన వస్తువు మరల లభించునా?

శ్రీ త్యాగయ్యగారు **'చీమలో, దోమలో'** అను చక్కని కృతిని వ్రాసి యున్నారు. దైవము మానవులలోనేగాక, పశుపక్ష్యాదులలోకూడ, చివరికి, చీమలలో దోమలలోకూడ ప్రత్యక్షమగుచుండును. అద్వైతానుభవముతో పరీక్షించినచో, భగవంతుడు, కుంటి గ్రుడ్డివాని రూపమున, పశుపక్ష్యాదుల రూపమున చీమ దోమ రూపమున వచ్చుచుండు నను నదికూడా సరికాదని చెప్పవలసియున్నది. ఈశావాస్యోపనిషత్తులో, **'ఈశావాస్య మిదం సర్వమ్'** అనగా, జగత్తంతయు నీశ్వరునకావాసమని చెప్పబడినది. **సర్వము నీశ్వరుడేనని, ప్రతి యాకారము విష్ణురూపమేనని** చెప్పబడినది.

దైవములేని తావు సూదిమొన యంతయయినను లేనపుడు, సర్వము దైవమేగాక మరేమగును? సర్వము దైవముచే నిండి నిబిడీకృతమయి యుండ, దైవము మరల వేరు ఆకారములో రానేల? అందుచే సర్వమును దైవముగ, సర్వమునందును దైవమును చూచుట మన విధి.

అంతయు నానందముగ, సుఖముగ నున్నపుడు అందరిలోను భగవంతుని చూడవచ్చును. కాని, విషమ పరీక్షలలో, ప్రవృత్తిపరులచే దూషణమునకు లోనయినపుడు, భగవంతుని చూడగలమా? ఈమధ్య వంటశాల సమీపమున గల ఇంటిలోనికి త్రాచుపాము వచ్చెను. భయపడి యందరును పారిపోయిరి. పాములో కూడ భగవంతుని చూడవచ్చునని యెవరినుండియు నేను వినియుండలేదు. ఇది సాధ్యమా? తప్పక ముమ్మాటికి సాధ్యమే?

విరోధిలో దైవమును చూచిన, అతడు ప్రాణమిత్రుడుగ మారిపోవును. పాములో దైవమును గాంచగలిగిన నది కాటువేయజాలదు. అన్ని మతముల సారాంశము ప్రేమయే గావున. సుఖదుఃఖములలో, నిందాస్తుతులలో, కలిమిలేములలో కూడ దైవమునే గుర్తించు వారి జీవితములు పరమోత్కృష్టములయినవి.

ఎవరిదయినను, ఎంత విద్యాధికులదయినను, ధనికులదయినను, సన్న్యాసుల దయినను, గృహస్థులదయినను, ప్రేమశూన్యమగు హృదయము శ్మశానము వంటిదని చెప్పబడినది. తోడి మానవుని ప్రేమించలేనివాడు ఘాతుకుడని పెద్దలు చెప్పియున్నారు. 'నేనుదేవుని ప్రేమించుచున్నాను. **నేను దైవభక్తుడను' అని చెప్పుకొనుచు, మానవుని ప్రేమించలేనివాడు, ప్రేమకు బదులు ద్వేషముగలవాడు, అబద్ధీకుడని, మోసగాడని క్రీస్తు చెప్పియున్నాడు.** కావున, దైవమెచటనో కొండపయిన, ఆకాశమునందు, మేఘములలో దాగి యుండలేదు. **నరరూపమున నుండువాడే నారాయణుడు గనుక, మానవసేవయే మాధవసేవ** యని చెప్పబడినది.

ప్రియపాఠకులారా! నారాయణస్వరూపులారా! ఇంతయెందులకు? వివిధ నామ రూపములలో విలసిల్లు దైవమును గుర్తించి, పూజింతము. అంతరంగమున, బాహ్యమున, చుట్టును, క్రిందను, మీదను నిండియున్న జ్యోతిస్వరూపుని నేడే గుర్తించి ధ్యానింతము. మనసునకు మనసుగ, హృదయమునకు హృదయముగ, శ్వాసకుశ్వాసగ ప్రకాశించుచున్న యాత్మస్వరూపుని స్థిరముచేసి, ఆ సచ్చిదానంద స్వరూపమునందే మనసులను లీనము చేసి, నిర్వికల్పమును గ్రోలుదము.

**'బ్రహ్మైవేదమమృతం, పురస్తాద్బ్రహ్మ పశ్చాద్బ్రహ్మ, దక్షిణత శ్చోత్తరేణ, అధశ్చోర్ధ్వం, చప్రసృతం, బ్రహ్మైవేదం విశ్వమిదం నవిష్ఠమ్."**

సర్వము నమృతమగు బ్రహ్మమే. ఇతర మేమియులేదు. ముందు బ్రహ్మము. వెనుక బ్రహ్మము, దక్షిణమున, నుత్తరమున బ్రహ్మము. క్రింద, పయిన బ్రహ్మము. అది సర్వమును వ్యాపించి యున్నది. అమృతమగు నీ విశ్వమంతయు, సర్వమును బ్రహ్మ మాత్రమే!

సర్వహృదయ వాసివయి, సర్వాంతర్యామివయి, అణువు మొదలు అజాండము వరకు నిండియున్న దీనదయాళూ! నీకు ఉత్తరమున, దక్షిణము, తూర్పున, పశ్చిమమున, అన్ని దిశలను నమస్కృతులు!

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
  శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ ;
సుర రక్షకుని జూచు కన్నులు కన్నులు
  శేషశాయికి మ్రొక్కు శిరము శిరము ;
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు,
  మధువైరి దవిలిన మనము మనము;
భగవంతు వలగొను పదములు పదములు
  పురుషోత్తముని మీద బుద్ధి బుద్ధి;
తే.గీ. దేవదేవుని జింతించు దినము దినము,
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు;
కుంభినీధవు జెప్పెడు గురుడు గురుడు,
తండ్రి హరిజేరుమనియెడి తండ్రి తండ్రి.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు
ఓం శాంతి శ్శాంతి శాంతిః

(శాంతి జూన్ 1956)

# అసాధ్యము - దుర్లభము

మానవునకు అసాధ్యమైనది యీ లోకములో యేదియూ లేదని జెప్పెదరు. మానవుడు చెయ్యజాలని పని యెద్దియు లేదట. దైవాకారుడైన మానవుడు తలచిన, యెట్టిపని యైనను, యేపని యైనను చేయగలడు!

నా అంతర్యానుభవమునుండి పరిశీలించి జూచిన, ఒక్కపని మాత్రము మానవునకు అసాధ్యమని తట్టుచున్నది. అది యెద్దియన, తనలో వ్యక్తమగుచున్న తన జీవితమునకే ఆధారమైన గమ్యస్థానమైన, సర్వముగా యున్న దైవత్వమును, అంతర్యజ్యోతిని దివ్య స్వరూపమును మరువజాలడు.

ఎన్నడూ నిత్య స్వరూపమును మరువజాలడు. ఎప్పటికినీ, తన దైవత్త్వమును మరచి జీవించజాలడు. ఐనను మాయ యెంత కఠినమైనది? లోతైనది అనగా తాను, దైవమును, మరచిపోవుచుంటిననే, మానవుడు, భ్రమపడుచు సదా బాధపడుచుండును.

దైవము, నాలో కదలుచుండెను. నీలో జూచుచుండెను. అందరిలో, ఆలోచించుచుండెను. ఆపాదమస్తకము వరకు, ప్రతీ అణువులో, అతడే నిబిడీ కృతుడైయుండెను. ఆయనను నేనెటుల మరువగలను? నా నేత్రమునకు నేత్రముగా, చెవికి చెవిగా, మనస్సునకు మనస్సుగా, హృదయమునకు హృదయముగా శ్వాసకు శ్వాసగాయున్న ఆ ఆంతర్యప్రభువుని నేనెటుల మరువగలను?

అతడు ఆంతర్య ప్రభువేగాదు, విశ్వప్రభువుగూడను, ఏలనన, అణువు మొదలు బ్రహ్మాండము వరకు, ఆయనయే వ్యాపించి యుండెను. **“ఈశావాస్య మిదంసర్వం”** యీ సృష్టి అంతయు, ఈశ్వరుని చేతనే నింపబడియున్నది. ఆయన లేని తావు సూదిమొన మోపుటకైనను లేదు. అంతయు దైవమే. ఏది జూచినను దైవమే! జూచువాడు దైవము, చూడబడెడిది దైవము.

## అంతా రామ మయం ఈ జగమంతా రామమయం :

జాగ్రదావస్థలోనేగాక స్వప్నావస్తలోను, గాఢమైన సుషుప్తి అవస్థలో గూడ దైవము కోటి సూర్యప్రకాశమానమైన దివ్య తేజుస్సుతో ప్రకాశించుచు, మనలను, కంటికి రెప్పపోల్కెను గాపాడు చుండెను.

వెర్రి మానవుడు, కండ్లు వుండియు, తనకు ఆధారముగా, సర్వముగా యున్న దైవమును చూడడేల? అన్ని శబ్ధములలో దైవమే వ్యక్తమగుచుండ, చెవులు వుండియు, దైవశబ్ధమును వినజాలడేమి?

**ఇదియే మాయ :**

మాయ జయించినవారే, దైవమునకు సన్నిహితులు. మాయ అనెడి దట్టమైన తెర మానవుని దైవము నుండి వేరు చేయుచుండును. **"తెరతీయగ రాదా"** అని త్యాగ రాజులు చక్కనైన కృతిని పాడియుండిరి. మన ప్రార్ధనలు ధ్యానములు, గూడ యీ తెరను, ఒత్తిగించుగాక! అంతా దైవమైయుండ, దైవము తప్ప అన్యమైనది, యెప్పుడును, యెచ్చటను లేనిస్థితిలో యీ మాయ తెర యెచ్చట నుండి వచ్చెను? ఈ తెర యెచ్చట నుండివచ్చెనో జెప్పజాలము గాని, అఖండకోటి సూర్యదివ్య తేజస్సులో మాత్రము ఏ మాయతెరలు ఉండుటకు సావకాశమేలేదు. అగ్నికి చెదలుపట్టగలవా? దివ్య సూర్య తేజస్సులో డాగులుండునా? ఆ దివ్య తేజస్సు లోకములనే భస్మీభూతముగా చేయగలదు. ఆ తేజస్సు యున్నచోటను మరొకటి యుండుటకు వీలులేదు. అద్వితీయమైన, నిత్యమైన, సత్యమైన, శాశ్వతమైన, పరిపూర్ణమైన, ఆ దివ్య తేజస్సును మరచుటయే. యీ మాయ తెరలకు మూలకారణమై యున్నది. అజ్ఞానమే మాయకు కారణము.

కాని జ్ఞానాగ్నిలో దివ్యతేజస్సులో అపరోక్షానుభవములో, బ్రహ్మసాక్షాత్కారములో ఆ సచ్చిదానంద స్వరూపములో అజ్ఞానమెచ్చటయున్నది? అజ్ఞానమును విమర్శించిన అదియుగూడ మాయమౌచున్నది.

ఒక వ్యక్తి, జ్యోతిని హస్తమందుంచుకొని, చీకటిని వెదకుటకు వెళ్లెనట, అతడు యెచ్చటకు వెళ్ళినను, చీకటి గానరాదాయెను కొండ గుహలలోనకు వెళ్లినను తన జ్యోతిముందు, అంధకారము పారిపోవుచుండెను. అటులనే ఆత్మజ్యోతి ముందు దివ్య తేజస్సు సమక్షమున ఏ మాయతెరయు, ఏ అజ్ఞానమును యుండజాలదు.

గాన ప్రప్రథమమున, మానవుడు తన జన్మహక్కుయైన సచ్చిదానంద స్వరూ పమును స్థిరముజేసిన, ఆ స్థిరత్వములోనె, సర్వము యిమిడియుండును.

మాయ తెరలన్నియు ఆ జ్ఞానాగ్నిలో దగ్ధమగును. భ్రమలన్నియు పరుగెత్తును. భ్రాంతులన్నియు దహింపబడును. ఈ అనుభవనీయమైన స్థితినే బ్రహ్మవేత్తలు విజ్ఞానము చేతను, మనో నాశనము, వాసనాక్షయముచేతను, పొందగలరని నుడివి యుండిరి. మొదట స్థిరము చేయవలసినది విజ్ఞానము.

1. విజ్ఞానము :

విజ్ఞానమనగా, అంతా బ్రహ్మము. బ్రహ్మము తప్ప, అన్యమైనదియెచ్చటను, యెప్పుడును లేదనియు, బ్రహ్మము అద్వితీయము రెండుగానిది గాన తానే అపరిపూర్ణమైన అద్వితీయమైన సత్యస్వరూపమని అనుభవముగా స్థిరము జేయుట.

2. వాసన క్షయము :

అనేకమయిన జన్మమల నుండి వచ్చుచున్న వాసన లన్నింటిని, క్షీణింపజేయ వలెను. సముద్ర కెరటములవలె, యీ వాసనలు అంతు ఆది లేకుండగ ఒకటి తర్వాత మరొకటి అహర్నిశములు, వచ్చుచునే యుండెను. వీటిని నశింపు జేయుటకు మనోనాశ నము తోడ్పడును.

3. మనో నాశనము :

దేనినయినను నాశనము చేయవచ్చును గాని తనలో లేచుచున్న ఆలోచనలను తనకు తెలియకుండగనే, వుద్భవించుచున్న భావనలను, నశింపజేయుట ఎటులను? మానవుడు, వాసనలకు, బానిసయై యున్నంతకాలము, మనస్సు అనే కోతి, చిందులు ద్రొక్కుచు గంతులు వేయుచుండును. ఒక విజ్ఞానమే, బ్రహ్మాకార వృత్తియే, మనో నాశనమును, వాసన క్షయమును గలిగించును.

వాసనక్షయము, మనోనాశము, యీ త్రిపుటిని ఒక్కొక్కటిగా వేరు జేయుటకు వీలులేదు. ఈ మూడింటిని కలిపి సాధకుడు, విజ్ఞానమనెడి, అఖండజ్యోతిచే, అజ్ఞాన మనెడి, అంధకారమును కాల్చివేయవలెను. విజ్ఞానమనెడి ఖడ్గము అజ్ఞాన మనెడి చీకటిని ఖండించును.

మానవుడు, ప్రస్తుతము ఎంత ప్రవృత్తిపరుడయి యున్నను, ఎప్పటికిని తన జన్మహక్కుయైన, తన జీవితాధారుడయిన దైవమును మరచి జీవించజాలడు. ఇదియే మానవునకు దుర్లభమయిన, అసాధ్యమయిన పని, ఈ సత్యమును, మానవుడు ఎంత త్వరలో గ్రహించిన, అంత మంచిది. నిద్ర యెట్టిదో యెరుంగని ఆ మహాసముద్రము తన కెరటములను, ఎంత రాత్రిలోనైనను, తాత్కాలితముగా నైనను, ఒక్క క్షణమైనను మరువగలదా? సూర్యభగవానుడు తన దివ్య తేజస్సును మరచి జీవించగలడా! పృధ్వి తన స్థిరత్వమును గట్టిదనమును మరచి ఉండగలదా! జలము తన చల్లదనమును మరువగలదా! అగ్ని తన వేడిని, వెచ్చదనమును మరచి ఉండగలదా!

అటులనే దైవ సంభూతుండయిన దైవాకారుండయిన మానవుడుగూడ తన దైవత్త్వమును దివ్యతేజస్సును మరచి క్షణములో కోటవవంతు కాలమయినను జీవిం చజాలడు.

కస్తూరి మృగమునకు, సుగంధము, దాని హృదయమునందే యున్నది. సూర్యునికి తేజస్సు ఆయన గర్భమునందె ఆయనలోనే యున్నది. అటులనే మానవుని స్వస్వరూ పానందము ఆత్మశక్తి తన పరమ పావనమైన హృదయ కుహరమునందే సదా ప్రకాశించుచున్నది.

సూర్యుడు తన తేజస్సుకయి యితరులను ప్రార్ధించవలెనో సూర్యభగవానుడు

అక్షయపాత్రను తీసుకొని కొంచము తేజస్సును బిక్షగా యివ్వమని, మిణుగురు పురుగుల వెంట పరుగెత్తిన యెంత హాస్యాస్పదముగా యుండునో ఆలోచించుడు. కస్తూరి మృగము సుగంధమును, తన హృదయమునందు గలిగియుండియు అద్దానిని మరచి కొండలలో లోయలంతటా తిరిగి వేసారి చివరకు, ఏ కొమ్మయో ఏ మోడుయో హృదయమునకు గుచ్చుకొనగా, తాను ఏ కస్తూరి కొరకై బాహ్యమున తిరిగి వేసారి ప్రాణము పోగొట్టు కొనుచుండునో ఆ కస్తూరి తన హృదయములోనె యున్నదని గ్రహించి మరియు ప్రాణమును విడచును, ఇక సామాన్యమానవుని దురదృష్టమయిన గతిని విమర్శించుడు.

నూటికి తొంబది తొమ్మిది జనులు అమృతతుల్యమైన కస్తూరి ఆత్మశక్తి ఒక్కటి తమలో యున్నదన్న సత్యమునే మరచి మాయాప్రపంచములో, నామరూపములకు బానిసలయి సంసార మహాసముద్రములో, మోహమనెడి సుడిగుండంలో పడి మునింగిపోవుచుండిరి.

మిగిలియున్న కొద్దివారును దైవమును, గుళ్ళలో, గోపురములలో గురువులలో గ్రంథములలో, కస్తూరి మృగమువలె, బాహ్యమున వెదకుచు, బాహ్యపూజా విధానములలో తృప్తిపొంది జీవించుచుండిరి. ఆత్మనె తాననెడి, సత్యమును మరచి శరీరమే తాననెడి ఉచ్చులో, బోనులో, వ్యామోహములో పడి జీవించువాడు, యెటుల కడతేరగలడు!

శరీరమనెడి, మొసలిని పట్టుకొని కౌగలించుకొని, యీ సంసార మహాసము ద్రమును యెటుల మానవుడు యీదగలడు?

అష్టావక్ర మునీంద్రుడు

**శ్లో॥ దేహాభిమాన పాశేన। చిరం బద్ధోఽసి పుత్రక**
**బోధోఽ హం జ్ఞానఖడ్గేన। తన్నికృత్య సుఖీభవ॥**

తా:– నా తనయా, నీవు చిరకాలమునుండి నేనే, శరీర మనెడి వుచ్చులో బంధింపబడి యుంటివి. జ్ఞానమనే ఖడ్గముచే, నేనే ఆత్మననెడి, అనుభవముచే, నీ వుచ్చును నరికి ఆనందముగా యుండుము.

ఆనందో బ్రహ్మ, ఆనందమే బ్రహ్మము, బ్రహ్మమే నీ జన్మ హక్కు :

అష్టావక్రుడే, మరి ఒక చక్కనైన ఉపదేశ వాక్యమును, యీ క్రింది పద్యములో జెప్పి యుండెను.

**గీ॥ అన్నిటికి ద్రష్ట వక్కడ వగుదు వీవ,**
**ముక్తుడవు యీవ, యిటులయ్యు**
**మోహ బుద్ధి దలప నేరక, నీకన్న**
**వేరె ద్రష్ట గలడనుట. అదియు నీకు బంధంబుగాదె॥**

సర్వము నీవైయుండి విశ్వసాక్షి స్వరూపుడవయ్యు, నీకన్న వేరే, ద్రష్ట గలడని భావించుటయే నీకు యున్న గొప్ప బంధము, సూర్యులకు సూర్యుడవై కోటిసూర్య దివ్యతేజ స్వరూపుడవై, నీ అఖండమయిన దివ్య తేజస్సును, మరుగు జేసుకొని ముష్ఠిచిప్పతో, కొంచము వెలుగునకయి మేఘములను, యాచించెదవేల? ఇదియే మాయ. ఇదియే నీకు యున్న గొప్ప ప్రతిబంధకము, పెద్ద అడ్డు, లెమ్ము మేల్కొనుము, నీ గాఢ నిద్రనుండి మేల్కొనుము. నీ ఆత్మ జ్ఞప్తిని వ్యక్తపరుచుము. ఇంకెన్నాళ్ళు మొసలిని ఆలింగనము జేసుకుని, సంసార మహాసముద్రములో యీదుటకు ప్రయత్నించెదవు. నీకీ లోకమంతలో అసాధ్యమైన పని ఒక్కటేగలదు.

అది నీ స్వస్వరూపమును, నీదివ్య తేజస్సును, నీ ఆత్మశక్తిని మరుగుపరచి జీవించజాలవు. నీ కీనీడను, నీచాయను నీవు పట్టుకొనగలవా?

ఒక వెర్రివాడు, తన నీడను లోతయిన గొయ్యను దీసి దానిలో పూడ్చివేయుటకు ప్రయత్నించుచుండెనట అది సాధ్యమా? అది వెర్రితనము గదా! అటులనే, నీవు నీస్వస్వరూపమును నీ ఆధారమును, నీలో అహర్నిశములు కదలుచు, మెదలుచు ఆలోచించుచు, వ్యక్తమగుచున్న నీ అంతరాత్మను దివ్యశక్తిని మరచి జీవించగలుగుట గూడ వెర్రితనమే, మౌఢ్యమే గాడాంధకారమే! సూక్ష్మములో మోక్షము అన్నట్లు అష్టావక్ర మహామునియే వేదసారమంతయు యీ క్రింది శ్లోకములో జెప్పుచుండెను.

**నీ శరీరమునుండి నీవు వేరై నీ ఆత్మలో, నీవుండగలిగిన తక్షణమే నీవు ఆనందమయుడుగా శాంతి సుధను గ్రోలుచు విముక్తుడవయ్యెదవు.**

ప్రియమైన పాఠకా, ఇక పెక్కుమాటలేల? నీకు మోక్షము విముక్తి కావలసిన అదియె నీవు, తత్వమసి అనెడి మహావాక్యమును, ఇప్పుడే, ఇచ్చుటనే, గుర్తించుము.

అహం బ్రహ్మోస్మి, అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ,
హరిః ఓం తత్సత్ ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

(శాంతి డిశంబరు 1956)

# అద్భుతమైన ఆధ్యాత్మికానుభవము

18-11-56

అది సూర్యభగవానుని ప్రియమగు నాదిత్యవారమునాడు పౌర్ణమి యగుటచే, ఇరువది నాలుగుగంటలు పూర్ణచంద్రుని జ్ఞాపకార్థము, నిరంతరాయముగ నాశ్రమ భక్తులచే, ఆశ్రమవాసులచే నత్యంత శ్రద్ధాభక్తులతో వైభవముగ నేకాహము జరుపబడు చుండెను. యధాప్రకారము నేను వేకువఝామున నే లేచి **"కాస్మిక్ ఫ్లాషెస్" "అష్టావక్రగీత"** యగు నాధ్యాత్మిక గ్రంథములను చదివితిని, రోజూవలె సందేశములను జాబులను వ్రాయుటకు బదులు, మామూలుకంటె నధికముగ శాంతిప్రార్ధనను మననముచేసి, మిక్కుటముగ ధ్యానము జేసి నాటిదినము నెక్కువ యుపయోగకరముగ గడప సంకల్పించుకొంటిని.

ఉషఃకాలమున నొకగంట సంతోషముగ తోటపని చేసితిని. స్నానానంతరము డా॥ మాధవరావు, డా॥ మార్కండేయులుగారును ఆశ్రమ వైద్యులు, నిర్వాణ మందిర మునకు వచ్చి, సంచారవైద్య సహాయమును గురించి ముచ్చటించిరి. వారు వెడలినపిదప, పాలు, అరటిపండ్లు స్వీకరించి, భగవంతుని సాన్నిధ్యము ననుభవించుచు యేదైన వ్రాయుటకు బల్లవద్ద కూర్చుంటిని. అపుడు 9 గంటలయ్యెను.

పాదములనుండి బయలుదేరి యాకస్మికముగ నేదియో నద్భుతమగు ననుభవము కలుగజొచ్చెను. నా పాదములు భూమిమీద లేవు. శరీరము బిగిసి యానందమయమగు ననుభవము కలిగెను. గాలిలో తేలియాడుచున్నట్లుండెను. శరీరమే లేనట్లు తోచెను. అంతయు నావిరి రూపమున నెగిరిపోయి, శూన్యమయినట్లుండెను. అది యనుభవైక వేద్యమేగాని, యంతముగల మాటలతో వర్ణింప శక్యముగాదు. అది జీవితములో నరుదుగ వచ్చు ననుభవము.

ఏకాంతము కోరుటచే, తలుపులను మూయమని సంజ్ఞ చేసితిని. అంతయు నానందము. క్షణమాత్రము శ్వాసకూడా శరీరమునుండి బైటకు పోయినట్లు, పోవుచున్నట్లు తోచి స్పృహలేక, నా శిరము వెనుకకు వ్రాలిపోయెను. అది చైతన్య రాహిత్యముగాని, శారీరక వ్యాధికానికాదు. ఆత్మజ్ఞానము, పరమాత్మ జ్ఞానము పూర్తిగ నుండెను. భగవానుని కరుణచే. నేను పూర్ణమగు నారోగ్యముతో బలముగ నుంటిని. నాయారోగ్యమున నెట్టి కొఱతయులేదు. ఆ యనుభవానంతరము, మామూలు స్థితికి వచ్చినపుడు, ఇంకను శరీరములేక స్వేచ్ఛగ నున్నట్లు తోచుచుండెను.

ఈ యద్భుతమయిన యనుభవము, శ్రీరామకృష్ణ పరమహంస భగవానుల స్పృసించినపుడు వివేకానందులవారికి కలిగిన పవిత్రమైన సమాధి యనుభవము నాకు జ్ఞప్తికి తెచ్చెను. నేను సర్వవ్యాపకుడగు సర్వాంతర్గతుడునగు భగవంతుని కృపచే స్పృశింపబడితిని.

ఇట్లే తాను చేయుచున్న పనిమధ్య నాకస్మికముగ, మహిమాన్వితమగు నతనికి నేననుభవములోనికి గొనిపోబడిన యొక అమెరికను సాధకుని విశ్వసందర్శనానుభవము సంగతికూడ నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. అతడు దానికి **అనంతములగు నేడు నిమిష ములు!** అను పేరిట నొక గ్రంథము వ్రాసెను. లేశమాత్రమయినను ప్రయత్నములేకయే. ఆకస్మికముగ అనుకొనకుండ గలిగిన ఆ దివ్యానుభవముయొక్క స్మృతిమాత్రమే యద్భు తము, అనిర్వాచ్యమునయియున్నది. అది మహత్పూర్ణమైన పరాదర్శనము–అమృతాస్వాద నము, అది పరమ సంతోషము. పరమానందముతో కూడిన కాలము, అందు నేను, కాలాతీతమైన, మహోన్నత శిఖరములకు లేవనెత్తబడితిని, మనస్సు అంతరించుచుండ, అనంతమగు దానితో నేను మేళవింపబడితిని. భగవత్కృప యట్టిది. అది యవతరించి నపుడు, తాను వరించిన వానిని ముంచివేయును. భగవంతు డెంతకృపామయుడు! భక్తియుతములగు మన హృదయములలో వసించు భగవంతుని మహిమను కీర్తించి సన్నుతించుట తప్ప నేనితరమేమియు చెప్పజాలను!

సర్వేషాం శాంతిర్భవతు

ఓం ఓం ఓం

(శాంతి ఏప్రిల్ 1957)

# అసూయ

అసూయ యనునదొక మానసిక కుష్ఠురోగము. కుష్ఠురోగము శరీరమును పాడు చేయును. అసూయ మనస్సునే నశింపచేయును.

భయంకరమగు కుష్ఠువ్యాధికన్న అసూయ మిక్కిలి యపాయకరము. కుష్ఠువ్యాధి పీడితుఁడయ్యు మానవుఁడాధ్యాత్మిక బుద్ధితో నుండవచ్చును. అసూయకు లోబడినవారికి పారమార్థిక బుద్ధితో నుండుట దుర్ఘటము.

అసూయాపరులతో గలసి యుండుట మిక్కిలి యపాయకరము. వారికి సహస్ర యోజనముల దూరమున నున్నను వారి బాధ తప్పదు. సాధ్యమైనంత వరకు నిట్టివారితో గలియకుండుట మేలు.

అసూయాపరులు జుగుప్సచే తాము దుఃఖభాగులగుటయే కాక తమచుట్టుగల వారికిగూడ సంతాపము కలిగింతురు.

ఈ మానసిక కుష్ఠువ్యాధికి గారణమేమి? మౌఢ్యమే దీనికి మూలము. అన్ని విషయములు వారికే కావలయును. తమ శరీరములే వారు, తామే తమ శరీరములుగ భావింతురు. తమకన్న జ్ఞానము గలవారిని గాని, అందమైన వారినిగాని, ఆధ్యాత్మిక బుద్ధిగలవారిని గాని చూచినచో వారికి గిట్టదు.

అన్నిటికిని దాముకాకపోతిమేయని విచారింతురు. చంచలములగు తమ మనస్సులకు దాస్యము చేయుచు, గాలిలో మేడలను గట్టుదురు. ప్రతివారును తమ్ము ద్వేషించుచుండిరని తలంతురు. ఇది దారుణమైన చిత్తవృత్తి. అసూయ యను నీ వ్యాధి మనస్సునఁబుట్టి క్రమముగా శరీరమంతయు వ్యాపించును. అది పుట్టినచోటునే క్షీణింపఁజేసి జీవితమునకు శాంతిని లేకుండఁజేయును. ఇట్టి మనః ప్రవృత్తి బుద్ధిమాంద్యమునకు, శరీర యనారోగ్యమునకు, నాయుక్షీణమునకుఁ గారణమగును.

ఈ వ్యాధి యున్నత స్థితికి వచ్చునప్పటి కారోగికింక సంతోషము శూన్యము. భరింపరాని దుఃఖముకలిగించును. ముంగోపితనము వారి నావేశించును. వారకాల మృత్యువు వాతఁబడుదురు.

ప్రాణాంతకమై, వినాశహేతుకరమై; భయంకరమైన యీ మానసిక విభ్రాంతి వ్యాధికి చికిత్స కలదా?

ఉన్నది , ఎవ్వనియందు జగములు నిండియున్నవో, ఎవ్వడు స్వార్థత్యాగియో, అట్టి భగవంతుఁడే దీనికి వైద్యుడు.

పరిపూర్ణ భగవత్స్వరూపము నెఱింగిన వాఁడే యావ్యాధి శత్రువును జయింప

గలడు. స్వీయానుభవముచేఁ బరమాత్మను దెలుసుకొనిన నాడే దీనికిఁ జికిత్స కలుగును. భగవంతుఁడు సర్వవ్యాపి. సర్వాత్మల యందు వసించువాఁడాతడొక్కడే. ఇంక అసూయతకు దావేది?

ద్వయితమునందసూయతకుఁ దావుకలదు. అద్వైతమునందు తావులేదు. సర్వము భగవన్మయమైనచో నీవెవరిపై నసూయఁ జెందెదవు?

అసూయనువిడిచి, ప్రపంచకమున సౌందర్యమును, మహత్తును కనుగొనుటకు యత్నింపుము. అపుడు ప్రతి వస్తువునందు నీ ఆత్మవంటి ఆత్మయే యుండు టెరుంగుదువు.

ఒకనికి వేయి సుగుణములున్నను, నసూయపరుఁడయ్యేనేని యా గుణములు బూడిదలోఁ బోసిన పన్నీరగును.

యీ క్రింది దృష్టాంతము వలన నీ విషయము మరింత సుబోధకము కాఁగలదు. తన ప్రతిబింబము నద్దములోఁ జూచుకొనిదానితోఁ బోరాడ నుంకించి తుదకు తన ప్రాణమును గోల్పోయిన యొక కుక్క కథ యిది.

కుక్కల కసూయ సహజమని కొందఱందురు. ఒకనాడొక కుక్క తన యజమాని యింటియం దద్దాల గదిలోనికిఁబోయెను. ఆ గది గోడలకు నలువైపుల, పైని, క్రింద కూడ అద్దములు గలవు. కుక్క యద్దములలో నన్నివైపుల తన ప్రతిబింబము చూచుకొని యరచుటకు మొదలుపెట్టెను. ఆ ముకురములలోఁ బ్రతికుక్కయు నోరు తెరచి మొరుగుచున్నట్లు కాన్పించెను. కుక్క భయముచే నెదురుగా ప్రతిబింబములన్నియు నెగిరినవి. పైకి చూచినది. అక్కడను కుక్కలే. ఇట్లెక్కడ చూచినను తనకు ప్రతిద్వంద లుండుటచే నది యెగిరి, మొరిగి మొరిగి యలసటచే తుదకచ్చటనే మృతి జెందెను.

ఇంక నిందలి మంచిని తీసికొందము. ఆ యింటి యజమాని అద్దాల గదిలోనికి వెళ్ళును. అతఁడచ్చటియద్దముల యందన్ని వైపుల తన రూపమే యన్ని ప్రతిబింబములుగ నుండుట చూచుకొని, తృప్తినొంది సంతసించును.

ఇట్లే ప్రపంచకమొక యద్దాల యిల్లు. ఈ యింటి యుపయోగమును మనమెట్లు పొందుచున్నాము? ఆ గృహమును మనమే దృష్టితో జూచుచున్నాము?

మనముకూడ నా కుక్కవలె పరులు మనయందసూయతో నుండిరనియు, గొందరు మనలను నిందించుచున్నారనియు, గొందరు మనలనుజంపదలచు చున్నారనియు దలంచుచు నాయింటఁ ప్రబవేశించుచున్నామా? లేక ఆ గృహ యజమాని తన ప్రతిబింబములను జూచి సంతసించునట్లు, మనముకూడా సత్యస్థితమగు నీ ప్రపంచకమున,

సర్వవ్యాపియగు పరమాత్ముని మనోహర స్వరూపమును కనుగొనుచున్నామా?

అనంతములగు వస్తువుల యందద్వైత తత్త్వమును గ్రహించిన వాడు సదానందమును గనును. తన్ను తాను మరచి సత్యస్వరూపమును గనుగొనలేక యొకే వస్తువు నందు విభేదములనుతలంచుకొనువానికి మనస్సంతాపము. తీరరాని దుఃఖము కల్గును. అభేద్యమగు పరమాత్మ స్వరూపము నాతడు గాంచలేడు.

“శాంతి” పాఠకులారా! బుద్ధిమంతుల కొక్కసారి చెప్పినచో చాలును. మన హృదయకోశము నందెచ్చటనైన విషయతుల్యములైన యసూయతా బీజములున్నవేమో కనుగొందము. ఉన్నచో జగద్రక్షకుని నిరవధిక కరుణా విశేషమున నా విషభీజములను విచ్ఛిన్న మొనరింపఁ బూనుకొందము.

ఎవరసూయ నెఱుఁగనే యెరుగరో, యితరుల సుఖదుఃఖములను తమవిగా నెవరు భావింతురో, ఇతరుల జయాపజయములు తమవిగా నెవరెంతురో, వేయేల? తమయందు నఖిలభూతమలందు నొక భంగి సమహితత్వంబు నెవ్వరు జరుపుదురో అట్టివారుకదా ధన్యులు!

మీరందఱును, సర్వ ప్రపంచకమును బ్రేమించి పోషించి కరుణించు భగవత్స్వరూపములే !

ఇట్టి మీయంతరంగములగాని, బహిః ప్రకృతిని గాని యసూయ యుండుటకు తావులేదు.

అనంతమై, యాద్యమై, యప్రమేయమై, సర్వమానవుల కేకాత్మకమై, భేదరహితమై, ప్రతి యణువునందునుతన స్వరూపమును గోచరింపజేయు పరమాత్ముని, మన మారాధింతముగాక!

ఓం ఓం ఓం

(శాంతి జ & ఫి 1959)

# అవ్యక్తము - వ్యక్తము

1. అవ్యక్తమనగా నేమి?

2. వ్యక్తమనగా నేమి?

1. అద్వితీయమైనది, అఖండమైనది, కదలనిది, మెదలనిది, పరిపూర్ణమైనది అవ్యక్తము, దైవమే అవ్యక్తము.

2. ఇక ఖండమైనదంతయు, మనము చూచెడిది, వినెడిది, కదలెడిది, మెదలెడిది అంతయు వ్యక్తమే.

## దైవము అవ్యక్తము
## ప్రపంచము వ్యక్తము

ఎచట రెండు వున్నవో, భిన్నమున్నదో అది అంతయు వ్యక్తమే! ఎచట ఒక్కటిగా, అద్వితీయముగా నున్నదో అదియేవ్యక్తము. ఇప్పుడు మనకు కావలసినది అవ్యక్తములోను, వ్యక్తములోనుగూడ, సర్వకాల సర్వావస్థలయందును దైవమును అనుభవించుటయే.

ఈమధ్యను వ్యక్తములో దైవమును అనుభవించుట సూక్ష్మమా లేక అవ్యక్తములో దైవమును అనుభవించుట తేలికయా అని యీ మనస్సు పరిపరివిధములుగా ఆలోచించుచుండెను. అద్దాని ఫలితమే యీ వ్యాసము.

జీవన్ముక్తులు అవ్యక్తములోను, వ్యక్తములోనుగూడ దైవమును తేలికగా అనుభవింపగలరు. వారి స్వభావమే దైవానుభవము. అట్టి ఆరూఢులు దైవమును మరచి క్షణములోని కోటవవంతు కాలమైనను జీవించజాలరు. అట్టి బ్రహ్మవిదులు పనిలో నున్నను, పనిలేకుండ నున్నను, ధ్యానములోనున్నను, ఖండమైన జీవిత దిన కృత్యములలో నిమగ్నులైయున్నను, వారు సదా దైవసన్నిధినే వ్యక్తపరచుచుందురు.

సూర్యుడు ఒక్క క్షణమైనను, ఎన్ని దట్టమైన మేఘములు వచ్చినను, తన దివ్య తేజస్సును మరువడుగదా, ఇక సూర్యులకు సూర్యుడైన కోటిసూర్య తేజస్వరూపుడైన దైవము గురించి చెప్పనేల? ఆంతర్యమున అవ్యక్తములో దైవానుభవమును పొందినవారు. బాహ్యమునగూడ వ్యక్తములో సూక్ష్మముగా దైవమును అనుభవించుటేగాదు. ఆ దివ్య తేజుస్సునే నిరంతరము పనిలోనైనను, పనిలేకున్నను. వ్యక్తపరచుచుందురు.

ఇక దైవానుభవము అపరోక్షముగా లేనివారు, పండిత పామరులైనను, ఎంత ధనవంతులు,శక్తివంతులైనను, దైవము ననుభవింపజాలరు. అట్టిజీవితములు భూభారమే, చిన్నచిన్న మాటలలో, పాటలలో శ్లోకములలో **అంతా రామమయం ఈ జగమంతా రామ మయం కన్ను మూసినా కృష్ణమయం కన్ను తెరచినా కృష్ణంమయం** అని

చెప్పబడుచున్నదిగదా? గాన మనము వినెడి, పాడెడి పాటలను, మన దినచర్యలలో, వ్యక్తపరచుటయే. ఆచరణలో నుంచుటయే ముఖ్యావసరము.

దైవాజ్ఞ, దైవచిత్తము లేకుండ గడ్డిపరకయైనను కదలజాలదు. అని మహనీయుల చేతను, సద్గ్రంథములచేతను చెప్పబడుచున్నది. అట్టి స్థితిలో ఈ హస్తముద్వారా వ్రాయు వారెవరు? ఈ కండ్లద్వారా చూచెడివారెవరు? ఈ మనస్సుద్వారా ఆలోచించెడివారెవరు? ఈ హృదయములో స్పందనజేయుచున్నదెవ్వరు? ఈశ్వాసలో ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా ఆడుచున్నవారెవరు? అద్వితీయుండైన, సర్వవ్యాపకుండైన దైవముతప్ప అన్యమైనది యెప్పుడును, యెచ్చటను లేనప్పుడు అంతయు దైవమే అన్నియు దైవమే. చెట్లు, పుట్టలు, జంతువులు, మానవకోటి అంతయు దైవమే.

ఈ శలయేర్లలో ప్రవహించెడివాడు, ఈ పర్వతములలో స్థిరముగా నున్నవాడు ఆతడే! ఈ క్రిమికీటకాదులలో కదలుచున్నవాడు ఆతడే! ఈ పుష్పములలో వికసిం చుచున్నవాడు, పక్షులలో పాడెడివాడు, పసిబిడ్డలలో నవ్వెడివాడు, బాల బాలికలతో ఆటలాడెడివాడు, సర్వము ఆతడే పృధ్విలోనేగాక, ఆకాశములో, నక్షత్రములలో, సూర్య చంద్రాదులలో, నవగ్రహములలో వ్యక్తమై ప్రకాశించుచున్నవాడు ఆతడే!

దైవముగాని దెద్దియు, ఎన్నడును, లేదుగాన మనము చేయవలసినది వెంటనే ఇప్పుడే ఇచ్చటనే, ఎచ్చటనున్నవారుఅచ్చటనే దైవమును గుర్తించి నిశ్శబ్దముగా నుండవలెను.

కండ్లు తెరచియున్నప్పుడు, చెవులు వినుచున్నప్పుడు, వ్యక్తములో దైవమును గుర్తించిన, కండ్లకు, చెవులకు, మనస్సునకు తదితర ఇంద్రియములకు, అతీతమైన ప్పుడుగూడా ఆ దైవమునే గుర్తించగలము. మంచుగడ్డలో దైవమును చూడగల్గినవారు నీటిలోగూడ దైవమును చూడగలరు. నీరు ఆవిరిగా మారినప్పుడు ఆవిరిలోగూడ ఒకే దైవమును చూడగలరు.

స్థూలములో నున్నదే, సూక్ష్మములో గూడగలదు. సూక్ష్మముగా నున్నదే కారణముగా నున్నది. మన్నుతో ఎన్ని పాత్రలు చేసినను, అన్నియు మట్టినుండియే వచ్చుచున్నవి. అటులనే పంచదార నుండి చిలుకలు, ఏనుగులు, కుక్కలు, మనుష్యులు మొదలగునవి చేయబడినను, అన్ని నామరూపములకు పంచదారయే ఆధారము. ఇక పెక్కుమాటలేల.

ప్రియమైన శాంతి పాఠకులారా! ఎచ్చటనున్నవారు అచ్చటనే దైవమును గాం చుడు. ప్రతి శబ్ధములో దైవశబ్దమునే వినగలరు. సర్వము దైవము. ఈ జగమంతయు దైవముచే నింపబడి నిబిడీకృతమైయున్నదన్న శృతివాక్యమును మీ జీవితములలో ఆచరణలో పెట్టుట కిదియే సమయము.

**"ఈశా వాస్య మిదం సర్వం"** ఈ జగమంతయు ఈశ్వరునిచే నింపబడియున్నది. మీలోపల నున్నవాడు అతడు, మీ బైట నున్నవాడు అతడే! అతడుగాని దెద్దియు యెచ్చటనులేదు. ఇక తడవేల? ఆయనను గుర్తించుటకు ఆలస్యమేల? మీరు ప్రార్ధనలు, జపతపాదులు, స్నానమాచరించి మడికట్టుకొని నియమనిష్టలతో, నిత్యముచేయగా చేయగా ఆకాశము నుండియో స్వర్గమునుండియో దైవము వచ్చి మీ హృదయములలో ఉరుకునన్న భ్రమను వదలివేయుడు. దైవము యిదివరకే మీవద్దకు వచ్చియుండెను. ఆతడు సదామీతోనే యుండెను. మీ హృదయమునకు హృదయముగా నుండెను. మన చిన్న శాంతి ప్రార్ధన–**పూజనీయమైన ఓ దివ్య స్వరూపా! మా లోపలను వెలుపలను నీ దివ్యదర్శనము ఇప్పుడు ఇచ్చటనే ప్రసాదింపు**మని సులభమైన సూక్ష్మమైన చిన్న మాటలలో చెప్పుచున్నది. కండ్లుండియు చూడరేల? చెవులుండియు వినరేల? మన మనస్సులెందుకు యివ్వబడెను. మీ మనో, బుద్ధి, చిత్త, అహంకారములను దైవములో విలీనముచేసి తరింపుడు. దైవము మీకై అనాది నుండియు వేచియున్నాడు.

వ్యక్తములో ఆయనను దర్శించగలిగిన, అవ్యక్తములోగూడ ఆయననే గాంచెదరు, ఏలనన? బైట నున్నవాడు, లోపల నున్నవాడు–ఆంతర్య బాహ్యములయందు–దైవమే! ఆహా దైవమెంత సన్నిహితముగా దగ్గరగా నున్నాడు. మన శ్వాసలో, నిద్రలో సహితము ఆడుచున్నవాడు ఆతడే! మనము మరచినను ఆతడు మనలను యెప్పుడును మరచుటలేదు. మనలను విడచుటలేదు.

గాఢమైన సుషుప్తి అవస్థలోగూడ కంటికి రెప్పవోలె మనలను సదా ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా సోహంభావనలో వ్యక్తపరచుచుండెను. ఇప్పుడు నాలో వ్రాయుచున్నవాడు మీలో చదువబోయెడివాడు ఆతడే.

దైవసన్నిధిని ఇప్పుడే, ఇచ్చటనే అనుభవింపవలెను. ఆంతర్యమున, బాహ్యమున, మీదను క్రిందను చుట్టును, పరిపూర్ణమైయున్న ఆ దైవస్వరూపుని ఇప్పుడు ఇచ్చట ఈ క్షణమునందే గుర్తించి అనుభవింపజాలకున్న–అస్థిరమైన భవిష్యత్తులో గుర్తించి అనుభవించెదమని ఎటుల చెప్పగలరు? ఆయనను గుర్తించుట కిదియేతావు. అనుభవించుటకు యిదియే సమయము. ఎచ్చటనున్నవారు అచ్చటనే నిత్యమైన, సత్యమైన పరిపూర్ణమైన, అద్వితీయమైన అఖండ సచ్చిదానంద స్వరూపుడైన, దైవమును వ్యక్తములోను అవ్యక్తములోను గుర్తించుచు తరించెదరుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి డిసెంబరు 1963)

# అభిమన్యు విహారము

**అనువాదం : దివాకర్ల రామమూర్తిగారు**

ఉపనిషద్విహారము, శంకర విహారము, కృష్ణ విహారము, మెహర్ విహారము, రామవిహారము, లక్ష్మీవిహారము మొదలగు విహారముల గూర్చి నెన్నింటినో మనము వినియుంటిమేకాని అభిమన్యు విహారమును గూర్చి యెన్నడును వినియుండలేదు. అసలు ఈ అభిమన్యు విహార మెందున్నదో?

అభిమన్యు విహారము దేవతా నివాసము! అందు నిర్మలము, నిర్ద్వంద్వమునైన సత్–చిత్–ఆనందము అధివసించియుండును. అందు అద్వితీయ కైవల్యము, అద్వయ పరిపూర్ణ జ్ఞానము, నిరవయవానందము–ప్రవర్తిల్లును. ప్రాపంచికమైన సర్వ ద్వైతభావ దూరమై శాంతికి పవిత్రస్థానమైనట్టిదియు, ఎల్లప్పుడును విజ్ఞాన ప్రభాస ప్రభలుండుటచే, నెట్టి దౌర్బల్యము, రుగ్మతవలని నిరుత్సాహము, దుఃఖలేశము–లుండనట్టియు, స్వయం ప్రకాశమైనట్టిదియు, అద్వితీయమైనట్టిదియునునగు నా అభిమన్యు విహారమున వసింపఁ గల్గుట యెంత యదృష్టము!

సరే ! కాని మొట్టమొదట ఈ యభిమన్యుఁడెవ్వడో తెలిసికొందము. ఇతఁడు గీతాచార్యుఁడైన శ్రీకృష్ణభగవానుని మొదటి శిష్యుడు. ప్రఖ్యాత పురుషుఁడునైన అర్జునుని వీరప్రసవ కిశోరము. కౌరవ పాండవయుద్ధములో దుర్లక్షుఁడయినవాఁడు అభిమన్యుఁడు; సక్రమ ధర్మయుద్ధ విధానము నాశ్రయించి యెవ్వరు నాతనిఁజెనక నసమర్థులు. ఆతఁడే శత్రువుల చిన్నాభిన్నము చేయుచుండెను. అందుచే కౌరవ వీరపుంగవులందరు అధర్మ యుద్ధ క్రమము నవలంబించి యొక్కుమ్మడి యతనిపైఁబడి ఘోరముగా నృశంసులై దయాశూన్యులై యతనిని వధించిరి. అందుచేఁ బుత్రమరణముచే నతని తండ్రియగు నర్జునుఁడు దుఃఖాభిభూతుఁడు, నిర్విణ్ణుఁడు, ఆశ్వాసింపఁబడ వీలుకానట్టివాఁడు నయ్యెను. కురుక్షేత్ర యుద్ధారంభసమయమున మరణించుటకు సంసిద్ధులై యుద్ధోన్ము ఖులైయున్న తన బంధువలను గాంచి యర్జునుఁడు, కృపాణ ధనుర్బాణములఁ బరిత్య జించి, యుద్ధము నుండి తరలి పోవుటకు నెవ్వరిని జంపకుండుటకు నిశ్చయించుకొనెను. అప్పుడెట్లో కృష్ణునిచే ప్రబోధింపఁబడి యుద్ధమొనరింపఁబూనెను. ఇప్పుడు మరల స్వీయ ప్రియతనూభవుని మరణమును గండ్లారఁగాంచి, విషాదోపహతుఁడై, మిన్నువిరిగి మీఁదఁబడ్డట్లయి, అర్జునుఁడు శరీరత్యాగ మొనరించుకొనంగోరెను. అట్టి క్రౌర్యము, అన్యాయము, ప్రబలి, ఒక కుట్రపన్ని, ప్రఖ్యాతులయిన వీరపుంగవులందరేకమై యమా యకుడైన యొక పసినిసుంగును జంపుటకై ఘాతుకక్రియ యాచరించినట్టి యీ ప్రపంచమునఁ బ్రతికియున్న ప్రయోజన మేమని యతని కనిపించినది.

ప్రియశిష్యుఁడైన అర్జునుని యనివార్యమగు దుఃఖమును దిలకింప భగవానుఁడగు కృష్ణుని హృదయమును బరితపించినది; ఈ దుఃఖమునుండి ఉద్ధరించి యతనికి సహాయముచేయ నతఁడు సంకల్పించెను. భగవంతుఁడు ఓదార్పునకై యుపశమన వాక్యము లాడెనుకాని, వానివలన నెట్టిప్రయోజనము గానరాలేదు. అందుచే కృష్ణపర మాత్మ అర్జునుని అభిమన్యు విహారమునకుఁ గొంపోయెను. అది శాంతి నిలయము; అందు అభిమన్యుఁడు సంతుష్టుఁడై సౌఖ్యము ననుభవించుచుండెను. అర్జునుఁడు అభిమ న్యుఁగాంచెను; అభిమన్యుఁడు ఆనంద పరిపూర్ణుఁడై, సుఖప్రపూర్ణుఁడై వెలుగొందు చుండెను. అర్జునుఁడు అభిమన్యునిఁ జూచి "నాయానా! అభిమన్యా! నీ తండ్రినైన నన్నేల వీడివచ్చితివయ్యా!" యని పలుకుచు నతనిని కౌగలించుకొనంగోరెను. అభిమన్యుఁడు ఆశ్చర్యచకితుఁడై–

"కో మమపితా! కస్త్వం?" (నాకు తండ్రియెవ్వడు? నీవెవ్వరవు?")

అర్జునుడు : "కింమాంనజానాసి? (నన్నెఱుంగవా?)

అహం తవప్రియోజనక :– (నేను నీప్రియమైన తండ్రిని)

అభిమన్యుడు (నవ్వి) : మయిజాతే భూమ్యాం మయిాదృష్టా న ఏకః పితా
ధవాద్వేపితవౌ – కింతు శతశతాధిక శతం పితరః

నేను భూమియందు పుట్టిననాళ్లు నాకొకరు లేదా ఇద్దరు తండ్రులుకారు శత సహస్ర జనకులైరి.

నిజముగా అనిద్రాణమైన విశాలార్ణవ తలమున నెన్ని కెరటములో అన్ని జన్మ ములుకదా; ఒక్కొక్క నిశ్శ్వాసమొక జన్మ.

మనకందరకెన్నెన్నియో జన్మలైనవి–అవి యెన్ని జరిగినవో మనము గణింపఁ జాలము. ఒకవేళ నిర్ఛిద్రమయిన సముద్రతీరమున నుండి దివారాత్రములు పుట్టి పెరిగి ఎరుగుచు లయించుచున్న కెరటముల పుట్టుక చావుల సంఖ్యనైన లెక్కపెట్టిన లెక్కపెట్ట గలుగుదుమేమోకాని–మనము పుట్టుక నుండి మరణము వరకునైన మన నిశ్శ్వాసములనే పరిగణింపజాలము! ఇఁక అసంఖ్యేయమయిన, అనంతమయిన మన జన్మల నెట్లు లెక్కింప సమర్థులమగుదుము! ప్రపంచ పరిస్థితి యిట్టిదై యుండగా **(ఏషావిహితారీతః)** నాకు తండ్రి యెవ్వఁడు? అందరును నా జనకులే!! అజ్ఞానమున–క్షణమున నశించి యదృశ్యమగునట్టి యొక కెరటము కొఱకై గుండె బాదుకొని ప్రేమించి విలపించుటేల? లేదా అట్టిదే యొక చిరు తరంగము వంటివాఁడును నొక తండ్రికదా?"

అనిన అభిమన్యుని పలుకుల నాలకింప అర్జునునకు వివేకము కలిగెను. కనువిప్పయ్యెను; పుత్త్రవ్యామోహమున కతఁడు సిగ్గిల్లెను; తాత్కాలిక ప్రేమోద్వేగమునకు

వశమైనదానికి జాలిపడెను. జనన మరణములు లేనట్టిదియు, నిరంతర శాశ్వతశాంతి సౌఖ్య సామరస్య ప్రజ్జ్వలితమైనట్టిదియునగు అభిమన్యు విహారమును స్వయముగా దర్శించుటవలన అర్జునుఁడు అమితమైన పుత్రమరణజాత విషాదమును నిగ్రహించు కొనగల్గుటకు సహాయమొనరించినదానికి భగవంతుఁడయిన కృష్ణుఁడు లోలోన నెంతయో సంతసించెను.

అభిమన్యు విహారమున, ఆకలి దప్పికలుకాని, శీతోష్ణములుగాని, రుగ్మతారుగ్మతలు గాని యుండవు. అయ్యది ప్రాపంచికమయిన సర్వద్వంద్వములకు, జీవితసంబంధి హెచ్చుతగ్గులకు అనివార్యమయిన పరీక్షలకు న్యాయవిచారణములకు జీవిత సంక్షోభము లకు విదూరమయిన స్వతంత్ర ప్రదేశము. అది భూలోకస్వర్గము (భూలోక **"షాంగ్రిలా"**) యధార్థమయిన భగవన్నివాసము! మంచిదే! మఱి అది యెచ్చటనున్నది? అన్నది ప్రశ్న; అసలు అది భూమిమీఁద నున్నదా? లేదా అది స్వర్గముననున్నదా? అట్లయినచో మేధా వంతుఁడు జిజ్ఞాసాపరుఁడునయిన శాస్త్రజ్ఞుఁడు దానిని పరిశోధింపక విడువఁడే? ఆతఁడు తాను క్రొత్తగా సృజించిన **'స్పుట్నిక్'** లోనో, రాకెట్టులోనోపోయి తప్పక దానిని కనుగొని తీరును. కాని ఈ యభిమన్యు విహారము – ప్రపంచ సంబంధమైన 'పేరు ప్రఖ్యాతులకు' సంపూర్ణముగా విముఖులైనవారికే. గాని స్వాంతరాత్మల–అహం కారము–అన్నిరూపముల పూర్తిగా నిర్మూలింపఁబడి, దగ్ధపటలము అయినవారికే–గాని చేరరానిది. మహామహో పాధ్యాయ బిరుదములందుకొన్న పండితులకుగాని, వేదాంతులకుగాని, సన్న్యాసులకుకాని చేరరానిది–ఏలయన–ఈ బాహ్యపరిత్యాగావలంబనముకాని, అఖండశాస్త్ర పాండిత్యము గాని, దీనికి సహకారులుకావు, అభిమన్యు విహారములో నడుగిడుటకు అహంకార నివాసము, కించిజ్ఞితారూపమయిన జీవభావపరిత్యాగము–అనుమతి ప్రవేశపత్ర మొం దుటకు ముఖ్యార్హతలు–సర్వజ్ఞానావబోధనా విశిష్ఠమయిన శాంతిరసలేశము శాశ్వతముగా నాస్వాదింపవలయునను జిజ్ఞాస యన్న పక్షమున, అభిమన్యు విహారమొక్కటియే లక్ష్యము, పరమమైన శరణ్యము, అందెట్టి నిరాశానిరుత్సాహము లుండవు.

ఈ అభిమన్యు విహారమునుగూర్చి యెఱిఁగి, యవగాహ మొనర్చుకొనుటకు బాహ్యాధ్యయన పరిశ్రమగాని, ఇతర బాహ్యయోగప్రక్రియాపరిశ్రమగాని కాదు కోరునట్టిది; మఱి కావలసినట్టిది–ఆత్మాంతరపరీక్షాధ్యయనము; బాహ్యమైన తలస్పర్శిమాత్రమైన పాండిత్య సంస్కారమును పూర్తిగా విస్మరింపవలయును; ఇఁక మనము ఆధారపడ వలసినది బాహ్యవిజ్ఞానమునందుకాదు; ఆడంబర ప్రియులైన గురువులయందుకాదు; దేశికులయందుకాదు, మఱి ఆధారపడవలసినది మనయందే–ఇచ్చటనే, ఇప్పుడే. – నివసించు అంతర్జ్యోతియందు–తత్పరమాత్మ సాన్నిధ్యమునందు; ఆ తత్పదార్థము

పవిత్రమైన మన యాత్మలయొక్క ప్రశాంతసమయములయందు మనచేఁ దెలియఁబడుటకై మనకై ఎల్లప్పుడు నిరీక్షించుచుండును.

ఓ ప్రియ – శాంతిపాఠకులార! ఈ యభిమన్యు విహార మెచ్చటనో, చేరరానిదై, దుర్లక్ష్యమైనట్టిదై, విదూరాకాశమున బహుదూరమున నున్నదనియు, దానఁబవేశించుటకు చచ్చిచాయంగలవిన్నపములు చేయవలసియుండుననియు భావించి నిరుత్సాహవంతులు కావలదు !

**"బ్రతుకుటకై నీవు చచ్చియుండుము"**–ఇందు కావలసినది భౌతికమయిన మరణముకాదు... ఇది యెంతయో సులభమయినది; మనకు కావలసినది మానసిక (సాంకల్పిక) మయిన మరణము – అదియే అహంకార పరిత్యాగరూపకమయిన మృతి – ఈ మృతి ననుభవించుట చాల దుష్కరము–అయినను, నీ దుష్కర దుర్లభమయిన మృతియే అభిమన్యు విహార ప్రవేశమునకు తప్పనిదైన ఏకైకార్హత, మనము అహంకార మును చంపుట, స్వార్థమును పరిత్యజించుట, **ఆత్మార్థ ప్రణవత్వమును విసర్జించుట – అను అమూల్యమైన** మూల్యమును జెల్లింప సంసిద్ధులమయినచో, ఇచ్చటనే ఆ అభిమన్యు విహారము సాక్షాత్కరించును – ఇది సర్వమానవులకును జన్మహక్కు; ప్రాక్పశ్చిమదేశ విభజనము లేక పరమార్థసత్యము నన్వేషించునట్టి జిజ్ఞాసువులకు దేవతా సంబంధమయిన వారసత్వము. మీ 'మనస్సు' అభిమన్యమగుత ; శరీరమువిహారమగుత, ఏలయన ప్రత్యగాత్మైక శాంతియే ప్రథమత! లభ్యము కావలసినది; ఇది ప్రతి హృదయాంతరమున నారంభించును; ఇయ్యదియే వైశ్వమయిన (విశ్వజనీనమైన) శాంతికి రాచబాట వైచును. అభిమన్యు విహారమునకుఁ ప్రవేశించుటకు సరళమైనది, సులభమైనది, ప్రత్యక్షమైనది యగు మార్గము–**"సోఽహం"** జపము ; నిరంతరము దాని ననుసరింపుఁడు. అయ్యది నిన్ను అభిమన్యు హృదయమునకుఁ దీసికొనిపోవును. పరమశాంతి భావమున నీవుండ, నీదే దెలియంబడుటకై "పరమశాంతి" నీరీక్షించుచుండును.

జనన మరణములకు దూరమైనట్టి, జ్యోతులకెల్ల జ్యోతియైనట్టి, స్వయంప్రకాశుఁడు, అయిన అభిమన్యుఁడు – మీ హృదయాంతర్వర్తియైన జ్యోతిర్విభూతి, అవ్యయ సత్యపరబ్రహ్మానుభూతిని గల్గించి ఆశీర్వదించుగాక!

ఓం, ఓం, ఓం.

(శాంతి ఫిబ్రవరి 1964)

# అయి! మురళి!

శ్రీబొబ్బిలి రాణీగారు శాంత్యాశ్రమ విశిష్ట భక్తురాండ్రలో నొకరు. ఆమె విశేషముగా శ్రీకృష్ణభక్తురాలు, ఆమె హృదయము స్నేహ విశాలమయినది. పవిత్రుల కెందరికో యందు స్థానము కలదు. ఆమె హృదయము విశ్వసించి పూజింపని దేవతా స్వరూపము లేదు. అయినను మందస్మేరాననుఁడగు నందకిశోరునియందు ఆమె హృదయమున కార్ద్రత హెచ్చు. నా అస్వస్థత సమయములో ఆమె నా కొఱకై యెన్నింటినో యమూల్యము లయిన బహూకృతులను, వైద్యాలయమునందలి నా తాత్కాలికా వాసమును ఆనంద యుతము, సౌఖ్యభరితమును జేయుటకునై తెచ్చి యిచ్చెను. ఆమె సమర్పించిన యమూ ల్యోపహారములలో సుందరమయిన కృష్ణ చిత్రమొకటి. అది యిప్పుడును శ్రీ చెన్నారెడ్డి దంపతులొసంగిన మెత్తని పాన్పులో శయనించునట్లు చిత్రింపఁబడిన నిద్రించు బాల కృష్ణుని చిత్రముగల గోడకు నెదుటి గోడమీఁద విరాజిల్లుచున్నది.

శ్రీ బొబ్బిలి రాణీగారొసంగిన శ్రీకృష్ణ చిత్రము అపూర్వమయినది. అది కృష్ణుఁడు మురళిని రెండు చేతులలో దాల్చి వాయించుచున్నట్టులుండిన మనోహర భంగిమా విన్యాసము కలది. ఇతర చిత్రములలో నెందుఁ దిలకించినను శ్రీకృష్ణ చిత్రము నీవంకే చూచినట్లుండును. మఱి యీ చిత్రమునందో – అట్లుకాక, అమరము. స్వతంత్రము, అత్యద్భుతమునైన గీతాగాన లహరుల ప్రవహింపఁజేయుచు, యావన్మానవలోకమును బులకిం పఁచేయుచు, వీక్షించుచున్నట్టులున్నది. ఆతఁడా దివ్యమైన మురళీగాన మొనర్చుటలో మైమరచియున్నాఁడు. ఆ దివ్య మురళీ మోహన మూర్తిని తదేక పరత్వ మునఁ దిలకింపగా నా శరీరమే యాతని మురళియను భావము గలిగినది. నేనాతని హస్తగతమై యున్న వ్యక్తిని. ఆతని దివ్య సన్నిధియే నన్నావృతమొనరించియున్నది. శ్రీ రాణీవారు సంతతము–

**"అంతా కృష్ణమయం, ఈ జగమంతా కృష్ణమయం**
**కన్ను మూసినా కృష్ణమయం, కన్ను తెరచినా కృష్ణమయం"**

అని గానము చేయుచుందురు. నాకును నట్లే తోచినది. నీవు కన్ను మూసికొని యున్నను తెరచుకొనియున్నను లోపలను వెలుపలను అంతటను శ్రీకృష్ణమయమే. ఈ ప్రపంచమే యాతనికంటె వేఱొకటి కాదాయెను! ఈ భావము నన్నావేశించియుండ, కృష్ణుడు మురళిని తన పవిత్రమైన రెండు చేతులఁబట్టుకొని, నన్నే యతని వంశనాళముగా నొనర్చి నా ద్వారా గానమాలపించుచుండెనను ననుభూతి గలిగినప్పుడు–ఈ భావము నాకెంతటి బలమును, మనసోత్సాహమొసంగినదో మీ రూహింపఁజాలరు.

మధుర మోహన గోపికా మన్మథుడు
నా ముఖంబున దివ్య గానంబు సలుపు;
స్నిగ్ధ మురళీ స్వరూపాత్మ నియతి గన్న
నాశరీరంబనెడు వంశ నాళ మూది
దివ్య గాన మఖిల విశ్వ దిగ్దగంత
ముల లహరుల పాటించుచు ముంచినెత్తు

● ● ●

తన్మనోజ్ఞమూర్తి చిరు హస్తములలోన
నే విరాజిల్లు చుండుదు నెల్ల వేళ!
అతని చేవీడి నేనొంటి నవఘళించు
నొక్క క్షణమేమి లేదిక నుండబోదు!

● ● ●

మధుర గోపాల మూర్తి సన్మంజు కర వి
రాజ మానమైనట్టి మురళి – తలంప
నెంత నిస్వార్ధమైనది! యెంత శుద్ధ
మైనది; మరెంత స్వతంత్రమైన దోయి !!

● ● ●

అంతియేకాదు ; మఱి నిర్భయంబదెంత !
అవునుగాని; శ్రీకృష్ణ కరావలంబ
నంబు గలుగ నిన్నెదిరించు నట్టి దేది?
ఎవరు ప్రత్యర్థతను భజియింప గలరు?

● ● ●

ఏనొకరుండనే హరికరేధితమౌ మురళీతనుత్వమున్
బూని తరింతునంచు తలపోయుఁడెల్లరుమీరు నిండు స్మీ
రానను జీవదూర్మికల; హుంకృతి శూన్యులరై తదంతర
శ్రీ నిహితాత్మతన్ వ్యవహరించినచో మురళీత్వమూనరే !

● ● ●

అతఁడు మీయెదలోన నిత్యంబు వెలసి
మురళి వాయించుగాక సమ్మోహనముగ;
అతఁడు కారకుడయి దయా స్వాంతుఁ డగుచు
భవదుపాధి కర్తృకమయి – వరలుగాక !

భవదనంతమూర్తుల విభవంబు చెల్ల
నొక్కడై తదా కృతులలో నొప్పి సర్వ
మంగళాయత నంబుగా మనుజవితతి
చేయుగాక గోపాలక చిన్మహమ్ము
కృష్ణభగవానునకు నమస్కృతులు నగుత...

● ● ●

పరమనైశ్చబ్ధ శాంతి భావంబు లందు
మధుర మంగళ క్షణముల మారుమ్రోగు
దివ్య గీతా సుధాగాన భవ్యగతులు...
కన్నుమూసి లోలోపల గాంచి వినుము.

● ● ●

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః
ఇది సమర్పిత మగుగాక యెల్ల భాగ
వతులకును; కృష్ణభగవాను భక్తులకును
పరమ గీతోప దేశిక వర్యునకును
ఎవనిచేత గీతామృతం బవని పరగె.

(శాంతి ఏప్రిల్ 1964)

## అందరికంటె భాగ్యవంతుడు

ప్రశ్న : ప్రపంచ మంతటిలోను భాగ్యాతి భాగ్యధనుడెవరు?

జవాబు : నిష్కామ, నిస్వార్థ మానవుడు యీ సృష్టంతటిలోను మిక్కిలి భాగ్య వంతుడు.

డెబ్బది వత్సరముల జీవితానుభవములతో కూడిన నా జీవిత కాలమును పర్యవ లోకనము చేసికొంటూ, ఆ భగవానుని అసంఖ్యాక ఆశీర్వాదములను, సర్వదా యాతడు యెడతెగక నాకిచ్చు రక్షణను గాఢమగు కృతజ్ఞతతో తలచుకొనునపుడు ఈ విశ్వమం దంతటిలో నేను మిక్కిలి భాగ్యవంతుడనని నా అంతర్వాణి చెప్పుచుండును. నేనా భగవానుని చొట్ట గొఱ్ఱె పిల్లను గాన, నేనాతని గారాబు ముద్దుబిడ్డనని తరచు తలంచుచుం దును. భగవంతుడు తప్పిపోయిన తన గొఱ్ఱెపిల్లను సంరక్షించుచున్నాడుకూడ. తప్పి పోయిన తన గొఱ్ఱెలను తన మందకు తిర్గి చేర్పక అతడెట్లు విడిచిపెట్టి వుపేక్షించును? తన బిడ్డలయెడ అపారమగు దైవప్రేమ అట్టిది!

లక్షలాది నక్షత్ర నయనములతో కూడిన అనంతమగు ఆకాశమును, సూర్య

చంద్రులను పరికించినపుడు ఇవన్నీకూడా నావేననీ, ఈ దివ్యభూతము లన్నిటికి అధికారిని నేనేనని, నేనే అందరికంటె మిక్కిలి భాగ్యవంతుడనని తలంచుచుందును ఇక ప్రాణప్రదమగు పంచభూతముల మాటేమి? అగ్ని, జల, వాయు, భూమ్యాకాశాదు లన్నీ నావే. పై ఆకాశములోను, క్రింది భూమిపైని చుట్టూ అంతటాకూడా నాకు చెందని దేదిన్నీ లేదు. వాటి నన్నిటిని నేను ప్రేమింతునుగాన, ప్రతి వస్తువు నాదే. పశు పక్ష్యాది మానవుల మాటేమి? అవికూడా నీకే చెందును. సుగంధ పుష్పములు ఘనమగు హిమాల యములు, సదా ప్రవహించు గంగానది, ప్రాక్ పశ్చిమములలోని సర్వనదులు, అగాధ మగు జలనిధితో సహా అన్నికూడా అద్వితీయుడనగు నావే.

ప్రశ్న : నేనొక్కడనా లేక ఇద్దరినా?

జవాబు : నే నెపుడూ ఒక్కనిగనే వుంటున్నాను.

నే నెపుడూ అద్వితీయునిగనే వుంటున్నాను గనుక, ప్రతీదీ నాదే. అందరూ నా ప్రేమలో చేర్చబడియున్నారు. అన్నీ నా స్వంతమే గాన, ప్రపంచములోని భాగ్యమంతా సహజముగా నాకు చెందునని వేరే చెప్పనక్కరలేదు. ప్రాక్పశ్చమములోని బ్యాంకు లన్నిటిలోని బ్యాంకు ఖాతాలన్నీ కూడా నా స్వంతమైనపుడు, నేనెంతో భాగ్యవంతుడనని తలంతును గదా! దాన కర్ణుడైనా, పరమ లోభులైనా, ప్రజలంతా నావారేగాన, నాకేమీ భేదములేదు. ఈ విశ్వభాగ్యమున కంతటికి స్వంతదారునైన నాకు ఏమి కావలసినా, ఎపుడు కావలసినా, నేను భగవంతునికి నెమ్మదిగా విన్నవించినంత మాత్రమున తరచు నేను బహిర్గతముగా విజ్ఞప్తిచేయుటకు ముందే ఆయన నా స్వల్పమగు స్వార్థరహిత కోరికలను సఫలీకృత మొనర్చును. నాకు భగవంతుడెంతమంచివాడు! ఎంతటి విషయగ్రాహి! ఈ నీలగిరి కొండలలోని “లక్ష్మీవిహారు”కు భగవానుడు నన్నొక సాధువుగా, దేశ ద్రిమ్మరిగా తీసికొనివచ్చి, పీరు (Pear) మరియు తేయాకుతోటలతోను, స్వంత ప్రవాహ సహిత అంతఃపుర భవనములతోను కూడిన భాగ్యవంతమగు భూఖండమును (Estate) నాకు ప్రసాదించి క్రమముగా నన్నొక ‘రాజా’ గా చేసెను. నాకు చెందినది మీకందరికిన్నీ చెందినదై వున్నది; కారణము? నాకు ప్రసాదింప బడినదంతా దైవసంతానమున కంతటికిని చెందునుగనుక నాసంపదలన్ని సర్వస్వామ్యములై వున్నవి.

ప్రకృతి సుందరమగు ‘కోటగిరి’ ప్రపంచములోకెల్ల మిక్కిలి ఆరోగ్య ప్రదమగు ప్రదేశముగా భావింపబడుచున్నది. ఇది “ప్రాక్ బ్రిట్టను” గా పిలువబడుచున్నది. నా అత్యుత్సాహములో, ఈ క్రిందివిధముగా పునర్వచించుచూ, తరచు ఆనందమును పొందుచుందును. “నీవు ఏ జబ్బు లేకుండా ఆరోగ్యముగాను, సుఖముగాను వుండదలిస్తే, ఆరోగ్యముగా దీర్ఘకాలం జీవించగోరినచో, “కోటగిరి” నీకు మిక్కిలి ఆరోగ్యయుతమగు శాంతి ప్రదమగు ప్రదేశము!

తరచు ఆశ్రమభక్తులు దగ్గరనుంచి దూరమునుంచికూడా వచ్చి కొద్దిరోజులు ఇచట ఆరోగ్యముగాను శాంతముగాను గడుప గోరుచుందురు,గాని చోటుచాలక మేము బాధపడుచుండుట వలన, ఒక వరండాపై లైబ్రరీతోను, రెండవ వరండాపై అతిధుల కొరకు రెండు గదులతోను కూడిన విశాలమగు ప్రార్ధనాలయమును నిర్మించ నిశ్చయించితిమి. అందరి సౌకర్యమునకు వుపయోగించు దీనిని నిర్మించుటకు (రు. 20000 లు) ఇరువదివేల రూపాయల మాత్రమగునని అంచనా వేయబడుచున్నది భగవంతుని అపారమగు సంపదముందు, యీ స్వల్ప ఇరువదివేల మొత్తమెంత? కేవలం ఒకభక్తుడు దీనిని పూర్తి చేయగలడు. శాంతి కాములందరి సౌకర్యమునకుగాను, తమ పేర శాశ్వతముగా నిలచుకొరకు, ఆ భక్తుడు గ్రంథాలయము మరియు రెండు అతిధి గృహములతో కూడిన ప్రార్ధనాలయమును భక్తలోకమునకు ప్రసాదించవచ్చును.

ఆ ప్రార్ధనాలయము, ఒక్కరిచేగాని పెక్కురిచేగాని ఎవ్వరిచే నిర్మింపబడినను అందులో వ్యత్యాసమేమీలేదు. ముఖ్యముగా అది పూర్తి కావడమే కావలసినది. గత సాలున భగవంతుని దయవలన, రాయితోను ఇటుకతోను, పునాదులు పూర్తి చేయగల్గితిమి. ఈ సంవత్సరం, తలుపులు, కిటికీలు వగైరా కలప పని అంతా ఇప్పటికి పూర్తి చేయగల్గితిమి. దైవమెంత మంచివాడు.

కొందరు తమ ఉత్సాహములో ధార్మికమగు వాగ్దానములను చేసి, వాని పాలించుటయందు మరపు గాంచునపుడు కొన్ని సమయములలో నాకు విచారము కలుగుచుండును. కాని వాగ్దానములను గుర్తుచేయటకు అట్టి దాతలను వెంబడించి వారికి బాధ కల్గించుటకు ఎన్నడూ నేను కోరను. అయితే అట్టి దాతల హృదయాంతరాళమున ప్రవేశించి వారు చేసియున్న వాగ్దానములను గుర్తుచేసి, వారు వాటిని పాలించి సహాయపడగలందులకు తోడ్పడ ఆ సాక్షిభూతుడగు దేవదేవుని మాత్రము సమీపించి ప్రార్ధించుచుందును. భగవానుడు వారల హృదయములను తాకినంతమాత్రమున ఎండి కఠినమైయున్న వారల హృదయములనుంచికూడా కరుణారసము ప్రవహించును. భగవంతునివలన కానిపని ఏముండును? దైవ సంపర్కమువలన మహాలోభులు ధార్మికులుగాను, కఠినహృదయులుకరుణా సముద్రులుగాను మార్పు చెందుదురు.

భాగ్యవంతమగు ఈ ఆస్తిని సంపాదించునపుడు, మొదటలో విలువైన సామగ్రులు వగైరాలకే ఇరువదివేల రూపాయలు మేము చెల్లించవలెనని కోరబడితిమి. భగవన్నిర్ణయమగు ఆఖరి క్షణమున భగవానుడు ఆ మొత్తమంతా సమకూర్చడమే గాకుండా, ఒక్క రాత్రిలో ఆ "లక్ష్మీవిహారు" స్థిరాస్థి నంతను, సర్వ హక్కులతోను మాకు స్వాధీనపరచి తోడ్పడెను. ఈ క్రింది పద్యమగు "ధార్మికత" మిక్కిలి ప్రాణప్రదమను ఆత్మ ప్రేరణమును అయి యున్నది.

## 29

### వితరణ

దాన మొనరింపు మర్థుల కుదారబుద్ధి
బిడికిటనుబిగియబట్టిన
అద్ది నేలగలయు నొక్కనాడు;
కాదందువో, నీ అంగుళుల సందునజారి.
రెక్కలొచ్చి ఎగిరిపోవునెటకో!
ఇమ్ము, నీదగు ఈవి తెలుపఁ
అద్ది మధుర ప్రవాహమై
లోకము ముంచి యెత్తు.

దేనిని తెలిసికొనిన సర్వము తెలియబడగలదో–యా వస్తువును తెలిసికో! మొదట నిన్ను నీవు తెలిసికో! దైవ సంబంధమగు స్వర్గరాజ్యము, ధర్మము అన్నీకూడా నిన్ను చేరును. దైవమును, దైవస్వరూప సత్యమును తెలిసికొంటివా, యీ విశ్వమంతట నిన్ను మించిన భాగ్యశాలి వుండడని నమ్ముము. దైవరాజ్యమును ముందు వెదకి పట్టుకో – అప్పుడు సర్వలోకములకు నీవే రాజువై, సృష్టికే అతి భాగ్యశాలివై రాణింతువు.

ఎపుడూ తనకొరకే పాటుపడు స్వార్థపరుడు అజ్ఞాన తూర్పు పడమరల అన్ని దేశముల – ప్రపంచ మంతట కలుగుచున్న సర్వబాధలకు చివరకు భూత భవిష్యద్వర్తమాన కాలముల యుద్ధములకుకూడా కారణభూతుడని–నేను సదా ఆంతర్యమున తలచు చుందును. స్వార్థపరత్వమువల్ల ప్రాపంచిక అనిత్య ఆటవస్తువుల వెంట పరుగిడుచూ, పేరు ప్రతిష్ఠలనెడు, చంచల మేఘములకు బానిసయై వర్తిస్తూ–కేవలం యాతన వేదుకకు, ఆత్మ ఘనతకొరకు యాతడు యీ భూతల స్వర్గమును నరకకూపముగా మార్చుచున్నాడు.

స్వార్థపరునియొక్క ప్రతిష్ఠ ఘనత ఎండుగడ్డిపరక, మరియు వాడిపోయిన పుష్పరేకు వంటివి. లక్షలకొలది నిరపరాధులగు ప్రజలను బలిగొన్న బలీయులు, క్రూరులునగు యుద్ధోన్మాదులు ఇపుడెక్కడగలరు? స్వర్గరాజ్యము పసిపాపలవంటి పవిత్రులకు, విశ్వాసపాత్రులకు మాత్రమే చెందును. అశాశ్వతమగు ప్రాపంచిక వస్తుసముదాయము వెంట పరుగిడక, మనము దైవమునుచేరి మనుదుముగాక! ఈ శరీర ఘటమునుండి ప్రాణకాంతి వీడిపోవు క్షణమునకు పూర్వమే, పవిత్రమగు ఈ మానవజన్మ యొక్క ఆశ యమును జేరుటకుగట్టిగా ప్రయత్నింతుముగాక! అన్ని జాతులకు అందరకు ప్రయోజ నకరమగు విధము ఆ పరాత్పరునకే తెలియుగాన మన కోరిక ప్రకారముగాక ఆయన యభీష్టమే నెరవేరుగాక!

ప్రియమగు శాంతి పాఠకులారా! ఈ పవిత్ర మానవ జన్మాశయమగు మనోశాంతి నొసగు దొంగలచే నపహరింపబడని, కాలప్రవాహమున నశించిపోని అమరభాగ్యమును, మీరుకూడ నాతో పంచుకొని అనుభవింతురుగాక! కోరికయే బంధించునది, కోరికను వీడుము. ఇపుడిక్కడే స్వర్గరాజ్యములో నీవు పూర్ణ సంతుష్ఠియను వున్నతాసనమును అధిష్టించి సుఖింతువు ఆసుపత్రులు, గురుకులములు, ముద్రణాలయములు, వృద్ధాప్య వసతులు, శాంత్యాలయములు వగైరాలతో కూడిన ఆశ్రమముల మాటేమియని యెవరేని ప్రశ్నించిన, నా జవాబు "అవి నా కొరకు కాదు. మీ ప్రయోజనేమునకే; అవి మీ అందరికిని, మీకు నే నిచ్చిన బహుకరణలు. దైవము సర్వకోరికలను నెరవేర్చు నా కల్పవృక్షము. ఆ సర్వవ్యాపి నీడనుచేరి యాతని పిల్లల ప్రయోజనమునకు అనేక చిన్నచిన్న వస్తువులను కోరుచుందును. అటి సర్వకోరికలను ప్రసాదించు మహాప్రభునకు, సర్వ సంపదలకు అధికారియగు దేవాదిదేవునకు, భాగ్యాతిభాగ్యునకు, వున్నతాతి వున్నతునకు గాఢమగు భక్తితో తలవంచి నమస్కరించి, అతని పవిత్రమగు అడుగుజాడలలో సదా పయనించుటకును అన్నిటికి మించి అతనివలె నిష్కామినై జీవించుటకును, తగు శక్తిని సమర్ధతను నా కొసగి ఆశీర్వదించుటకు కోరుకొందును. కేవలం జ్ఞానులకు మాత్రమే కలుగు యా పరమశాంతి పదవి నిష్కాములకు ప్రాప్తించును.

అనంత పరబ్రహ్మము మాత్రమే నిష్కామి.

పవిత్ర మానవ జన్మాశయమగు సేవను గూర్చి వ్రాయబడిన యీ క్రింది పద్యముతో నా సందేశమును ముగింతునుగాక!

నీ చేతనైనన్ని విధముల
నీ చేతనైనన్ని మార్గములలో
నీ చేతనైనన్ని ప్రదేశములను
నీ చేతనైనన్ని కాలములందు
నీ చేతనైనంత మంది జనులకు
నీ చేతనైనంత వుపకారమును చేయుము.
సర్వజనులకు సుఖ శాంతులు కలుగుగాక!

ఓం ఓం ఓం

ఆంధ్రానువాదకులు
శ్రీ జ్యోతుల కాశీస్వామి (శాంతి జూన్ 1965)

# అత్యధిక సుఖవంతుడు

అందరికంటె భాగ్యవంతుడు అను శీర్షికతో ప్రథమమున నేను వ్రాసిన వ్యాసమై యుండెను. దానికి పిమ్మట "సంపూర్ణ ఆరోగ్యవంతుడు" అను శీర్షికతో వెలువడినది. కడపట ఈ "అత్యధిక సుఖవంతుడు" అను శీర్షికతో ఈ వ్యాసము వ్రాసితిని. ఏ కొందరు భక్తులకో, ఎక్కడో అక్కడ ఎప్పుడో ఒకప్పుడు, సహాయము చేయుననెడి తలంపుతో, నా అంతరాత్మ ప్రోద్బలమును పురస్కరించుకొని అప్పుడప్పుడు నా దివ్య భావములను వెలి గ్రక్కుచుందును. భాగ్యవంతు డెవరు? అను ప్రశ్న వచ్చినప్పుడు, ప్రపంచములోని సంపద నంతను పొందియుండి తనకు తాను అనుభవించువాడుకాక, దేవునిబిడ్డల సేవా తత్పరతలో, ఖర్చుపరచి తన ఐశ్వర్యమును సద్వినియోగము చేయునతడే నిశ్చయముగా భాగ్యవంతుడు అని చెప్పవలసి వచ్చును. కేవలము, తనకొరకే తాను జీవించువాడును, ధనికుడైయుండియు బీదల పాలిట కల్పతరువు కాకపోయినవాడును–ఎన్నటికీ బీదవాడే. క్రీస్తుప్రభువు, తన పావన శిరస్సును దాచుకొనుటకు, తనది అను పేరుతో, ఏకొద్దిపాటి స్థలము లేకపోయినను, ఆయన ప్రపంచకమునకెల్ల భాగ్యాతి భాగ్యవంతుడు కాలేదా? "ఇది నాది" అని లేకుండ చేసుకొనుటలోనే గలదు మహిమ.

కాబట్టి దీని సారాంశ మేమనగా, అనశ్వరమైన ఐశ్వర్యము ఏది? అని అడిగినపుడు–ఆధ్యాత్మికపు టైశ్వర్యమే ఐశ్వర్యమని చెప్పవలసివచ్చును. ఎవ్వరిని విడిచి పెట్టక –సర్వులను తనలోకలుపుకొను సువిశాలప్రేమతో కూడిన దయార్ద్ర హృదయమే–ఐశ్వర్యము. ఆరోగ్యముకూడ తత్తుల్యమైనదే. అనశ్వరమైన ఆధ్యాత్మికపు టైశ్వర్యము నుండి ఉద్భవించినదే ఆరోగ్యముకూడ. ఆరోగ్యవంతునికే శాంతి సౌభాగ్యములు శోభిల్లుచుండును. **"శాంతములేక సౌఖ్యములేదు"** అనెడి అమరవాణి, త్యాగరాయకృతిని వింటిమిగదా? **ధనికునికైన, దాంతునికైన, వేదాంతునికైన శాంతము లేనిదే సౌఖ్యము మృగ్యము** అని శ్రీ త్యాగరాజు కీర్తించిరి. కాబట్టి శాంతములోనే సౌఖ్యమున్నదని తెలును.

ప్రశ్న : శాంతి ఎక్కడ కలదు?

జవాబు: కోరికలు లేనిచోట మనస్సు చలించదు గనుక అచ్చటనే–శాంతి కలదు.

**"శాంతోయం ఆత్మా"** మహావాక్యములలోకెల్ల అద్భుత వాక్యము "నా ఆత్మ ఉత్కృష్టమైన శాంతియే" కావుననే, అట్టి దివ్యశాంతిని పొందుట ప్రతి మానవుని జన్మహక్కు–ఇంతేకాదు–గమ్యస్థానము ప్రాప్యస్థానముకూడనై యున్నది. ఏవిధముగా పరికించి చూచినను శాంతి సౌఖ్యములు అభిన్నమైనవేగాని–భిన్నమైనవికావు. ఒకే నాణెమునకున్న బొరుసు, బొమ్మవంటివన్నమాట. శాంతి యెచ్చోట కలదో అచ్చోట సౌఖ్యము కలదు సౌఖ్యమున్నచోట శాంతి కలదు.

ప్రశ్న : ప్రపంచములోనికెల్ల అత్యధిక సుఖవంతుడెవరు?

జవాబు : తనకున్నదానితో సంతృప్తి జెందువాడును, కోరికలు త్యజించువాడును, అత్యధిక సుఖవంతుడు.

ఆశయే మానవుని బంధించును, ఆశారహితునికి మాత్రమే నిజమైన శాంతి జెందియున్నది. మౌనపు ఘడియలలో, నేనుండిన పావన సమయమున, తరుచు నేను ఒంటరిగా దైవమునకు సన్నిహితుడనై యున్నపుడు, నా అంతరమునుండి యీ దిగువ తలంపు పొంగుచుండును.

ప్రశ్న : ఓ సౌఖ్యమా! నీవెచ్చటనున్నావు?

జవాబు : నేను నీ దైవ సంయోగములో నున్నాను.

అంతట రెండవ ప్రశ్న ఉదయించును.

ప్రశ్న : దైవ మెక్కడున్నాడు?

జవాబు : నీ అంతరమున నిశ్శబ్ద విశుద్ధ హృదయమున దైవమున్నాడు.

ఆధ్యతనభావిలో, ఆధునిక రంగములో, ఆత్మ సాక్షాత్కారము పొందుట ఇప్పుడే –ఇక్కడే అనెడి మంగళవాక్యము–అగ్రశ్రేణిని వహించినది. అది నా జీవితాభిలాష యొక్క–సారము. దైవమును ఇప్పుడే–ఈ ప్రస్తుత క్షణములో అనుభవింప లేనపుడు ఇకముందెన్నడో–అనిశ్చిత దుర్గమయ భవిష్యత్తులో అనుభవమునకు దెచ్చుకొనెదనన్నచో – అదెట్లు నమ్మ వీలగును? ఇప్పుడేగనుక ప్రయత్నించి దైవసన్నిధిని అనుభవింప గల్గి నట్లయిన – ఎల్లవేళల – అనంతకాలము –దివ్యముగా దైవమును అనుభవింపగలవు. ఒకసారి పట్టుబడిన పిమ్మట –వదలిపోయేది కాదది. ఆయన నిశ్చయముగా నీతో–నీలో – నీ చుట్టును పరివేష్టించి యున్నారు. ఆయన సర్వత్ర జగత్తంతయు వ్యాపించియున్నవారై యుండుటచే–నీ దేహములోని ప్రత్యణువునందును, నీ బాహ్యాంతరములను, శాశ్వతముగా వ్యాపించియున్నారు.

యధార్ధ సౌఖ్యమనునది దైవముతో కలిసి యున్నప్పుడుమాత్రమే సంభవము. అట్టి ప్రపంచ మంతట–మూర్తీభవించిన దైవములో ఐక్యమగుటయే – నిజమైన సౌఖ్యాను భవము పొందుట అనబడును.

ఇట్టి సుఖమునుగాని–శాంతినిగాని, పొందవలెననెడి అభిలాష మనకున్నను లేకపోయినను పరిచితులతోను–అపరిచితులతోను, ప్రేమించు వారితోను, ద్వేషించువారి తోను–ఇంతయేల? పిపీలికాది సమస్త జీవరాసులతోను, మన సంసర్గమును నిరూపించు కొన గలిగినట్లయిన దానంతట అదియే – సుఖమనగా నేమో –శాంతి అనగా నేమో–అప్ర యత్నముగా మన దివ్యానుభవమునకు వచ్చితీరును. దివ్య ప్రేమ–సర్వతోముఖమైనట్టిది.

అది అద్వితీయము. దేవుడు–శాంతి–సౌఖ్యము–ఆత్మ–సత్త్వము–ఈశ్వర తుల్యమైన దివ్యశక్తి–వీటిలో నీ ఇష్టంవచ్చిన పేరుతో నీవు పిలువ వచ్చును. ఒకే దేవునికి–పలువిధ నామములు పెట్టుట వలన ప్రయోజనమేమియులేదు. ఏల? ఉన్నది ఒక్కటియేగదా! దానినే పలువిధ దేశములలో ఋషులు, పలువిధ నామములతో పిలుతురని నేను తరుచు చెప్పుచుందును. ఏది ప్రధానము? నీ ఆత్మతో, ఉత్కృష్టమైనదానితో, నీ చేరిక ప్రధానము. మానవజన్మ సాఫల్యము తన గమ్యస్థానమును చేరుకొనుటయే.

దైవాంతర్వ్యాప్య సాన్నిధ్యమును ఇప్పుడే–ఇక్కడే–నీవు గుర్తించినట్లయిన, నీవు ప్రపంచమున కంతలోను, అత్యధిక సుఖవంతుడవనబడుదువు. సౌఖ్యము స్వార్థపరతలోలేదు. స్వార్థపరత–సౌఖ్యము–ఈ రెండును ఉత్తర దక్షిణ ధృవముల వంటివి. ఒకదానినుండి మరొకటి, ఈ ధృవము లెంతదూరమున నున్నవో, వాటిలో వాటికంత తేడాకూడ కలదు. చీకటి వెలుతురుల మధ్యనున్న తేడా అన్నమాట. ఇంద్రియాతీతమైన సుఖమును అనుభవించువా డెన్నడును స్వార్థపరుడై యుండబోడు. తనకొరకే తాను జీవించడు. ఇతరుల సౌఖ్యముకొఱకే తాను జీవించును. అందుచేతనే వాడు సౌఖ్యవంతుడై యున్నాడు. నేను తరుచు ఉచ్చరించుచుండెడి నా అభిమాన వాక్యములు !

నీవు దుఃఖితుడవు కాదలిచినచో నీ బాగును గురించియే ఆలోచించుకొనుము లేక నీవు సౌఖ్యవంతుడవు కాదలచినచో, ఇతరుల సౌఖ్యమును గూర్చి ఆలోచించుము.

"ఇతరులు" అను నప్పుడు, నా ఉద్దేశములో, వారు మరెవ్వరో బైటివారై యుండ లేదు. నానాత్వములోని ఏకత్వమే–అభేద్యమైన దైవమేగాని తదితర మేమియుగాదు. ఈ నానాత్వమును ప్రేమించుటే ఏకత్వమైన దైవమును ప్రేమించుట అనబడును.

నిస్వార్థసేవయొక్క గొప్పదనమును అభివర్ణించెడి ఆవేశమును గొల్పు ఒకచిన్న కథ కలదు : ఒకప్పుడొక శిష్యుడుతన గురువువద్ద మంత్రోపదేశమును పొందినవాడై దానిని రహస్యముగా నుంచుమనియు, ఎట్టిపరిస్థితులలోనైనను దానిని వెల్లడింపవలద నియు అలా తమ ఆజ్ఞను జవదాటినచో ఆయన శిరస్సు వేయి చెక్కలగుననియు, గురు వుచే భయపెట్టబడెను. శిష్యుడా విధముగా గురుత భక్తితో మంత్రమును పునశ్చరణ చేసికొనుచు దాని సమర్థతను గుర్తించిన వాడయ్యు, కోటానుకోట్ల మానవుల అజ్ఞానాంధ కారములో మునిగియుండగా, స్వలాభాపరాయణుడనై, ఈ మహా మంత్రానందాను భవమును నేనొక్కడనే పొందవలసినదేనా? అని తనలో అనుకొని –అది బాగులేదని యెంచి–ఒకానొక దినమున విస్తృత సమావేశము నేర్పరచి, బహుజన సమక్షమున తాను వేదికపై నెక్కి ఆ మంత్రమును –దాని రహస్యార్థమును బైటపెట్టెను. దానిని నిత్యము పునశ్చరణ చేయుచు అందరను తరింపుడని బోధించెను. గురువున కాసంగతి

తెలిసి, శిష్యుని రావించి, నా ఆజ్ఞోల్లంఘనకు కారణమేమియని అడుగగా – శిష్యుడిట్లు సమాధానము చెప్పెను.

"ఓ గురువర్యా! కోటానుకోట్ల మానవులు తమస్సులో మునిగియుండగా, ఆధ్యాత్మిక దివ్య ప్రసాదమును నేనొక్కడనే ఏలాగు భుజించి యుండగలను? వారి సౌఖ్యమే నా సౌఖ్యము. వారి శాంతి సౌభాగ్యములే, నా శాంతి సౌభాగ్యములు, లక్షలాది జనం ఈ మంత్రమువలన రక్షింపబడునపుడు మీ శాపము వలన నా శిరస్సు వేయికాదుగదా లక్ష చెక్కలై పడిపోయినను పోయినదిలేదు.

శిష్యుని నిస్వార్ధబుద్ధికి గురువు సంతృప్తిచెంది–మనో బుద్ధీంద్రియా తీతమైన శాంతి సౌభాగ్యములతో శిష్యుని ఘనముగా ఆశీర్వదించెను. కాబట్టి సోదరులారా! శాంతి పత్రికా పఠితలారా! యధార్ధమైన సౌఖ్యమనునది, మనకున్నదానిని జాతి, మత, కుల, దేశ విచక్షణారహితముగా ఇతరులకు పంచి యిచ్చుటలోనే కలదని నమ్ముడు–అందుచేతనే శ్రీశాంతి ఆశ్రమము మీకు ఎల్లవేళల హృదయపూర్వక సుస్వాగతము నొసగుచున్నది. అది తూర్పు పడమర దేశములలోని యావన్మందికి చెందిన ఉమ్మడిసొత్తు. శాంత్యాన్వేషణ పరులకది–నా మరణశాసనము. ఎంతరుసుము పైగా వెచ్చించి కొనదల చినను నీకు లభ్యముగాని శాంతిని నీవు నీ శాంతి ఆశ్రమములో ఉచితముగా, సులభ ముగా, సూటిగా, బడయగలవు.

మానవుడు తన అగాధమైన భ్రాంతి భ్రమలలో చిక్కుకొని తన సౌఖ్యముకొరకై, ఎంతసేపూ, బాహ్యమున, సౌఖ్యము లేనిచోట వెతుకులాడునేగాని–అది ఏమిచిత్రమో–తన విశుద్ధ హృదయములోని నిశ్శబ్దతలో తన సౌఖ్యమున్నదని తెలుసుకో జాలకున్నాడు. మానవుని అజ్ఞానావృతమైన బాహ్యాన్వేషణ. ఒక దురదృష్టకరమైన విచారము గొలుపు కస్తూరి మృగముయొక్క గాధను నాకు జ్ఞప్తికి తెచ్చుచున్నది. తన నుండి వచ్చెడి కస్తూరి పరిమళము తా ననుభవించినదై–ఆ సువాసన బైట నుండి ఎచ్చటనుండియో వచ్చు చున్నదనెడి భ్రాంతిచే, దానికొరకు, కొండలలోను, కనుమలలోను, గాలించి వెతుకు లాడునేగాని – అదేమిచిత్రమో–తన నాభిస్థానములోనే కస్తూరి యున్నదని గ్రహింప జాలదు. కంగారుపడి వెతుకులాడెడి ఆ త్రొక్కులాటలో, ఏదోఒక వాడియైన చెట్టుకొమ్మ ఆకస్మాత్తుగా తనకు గ్రుచ్చుకొని చివరకు విచారముతో బాధపడి చనిపోవును.

ఓ మానవుడా! యోగులు, స్వామీజీలు, బాబాలు, మహాత్ములు మొదలగువారి వెంటబడి పోవుటకు బదులుగా నీవు నీ ఆంతరమున నున్న సౌఖ్యాన్వేషణకు గడంగుట కిదియే మంచి తరుణము. ఆంతర ఆధ్యాత్మిక దివ్యసత్తాను మరచి, క్రీనీడలవెంట పరుగులెత్తుటయు, వృధా బాహ్యాన్వేషణ కొరకై అమూల్యమైన నీ కాలమును వ్యర్ధపర చుటయు తగదుసుమా!

ఈ సందర్భములో గౌ॥ కీ॥శే॥ శ్రీ యు. నారాయణరావు (డిస్ట్రిక్టు జడ్జి) గారి సతీమణి శ్రీమతి మనోరమ, (బెంగుళూరు) ఈమధ్య కోటగిరి శాంతి కేంద్రము నామె సందర్శించినపుడు పాడిన నామదేవుని పాట, తన అభిమాన కీర్తన నన్ను ముగ్ధుని జేసెను. ఆ పాట ఇదే

ఓ పాండురంగా !

ఈ నా దేహము ఉండనిమ్ము–ఊడనిమ్ము నీ యెడల నా విశ్వాసమును ధృఢతరము చేసికొని నీ పాదముల నెన్నడును విడిచిపెట్టను. నీ పావన నామమును ఎల్లవేళల కీర్తించెదనని నీ దివ్య సన్నిధిని ఇదిగో ఇప్పుడే ప్రతిజ్ఞ చేయుచున్నాను. గైకొనుము. నీ ప్రేమను నా హృదయమున స్థిరముగా నిలుపుకొందునని కేశవరాజుతో నామదేవులు విన్నవించుకొనిరి. ప్రియమైన దైవమా! నా వాగ్ధానమును నేను నిలుపుకొనునట్లు నన్ను కాపాడుటకై నీ శరణుజొచ్చితిని.

"నా బాల్యమున అదే భావపరంపరకు జెందిన, అష్టావక్రగీతలోని ఒక శ్లోకమును నేను కంఠస్థము చేసితిని. అది అద్వైతభావన కావచ్చును. శ్రీమతి మనోరమాదేవి పాడినది ద్వైతభావన అయి యుండనోపు. పరిభాషలో ద్వైతాద్వైతమత తేడాయేగాని భావమంతయు ఒక్కటే, నేను కంఠస్థము చేసిన శ్లోక తాత్పర్యమేమనగా–ఈ నా దేహము వేయి సంవత్సరములుండుగాక లేక ఇప్పుడే నశించుగాక, స్వయంభు అయిన శాశ్వతాత్మ అనంతకాలము జ్వాజ్వల్యమానముగా, వృద్ధి క్షయరహితముగా నాలో ప్రకాశించుచుండగా, నాకీ శరీరముతో పనియేమి? ఉపనిషత్తులలోని ఈ దిగువ శ్లోకార్ధము నాకు బ్రహ్మానందము గొలిపెను. "ఈ విభజనతో – ఈ ద్వైతభావనతో, ఇంతకాలము దనుక నాకు వెర్రెత్తిపోయి సతమతమైపోతిని. కాని ఇప్పుడన్ననో–నాకు జ్యోతి దర్శనమాయెను. ధన్యుడనైతిని. తెలిసికొనవలసినదానిని తెలిసికొంటిని. జ్యోతులలోకెల్ల పరంజ్యోతిలో–సౌఖ్యానందములకు ఆటపట్టయి యున్న దానిలో–అభేద్యమైన దైవములో, నేనిపుడు కేంద్రీకరింపబడియున్నాను. ఇంతకంటె చెప్పవలసిన దేమికలదు?"

ఓ సౌఖ్యమా? నీవెచ్చటనుంటివి? పరిపూర్ణమైన నిస్స్వార్ధతలోను, జీవుడుపూర్తిగా నాశనమైనచోట నీవున్నావు. దైవస్మృతి యను దావానలములో కోరికలు సమూలముగా దగ్ధమైనచోట నీ వున్నావు, ఒకడు, రెండవవానిని తలవనిచోట, రెండవ వానిని చూడని చోట, రెండవవానిని విననిచోట–అంతయు శుద్ధ చైతన్యమే యగుటంజేసి, అంతట నీవున్నావు – అంతయు అద్వితీయమైన పరబ్రహ్మ స్వరూపమే కాబట్టి, ఒకడు దైవమును అందరిలోను చూచును–అందరినుండి తాను దైవమును వినును.

ఈపైన వ్రాసిన నా మాటలను భగవద్గీత ఈ క్రింది విధముగా బలపరుచున్నది.

శ్లో॥ యత్ర చైవాత్మ నాత్మానం పశ్యన్నాత్మనితుష్యతి. 6 (20) గీత॥

తా॥ తన మనస్సుచేత ఆత్మను కనుగొన్నవాడై తాను ఆత్మలో చేరియుండి యోగి ఎచ్చటనైతే ఆనందముపొందుచున్నాడో అచ్చట.

శ్లో॥ సుఖమాత్యన్తి కం యత్త ద్బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియమ్॥ 6 (21) గీత॥

తా॥ వాని బుద్ధి ఇంద్రియాతీతమైన అత్యంత సుఖమును గ్రహించి, అనుభవించుచున్నది.

శ్లో॥ ప్రశాంత మననం హ్యేనం యోగినం సుఖముత్తమమ్॥ 6 (27) గీత॥

తా॥ ప్రశాంతమైన మనస్సుగల యోగి ఉత్తమమైన సుఖమును బడయుచున్నాడు.
ఓం ఓం ఓం.

ఈ దినములలో మానవులందరు–యోగులే కానీ, సాధువులేకానీ–ప్రాపంచికపు భ్రాంతిలోని ఎండమావుల వెంటబడి వారి విలువైన కాలమును వృథా పుచ్చుచుండుట చూచినపుడు, నా కెంతయో, కనికరము, విచారము గలుగుచుండును. వారు అంతర జ్యోతిని మఱతురు. జ్ఞప్తికి వచ్చినను అలక్ష్యము చేయుదురు. సర్వత్రా చుట్టుముట్టియున్న అంతరజ్యోతికి, అభిముఖముగా బోవుట కొప్పుకొనరు. వారు కండ్లు మూసికొని, ఇటునటు పనీ పాటూలేక ఊరక తిరుగుచు, అనిశ్చయభవిష్యత్తులో, మనఃకల్పిత స్వర్గమునుండి, ఏ దేవుడో ఎప్పుడో వచ్చి, తమను రక్షించునని ఆశ పెట్టుకొని, నిరీక్షించుచుందురు. భవిష్యత్తు మనదికాదు–ప్రస్తుత క్షణము–అద్యతనభావి మాత్రమే మనది. అందుచే ఇప్పుడే–ఇక్కడే, దైవమును గుర్తించెదముగాక! దైవమును ముఖాముఖీని సందర్శించుటలోనే మన సౌఖ్యమున్నదని గ్రహించి, ప్రియులలోను–అప్రియులలోనూ ప్రపంచములోని దూర–దగ్గర ప్రాంతముల సోదర సోదరీమణులలోను దైవమును గుర్తించెదముగాక! దేవునిలో ఎడము లేదు. ఆయన దేశకాల నిమిత్తములకు పైబడియున్నారు. దైవముయొక్క సర్వవ్యాపకత్వమును–సర్వశక్తిని–సర్వజ్ఞత్వమును–గుర్తించి ఎక్కడైతే, అద్యంతరహిత సౌఖ్యపుగని నివాసము చేయుచుండునో–అట్టి ప్రస్తుత దివ్య, సజీవ, క్షణములో, మన సౌఖ్యమును కేంద్రీకరించెదముగాక!

ఎన్నటికిని మార్పు చెందని దానిలోనే సౌఖ్యమున్నది. అనుక్షణము మార్పు చెందుచున్న ఈ ప్రపంచములో సౌఖ్యమనునది లేదు. దైవ మొక్కడే మార్పు చెందనివాడు. కాబట్టియే, మార్పు చెందని అఖండానంత సౌఖ్యము–అనంతాఖండ నిత్య దైవములో నున్నది.

నా పసితనమున నా బాల్యచేష్ట కారణముగా, దైవముతో మైమఱచి సంభాషించుచున్నానని గ్రహించితిని. కొన్ని వేళలందు ఇట్లవి నాలో నేను గుసగుసలాడుకొందును.

ప్రశ్న : ఓ, నా దైవమా? నీ వెచ్చట నున్నావు ?

జవాబు : (బహు చిన్న స్వరూపముతో ఆయన ఇట్లని జవాబు చెప్పును) "అదిగో! ఓ నా బిడ్డా ! నీ చెంతనే ఉన్నాను.

ఐహిక సంబంధమైన బాతాకానీ కబుర్లు చెప్పెడి మానవులతో నేను కలిసి మాట్లాడి, నా విలువైన కాలముకూడా వృధాపుచ్చుట సంభవించినపుడు, వారి బారినుండి కొంతసేపటికి నేను తప్పించుకుని-బైటపడి-ఒంటరిగా దైవముతో చేరిక గలిగి - నిశ్శబ్దములో నాకు తెలియకుండానే ఇట్లని విన్నవించుకొందును.

ఓ దైవమా ! నిన్ను మరచితినా? లేక, నీ పేరుమీదనే సమస్తము జరిగిపోయి నప్పటికీ – నా సహచరుల గందరగోళములో బడి, అధిక ధోరణిలో నిన్ను అలక్ష్యముగా విడిచిపెట్టితినా? తప్పక నీవు నిశ్శబ్దమే. "అంతట దైవమిట్లు నాతో రహస్యముగా చెప్పినట్లు తోచెను." నేను నిశ్శబ్దములోను, శబ్ధములోను కూడ ఉన్నాను. నేను ప్రత్యక్షము –అప్రత్యక్షముకూడ నై యున్నాను. భక్తుల రూపములో నీ వద్దకు వచ్చుచుందును. వారిని నీవు ప్రేమించుట అనగా నీవునన్ను ప్రేమించుటే – వారికి నీవు సేవ చేయుట అనగా – నీవు నాకు సేవ చేయుటయే వారితో నీ గోష్ఠి సహేతుకమైనదే!

అంతట దేవుని ఓదార్పుమాటలకు సంతృప్తి జెంది, ఈ క్రింది వాక్యములను చదువుచు నెమ్మదిగా నేను ఆయనలో లీనమైపోదును.

ఇతరుల ఐశ్వర్యమంతయు నా ఐశ్వర్యమే యగుగాక !

ఇతరుల ఆరోగ్యమంతయు నా ఆరోగ్యమే యగుగాక !

ఇతరుల సౌఖ్యమంతయు నా సౌఖ్యమే యగుగాక !

ఇతరుల శాంతి అంతయు నా శాంతియే యగుగాక !

సర్వత్ర శాంతి వర్ధిల్లుగాక !

ఇంగ్లీషునుండి అనువాదం : స్వామి నిర్వాణానంద

(శాంతి సెప్టెంబర్ 1965)

# అద్భుతము

ప్రశ్న : అద్భుతమైన వస్తువేది?

జవాబు : పరబ్రహ్మ స్వరూపమే.

ప్రశ్న : ఎందుచేత?

జవాబు : అది కోటిసూర్య ప్రకాశవంతమైనది. దానిని మించిన వస్తువు మరొక్కటి అన్యధా లేదుగాక, అద్వితీయమైన, పరబ్రహ్మమే, అద్భుతమైన వస్తువులకు, మూలముగా, అద్భుతముగా ప్రకాశించుచున్నది.

**జ్ఞాతం జ్ఞాతవ్య మధునా.**

ఇప్పుడు తెలుసుకొన దగినది, తెలియబడెను.

ప్రశ్న : అది యెద్ది?

జవాబు : అది పరమాత్మయే.

ప్రశ్న : యెటుల తెలియబడెను?

జవాబు : శ్రవణ, మనన, నిధి ధ్యాసలచే

ప్రశ్న : శ్రవణ, మనన, నిధి ధ్యాసలు దేనిని గురించి? యెటులను?

జవాబు : **"జీవోదేవ స్సనాతనః".** అనాది నుండియు జీవుడే దైవమని, గురుముఖమున విన్న సత్యమును, మననము జేయుచు, అద్దానిని అనుభవములో వుంచవలెను.

**ద్రష్టం ద్రష్టవ్య మద్భుతమ్**

చూడదగినది చూడబడెను. ఎంత ఆశ్చర్యము

ప్రశ్న : చూడదగిన దెద్ది?

జవాబు : పరబ్రహ్మ స్వరూపమే.

ప్రశ్న : అది నేత్రములతో చూచుటకు సాధ్యమా?

జవాబు : అసాధ్యము, గాని, సూక్ష్మదృష్టిచే జ్ఞాన చక్షువుచే ఆ పరబ్రహ్మ స్వరూపము దర్శింపబడెను. లేక గ్రహించబడెను.

**విశ్రాంతోస్మి, చిరం శ్రాంతః**

చిరకాలమునుండి శ్రమపడుచున్న నేను ఇప్పుడు బడలిక తీరినవాడ నగుచుంటిని.

ప్రశ్న : చిరకాలమునుండి, ఏల శ్రమపడుచుంటివి?

జవాబు : ఆత్మ తనకంటె వేరుగా, వున్నదనెడు భేదభావనచే

ప్రశ్న : ఇప్పుడు అన్ని అవస్థలు పోయి, విశ్రమించుట యెటుల కలిగెను?

జవాబు : సర్వము, పరమాత్మయే తానే అనెడి అనుభవము గలిగెను గాన.

## చిన్మాత్రాన్నాస్తి కించన

చిన్మాత్రమైన, అఖండ సచ్చిదానంద స్వరూపంబైన బ్రహ్మ కంటె అన్యమైన దెద్దియును, యెప్పుడును, ఎచ్చటను లేదు.

ప్రశ్న : పరబ్రహ్మము తప్ప మరెద్దియు అన్యమైనది లేనప్పుడు, యీ జగత్తు అంతయు ఏమి?

జవాబు : ఇది అంతయు పరబ్రహ్మ స్వరూపమే. నీటిబుడగ సముద్రము నుండియేవచ్చి, మరల అందే విలీనమగుచున్నట్లు యీ సృష్టి అంతయు, మాయచే గల్పింపబడి, విజ్ఞానమందే లీనమగుచున్నది.

ఈ బ్రహ్మానుభవ శ్లోకము, శ్రీ శాంతి ఆశ్రమమున ఆఫీసు గదిలో, నేను కూర్చొని వ్రాసుకొనెడి బల్లకు ముందుగా, ఒక గోడ మీద, పెద్ద అక్షరములతో వ్రాయబడి యున్నది.

ఇప్పుడే ఈ శ్లోకమును అంతను, మరల స్మరించుచు దీని సారాంశమును, అనుభవించుటకు ప్రయత్నింతము.

ఇది సామవేదములోని శ్లోకము.

శ్లోకము : జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
ద్రష్టం ద్రష్టవ్య మద్భుతమ్
విశ్రాంతోస్మి చిరం శ్రాంతః
చిన్మాత్రానాస్తి కించన

తాత్పర్యము : ఇప్పుడు తెలియదగిన, బ్రహ్మము తెలియబడెను. దానిని గూర్చి నేను మిక్కిలి శ్రమపడితిని. నా శ్రమ ఇప్పుడు గట్టెక్కెను. ఇక విశ్రమించెదను. చిన్మాత్రయైన బ్రహ్మకన్న నితర మేమియును లేదు. నేనే యా బ్రహ్మమును, అహో ఏమి, ఆశ్చర్యమైన సంగతి!

ఇవి కేవలము బ్రహ్మానుభవముచే గలిగిన యుత్సాహకరమైన, మరల, మరల మననము చేయతగిన అనుభవనీయమైన వాక్యములు.

ప్రియమైన ఆత్మ సోదరీ, సోదర స్వరూపములారా! తరించుటకీ ఒక్క శ్లోకము చాలును. దాహము తీర్చుకొనుటకు, గోదావరి నదిలోయున్న జలమునంతను, త్రాగనవసరము లేదు. గాన మీకు పూర్ణశాంతి కావలసిన మీ అవస్థ లన్నింటి నుండియు

విముక్తి పొందవలెనన్న దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనకు దూరముగాయుండి, నిరంతరము బ్రహ్మానుభవమును గ్రోలవలెను. అవి యున్న యీ చిన్న శ్లోకమును కంఠతా వల్లించి, అతి గోప్యమైన, సర్వ వేదాంతసారమును, మీరు సదా మననము చేయుచు, నిధి ధ్యాసతో తరించుడు.

హరిః ఓమ్ తత్సద్బ్రహ్మార్పణమస్తు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీకైలాసము

6-7-52 (శాంతి ఆగస్టు 1970)

# అమూల్య శాంతి నిధి

మాతృదేశ శ్రేయోభిలాషులు, దేశ అభ్యున్నతికై ఒక కోటి రూప్యములను, పూజ్య వినోబాజీ రాబోవు జన్మదిన కానుకగా అర్పించబోవుచుండిరని వినుట నా హృదయమున కెంతయో ఆనందము కల్గించెను. ప్రతి హృదయమున, ఈ విశాల విశ్వమునందెల్ల శాంతిని వ్యాపింపజేయుటకు తోడ్పడుననెడి తలంపుతో, ఆశ్రమ కార్యకర్తలు, శ్రేయో భిలాషులు ఒక లక్ష రూప్యములు నిధిగా ఈ భౌతిక రూపమునకు రాబోవు జన్మదిన కానుకగా అర్పింపదలచుచుండిరి.

కోటి రూప్యముల ముందు, ఒక లక్ష ఎంత అల్పమైనది? అయినను, సకల సౌఖ్య ప్రదాతయగు ఆ దైవ కృపయేగదా! అంతయు ఆతని మహిమ. **"అర్హత పొందుము. నీవు కోరవలసిన పనిలేదు."** ఇదియె శాంతి ఆశ్రమ మూలసిద్ధాంతము. విశ్వశాంతికి ప్రాతిపదిక.

స్నేహితులు, ముఖ్యముగా ఆశ్రమ కార్యకర్తలు, 21వ జనవరి, 1971 రాబోవు జన్మదినమున, ఈ నిధిని సమర్పించుటకై ఎంతయో కృషి సల్పుచుండిరి. ఇంత కాలము నుండియు నా భావన ఏమన, ఎట్టి శాశ్వత నిధియు అక్కరలేదనియు, ఎంతకాలము యీ జీవితము సజీవమై యుండునో అంతవరకు అదియే శాశ్వత నిధి అనియు, ఈ విశాల విశ్వమునందలి సంపత్తి ఎల్ల నాకే చెందినదనియు అనిపించును. అదేవిధముగా కరుణామయుడగు దైవము ఇన్ని సంవత్సరముల నుండి ఆశ్రమ రక్షణ గావించుచుండెను.

కాని ఆశ్రమ కార్యక్రమములు ఈ కన్నులు మూతపడిన వెనుక నిరవధికముగా కొనసాగుటకై శాశ్వతనిధి అత్యంత ఆవశ్యకమని ఆశ్రమ శ్రేయోభిలాషులు భావించు చుండిరి. ఆ దైవ కృపచే నేను కష్టించుచుంటి ననుటకంటె, సూర్యోదయము నుండి సూర్యాస్తమయము వరకును, సూర్యాస్తమయము నుండి సూర్యోదయము వరకును ఆ కృపామయుడే. ఈ సాధనము ద్వారా పనిచేయుచుండెననుట సమంజసముగా నుండును.

అయినను నాకేలనో తృప్తి కలుగనేరదు. దినమంతయు గడచినవెనుక అచేతనుడనై, నాలో ఇట్లనుకొనుచుందును.

"మరియొకరోజు వ్యర్థముగా గడచిపోయెనుగదా!" ఇంకను మిక్కుటమగు సేవను మీ అందరికిని చేయలేకపోవుచుంటి ననెడి భాన తరచుగా నా హృదయము బాధతో బరువెక్కించుచుండును.

అశాశ్వతమగు సంపద నంతయు తమవద్దనే నుంచుకొని, శాశ్వత సంపదను, శాంతి ప్రార్థనలను అర్పించుడని నేనొక కోటి మంది భక్తులను కోరుచుంటిని. దైవమును ఇచ్చుటనే ఇప్పుడే అనుభవించుడు. ఇదియే నా మనోవాంఛ. అందరును శాంతితో నోలలాడుదురుగాక!

నిరాశాపూరితమగు ప్రస్తుత స్థితిలో "కోటి రూప్యముల నిధి" అనెడి తలంపు నా కెంతయో శక్తిని, ఊరటను కల్గించెను. ఆ అమూల్యనిధి ఏమి? అది ధన కనకవస్తువు వాహనములుకాదు. ఏ మతమువారైనను, ప్రపంచమందేతావున వసించుచున్నను, ఒక కోటి మంది భక్తి ప్రేమలతో శాంతి ప్రార్థనను పునః పునః గావించుచో, అదియే నాకు అమూల్యమగు నిధిగా భావింతును. ఆ విధముగా వారు విశ్వశాంతికై, శాంతి ప్రార్థనను పునః పునః గావింతుమని వాగ్దానము గావించిన, ఈ జగతిలో, నేనే అందరి కంటె భాగ్యవంతుడననియు, సౌఖ్యవంతుడననియు భావింతును.

ప్రియమైన శాంతి పాఠకులారా! ఇప్పుడు నా అమూల్య నిధి మీ చేతులలో నున్నది. ప్రతి దినము కోటి గొంతులతో శాంతి ప్రార్థన గావింప బడుచుండిన చాలును. దైవసేవలో జీవితమును గడపదలచినవారు, జగతిని శాంతి నెలకొల్ప నెంచువారు, దినమునకు 116 పర్యాయములు శాంతి ప్రార్థన గావింపుడు. అటుల చేయలేనిచో 58 పర్యాయములైన గావింపుడు. అది వ్యక్తి శాంతికి, లోక శాంతికిగూడ తోడ్పడును.

మీరు అధిక కార్య నిమగ్నులైనచో మీ మనోవాక్కాయములను కేంద్రీకరించి 12 పర్యాయములు శాంతి ప్రార్థన గావింపుడు. కొందరు 12 పర్యాయములు చేయుటకైనను, తమకు తీరిక లేకయుంటిమని చెప్పుచుందురు. అట్టివారికి మా ప్రార్థన యిది. ఉదయమున మేల్కాంచగనే శాంతి ప్రార్థనతో దినమును ప్రారంభించుడు, దినమంతయు గడచిన వెనుక ప్రశాంతితో శాంతి ప్రార్థన గావించి నిద్రింపుడు. దైవనామమును హృదయమున స్మరించుచు మేల్కాంచి దైవార్పణగానే కార్యముల నొనర్చుచు, ఆ దైవజ్ఞప్తి లోనే జీవించుచు కడకు ఆ దైవ నామముతోడనే, శాంతి ప్రార్థనలతోడనే దినమును ముగించినవారి జీవితమెంత ధన్యవంతమైనది. దైవస్మరణయే ఉత్కృష్టమైన మానవ గమ్యము. ధ్యేయము.

ఈ క్రింది వాక్యము లెంతటి ఉత్తేజపూరితములు. ఎంత మనోహరము:

**"విశ్వమున శాంతి నెలకొనుగాక !**

**అది నా నుండియే ప్రసరిత మగుగాక !"**

ప్రతిమతము సర్వులకు ఉపయుక్తమగురీతిగా, నా హృదయము అందరకునూ సహాయమొనర్చవలెనని కోరుచుండును. వారు నాస్తికులైననూ సరియే, ప్రాపంచికాభిలాషులైనను సరియే. నేను వారిని కోరునదేమన, శాంతి ప్రార్దన అంతయు చేయజాలనిచో శక్తివంతములగు రెండు మాటలను పునరుక్తి చేసిన చాలును.

**"పూజనీయమైన ఓ దివ్యస్వరూపా!"**

**"పూజనీయమైన"** అనెడి పదము మీ వ్యక్తిత్వమునకు చిహ్మము. ఓ **"దివ్య స్వరూపా!"** అనెడి పదము యీ విశాల విశ్వము యొక్క చిహ్నము. ఇట్టి భావనతో యీ రెండు పదములను పునరుక్తి గావించు చుండినచో జీవాత్మ పరమాత్మతో సమైక్యతనొంది, తాను ఒకే విశ్వశక్తిగా గుర్తించును.

ఉన్నది ఒకే అవిశ్చిన్నమైన, అనంతమైన దివ్యశక్తి స్వరూపము, మనము ఎవరిని ప్రేమించినను ఆ దైవమును ప్రేమించినట్లేయగును. ఎవరిని అన్యులుగా భావించినను, అనుమానించినను, గాయపరచినను, విశ్వవ్యాప్తమగు ఆ అనంతుని గాయపరచినట్లే యగును. సర్వోపగతుడగు ఆ పరమేశ్వరునే శంకించినట్లగును.

**"ప్రేమయే దైవము ; దైవమే ప్రేమ."**

**"ప్రేమ స్వరూపులమై జీవింతుముగాక!"**

ముఖ్యముగ **"ఎచ్చట ప్రేమగలదో అచ్చటనే దైవము గలడు."**

మరల ఒక్కపర్యాయము మన అమూల్య నిధి వైపునకు మరలుదుముగాక! శాంతి కాముకులైనవారు ఈ అమూల్య శాంతి నిధిని వారి హృదయములందు నిక్షిప్త మొనర్చుకొనుటకాదు. ఇప్పుడు, ఇచ్చట తాము ఎట్టి మధురానుభూతి నందుచుండిరో, అట్టి మధురానుభూతి ఇతరులుగూడ ఆ అమూల్యశాంతి నిధియందు భాగస్వాములై చవిచూచునట్లొనర్పుడు. ఈ కోటానుకోట్ల జన సమూహములలో ఒకటి రెండు కోట్ల ప్రజలు లోకశాంతి ప్రార్ధన లొనర్చుచు, మానవ హృదయమున శాంతి నెలకొల్పిన, కడకదియే విశ్వశాంతికాలవాలమగును.

ఇపుడు కర్మాచరణకేగాని, వ్యర్ధ ప్రసంగములకు సమయముగాదు. నేటి నుండియే యీ అమూల్యనిధిని పెంపొందించుటకు కృషి సల్పుదుముగాక! ఓ ప్రియమిత్రమా! శాంతి ప్రార్ధనలందు భక్తి శ్రద్ధలు గలవారిని ఒక వందమందిని నీ వంతుగ అమూల్య

శాంతినిధి ప్రధానమున జేర్చ జాలవా? వివిధభాషలలో ఇంగ్లీషు, హిందీ, సంస్కృతము, తెలుగు, ఒరియా, కన్నడము, తమిళము, మళయాళము, బెంగాలీ, గుజరాతీ, జర్మన్ మొదలగున వెన్నియో భాషలలో శాంతి ప్రార్థనలు సిద్ధముగ నున్నవి. నీకు వలసినవానిని ఈ ఆశ్రమమునుండి ఉచితముగ పొందవచ్చును.

మనము ఆనందము పొందగోరిన, ఇతరులను ఆనందపరచవలెను. అదియే మూలసూత్రము. ఈ క్షణము మాత్రమే మనది. ఉత్తరక్షణము ఏమి జరుగునో ఎవరెరుగుదురు? మనము గావింపదలచు సత్కార్యము నిప్పుడే ప్రారంభింతుముగాక! దైవ ప్రతిరూపులగు ఓ మానవులారా! ఒక కోటి మంది ఐనను తమ ముక్త కంఠములతో ఇప్పుడే, ఇచ్చటనే శాంతి ప్రార్థనలు గావించి అమూల్యమగు **"ఈ శాంతినిధి"** ని సుప్రతిష్ఠిత మొనర్తురుగాక!

"ప్రభో నీ నామమె పాడుచుండెదా
ప్రభో నీ నామమె గ్రోలుచుండెదా
నీ నామ పానముచే మత్తెక్కిపోయెదన్
మత్తులో నిన్ దలచి పిలచి పిలచి పాడెదన్॥ ప్ర॥
ప్రభో నీ శాంతిగాన మాలపించెదన్,
ప్రభో! నీ శాంతిమధువునే గ్రోలుచుండెదన్
నీ శాంతిసుధలలో మత్తెక్కిపోయెదన్
మత్తులో నిన్ దలచి పిలిచి, పిలిచి పాడెదన్. ॥ప్ర॥

ఈ విశ్వమును నేను శాంతి తరంగములచే ముంచెత్తి వేయుదును. సకల వైవిధ్యములను శాంతి ష్వాళిత మొనర్చుగాక! అణుశక్తి విలయతాండవ మొనగూర్చునెడ శాంతి ప్రసరితమగుగాక! పరస్పర వైషమ్యములు, ప్రేమ, సామరస్యము, పరస్పరావగాహనలచే సమసిపోవుగాక!

ఓ ప్రేమాస్పదులారా! నిమీలిత నేత్రులై, మీ ఆపాదమస్తకము ఆ దైవానుభూతిచే నిండించుకొని నాతో ప్రార్థింప వేగమె రండు, రండు, వేదోక్తమైన శాంతిపాఠము పఠింతముగాక!

శ్రీ పరమేశ్వరార్పణమస్తు
లోకా స్సమస్తా స్సుఖినోభవంతు
ఓం శాంతి శ్శాంతి శాంతిః !

(శాంతి సెప్టెంబర్ & అక్టోబర్ 1970

# అంధత్వము

ఆధ్యాత్మిక జీవితమునకు ఆంతర్యవృద్ధిలో అంధత్వము చాలగా తోడ్పడును. అంధత్వమున బాహ్యదృష్టి లేక భౌతిక నేత్రములను మూసియుంచుట. బాహ్యమున చూడవలసినది ఏమియు లేదు. చూడవలసినదంతయు లోపలనేయున్నది. కావున ప్రవృత్తికి స్వస్తి చెప్పి నివృత్తులైయుండుట.

ప్రవృత్తియనగా నామరూపముల వెంట పర్వులెత్తుట చూచుట, వినుట, ఆలోచించుట, మాట్లాడుట మొదలగునవన్నియు ప్రవృత్తిలోనే చేరును. ఇక నివృత్తి అనగా నామరూపముల వెంట పరుగులెత్తక శ్రవణ, మనన, నిధిధ్యాసలతో అంతర్య ప్రపంచములో పరమాత్మ అనుసంధానముతో నిరంతరము జీవించుచు, మౌనముగా ఆత్మ జ్ఞప్తితో నుండవలెను (BE DEAD THAT YE MAY LIVE) నీవు జీవింపవలెనన్న బాహ్యమునకు చనిపోవలెను.

వ్యర్ధమైన మాటలతో విలువైన కాలమును వ్యర్ధము చేయుట ప్రవృత్తిలోనే చేరును. ఈ ఉపన్యాసములు బోధలు, వ్రాతలు ఇవన్నియు పరోపకారములో ఒక భాగమైనను ఆత్మ దృష్టినుండి పరీక్షించుకొనిన ప్రవృత్తివల్ల కల్గుచున్నవి. ఓ ప్రవృత్తి భూతమా! నా బాహ్యదృష్టి నుండి దూరముగా నుండుము. ఓ నివృత్తిదేవతా! నా హృదయఫలకములో శాశ్వతముగా శాంతి సింహాసనము అధిష్టింపుము. శాంతియే నీ జన్మహక్కు. అద్దానిని క్షణములో కోట్యంశమైనను ఇక మరువనని నీ అంతరాత్మకు వాగ్దానము చేయుము. నీ అంతరాత్మయన దైవస్వరూపమే. ఇదియే నివృత్తి జీవితమునకు ప్రారంభదశ. మొదటి సోపానము. నీ కృతనిశ్చయమునకు సత్యముగా నుండును.

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు
ఓం సర్వేషాం శాంతిర్భవతు
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం సర్వేషాం మంగళం భవతు
ఓం శాంతి శ్శాంతి శాంతిః

మంచి ఆలోచనలే చేయుచుండుము. ఇతరులకపకారము చేయునట్టి ఆలోచనలను నీదరికి రానీయకుము.

సమస్త జీవులయందు భగవానుని చూచువాని చిత్తమే భగవానుని నిజగృహము.

(శాంతి ఆగస్టు 1976)

# అహం బ్రహ్మో౽స్మి

అహం బ్రహ్మో౽స్మి మంత్రోయం జన్మపాప వినాశయేత్
అహం బ్రహ్మో౽స్మి మంత్రోయం భేదబుద్ధి వినాశయేత్
అహం బ్రహ్మో౽స్మి మంత్రోయం దోషకోటి వినాశయేత్
అహం బ్రహ్మో౽స్మి మంత్రోయం జ్ఞానానందం ప్రయచ్ఛతి

తా॥ **"అహం బ్రహ్మో౽స్మి"** యను మంత్రము సమస్త కర్మలను నశింపచేయుగాక! ఆ మంత్రోపాసమున జీవేశ్వర భేదబుద్ధి నశించి జన్మ రాహిత్య మగునుగాక! నా మంత్రోపాసమున, సమస్తము బ్రహ్మమని తోచి సమత్వము కలుగును గాక! **అహం బ్రహ్మో౽స్మి** యను నీమంత్రము కోటి దోషములను నశింపచేసి జ్ఞానానంద స్వరూప కైవల్యము చేకూర్చునుగాక!

బ్రహ్మాండమైన భావన కల్గిన ఈ పై శ్లోకమును నేను చిన్నతనములోనే వల్లించెడి అదృష్టము కలిగెను. దీనిని శ్లోకమని చెప్ప వీలులేదు మంత్రములకు మహామంత్రమనియే చెప్పవలసియున్నది. వేదములు నాలుగని అందరకు తెలిసియున్నదే! నాలుగువేదములలో నాలుగ మహావాక్య ములున్నవి. **అహం బ్రహ్మో౽స్మి** యనెడి మంత్రము అధర్వణ వేదము యొక్క మహామంత్రముగా నున్నది.

మహామంత్రములయొక్క విపులార్ధమును గ్రహించుటే నిజమైన తత్త్వవిచారణ. మహాకావ్యములను విమర్శనా పూర్వకముగా గ్రహించి అనుభవములో పెట్టగల్గినవారినే జీవన్మునులుగా భావింపవలసియున్నది.

అయిన మహావాక్య విచారణ అంత తేలికయైన పనిగాదు. చాల దుర్లభమైన కఠినమైన పని. అయినను మనస్సుకు, బుద్ధికి పట్టుబడి నంతవరకు తేటమాటలతో వివరించుటకు ప్రయత్నించెదము.

అహం : నేను
బ్రహ్మ : బ్రహ్మను
అస్మి : అగుచున్నాను.

ఉన్నదొక్కటే అయివుండగా, నీవు ఎక్కడ! బ్రహ్మ ఎక్కడ! అగుచుండట ఏమి? ఏది అగుచున్నదని శంక రావచ్చును. ఉన్నదొక్కటేయైనను ఆ బ్రహ్మ స్వరూపమును నిరూపించుటకు స్థిరము చేయుటకు, అనుభవములో పెట్టుకొనుటకు సహాయమైన పరికరములను మాటలను మనముపయోగింప వలసి వచ్చుచున్నది.

సత్యమై, నిత్యమై, పరిపూర్ణమై అఖండమైన ఆ బ్రహ్మ పదార్థమును మాటలచే

నిరూపణ చేసినంత మాత్రమున, అది ఎన్నటికిని రెండుగా గాని అనేకముగా గాని మారజాలదు. అద్వితీయమునకు, నానాత్వము లేక భిన్నత్వము ఎన్నటికిని కలుగదు.

సూర్యభగవానుని ఏ ఏ రీతిగ, ఎచ్చటెచ్చటి నుండి ఏ ఏ పరికరముల ద్వారా చూచుటకు ప్రయత్నించినను, సూర్యుడు–సూర్యుడే ఒక్కడే ఎన్ని తావుల, ఎన్ని విధము లుగా ప్రతిబింబించినను, సూర్యునికి భిన్నత్వము కలుగుచుండుట లేదుకదా!

అటులనే బ్రహ్మస్వరూపము కూడా అద్వితీయము పరిపూర్ణమై, అనాదిగా, అవాఙ్మానసగోచరమై నిరంతరము ప్రకాశించుచున్నది.

ఇక అహం అనెడిది ఏది?

బ్రహ్మ అనెడిది ఏది?

అస్మి అనెడిది ఏది?

అహం అనెడిది, బ్రహ్మ అనెడిది, అస్మి=అగుచున్నాను అనేటి ఈ అక్షరముల సంపుటి అంతయు అసత్ పదార్థాంశమే సూర్యుడు ఒక్కడే అద్వితీయ ప్రకాశవంతుడై యుండ–నేను సూర్యుడను అని చెప్పనేల? సూర్యుడు–సూర్యుడే. అటులనే బ్రహ్మపదార్థము అద్వితీయమై, అన్నిట నొక్కటిగా వెలుగుచుండియు, నేను బ్రహ్మమునగుచున్నాను అని చెప్పనేల?

నీవు సదా బ్రహ్మ స్వరూపుండవే! అనాది నుండి అంత్యము వరకు అన్యమైనది ఎన్నడును, ఎచ్చటను అయి యుండలేదు. కనుక నీవే ఆ సత్ పదార్థము, ఆ సచ్చిదానంద స్వరూపుడవు.

పరిపూర్ణములో అద్వితీయమైన స్వరూపమును అనుభవించుచు, మౌనముగా నుండుటకు బదులు 'నేను బ్రహ్మను అగుచున్నాను' అని స్మరించుట కూడ కించిజ్ఞత్వమే! కాని సాధకులు–స్వస్వరూపమును బ్రహ్మానుభవమును స్థిరపరచుటకు నిట్టి విచారణ మననము సహకారిగా నున్నందున ఆచరింపదగినది.

కొదవు మూడు మహావాక్యములును ఈ సత్యమునే నిరూపించుచున్నవి; స్థిరము చేయుచున్నవి.

**'ప్రజ్ఞానం బ్రహ్మ'**

ఏ ప్రజ్ఞ మనలో ఏ తెలివిగలదో, ఆ తెలివియే, చైతన్యమే బ్రహ్మ స్వరూపముగా నున్నది.

**'అయమాత్మా బ్రహ్మ'**

నేనే ఆ బ్రహ్మమును నాలోని ఆత్మయే ఆ బ్రహ్మస్వరూపముగా వెలుంగుచున్నది.

**'తత్త్వమసి'**

అదే నీవు – అదియే నీవుగా నున్నావు.

ఉన్నదొక్కటే నిత్యమైన, పరిపూర్ణమైన సద్వస్తువు.

ఆ అద్వితీయమైన సత్ పదార్థమే నీవు.

అనుభవశూన్యులకు ఈ మాటలన్నియు చిలుకపలుకులవలె నుండును అనుభవనీయులకు ఈ చిన్నమాటలే అద్వైతానుభవము నిచ్చును.

**'అహంబ్రహ్మాఽస్మి'** మంత్రము నిప్పుడు, అనుభవముగా మన జీవితములలో సహకరించెడిలాగున విచారణ చేయ ప్రయత్నించెదము. ఈ వ్యాసము స్థితప్రజ్ఞులకు అవసరములేదు. ఇక జిజ్ఞాసువులకు, దైవ పరితాపనాపరులకు సహకారిగా నుండును.

ప్రతి మనుజునిలో **'సోహం'** అనెడి అజపగాయత్రి మహామంత్రము. అహర్నిశలు జరుగుచునే యున్నది. ఆ మహామంత్రమును మనము ప్రయత్నముచేసి స్మరింప నవసరము లేకుండగనే, సహజముగ రోజునకు 21600 మార్లు శ్వాసలో ఆడుచున్నదని తత్త్వజ్ఞులు, యోగారూఢులు అనుభవముగా పరిశీలించి స్థిరము చేసి యుండిరి.

ఆత్మీయులారా! ఒక్కతరి కండ్లుమూసి **'సోహం'**ను గమనింపుడు మీ ఉచ్ఛ్వాస నిశ్వాసలను పరీక్షించుడు.

ఉచ్ఛ్వాసలో – సో

నిశ్శ్వాసలో – హం

ఉచ్ఛ్వాసలో – అ

నిశ్శ్వాసలో – హం

ఉచ్ఛ్వాసలో – బ్ర

నిశ్శ్వాసలో – హ్మా

ఉచ్ఛ్వాసలో – అ

నిశ్శ్వాసలో – స్మి

మనమిప్పుడు మన ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలలోనే **'అహం బ్రహ్మాఽస్మి'** మంత్రమును కలిపి గమనించిన బ్రహ్మానుభవమున కెంతయో సహకారిగా నుండును.

మొదటి శ్వాసలో "అ" ను పూరింపుడు నిశ్వాసలో 'హం' అని వదులుడు మరల "బ్ర" పూరింపుడు "హ్మా" వదులుడు. తరువాత శ్వాసతో "అ" పూరింపుడు. "స్మి" అగుచున్నాను అను భావనతో వదులుడు.

**“అహం బ్రహ్మాఽస్మి”**

నేను బ్రహ్మనగుచున్నాను. నేను సదా బ్రహ్మగానే ఉంటున్నాను. నా ప్రతి శ్వాసయు బ్రహ్మమయమే! ఈ విధమైన భావనలో **‘అహం బ్రహ్మాఽస్మి’** మంత్రమును, మీ ఉచ్ఛ్వాసనిశ్శ్వాసలలో జాగ్రత్తగ గమనించుచు, ధ్యానము చేయుడు. అట్లు చేయగా చివరకు నీ బీజాక్షరములను, శ్వాసను గూడ మరచి అఖండమైన దివ్య తేజస్సులో విలీనమగుడు!

ఈ **‘అహంబ్రహ్మాఽస్మి’** మంత్ర ధ్యానముచే జన్మపాపములు భేదబుద్ధి వినాశము దోషములు నశింపబడుటేగాక జ్ఞానానందము, శుద్ధ బ్రహ్మానందము సిద్ధించునని, ఈ వ్యాసము ప్రారంభములోనే సూచించబడినది.

ఆత్మస్వరూపా! ఇట్టి అనుభవనీయమైన మహావాక్య విచారణ గురుముఖముగా తెలిసికొని ఆచరించవలసినదేగాని, కాగితముల మీద వ్రాయుటకు సాధ్యముకాదని కొందరుపెద్దలు చెప్పెదరు. అయినను నేను అనుభవించెడి ఆనందమునంతను నా సొంతమునకేగాక మీ అందరితో పంచుకొనవలెనను ఉత్సాహమే. కైలాసములో ఏకాంతముగా నిశ్శబ్దముతో బ్రహ్మభావన ననుభవించుచు నన్నీ వ్యాసము వ్రాయ పురి కొల్పుచున్నది.

ఇక ఈ వ్రాతలు గూడ మరచి మనమిప్పుడే **‘అహం’ బ్రహ్మాఽస్మి’** మహామంత్ర సారము ననుభవించుటకు ప్రయత్నింతము.

‘అహం’ అనెడి నీటిబుడగను, ‘బ్రహ్మ’ యనెడి అఖండమైన సచ్చిదానంద సముద్ర ములో విలీనము చేయుదము.

‘అహం’ అనెడి ఘటాకాశమును ‘బ్రహ్మ’ అనెడి మహదాకాశములో కలుపుదము. అప్పుడు ఆ పరిపూర్ణ స్థితిలో ‘అస్మి’ అగుచున్నాను. కలువవలసినదిగూడ నేమియులేదు. నీటిబుడగ సముద్రములోనే యున్నది. కిరణము సూర్యునిలోనే ప్రకాశించుచున్నది. ఘటాకాశము మహదాకాశముతో ఎల్లప్పుడును నిండియున్నది.

**జీవ ఏవ సదా బ్రహ్మ**
**స్వయం బ్రహ్మ సనాతనః**

తా॥ జీవుడెల్లప్పుడు బ్రహ్మమయి యున్నాడు. తాను అనాదిసిద్ధమైనవాడు అహం కృతి లేనివాడు బ్రహ్మమే తాను .

లోకాస్సమస్తా సుఖినోభవంతు
ఓం తత్ సత్!

(శాంతి నవంబరు 1989)

# ఆశ్రమ స్థాపనలు

ఎవ్వరైనను కొత్తగా ఆశ్రమము స్థాపించెదరని విన్నను, నాతో జెప్పినను నాకు చాల చింతగా నుండును.

ఆశ్రమములు స్థాపన చేయుముందు మనము గమనించవలసిన ముఖ్యమైన విషయ మెద్ది యనగా, మనకు తెలియకుండగనే, స్వతంత్రముగా యున్న మన జీవిత ములు, అస్వతంత్రముగా ఆశ్రమము పేరున అనేకమైన వాంఛలు, కోరికలు, సంకల్ప ములతో నిండి యుండవలసి యుండును. ప్రారంభమున, ఆశ్రమ స్థాపన చేయుటలో అన్నివిధముల తోడ్పడెదమని ప్రోత్సాహము గలిగించిన, భక్తులందరునూ ఒక్కొక్కరు నెమ్మదిగా జారిపోయెదరు. అప్పుడు ఏ గత్యంతరములేక, అక్షయ పాత్రతో గ్రామ గ్రామము తిరగి, అదృష్ట హీనుడైన, ఆశ్రమ స్థాపనజేసిన వ్యక్తి యాచన జేయుచుండును. ధనికుల యిండ్ల ముందు, వారి గుమ్మములవద్ద, పడిగాపులు పడుచు చందాలకై వేచి యుండ వలసిన దుష్కర్మ తనకు తెలియకుండగనే ప్రారంభించును.

ఆశ్రమస్థాపనలు తలచిన, తలవని తలంపుగా ఒక చక్కనైన కథ జ్ఞప్తికి వచ్చు చుండును.

ఈ కథను యెప్పుడెచ్చట చదివితినో దీనిమూల మిప్పుడు, నాకు జ్ఞప్తికి వచ్చుటలేదు.

కాని చిన్న సంఘటన మాత్రము దీని సంబంధమైనది జ్ఞప్తికి వచ్చుచున్నది. అది ఆశ్రమ స్థాపన రోజు. ఒక భక్తురాలు ఆమె బంధుస్నేహితులందరితో శాంతి ఆశ్రమ శాఖను అమెరికాలో (న్యూయార్కునందు) స్థాపించుటకు చాలామందిని ఆహ్వానించి యుండెను. ఇది జరిగి ముప్పది సంవత్సరములై యుండవచ్చును.

నేనీ క్రింద వ్రాయబడెడి కథను ఆ సమావేశములో జెప్పిన తరువాత ఆ భక్తురాలు వుత్సాహము ఆశ్రమ స్థాపనయందే గాక ఆశ్రమ వృద్ధియందునుగూడ తగ్గిపోయెను.

నాకు, నేనే అనగా ఆశ్రమ వృద్ధికి హాని జేసుకొన్నట్లయ్యెను. ప్రపంచ రీత్యా ఆశ్రమ వృద్ధికి కొంత నష్టము, లోటు, నా కథవల్ల గలిగినది. మొత్తముమీద శాంతి ఆశ్రమ కేంద్రమును స్థాపించిన ఆ భక్తురాలికి ఆధ్యాత్మికముగా తోడ్పడితినిగదా అని కొంత తృప్తిని, ఆనందమును పొందితిని.

ఇప్పుడు నాకథను ప్రారంభించనీయుడు. అది కలియుగమో, మరేయుగమో నాకు తెలియదు. సైతాను రాజుగా యుండెను. సైతాను యనుచరులు దేశమంతా నిండి, సైతానుకు పెక్కండ్రు శిష్యులను వీలైన తావు లన్నింటిలో పోగుచేయుచుండిరి.

ఒక గ్రామమున చాల మంచి భక్తుడు, నిరాడంబరమైన జీవి, స్వార్థరహితమైన సేవ జేయుచూ, సదా ఆత్మ భావనతో, విశ్వప్రేమయందు మునింగి జీవించుచుండెను.

ఆయన ఆదర్శనీయమైన జీవితముచే ప్రజలందరూ ఆయనను అనుసరించి తప్పు మార్గములను నడచుట లేదు. అధర్మము తగ్గిపోవుచుండెను. ధర్మము నూరు పాళ్ళు వృద్ధి అవ్వుచుండెను. ఈ స్థితి సహజముగా సైతాను అనుచరులకు చాల బాధాకరముగా యుండెను.

వారు యెన్నో రీతులుగా మన భక్తుని, ఆదర్శనీయమైన జీవితమును గడుపుచున్న మహానీయుని, క్రింద పడవేయుటకు, నామ రూములతో, ఆకర్షించుటకు, పేరు ప్రతిష్ఠ లిచ్చి ఆయన మనస్సును నివృత్తి నుండి ప్రవృత్తికి, స్వార్థరహితము నుండి స్వార్థమునకు, మౌనము నుండి వాగాడంబరములకు, నిత్యమునుండి, అనిత్యమునకు, అమృతత్వము నుండి మృత్యువునకు, దైవ సేవనుండి, పిశాచారాధనకు, మరల్చుటకు విశ్వప్రయత్నములు జేసినను ఇసుమంతయు లాభము లేకపోయెను. వారప్పుడు వారి ప్రభువువైన–సైతాను వద్దకు వెళ్ళి.

> "ప్రభూ! మాకింక భూలోకములో ఏ పనియులేదు. ఏలనన ఒక మహాత్ముడు తన ఆదర్శనీయమైన, నివృత్తి జీవితముచే తన దగ్గరకు వచ్చిన వారిని, తన్ను జూచిన వారందరను, భక్తులుగా, స్వార్థరహితులుగా, మార్చి వేయుచుండెను. మాకు మీ రొసంగిన అన్ని శక్తులు, తెలవితేటలు, సామదాన దండోపాయములు ఉపయోగించి వాడినను, ఆ మహాత్ముడు చలించుటలేదు."

అని మొఱ పెట్టుకొనిరి. అప్పుడు ఆ పిశాచము లన్నింటికి ప్రభువైన సైతాను రాజుగూడ మొదటిలో కొంత చింతించినవాడై నివృత్తుడై దివ్య దృష్టిని జూచి నవ్వసాగెను.

అప్పుడా పిశాచములు తమ యజమాని నవ్వుటకు కారణ మడుగగా యీ క్రింది రీతిని జెప్పెను.

> "ప్రియమైన ఓ అనుచరులారా! మీరిక, ఆ వ్యక్తి గురించి భయపడ నవసరములేదు. మీరేమీ, అతనిని పాడుజేయుటకు ప్రయత్నించ నవసరముగూడ లేదు. ఏలనన అతడొక ఆశ్రమమును స్థాపించుటకు ప్రయత్నించుచుండెను. అతని శిష్యకోటి అంతయు, అతనిని ఒక నూతనమైన ఆశ్రమమును నవీన పద్ధతులతో స్థాపించమని కోరుచుండిరి. అతని ఆశ్రమ స్థాపనయే అతని పతనమునకు కారణమై అధోగతిని జేర్చును."

అని సైతాను ప్రభువు జెప్పగా అనుచరు లందరును మహదానందమును పొందిరి.

**వృద్ధియే జీవితయు వృద్ధి లేకుండుటయే, పతనము, అని తరచు చెప్పుచుందును.**

ప్రతీ చిన్న విషయమునుండియు–సాధకుల ఏదో మంచిని గ్రహించి, నిరంతరము వృద్ధి అవ్వుటకు దీపము ఆరిపోకుండగ–దుర్లభమైన మానవ జన్మకు గమ్యస్థానమైన దైవత్వమును, బ్రహ్మానందమును పొందుటకు హృదయపూర్వకముగా ప్రయత్నించవలెను. కృపామయుడైన దైవము మా శాంతి పాఠకుల నందరను, శాంతితో, నిత్యశాంతితో నిరంతరము బ్రోచుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు,

ఓం తత్సత్ ఓం

(శాంతి జనవరి & ఫిబ్రవరి 1959)

## ఆరు తాడిచెట్లు

శ్రీ శాంతి ఆశ్రమములో నిర్వాణాశ్రమము పర్వతపరిసర ప్రాంతములందు గలదు. నిర్వాణాశ్రమములో చక్కటి శాంతియుతమైన తావున నిర్వాణమందిరము నిర్మింపబడెను. నిర్వాణమందిరముమీద ధ్యానము జేసుకొనటకు ఒక గది గలదు. ఆ గదిలో యెవ్వరును మాట్లాడరు. అది కేవలము మౌనముగా, ధ్యానము జేసుకొనుటకే నిర్మింపబడి వాడబడు చున్నది.

జనసమర్ధములో హెచ్చుగా బోధలు జేయుచు, మాట్లాడినప్పుడు, విసుగుగా, విరక్తిగా యుండి మౌనగదిలోనికి వెళ్ళినంత మాత్రమునే ఆయాసమంతయుపోయి, ఒక్క నిమిషములోనే శాంతి ఆవరింపబడి యుండును. "అచ్చట ప్రశాంతత వర్ణనాతీతము. అంతర్యమున తేజస్సు, బాహ్యమున తేజస్సు, చుట్టును తేజస్సు, శబ్దములో తేజస్సు, నిశ్శబ్దములో తేజస్సు అని జెప్పవలసియుండును. అచ్చట తరుచు శబ్దమే లేదు.

అంతా రామమయం బీజగమంతా రామమయం
అంతా కృష్ణమయం బీజగమంతా కృష్ణమయం,
కన్నుమూసినా కృష్ణమయం కన్నుతెరచినా కృష్ణమయం

ఆ మౌన గదిలో వెనుక గోడననుసరించి ఒక కుర్చీ గలదు. దానిమీద నేను కొర్చొనియుండ ద్వారము తెరచియున్నచో యెదురుగా, ఆరు తాడిచెట్ల ప్రత్యక్షమగు చుండును. ఏలననగా, నిర్వాణ మందిరమునకు పడమర దిశను తాటికట్టవగలదు. నీ ముందు స్థూలముగా గానవచ్చుచున్న తాటిచెట్లను చూడకుండయుండుట యెటులను? వాటిని లేవనుట యెటుల సంభవించును? గాన తరచు నా ధ్యానము కొంతసేపు ప్రతి దినము తాటిచెట్లమీదనే యున్నట్లు గ్రహించి, విచారించితిని.

నిర్వాణాశ్రమము, అందులోని నిర్వాణమందిరము, దానిమీద మౌనధ్యానము జేయుటకు శాంతి తుల్యమైన గది, ఇవన్నీయు గల్గియుండియు తాడిచెట్లుమీద ధ్యానము జేయు గతి వచ్చినదేమి? ఓ దైవమా! అన్నట్లు, మనస్సు ఒక్కొక్క రోజున పరిపరివిధముల విమర్శింప దొడగెను. ఆ తాడిచెట్లును చూడగాచూడగా, వాటి మీదనే ధ్యానించగా, ధ్యానించగా అవి ఆశ్చర్యముగా, విచిత్రముగా, మానవరూపములను దాల్చసాగెను. మానవ రూపములేగాదు, దైవరూపములు గూడను.

అంతా కృష్ణమయం ఈజగమంతా కృష్ణమయము గదా!

నిమీళిత నేత్రుండనై కృష్ణుని ధ్యానించుచుండ కండ్లు తెరచిన కృష్ణుడే గానవచ్చును. ఇప్పుడు నా ముందుగయున్న ఆరు తాడిచెట్లును పరిశీలింతము. ఆరు చెట్లలో ఒక చెట్టు మాత్రము పొడవుగా నున్నది. దాని కుడివైపున రెండు చెట్లును ఒక్కటి కొంచెము పొడవుగా, రెండవది దానికంటె చిన్నదిగా యున్నది. ఎడమవైపున యున్న కొదువ మూడు చెట్లును గూడ ఒకటి తర్వాత రెండవది కొంచెము యెత్తు తక్కువగానే యున్నవి. మధ్యను పొడవుగాయున్న తాడిచెట్టు శ్రీకృష్ణభగవానుడుగా మారెను. ఆయన కుడివైపున నున్న రెండు చెట్లును ధర్మరాజు, భీమసేనుడుగా మారెను. భీమసేనుడు పుష్టిగా నుండెను. ఇక యెడమ వైపున జూడగా, మొదటి తాడిచెట్టు (పార్థుడుగా) అర్జునుడు గానవచ్చెను. ఇంకను అర్జునుని వైపు జూడగా అతని గాండీవముగూడ గానవచ్చునా అన్నట్లుండెను. కొదువ రెండు తాడిచెట్లును నకుల, సహదేవులుగా వినయవిధేయతలతో బరంగుచుండిరి.

ఈ రోజులలో, ఇప్పుడు నిర్వాణ మందిరముమీద మౌనగదిలో ధ్యానము జేయుచుండ, నాకుతాడిచెట్లు గానరావు. శ్రీకృష్ణపరమాత్ముడే-పంచపాండవులతో ప్రత్యక్షమగుచుండును. నా ఆనందమును యీ ఖండమైన చిన్నమాటలతో యెటుల వర్ణించగలను?

ప్రియమైన శాంతిపాఠకులారా! మీకు గూడ శ్రీకృష్ణపరమాత్మను, పంచపాండవులను దర్శించవలెనని యున్న రండు, రండు, శ్రీ శాంత్యా శ్రమమునకు. మీకుగూడ ధ్యానగదిలో, నిర్వాణమందిరమునందు మౌనముగా ధ్యానము జేసికొనుటకు సమానమైన హక్కు గలదు.

ప్రశ్న : శ్రీ శాంత్యాశ్రమము యెవరిది?

జవాబు : అది దైవపరితాపనతో నిండియున్న భక్తుల సొత్తు! ఇదియే మీ అందరకు మా సుస్వాగతము.

నిత్యము అటుల ధ్యానము జేయుచుండ, ఒక్కొక్కసారి, శ్రీకృష్ణ భగవానుడు, అర్జునునకు గీతామృతమును, ఇంకను బోధజేయుచున్నట్లు నేను భ్రమపడుచుందును. ఆయన దివ్యహస్తములు రెండు వైపులను చాచబడి, ఒకవైపున ఒక హస్తము ధర్మజుని,

భీమసేనునిమీద, రెండవ హస్తము అర్జునుని, నకుల సహదేవుల మీదను వుంచబడినట్లు జూచుచు తృప్తి పడుచుందును.

ఇంతియేగాదు, మరొక్కమెట్టు ఆధ్యాత్మికముగా లోపలకు వెళ్ళిన నామరూపములు మాయమై, కోటిసూర్య ప్రకాశవంతమైన పరమాత్మయే సత్యము, ధీరత్వము,ధర్మము, భక్తి, విధేయతలతో లోకమంతయు నింపబడినట్లు గాంచుచుందును.

| | | | | |
|---|---|---|---|---|
| GOD | – | పరమాత్మస్వరూపుడు | – | శ్రీకృష్ణుడు |
| TRUTH | – | సత్యము | – | ధర్మరాజు |
| VALOUR | – | వీరత్వము | – | భీముడు |
| DUTY | – | ధర్మము | – | అర్జునుడు |
| DEVOTION | – | భక్తి | – | నకులుడు |
| OBEDIENCE | – | విధేయత | – | సహదేవుడు |

ఒక్కొక్క సమయమున ధ్యానఘడియలలో **తక్కువేమీ మనకు శ్రీకృష్ణపరమాత్మ దొక్కడుండు వరకు** అని కీర్తించుచుండ, శ్రీకృష్ణపరమాత్ముడు తన అఖండమైన దివ్య తజస్సుతో బాహ్యముననేగాక, నా ఆంతర్యమునగూడ వెలుంగుచున్నట్లు ప్రత్యణువులో నిండి నిబిడీకృతమైనట్లు అనుభవించుచూ, ఆనందించుచుందును.

## నా ధ్యానము

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మాలోపలను ప్రత్యణువునందు నిండియుండి మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము, ఆత్మలకు ఆత్మవై వెలుంగుచున్న ఓదేవా! ప్రేమైకమూర్తి! నిన్ను తెలిసికొను భాగ్యము ఇప్పుడే, ఇచ్చటనే ప్రసాదింపుము.

అని స్మరించగనే ఆంతర్యమున శాంతియేర్పడి, వ్యక్తులయందును, ప్రతీ మానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థమునను స్థిరమైన శాంతి ప్రతిష్ఠింపజేయుటకు తోడ్పడుచుండును.

ఒక్కొక్కమారు శ్రీకృష్ణపరమాత్మను శాంతిదూతగా, ఒక పెద్ద శ్వేతపావురముగా, గరుడునివలె తన రెండు హస్తములు ప్రాక్పశ్చిమ దేశములపై చాచి, **"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"** అని మానవకోటి నంతయు ఆశీర్వదించుచున్నట్లు గాంచుచు, ఆనందించుచుందును. ఆధ్యాత్మికానుభవములు, ఆత్మభావనలు అనుభవనీయులైన ఆత్మీయులకే, బ్రహ్మ వేత్తలకే గ్రాహ్యములు, తదితరులకు ముఖ్యముగా ప్రవృత్తిపరులకు అగోచరము అగ్రాహ్యముగదా!

నేత్రములుండియు చూడరేల?

కర్ణములుండియు వినరేల?

గాంచుడు, అద్వితీయుని, అఖండుని ఖండములో!

**జీవోదేవస్సనాతనః**

సనాతనుండైనజ్యోతులకు జ్యోతిస్వరూపుండైన, సచ్చిదానంద స్వరూపమునకు మా ధన్యవాదములు!

**నిశ్శబ్దో బ్రహ్మ**

నిశ్శబ్ధ స్వరూపునకు, నిశ్శబ్దయుత ప్రణామములు.

ఓం శాంతి శ్శాంతి శాంతిః

(శాంతి మార్చి 1963)

## ఆశ్రమ సందర్శనము

శ్రీ శాంతి ఆశ్రమమును సందర్శించిన భక్తులకు పునర్జన్మ లేదు. శ్రీశైల శిఖరమును దర్శించిన వారికిగూడ పునర్జన్మ లేదని, మహనీయులు జెప్పుచుందురు.

చి॥ సీతాదేవి, ఆశ్రమ నివాసి, భక్తురాలు, ఆశ్రమసేవ జేయుచు ఆమె దిన దినాభివృద్ధి గాంచుచుండుట ఆనందకరము. ఆమె తండ్రిగారు భక్తులు. మామిడిపండ్లు మామిడిచెట్టు నుండియే వచ్చునుగదా! సీతాదేవి మామిడి పండువంటిది.

మామిడిపండ్లు దొరకని రోజులలో, మాధుర్యమైన, అనాసమామిడి పండ్లు, నన్ను రుచిచూడమని కోరుచు, భక్తి ప్రేమలతో శ్రీ పెరుమాళ్లయ్యగారు పంపిరి. వారు పంపిన మామిడిపండ్లే, అంతరుచిగా ఉండగా, అట్టి పండ్లను పంపినవారెంత మాధుర్యముగా, నుందురో, అట్టి భక్తులను వెంటనే చూడవలెనని, చి॥ సీతాదేవితో జెప్పగా, ఆమె నా సంకల్పమును తన తండ్రిగారికి వ్రాయగా, వారు పెద్ద వయస్సు గల్గినవారై యుండియు, శ్రమయనక వెంటనే ఆశ్రమ సందర్శనమునకై వచ్చిరి. ఇదియే వారి ప్రధమ దర్శనము. వారు ఆశ్రమములోనున్న మహావాక్యములన్నియు చదివి, ఇచ్చుట కార్యకలాపములు జూచి, నావద్దకు వచ్చినపుడు పరవశత్వముతో స్వామీజీ, శాంతి ఆశ్రమమును, దర్శించిన భక్తులకు, పునర్జన్మలేదు. దీనిని దర్శించిన మాత్రముననే తరించెదరు. అని జెప్పగా నాకెంతయో ఆనందము గలిగెను.

ఈ 50 సంవత్సరములనుండియు మానవాభ్యుదయమునకు దేశవృద్ధి లోక కళ్యాణమును కోరుచు శ్రీ శాంతి ఆశ్రమము పేరున, జేయుచున్న అల్పమైన సేవకు శ్రీ పెరుమాళ్లయ్యగారి వంటిభక్తులు దగ్గర నుండి, దూరమునుండి, దేశదేశములనుండి,

వచ్చుచు అద్దాని ఫలితమును, అనుభవించుచు, ఆనందించుట, తరించుటయే నాశ్రమ యొక్క ఫలితమని ఎంతయో తృప్తిని, వుత్సాహమును పొందుచుందును. శ్రీ పెరుమాళ్లయ్య గారు, ఆహ్లాదకరమైన, నూతనమైన శక్తిని, వుత్సాహమును గల్గించెడి యీ మాటలను, జెప్పినప్పటి నుండియు ఆశ్రమమునకు, ఏ సందర్శకులు వచ్చినను వారిని జూచుచు, వారి ఆలోచనలు, భావనలు, మాటలు గాంచుచు, వినుచున్న వారికి యిక పునర్జన్మలేదా అని, నేను విమర్శించుకొనుచుందును. పునర్జన్మ లేకుండ జేసుకొనుట అంత సులభము గాదు. మాటలవల్లనే జరుగదు. జన్మరాహిత్యమునకు జన్మజన్మల నుండియు వచ్చుచున్న వాసనలన్నింటిని, జ్ఞానాగ్నిలో కాల్చివేయవలెను. పూర్తిగా మనోనాశనమును గల్గియుం డవలెను. కష్టమైనను, మూల్యము చెల్లించబడినచో, ఆధ్యాత్మిక సాధనలు చేసినచో ఏ పనియైనను సులభముగానే యుండును.

ప్రియమైన, సందర్శకులారా! మీరు శ్రమ తీసుకొని ఆశ్రమమునకు వచ్చినందుకు, ఆనందము, మీకు సుస్వాగతము.

**మీకు ఏమి కావలెను.**
**ఏ ఉద్దేశముతో వచ్చిరి.**
**మీ ఆశయ మెద్ది?**

శాంతి ఆశ్రమములో నున్నప్పుడైనా శాంతిని అనుభవించుచున్నారా! శాంతి మీ జన్మహక్కు, ఏ శాంతి బజారులో, లక్షలకొలది ధనమిచ్చినను కొనజాలరో అట్టి పరి పూర్ణమైన శాంతిని, మీ స్వంతమైన శాంతి ఆశ్రమములో వుచితముగ పొందగలరు.

కాని కొందరు, కండ్లు ఉండియు చూడజాలరు, చెవులు ఉండియు వినజాలరు. ఆశ్రమమునకు వచ్చియు, దైవపరితాపముతో నిండి, జన్మరాహిత్యమును గల్గించెడి ప్రార్థనధ్యానాదులతో గడపక, అధోగతిపాలు జేసెడి ప్రవృత్తి మాటలు, తిండి మొదలైన వాటి గురించియే కాలము గడపుచు, వారు పాడగుటేగాక ఇతరులయొక్క కాలముగూడ వ్యర్థబుచ్చుచుందురు.

ఆశ్రమమునకు వచ్చియు, జన్మరాహిత్యమును జేసుకొనుటకు బదులు, అధోగతికి పాలగుచున్నవారిని జూచినప్పుడు ఆశ్రమవాసులు పెద్దలైనను పిన్నలైనను, తటస్థముగా వూరుకొనక, అట్టివారితో,

ఓ నాయనలారా! భక్తులారా! కాలము విలువైనది. నేడే మనది, రేపు మనదిగాదు. ఆశ్రమమునకు వచ్చిన జ్ఞాప కార్థమైనను, కాలముయొక్క విలువను గ్రహించి మీ ప్రతీ క్షణము ప్రార్థన ధ్యానాదులలో దైవనామ స్మరణను జేయు

టలో తరించుటలో సద్వినియోగము జేయుడు అని నిర్భ
యముగా ప్రేమతో, వారి శ్రేయస్సు కోరుచు జెప్పుట
చాల అవసరము.

శాంతి ఆశ్రమములో దైవనామ స్మరణ తప్ప మరొక్క శబ్దము వినరాదు.

సంసార సంబంధమైన, మాటలు మాట్లాడుట తప్పనియెడల గేటు అవతలకు వెళ్ళి అచ్చట మాట్లాడుకొని, లోపల ప్రవేశించి శ్రమ తీసుకొని, వ్యయప్రయాసలతో ఆశ్రమమునకు వచ్చినందుకు తరించే మార్గము నవలంబించుట చాల ముఖ్యము.

ఆత్మసోదరీ, సోదర స్వరూపములారా! జన్మరాహిత్యమే మన గమ్యస్థానము గాన నేడే, ఆశ్రమమును సందర్శించినప్పుడే, మీరు తరించుటకు గట్టి ప్రయత్నములు జేయుచు శరీరములు ఉండగనే తరించవలెను గాని, శరీరములు పోయిన తర్వాత తరింప జాలముగదా, అప్పుడు, ఏ చిన్న సేవను, ఉపకారమును, ఇతరులకుగూడ జేయజాలము గదా.

## పరోపకారార్ధ మిదం శరీరం

ఈ శరీరములు, ఇతరుల సేవకొరకే ఇవ్వబడెనని మహానుభావులు మత గ్రంథ ములు జెప్పుచున్నవి. మనవల్ల నిజమైన సేవ జరుగుచున్నదా, దగ్గరవారికి దూరము వారికి, సన్నిహితులకు దూరస్థులకు మానవకోటినంతను ప్రేమించుచు, నిరంతరము, స్వార్థరహితమైన సేవను జేయుచుంటిమో లేదో మన జీవితములను, దినచర్యను విమర్శిం చుకొని, పరిశీలించుకొనవలెను. నూతిలోని కప్పవలె, ఖండమైన, అల్పమైన జీవితము లను జీవించరాదు. మానవకోటి అంతయు దైవ సంతతేగాన, అందరినీ ప్రేమించుచు శక్తికొలది సేవజేయుచు తరించుటకు ప్రయత్నించవలెను.

స్వార్థుడు అధోగతి పాలగుచుండెను. స్వార్థరహితుడు జన్మరాహిత్యమును జేసు కొనుచుండెను. స్వార్థము నరకమునకు జేర్చుచున్నది. స్వార్థరహితమైన ప్రేమజీవితము, స్వర్గమునకు జేర్చుచున్నది. ఇందు రహస్యమేమియులేదు. దైవపరితాపనతో నిండి దైవము దైవమన్నవారు దైవములో విలీనమగుచుందురు. ఆశ్రమములో ఉండుటకు అదృష్టము గల్గియు, విషయవాసనలకు బానిసలై ప్రవృత్తి మాటలతో, స్వార్థపు ఆలోచనలతో అమూల్య మైన కాలమును గడుపుచున్నవారు, తమ గోతులుతామే త్రవ్వుకొనుచు అధోగతి పాలగు చుండిరి. దైవభక్తులకు వెయ్యిమాటలు అనవసరము, ఒక్కమాట చాలును.

ప్రియమైన సందర్శకా, ఏ దైవము గురించి, ఆశ్రమమునకు వచ్చితివో, ఆ దైవము నీ హృదయమునందే, నీకై వేచియుండెను. నీ శరీరమంతయు నిండి, నీ హృదయమునకు హృదయముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా, ప్రకాశించుచుండెను.

లెమ్ము! మేల్కొనుము! తరించుట కిదియే సమయము. ఈక్షణమే నీది, క్షణములను వ్యర్థబుచ్చెడివారు జీవితమును వ్యర్థబుచ్చెదరు. పనిచేయని సోమరునికి తినుటకు హక్కులేదు. ప్రార్థనచేయక, దైవమును మరచిన మానవునకు జీవించుటకే హక్కులేదు. ప్రేమలేని హృదయము స్మశానము, దైవము మేల్కొనియుండ, నీవు నిద్రపోయెదవేల? ఇటువంటి మహావాక్యములే, భక్తశిరోమణియైన శ్రీ పెరుమాళ్ళయ్యగారి మనంబు నాక ర్షించి, ఆశ్రమ సందర్శనము, జన్మరాహిత్యము నిచ్చునని, ఘంటాపథముగ జెప్పదొడంగిరి.

**తత్వమసి - అయ మాత్మా బ్రహ్మ**

**అహం బ్రహ్మాఽస్మి - ప్రజ్ఞానం బ్రహ్మ!**

ప్రియమైన పాఠకులారా! మీలోనున్న తెలివియే, ప్రజ్ఞయే బ్రహ్మస్వరూపము. మోక్షము ఇప్పుడే, ఇచ్చటనే, ఎండమావులవైపు కీనీడవెంట, పరువెత్తుటమాని, మీజన్మహక్కైయైన, శాంతిని, శాంతి ఆశ్రమమునకు వచ్చిన జ్ఞాపకార్థముగా స్థిరము జేసుకొని, మీరు తరించి, మీ సన్నిహితుల తరింపునకు తోడ్పడెదరుగాక! తండ్రి **హరి జేరుమనియెడి, తండ్రి తండ్రి,** దైవమును జేర్చెడివారే నిజమైన తల్లిదండ్రులని, శాస్త్రములు చెప్పుచున్నవి. గాన, నేడే, ఇప్పుడే, జన్మరాహిత్యమును బడయుటకు ప్రయత్నించెదరుగాక! **నిశ్శబ్దో బ్రహ్మ!** మౌనం సర్వార్థసాధనము. మౌనమే సర్వమును జయించును. నిశ్శబ్దమే దైవము. పరబ్రహ్మము. గాన ఆశ్రమవాసులందరునూ, మౌనముగా నిశ్శబ్దముగా నుండి సందర్శకులకు, ఆదర్శముగా జీవించుచు, అందరూ కలసి, జన్మరాహిత్యము జేసుకొనుచు, జీవన్ముక్తులుగ బరగుదురుగాక!

An offering to all wishing freedom from re-birth.

అందరి జన్మరాహిత్యమును గోరుచు అందరకు ప్రేమపూర్వకమైన అర్పణ.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి నవంబరు 1964)

# ఆదర్శ జీవితము

ఆదర్శయుత జీవనము గడుపువారు తమకు తామేగాక. భగవానుని బిడ్డలగు యావన్మానవానీకమునకంతకు యుత్కృష్ఠ దన్యవంతులన బరగుదురు. ఆదర్శ జీవితము మధుర వాసనలు వెదజల్లు సుగంధయుత పుష్పము వంటిది. సుగంధ పుష్పమెటనున్నను యది అందరకు సువాసనలు వెదజల్లుచునే యుండును. అటులనే స్వార్ధాహంకారులైన అధికారుల ఇనుప పాదముల క్రిందపడి క్రూరముగ, కఠినముగ త్రొక్కబడుచున్నను, ఆదర్శ జీవితమును గడుపువారుగూడ నిరంతరము సౌమ్యతను, మాధుర్యమును, ప్రశాంతతను వెదజల్లుదురు.

శ్రీ రాఘవేంద్రరావుగారు శాంత్యాశ్రమ ముఖ్య భక్తులలో నొకరు మరియు వారు నిరంతరము ఆశ్రమాభివృద్ధినే గోరుచుందురు. వారు తూర్పుగోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంటుగా నున్నంత కాలము వారి సహధర్మచారిణియగు శ్రీమతి రాజేశ్వరి గారి సహాయ సానుభూతులతో ఆశ్రమాభివృద్ధికై తమ జీవితమును మౌనయుతముగా, నిరాడంబరముగా వినియోగించిరి.

కృతజ్ఞతల నర్పించుట మానవత్వమున కుదారతయై యున్నది. శాంతి సుహృ ద్భావములను వెదజల్లు శాంత్యాశ్రమమునకు నిరాడంబర నిస్వార్ధ సేవలొనర్చిన యా దంపతులకు ఆశ్రమము నిరంతరము కృతజ్ఞతలనర్పించుచున్నది. ఏ నిమిషమునకేది యెట్లుజరుగునో తెలియదుగదా! శ్రీ రాఘవేంద్రరావుగారు పరిపూర్ణారోగ్యవంతులు, తమ కార్యనిర్వహణను శక్తిసామర్ధ్యములతో నిర్వర్తించుచు ధనికులను పేదలను సమముగా పరికించెడివారుగాన, సంతృప్తిపరులుగ గూడ నుండెడివారు.

నాకు క్రిందటేడు కలిగిన హృదయ స్పందన వ్యాధివంటిదే శ్రీ రాఘవేంద్రరావు గారికి సంభవించెననియు సికింద్రాబాదులో శ్రీ గాంధీజీ హాస్పటలులో జేర్చబడిరనియు విని మేమెంత విచార సంభ్రమములలో బడితమో వర్ణింప నలవిగాదు. వారటుల వైద్యాల యములో అనారోగ్యముతో బాధపడుచు పరుండియుండియు వారు శాంత్యా శ్రమాభి వృద్ధికై నిరంతరాలోచనలు ప్రార్ధనలు చేయుచుందురు. శ్రీ రాఘవేంద్రరావుగారు కార్య నిర్వహణములో న్యాయవంతులు, పెద్దలయెడల వినయ, విధేయతలు గలవారు. నిరం తరము నిస్వార్ధమయ నిరాడంబర జీవితమును గడుపుచుందురు. పోలీసు ఇన్స్పెక్టరు జనరల్ మొదలుకొని చిన్న కానిస్టేబుల వరకు అందరధికారులు, స్నేహితులు మొదలగు వారందరు వారి క్షేమము కాంక్షించుచు, వారి ఆరోగ్య విషయమున సానుభూతిని ప్రక టించుచు సత్వరముగా నారోగ్యవంతులగుటకు ప్రార్ధనలను సలుపుచుండిరి.

శ్రీ రాఘవేంద్రరావుగారు నిరంతరము చంటిబిడ్డవలె నందరను ప్రేమించుచు, సాధ్యమైనంత వరకందరకు యెల్లరకు మంచినే చేయుచు నిరాడంబర జీవితమును గడుపు వారగుటచే వారిని బాబాలు, మహాత్ములు, యోగులు, బాలయోగులు, ప్రఖ్యాతవంతులగు స్వాముల వారి వంటి వారిలో ఆయన ఒకరనికూడా నెంచబడుదురు. అట్టి జీవిత మెంత ధన్యవంత మైనది!

పూజ్యశ్రీ రామానందతీర్థ స్వామీజీ, గాంధీజీ హాస్పటలునకు వెళ్ళి శ్రీ రాఘవేంద్ర రావుగారిని చూచి, ఆశీర్వదించి, త్వరలో పూర్ణారోగ్యవంతులగుటకుగాను మౌనయుత ప్రార్ధనలు గావించిరి. నిస్వార్థుల యోగక్షేమములకై ప్రార్ధనల నొనరించుటద్వారా మేమును ప్రపంచ శాంతి సుహృద్భావములకై తోడ్పడుదుము. కనుక పోలీసు సూపరింటెం డెంటుగారగు శ్రీ రాఘవేంద్రరావుగారు ప్రపంచ క్షేమము కొరకై త్వరలో పూర్ణారోగ్యవంతు లగుదురు గాకయని మే మొనరించు ప్రార్ధనలలో మా ప్రియమైన శాంతి పాఠకులుగూడ కలిసి ప్రార్ధనలు చేయగోరుచున్నాము.

కరుణామయుడగు సర్వేశ్వరుడు శ్రీరాఘవేంద్రరావుగారికి పరిపూర్ణారోగ్యము నొసంగి, వారి ఆదర్శయుత జీవితము భగవానుని బిడ్డలగు సర్వ మానవులకు ఆదర్శమై అనేక వత్సరములు వెలయుగాక యని శాంత్యాశ్రమవాసుల, సభ్యుల, కార్యకర్తల, గురుకుల బాలబాలికల యొక్క ప్రార్ధన.

లోకా స్సమస్తా స్సుఖినోభవన్తు

ఓం ఓం ఓం

(శాంతి జూన్ 1965)

# ఆత్మోద్ధరణ పద్ధతి

జీవనదాయియైన యీ యాత్మోద్ధరణ పద్ధతి ప్రాపంచిక వ్యవహార లంపటంబునఁ జిక్కిన సామాన్య మానవునకు సులభముగ నర్థమగునదిగాదు. పారమార్థిక చింతన కల్గిన పుణ్యపురుషున కీ మహత్తర సందేశ మర్థమగుటయే గాక బలమును, ఉత్తేజమును కూడ కల్గించును. ఈ ప్రపంచములో మానవున కసాధ్యమైన కార్యము ఆత్మజ్యోతిని మరువగల్గుటయే. ఎద్దానినైన మరువగలడే కాని జ్యోతిస్వరూపుడై యాత్మలో నివసించు పరమాత్మను మఱచుట మాత్రమ సాధ్యము.

ఆత్మజ్యోతి–ఆత్మస్వరూపమైన పరమాత్మ జీవితారంభము నుండి యంతము వఱకు నీలో నుండగా నద్దాని మఱచుట యెట్లు? నీ వేపని చేయుచున్నను, సర్వవ్యాపకమైన యీ జ్యోతి నిన్నొక నిమిషమైన విడువక యనుసరించుచునే యున్నది. తపో నియమాదుల

వలన నీ యాత్మ జ్యోతియు, విశ్వప్రకాశియునై, సర్వజ్ఞ, సర్వవ్యాపకత్వ సర్వశక్తి యుతంబునైన పరంజ్యోతిని తెలిసికొనినచో సర్వకాల సర్వావస్థలయందును తత్సమా నుండవై సాయుజ్యము నందగలవు.

నీయొక్క ప్రతి కదలికయందును పరమాత్మ గోచరించునే యుండును. నీవు నడచుచున్నను, ఆలోచించుచున్నను ఏమియు చేయక మౌనవ్రతుడవై యున్నను. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములయందును-ఇదియు నదియు యననేల-సర్వ అవయవ ములందును పరబ్రహ్మ స్వరూపము ప్రత్యక్షమగుచునే యున్నది. అట్టి సర్వవ్యాపకుని, సర్వజ్ఞుని మఱచుట సాధ్యమా!

భగవంతుని సరియైన విధముగ నర్థము చేసికొనగల్గినప్పుడే యా భగవంతుని మనోవాక్కాయ కర్మలయందు స్మరించి తరించగలవు. భగవంతుడు సర్వవ్యాపి. చూచుచు న్నను, ఆలోచించుచున్నను-ఏమి చేయుచున్నను, భగవత్పరమే. శబ్దమే పరబ్రహ్మస్వ రూపము. ఈ బ్రహ్మాండమే భగవంతుని ప్రకృతి స్వరూపము.

మాటలతో పనిలేదు. మౌనమే బ్రహ్మము. అందుచేతనే మునులందరు మౌనవ్రతు లైరి. ఈ శబ్దరాహిత్య స్వరూపమునకే యాత్మ సృష్టియైనది. ఈ యనిర్వాచ్య శబ్దరాహిత్యం బుననే సర్వంబు నుత్పత్తి యగుచున్నది. అందుచేత నింద్రియంబుల మనంబునందును, మనంబును జ్ఞానంబునందును, జ్ఞానంబు నా యాది శక్తియందును లయంబు చేసి, యా కోటిసూర్య ప్రభాభాసురుండును, స్వయంప్రకాశమానుండునగు పరబ్రహ్మంబును ప్రార్థించెదముగాక!

ఆత్మోద్ధరణ శక్తియుతంబగు నీ సందేశము జ్ఞానోదయ కారణంబులగు శాంతిదాంతులను ప్రసాదించుగాక!

**అహం బ్రహ్మాఽస్మి - తత్త్వమసి.**

సర్వేజనా స్సుఖినోభవన్తు

ఓం! ఓం! ఓం!

(శాంతి. మార్చి 1967)

# ఆవేదన

దైవమునకు నివేదనయైన జీవితములు ధన్యవంతములు. గాని అట్టి పరమ పావనమైన జీవితములు చాల అరుదు. లోకములో నున్న జీవితములన్నియు చాల భాగము ఆవేదనతోనే నిండియుండుట విచారకరము. దుర్లభమైన మానవ జన్మను పొందియు మానవుడు ఏదో ఒక ఆవేదనతోనె, అమూల్యమైన జీవితమును, కాలమును వ్యర్ధ బుచ్చుచుండుట చాల విషాదకరము.

ఏ ఆవేదనయు లేని జీవితములు చాల అరుదుగదా! తన గురించి గాకున్నను, యితరుల కొరకైనా మానవుడు ఏదో ఒక విధమైన ఆవేదన పొందుచుండును. ఇంట్లో చనిపోయిన వారి గురించి దుఃఖించును. చుట్టుపట్ల హఠాత్తుగా చనిపోయినవారి గురించి బాధ పడచుండును. దైవమును మరచిన వారికి అన్నియు ఆవేదనలే! ఒక్క దైవములోనే అపరోక్షానుభవము నందే ఏ ఆవేదనయు గానరాదు. సూర్యునిలో అంధకారము చీకటి యెటుల వుండగలదు?

ఈ మధ్య ఒక ఆశ్రమ భక్తుడు నోటి నుండి రక్తము కక్కుకొనుచు హఠాత్తుగా చనిపోయెను. ఆయన బంధు స్నేహితులందరూ విచార సముద్రంలో మునింగి ఆవేదనతో బాధ పడుచుండిరి. నేను గూడ ఆవేదన పడుచునే యుంటిని, గాని నా ఆవేదన వేరు. ఆయన బ్రతికియుండగా ఏల తోడ్పడ జాలనైతిననియే చింతించుచుంటిని. ఒక్కమారు శాంతి ప్రార్ధనను ఆయనకు యిచ్చి దానిని స్మరించుచు వృద్ధి చెందమని, తరించమని కోరితిని. ఈ చిన్న సహాయమే, యిప్పుడు ఆయన చనిపోయిన తర్వాత కొంత తృప్తిని నాకు గల్గించుచున్నది. బంధు స్నేహితులందరూ చనిపోయినవారికై విచారించుచు, బాధపడుచుండ, నేనుగూడ బ్రతికియున్న వారికై ఆవేదన చెందుచుంటిని. నా ఆవేదన చనిపోయిన వారి గురించిగాదు. వొలికిపోయిన పాలగురించి విచారించి బాధపడిన ఏమి లాభము? నేనిప్పుడు జీవించియున్నవారి గురించి ఆవేదనతో బాధపడుచుంటిని.

బ్రతికియుండగా మేల్కొన జాలని యెడల చనిపోయిన తర్వాత యెటుల మేల్కొన గలరు? బ్రతికియున్నవారికి సహాయము జేయుటకు, జీవించి యుండగా తోడ్పడుటకు యిదియే మాకు సావకాశము. నేడే మనది. రేపు మనదిగాదు. మృత్యువు ఎప్పుడు వచ్చినా రావచ్చును. ఏవైపు జూచినా మృత్యువుయొక్క ఆర్తనాదమే వినవచ్చుచున్నది.

హఠాత్తుగా గుండె ఆగిపోయి చనిపోయెనని, ఏ జబ్బూ లేకుండ భోజనము జేయుచు చనిపోయెనని, రైలు క్రిందనో, బస్సుక్రిందనో పడి చనిపోయెనని, మృత్యువు యొక్క పిలుపును, దగ్గర నుండి దూరము నుండియు చుట్టుపక్కల ప్రదేశముల నుండియు వినుచు నిత్యము విచారించుచునే యుందుము.

ప్రియమైన ఆత్మ సోదరీ, సోదరా! ఇప్పుడు ముఖ్యముగా నేను వ్రాయబోయెడిది నీవు జీవించి యుండగా, బొందిలో ప్రాణముండగా, హఠాత్తుగా శరీరము పోకముందే

నీకు సేవజేయుభాగ్యము నీవు తరించుటకు తోడ్పడెడి సావకాశము నాకు యివ్వమని నిన్ను హృదయపూర్వకముగా కోరుచుంటిని.

మాయ యెంత దట్టమైనది. గొప్పదియనగా, నిత్యమును అనిత్యముగా జేయును. అనిత్యమును నిత్యముగా జేసి, బొందిలో ప్రాణముండగా విజ్ఞులను సహితము నేత్రములు గప్పుచు, బురదలో పడవేయుచుండును. దైవము మేల్కొనియుండ నీవేల నిద్రపోయెదవు? నేడే నీదై యుండ అమూల్యమైన నీ కాలమును వ్యర్థ బుచ్చుచు, మృత్యువు నోటిలో పడెదవేల?

శ్రీశాంతి ఆశ్రమములో వ్రాయబడిన ఆకర్షణీయమైన యీ మహావాక్యమును చదివియైన మీ నిద్రనుండి, అజ్ఞానమునుండి, మేల్కొనుడు. కాలమనెడి సర్పము, మృత్యువు అనెడి నోటిని తెరచి సోమరులను స్వార్థులను, అతివాగుడుతో విలువైన కాలమును వ్యర్థబుచ్చు చున్నవారిని మ్రింగుచున్నది. మృత్యువనెడి పెద్దపాము నోటిలో పడవలదు. లెండు, మేల్కొనుడు, తరించుట కిదియే సమయము.

కరుణ, ప్రేమయే స్వరూపమైన మనసోదరి సుశీలాదేవి యెటుల హఠాత్తుగా ఆమె సోదరునితో సహా, హిందూదేశమునకు తిరిగి వచ్చుటకు ప్రయాణ సన్నాహములలో యుండ, ఒక కారుక్రిందను చీకటిలో, మంచులో హఠాత్తుగా పడి యిద్దరును యెటుల చనిపోయిరో, మనము సదా జ్ఞప్తియందుంచుకొని మనమందరమును ఒక గుణపాఠము నేర్చుకొని, మేల్కొనవలదా! చావు–మృత్యువు యెవ్వరినీ విడువదు. దానికి దయా దాక్షిణ్యములు లేవు.

ప్రవృత్తిపరులు చనిపోయినవారికై రోదన జేయుదురు. నివృత్తిపరులు జీవించి యున్నవారికై విచారించుచుందురు. An Offering to the Deathless one. I weep for those who do not weep for God. దైవము గురించి పరితపించని వారికై నేను పరితపించుచుంటిని అనెడి అమూల్య వాక్యము ఆశ్రమములో వ్రాయబడి యున్నది.

మీ శాంతియే నా శాంతి. మీ వృద్ధియే నా వృద్ధి మీ తరింపే నా తరింపు గాన మీరు జీవించియుండగనే నన్ను మీకు తోడ్పడెడి, సావకాశము నివ్వగోరుచు యింతగ వ్రాయచుంటిని. మీరు మీ గాఢమైన నిద్రల నుండి మేల్కొనుటకే మీరు తోడ్పడుటకు నా మనస్సు ఆవేదన పడుచున్నది. మృత్యువును జయించుడు. మీ హృదయములలో శాంతిని స్థిరముజేయుడు. మీ గృహములలో శాంతిని స్థాపనజేయుడు. మానవుల జన్మహక్కైన నిత్య శాంతిని, నేడే అందరి హృదయములలో, దేశములో, లోకములో స్థిరముజేయుచు, దేశవృద్ధికి లోక కళ్యాణమునకు తోడ్పడెదముగాక! బుద్బుదప్రాయమైన ప్రాణము పోకుండగనే మృత్యువును జయించెదముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః (శాంతి. ఏప్రియల్ 1971)

# ఆనందాశ్రమము

పూజ్యస్వామి రామదాస్‌జీ దక్షిణ హిందూదేశమున కన్‌హన్‌గాడ్ అనుచోట ఆనందాశ్రమమును స్థాపించిరి. వారు సదా ఇట్లు చెప్పెడివారు.

"దైవనామము, దైవము రెండుకాదు. ఒక్కటియే." తలనొప్పి మొదలు, తరించ గోరువారి వరకు ఒక్క నామమే తెల్పెడివారు. భవరోగములనుండి, ఆధ్యాత్మిక పతనముల నుండి, సర్వము నుండి రక్షించగలిగిన దివౌషధము దైవనామమే-అని వారి దృఢ సంకల్పము.

అందరి ఉపయోగార్ధము ఆ మంత్రము నిచ్చట పొందుపరుచు చుంటిమి.

"ఓం శ్రీరాం జైరాం జైజైరాం ఓం"

ఈ మహామంత్రము ఆశ్రమవాసులు, భక్తులే గాక సందర్శకులు బాలబాలికలు కూడ దివారాత్రములు అతి ఆనందముతో, శ్రద్ధతో సల్పుచుండుట చూచి తీరవల యునేగాని వర్ణింప శక్యముకాదు.

ప్రపంచమునందలి రుచికరములగు ఆహారములన్నియు చూచుటచేగాని, వివిధ పదార్దముల వర్ణనలు పఠించినగాని మన యాకలి తీరదుకదా! మన ఆకలి తీరుటకు మనము భుజింపవలెను. అట్లే ఈ నామముయొక్క రుచి నాస్వాదించుటకు, ఆ దివ్యాను భూతి నొందుటకు ఆ దివ్యనామము **"శ్రీరాం జైరాం జైజైరాం"** జపించవలెను. కోటిసూర్య ప్రభాభాసము,దివ్యమునగు ఆ అనంత స్వరూపునియందు మనసు నిల్పవలెను. సిద్ధాం తములను వల్లెవేయుటకాదు. ఆచరణ, నిత్యజీవితమునందు ప్రతిక్షణము ఆచరణ, అదియే ముఖ్యము. శరీరము నిల్చియుండుటకు తగిన ఆహారము జీర్ణము చేసికొనుట ఎట్లు ముఖ్యమో, అట్లే దైవమును గుర్తించుటకు నామామృత పానము ముఖ్యావసరమై యుండెను.

సుమారు 21 సంవత్సరముల క్రిందట విశాఖపట్టణము నందలి కైలాస పర్వతముపై నేను మౌనముగానున్న కాలమందు పూజ్య పప్పాజీ, మాతా కృష్ణాబాయి, వారి కార్యదర్శి శ్రీస్వామి సచ్చిదానందజీ, కొలదిమంది భక్తులతో అచ్చటకు వచ్చి, మూడు దినములు సత్సంగములతో, భజనలతో, ఆధ్యాత్మిక సంభాషణలతో, నామ సంకీర్తనలతో చక్కగ కాలము గడపిరి.

"ఓం శ్రీరాం జైరాం జైజైరాం ఓం" అంతటను ప్రతిధ్వనించెను.

కైలాసము విడుచుముందు నేనువారి ఆనందాశ్రమము రావలెనని వారి ఏకైక కోర్కె. నేను సరేయని ఒప్పుకొంటిని. కాని కాలగర్భమున 21 సంవత్సరములు గడచి

పోయినవి. నా వాగ్దానము అట్లే యున్నది. ప్రతి సంవత్సరము కోటగిరి శాంతి కేంద్రము నకు వెడలినపుడు అచ్చటికి వచ్చెదనని తెల్పుచుంటినికాని కేరళదేశము నందు అధిక వర్షములచేతనో, శాంత్యాశ్రమమున ముఖ్యమగు పనుల చేతనో యింతకాలము నుం డియు సాధ్యపడలేదు.

ఈ సంవత్సరమైనను మమ్ము నిరుత్సాహపరచకుడు అని మాతాజీ (కృష్ణాబాయి గారు) ప్రత్యేకమైన జాబు వ్రాసిరి. జీవితము క్షణభంగురము, వాగ్ధాన మెటులైన వాగ్ధానమే గదా! ఈ సంవత్సరమైనను వారి వాగ్ధానము చెల్లింతునని దైమునకు మాట యిచ్చి యుంటిని, పప్పాజీ నేడు మన మధ్య రూపు దాల్చి లేకుండినను, వారి పవిత్రాత్మ మాతాజీ, సచ్చిదానందమూర్తి ఆశ్రమవాసులు అందరి నుండియు ప్రస్ఫుటమగుచుండెను. ఆనందా శ్రమమునందేమి, అచ్చటి కార్యక్రమములందేమి వారి దీప్తి తేజోవంతముగ ప్రకాశిం చుచుండెను.

మేము కోటగిరి నుండి ఆనందాశ్రమము ప్రయాణమగుచుండ కోయంబత్తూరు భక్తులు, అచ్చటి వారు మమ్ము చాల నిరుత్సాహ పరిచిరి. కేరళ దేశమునందు వర్షములు మిక్కుటముగ నున్నవనియు, రోడ్లు, వంతెనలు మొదలగునవి వర్షపు నీటికి కొట్టుకొని పోయెననియు, మా శాంతి శకటము పూర్తిగా ప్రయాణము చేయుట కష్టమనియు ఎన్నియో రీతుల తెల్పిరి. వార్తాపత్రికలు కూడ తెచ్చి చూపిరి. వారిని సంతృప్తి పరచుటకు యీ క్రింది విధముగా తంతినీయ సంకల్పించితిమి.

"అధిక వర్షములచే, ఈ పర్యాయము కూడ మిమ్ము నిరుత్సాహ పరచవలసి వచ్చినందుకు క్షమింపుడు" కాని ఉన్నతాత్మ ఇట్లు ప్రబోధించెను. "ఇప్పుడేనా, ఎప్పు డూనా? నాగలిపై చేయి నుంచి ఎన్నడును వెనుదిరిగి చూడవలదు." అందుచే దైవముపై పూర్తి బారముంచి, అచంచల ఆత్మ విశ్వాసముతో అచ్చటి నుండి బయలుదేరితిమి.

వాస్తవమునకు మార్గము లన్నియు జలమయమై యుండెను. కాని దైవానుగ్రహ ముచే అర్ధరాత్రి సమయమునకు ఆనందాశ్రమం చేరితిమి. అట్టి నిశీధియందుకూడ పుష్పమాలలతో ఆశ్రమవాసులు మా కొఱకు నిరీక్షించుచునే యుండిరి. కర్పూరహారతు లతో చక్కగా ఆహ్వానించిరి. అందరికిని తగిన వసతులన్నియు కల్పించిరి. మాతాజీ అపూర్వ ఆదరణలో, శ్రీ సచ్చిదానందమూర్తి తదితర ఆశ్రమవాసుల ఆదరాభిమానము లతో మా ప్రయాణపు అలసట అంతయు క్షణములో మటుమాయమైపోయెను. అదృశ్యమానమగు పప్పాజీ చల్లని నీడలో శాంతితో హాయిగా విశ్రాంతి నందితిమి.

అన్ని వసతులతో గూడిన మా గదుల యందు వివిధ రకముల పండ్లు, పూలు మొదలగునవన్నియు పళ్ళెరముల యందు అమర్చబడియెండెను. అగరబత్తిల నుండి

పైకెగయుచున్న దివ్య పరిమళములు గదియంతయు అలముకొని, ఆ పరిసరములను దైవచైతన్యముచే నింపివేయుచుండెను. అవిరళముగ వర్షము కురియుచున్నను సచ్చి దానందమూర్తిజీ ఉదయము, సాయంత్రము నన్ను తప్పక ప్రార్థన మందిరమునకు కొనిపోవుచుండిరి. ఎడతెగక అచ్చట గావింపబడుచున్న ఓం శ్రీరాం జైరాం జైజైరాం ఓం ఎంత మధురముగ నున్నదో వర్ణించుట ఎట్లు? దివ్య భావతరంగములచే పరిసరము లెల్ల దీప్తివంతముగ ప్రకాశించుచుండెను.

మేము అచ్చట మూడు దినములుండ వలెనని నిర్ణయించుకొంటిమి. కాని మాతాజీ కనీసము 21 దినములైన యుండుడని ఎంతయో కోరిరి. అద్వితీయమగు వారి ఆతిధ్యము, ప్రేమ మరపురానివి. అయిదు దినములచ్చట గడిపి ఎట్లో వారి ప్రేమ బంధముల నుండి విడివడి అచ్చటనుండి బయలుదేరితిమి. తిరిగి ఆనందాశ్రమమునకు వత్తుమనియు, మరొక పర్యాయము చాల దినములు వుందుమనియు తెల్పిన గాని వారు విడువ లేదు. వాస్తవమాలోచించిన ఆనందాశ్రమము శాంతి ఆశ్రమము రెండు కాదు ఒక్కటియే.

అక్కడ గడిపిన కాలములో ఎన్నియో మధుర క్షణములు గలవు. పూజ్య పప్పాజీ, మాతాజీ అడుగు జాడలలో అనుక్షణము వర్తించు శ్రీసచ్చిదానందమూర్తిజీ ఒక పర్యా యము నావద్దకు వచ్చి యిట్లు చెప్పిరి. ఆమెకు ఒకేఒక కోర్కె కలదనియు, అది ఎటులైన నెరవేర్పుడనియు కోరిరి. అది యేమన ఆమెకు నా పాదపూజ చేయవలెనని యున్నది. బాల్యము నుండియు పాదపూజలన్న నాకంత యిష్టముండదు. దైవములో వసించుచు, దైవ ప్రతిరూపులగు వారిని సేవించుచు, జీవించు వారి పాదపూజ నిశ్శబ్దముగా చేయవలె నని నా హృదయము కాంక్షించును. కాని యీ విధముగ బాహ్య ఆడంబరములపై నాకు అంత ప్రీతి తక్కువ కాని ఆమెకు ఆశాభంగము కల్గింపరాదు అని యీ క్రిందివిధ ముగ కబురు చేసితిని.

"పాదపూజ నిశ్శబ్దముగా జరుగవలయును. అందు మాతాజీ నేను తప్ప అన్యులెవరును పాల్గొనరాదు."

అటుపైన ఒక పవిత్ర క్షణమునందు నన్ను శ్రీ సచ్చిదానందజీ పూజ్య రామదాస్‌జీ పవిత్ర నివాసమునకు కొంపోయిరి. అచ్చట పాదపూజ కన్నియు అమర్చబడి యున్నవి. అచ్చట గంపలకొలది పండ్లు, పూలు, వస్త్రములు మొదలగున వన్నియు కాంచిన ఆశ్చ ర్యము కలిగెను. అచ్చట అమర్చబడిన ఒక పవిత్రాసనమున ఆసీనుడనై, కన్నులు మూసికొంటిని. మాతాజీ యధా శాస్త్రానుసారము పూజ గావించెను. పూజానంతరము మాతాజీ మోమును గాంచగా వింతకాంతిచే ప్రకాశించుచుండెను. నా యిష్టమునకు

వ్యతిరిక్తమగు ఆచారమైనను, నావలన ఆమెకు కొంత ఆనందము చేకూర్చితినిగదాయని ఆనందించితిని. పూజానంతరము "పాదకట్నము" అనుచు ఒక కవరును మాతాజీ నాకు యిచ్చిరి. ధనము లెక్కించుటయందు ఉత్సాహములేని నేను దానిని కుమారి జ్ఞానేశ్వరికిచ్చి వేసితిని. ఆమె ఆ ధనము 500 రూపాయలు అని చెప్పినపుడు చాల ఆశ్చర్యము కలిగెను. పాదకట్నము పేరుతో ఎంత ధనమును ఆమె ప్రీతితో నొసగెనో. నేను జ్ఞానేశ్వరితో ఆ ధనమును ప్రయాణపు ఖర్చులకు వాడవలదనియు, వాల్తేరు ఆశ్రమాభివృద్ధికై కేటాయించవలెననియు చెప్పితిని. ఆమె ఆనందముతో అంగీకరించెను. చిన్నపనులందేమి పెద్ద పనులందేమి నేను ఎట్లు చెప్పిన అట్లు చేయుచుండుటయే ఆమె సాధన.

అచ్చటనుండి ఇతర భక్తులను సేవించుచు, శాంతిబీజములను నాటుచు మరికొన్ని వందల మైళ్లు ప్రయాణము చేసితిమి. విషాదభరితమగు మోములో ఒక పర్యాయము జ్ఞానేశ్వరి నావద్దకు వచ్చి ఇట్లు చెప్పెను. "పెట్రోలు అయిపోయనది. కొనుటకు ధనము కూడ లేదు." మాతాజీ ఇచ్చిన పాదకట్నము జ్ఞప్తికి వచ్చినది. ఆమె పేరుతో అది వెచ్చించమని తెల్పితిని. ఆ రీతిగా మాతాజీ సహాయముతో శాంతి ఆశ్రమమునకు సుఖముగా తిరిగి చేరితిమి.

శాంతి శకటము ఆనందాశ్రమమునుండి బయలుదేరు ముందు చాల భారముగా నుండెను. మా ప్రయాణములో వినియోగించుటకు బుట్టలకొలది పండ్లు, ఆహార పదార్థములు, మిఠాయిలచే కారు నింపబడెను, మాతాజీ నాపట్ల చూపిన అవ్యాజ ప్రేమ అపారమైనది. నేను సత్సంగములో ఎప్పుడు దగ్గినను నా నోటియందు కొన్ని హోమియోపతి మాత్రలను వుంచెడివారు. మేము ఆనందాశ్రమము విడిచినను ఆమె వాత్సల్య తరంగములు మమ్ము వెన్నంటియే యుండెను. మేము వెళ్ళబోవు ఆశ్రమము లన్నింటికి ఆమె ముందు ఫోనుచేసి మాకన్ని యేర్పాటులు జరుగునట్లు చూచెడివారు. మా క్షేమము ఎప్పటికప్పుడు తెలిసికొనువారు.

"ఓం శ్రీరాం జైరాం జైజైరాం ఓం" అను పవిత్ర మంత్రముతోబాటు అచ్చట నిత్యము భజనయందు పాడు "ధన్యధన్యహో" అను పాట మా జ్ఞానేశ్వరి మొదలగువారు నేర్చుకొనిరి. మంచి ఎచ్చటనున్నను నేర్చుకొనుటయే మన కర్తవ్యముగదా. ఆ పవిత్ర నామము నుచ్చరించుచు, భజనలు సల్పుచు అందరిని ఆనందింపజేయుచు, మే మానంద మొందితిమి.

మాతాజీ కరుణను, ప్రేమను, ఈ పరిమితమగు మాటలచే వర్ణింప సాధ్యముకాదు. కావున నిశ్శబ్దములో నా కృతజ్ఞత తెల్పుదునుగాక! పశ్చిమ దేశములందు ఒక నుడి గలదు, ఏమన_

"నేపుల్సు చూచి మరణించుడు" నేనిపుడుచెప్పబోవున దేమనగా ఆనందాశ్రమము

చూచి జీవించుడు" అని.

మాతాజీకి, శ్రీ సచ్చిదానందజీకి, ఆశ్రమవాసులకు అందరకు మా కృతజ్ఞతలు. మా యాత్రలో పాల్గొనినవారి కందరకు వారు చూపిన ఆదరణ మరపురానిది.

పరమేశ్వరుడు మాతాజీని ఆయురారోగ్యముతో, శాంతితో సదా కాపాడుగాక!

ఇదియే ఆమె పుత్రుడు ఓంకార్ గావించు ప్రార్థన.

మాతాజీ ప్రదర్శించిన ప్రేమ, వాత్సల్యము, ఆదరణలకు యిదియే నేను అర్పింపగల చిన్న కానుక.

ఓం ఓం ఓం

(శాంతి. ఆగష్టు & నవంబరు 1971)

## ఆశ్రమావస్థలు

ఎట్టి అవస్థలైనను, ఎవరికి చెందినవైనను వినుటకు ఎవ్వరికిని కుతూహలము, ఉత్సాహము వుండనేరదు. "నీవు ఏడ్చిన నీ ఒక్కడవే యేడ్వవలెను. నీవు నవ్విన లోక మంతయు నీతోనవ్వును." అని విజ్ఞులు వక్కాణించిరి.

కాని శాంతి ఆశ్రమము సర్వమానవహక్కు, జ్ఞానగృహము. కావున భక్తులూ, శాంతి పాఠకులు, ఎల్లరూ ఆశ్రమావస్థలు తెలుసుకొనవలెనని నా మనస్సు కోరుచున్నది.

నిత్యప్రార్థన లనెడి చిన్నపొత్తములోని ఈ క్రింది పద్యము నాకెంతయో ఉత్సాహ మును, ఆనందమును, నూతన శక్తిని కల్గించుచుండును.

గీ॥ వచ్చునా పదలవ్వి యా పదలుగావు
వచ్చుసంపదలవ్వి సంపదలుగావు
పరమ పురుషు మరచుటే యాపదలుసుమ్ము
పరమ పురుషు దలచుటే సంపదలుసుమ్ము.

ఎల్లరును సౌఖ్యమునే కాంక్షింతురు. శుభములనే విననిచ్ఛగింతురు. దుఃఖములను కాంక్షింపరు. విననిచ్ఛగింపరు. అనంత కాల ప్రవాహమందు సుఖదుఃఖములు అవిభక్త ములు. ఈ సత్యమును గుర్తించినవారే పరమానంద సుఖమును పడయగలరు.

ఈ విశ్వమునందు ఎవరు దుఃఖముతోను, విషాదముతోను క్రుగ్గుచున్నను, అంటురోగమువలె ఆ దుఃఖము ప్రపంచమందెల్ల వ్యాపించియే తీరును.

నీ అవస్థలచే, బాధలచే నీకు తెలియకనే ఇతరులకు విషాదమును పంచుచుంటివి గాన, సదా నీవు ఆనందముగా యుండవలెననుటయే జగత్కల్యాణమునకు నాంది.

ఈ 56 సంవత్సరముల నుండి ఆశ్రమావస్థలలో తోడ్పడిన భక్తవరేణ్యులకు ప్రథమముననే నా కృతజ్ఞతా వందనములర్పింప నిండు, సర్వసాక్షి, సర్వోపగతుడు, కృపామయుండు అగు ఆ దైవము ఆశ్రమాభివృద్ధిలో, ఆశ్రమావస్థలలో తోడ్పడుచున్న భక్తులందరినీ ఆయురారోగ్య ఐశ్వర్యములతో బ్రోచి సదా శాంతిని ప్రసాదించుగాక!

పెద్ద పెద్ద సంస్థలలో గురుతర కార్యనిర్వహణలో, మానవసేవా పరతత్వములో, సముద్రకెరటములవలె యీ అవస్థలు తప్పవు. కాని యీ అవస్థలన్నియు తాత్కాలికమైన మేఘముల వంటివేయని మనము గుర్తెరింగిన తృప్తిని చెందుదుము. ఆకశమున మేఘ గమనము నెప్పుడైన వీక్షించిరా? చూచుచుండగనే ఆకశమంతయు మేఘావృతమై అంధ కారమలముకొనుచుండును. తిరిగి క్షణములో ఎచ్చటి మేఘము లచ్చట విచ్ఛిన్నమై మాయమగుచుండును. ఎంతటి ఆనందము! అద్భుతము! అట్లే మానవుడు తన దుఃఖ ములు, అవస్థలు ఎంతఘనతరమైనవైనను, అవి అశాశ్వతములని గుర్తించి, తృప్తిని, బలమును, శాంతిని పొందవలెను.

ఈ ఆశ్రమావస్థలు ఎప్పటినుండి ప్రారంభించవలెనో తెలియకున్నది. మొట్టమొదట 1917లో ఆశ్రమము ప్రారంభించినపుడు పది యెకరములలో ఒకేఒక మామిడి చెట్టువుండెడిది. అడవి జంతువులు విచ్చలవిడిగా తిరుగుచుండెడివి కావున ఆ మామిడి చెట్టునకు ఉయ్యాల వేసుకుని, అందులోనే ప్రార్థన ధ్యానాదులు సల్పుచు నిద్రించెడివాడను. అరసాల వృక్షమొక్కటియే భక్తులను సేదతీర్చుటకు ఆహ్వానించెడిది. మిగిలిన భాగమంతయు కంటకావృతమై రాళ్ళురప్పలచే నిండియుండెడిది. ఇప్పుడనెదరా! రెండు వందల ఎకరముల విస్తీర్ణముతో 125 మంది గురుకుల బాలబాలికలతో 30మంది వృద్ధులతో తదితర ఆశ్రమ వాసులతో, నిత్యము పనిచేయు తోటమాలీలతో కళకళ లాడుచున్నది. నాడు ఏకాంతముగా మామిడిచెట్టుపై ప్రార్థన ధ్యానాదులు సల్పుకాలమున పాలు, పండ్లు, ఏ కృపామయుడు ప్రసాదించెనో, నేడు ఆ కృపామయుడే సుమారు రెండువందల మంది ఆశ్రమవాసులకు, వచ్చిపోయెడి అతిధులకు పోషణ భారము వహించుచుండెను. ఈ శాంతి ఆశ్రమమున ఏదైన మహత్యమున్న ఎడల అది ఇదియే. మరునాటి ఆహార మెచ్చట నుండి వచ్చునో తెలియని స్థితిలో, సర్వజ్ఞుడు, కృపామయుడు అగు ఆ దైవము యీ ఏబదియారు సంవత్సరములనుండియు, దినదినము ఏదోయొక రూపమున సంరక్షించుచు, ఆశ్రమవాసులను, ఆసుపత్రి యందలి రోగులను కంటికి రెప్పవలె కాపాడుచుండెను.

సీ॥ అడవిపక్షుల కెవ్వఁడా హారమిచ్చెను?

మృగజాతి కెవ్వఁడు మేతఁబెట్టె?

జలచరాదులకు భోజన మెవ్వఁడిప్పించె?

జెట్ల కెవ్వడు నీళ్ళుఁజేదిపోసె?

స్త్రీలగర్భంబుల శిశువు నెవ్వఁడుబెంచె?

ఫణుల కెవ్వఁడు బోసె బరగవిషము?

మధుపాళి కెవ్వఁడు మకరందమొనరించె!

బసుల కెవ్వండొసంగెఁ బచ్చిపూరి

తే॥ జీవరాసులఁబోషింప నీవేగాని

వేరెయొక దాతలే డెందువెతకిచూడ

భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!

దుష్టసంహార! నరసింహ! దురితదూర!

ఇంతవరకు యెవ్వరు చేసిచూపజాలని స్వార్థరహిత సేవలలో, విశ్వప్రేమతో జ్ఞానదీప్తిని ప్రసరింపజేయుచు లోకమునందలి మిగిలిన ఆశ్రమములన్నింటికి మార్గదర్శిగా నుండుటయే శాంతి ఆశ్రమ లక్ష్యమైయున్నది. ఈ సంకల్పము 'అహంకార' మమకార' ములతో కూడియున్నట్లు కానవచ్చుచున్నను, ఇదియే వ్యక్తి శాంతికి, లోకశాంతికి స్థిరమైన మూలమైయున్నది.

విశ్వప్రేమయే! విజ్ఞానమే ! ఈ సంకల్పమునకు కారణము. ఈ విశాల విశ్వమే నా గృహము. అందలి ప్రతి జీవియు నా స్వరూపములే. వారు తరించుటయే నా తరింపు. అదియే నా మతము, ధ్యేయము. ఈ భావనయే ఆధ్యాత్మికముగ రోగనివారణ చేయు కేంద్రమును స్థాపించుటకుకూడ మూలకారణము.

అయిదు సంవత్సరముల క్రిందట ఒక పవిత్ర దినమున జాతి, మత, కుల విచక్షణ లేక, లోకమునందలి ఏ దేశస్తులకైనను ఆధ్యాత్మికముగ రోగనివారణ గావించి, రోగులకు తోడ్పడవలెననెడి భావన కల్గెను నాడే "ఆధ్యాత్మికముగ రోగనివారణాకేంద్రము" శంఖుస్థాపన జరిగెను. ఆసుపత్రి భవనపు, రెండవ అంతస్థున నిర్మింపబడుచున్న యీ నిర్మాణపు పని గోడలతో ఆగి, అట్లే నిలిచియున్నది. అమెరికా సోదరి సుసేనాదేవి సహాయముతో రోగచికిత్సాలయపు పని ఉత్సాహముతో జరుగుచున్నను, దాని భవనము ఇంకను పూర్తి కాకుండుట చూచి విచారమును పొందుచుంటిని.

ఈ భవనము మీద పెంకులు పడవలెనని ఒకటి రెండు సార్లు ఉపవసించి ప్రార్థన ధ్యానాదులుకూడా సల్పితిని. ఏ భక్తుల హృదయములందైనను దైవము ప్రవేశించి, ఆ గొప్ప సేవను పూర్తి చేయించునని నా వెఱ్ఱి నమ్మకము. అయిదు సంవత్సరములు

గడుచుచున్నను, బోడిగోడలపై రేకుగాని, పెంకుగాని వేయించెడి భక్తులొక్కరైనను ముందుకు రాకుండుట విచారము. ఏ సంవత్సరమున కాసంవత్సరమే వర్షాకాలమున ఆ గోడలు పడిపోవునేమోయని భయపడుచుందుము. దైవకృపచే ఇంకను గోడలు పడిపోక నిల్చియున్నవి. ఏ భక్తుల హృదయమందైనను ఆ దయామయుని కరుణచే "ఆధ్యాత్మికముగ రోగనివారణచేయు కేంద్రము" పూర్తియై రోగులకు శాశ్వత సేవచేయబడుగాక!

మీ రెచ్చటనున్నను దగ్గరలోగాని, దూరమునగాని, రోగగ్రస్తులైనవారు మా ప్రార్ధనలకై తెలియజేయుటకు నేడు చక్కని సావకాశము కలదు. ఆశ్రమములో నేడు టెలిఫోన్ కనెక్షన్ కలదు. దాని నెంబరు ఓం 44 సి.ఒ.సి. వయా, తుని రోగులు మా ప్రార్ధనలావస్యకమని తోచినపుడు మాకు టెలిఫోన్ చేయవచ్చును. వారు సదా శాంతి ప్రార్ధన చేయుచు మాకు తోడ్పడవలెనని మా ప్రార్ధన. నిరంతర దైవ ప్రార్ధనలతో రోగనివారణకు తోడ్పడుటయే మా ఆశయము. ఎన్నియో సంవత్సరములు గడుచుచున్నను ఇట్టి పవిత్రమగు రోగనివారణా కేంద్రపు కట్టడపు పని పూర్తి కాకుండుట, ఆశ్రమ అవస్థకాదందురా?

మరియొక అవస్థ ఏమన చేతిపనుల కార్యాలయము, ఇచ్చట సబ్బులు, అగరవత్తులు మొదలగునవి తయారుచేయుచుందురు. మరియు బాలబాలికల అభివృద్ధికై తోడ్పడుటకు కుట్టుమిషనులుకూడ కలవు. వీని సామగ్రి యుంచుటకు తగినవసతి లేక తాటియాకుల పాకలలో నుంచుటచే చెద, వర్షములచే కలుగు కష్టనష్టములు భరించవలసి వచ్చుచుండెను. ఇవన్నియు ఆశ్రమావస్థలు కాదా? అడుగకున్న అమ్మయైన పెట్టదను నానుడి కలదు. ఇట్టి అవస్థలన్నియు మా ఆశ్రమాభిమానులకు, భక్తులకు తెలియజేయకయున్న ఎడల ఆశ్రమాభివృద్ధి ఎట్లగును? దైవ కార్యములెట్లు నెరవేరును?

వెనుక ఒక పర్యాయము నేను కోటగిరి యందుండగా ఒక భక్తుడు జనకాశ్రమములో మూడు కుటీరములే యున్నవి. నాల్గవ వైపున తన పేరున ఒక కుటీరము నిర్మించవలెనని యున్నదనియు, నేను ఆశ్రమమునకు తిరిగివచ్చిన తదుపరి శంఖుస్థాపన చేతుననియు పలు జాబులు వ్రాసెను. అడుగకుండగనే ఇట్టి సహాయము చేయుటకు ముందుకు వచ్చిన ఆ భక్తునకు కృతజ్ఞతలర్పించుచు, దైవకృపకు ఆనందించితిమి. కాని చిత్రమేమనగా మేము తిరిగి వచ్చి ఎన్ని ఉత్తరములు వ్రాసినను ఆ భక్తుడు జవాబుకూడ వ్రాయడయ్యెను. "మానవుడెన్నడును నిరాశనే కల్గించును. దైవమొక్కడే నిరాశను కల్గించనిది" అనెడి సూక్తి ఎంత సత్యమైనది?

మరియొక పర్యాయము కూడ ఇట్లే జరిగెను. ధనికుడగు నొక భక్తుడు ఆశ్రమమునకు వచ్చి "స్వామీజీ! మానవ శరీరములు అశాశ్వతమైనవి, నేటి మనుజుడు రేపుండక

పోవచ్చును, కావున నా పేరున ఇచ్చట ఒక భవనము కట్టింతును. పదివేల రూపాయలు ఖర్చుచేయగలను. అందు కొంత ముందు ఇచ్చెదను. మీరు దాని నిర్మాణమునకు తోడ్పడుడు అని కోరెను. “మేము ఆనందముతో వప్పుకొంటిమి. ఆ భక్తుడు పెట్టిన గడువు దాటిపోవుటచే, మరచెనేమోయని జ్ఞప్తి చేసితిమి. అందుకు వారు మా యింట ఇప్పుడే వివాహ కార్యము జరిగెను. దానిని జయప్రదముగా చేయుటకు ఏబదివేలు అప్పు చేయవలసివచ్చెను. ఇట్టి స్థితిలో మేము దానధర్మము లెట్లు చేయగలము అని కబురు చేసిరి. కలియుగములో మాయ చాల దట్టముగా యుండునుకదా! వారిని మేము భవనము కట్టవలసినదిగా ఆడుగనైన లేదు వారే కోరి వాగ్దానము చేసిరి. వాగ్దానమును మరిచి అట్లు ప్రవర్తించుట, మాకు ఆశ్చర్యమును, విషాదమును గొల్పెను. ఇట్టివెన్నియో అవస్థలు మా పాఠకులతో పంచుకొని వారికి విసుపు కల్గించుట మా అభిమతముకాదు!

కాని, ఎవ్వరి స్వభావము వారిచే దేనినైనను మార్చగలము గాని స్వభావమును మార్చజాలమని పెద్దలు నుడివి యుండిరి. ఇక నా స్వభావమేమనగా, నా అంతర్యభావన, అదెట్టిదైనను, దానిని మీ వృద్ధిని కోరుచు, మీ అందరితో వెనువెంటనే పంచుకొనవలె ననియుండును.

ఈమధ్య ఆశ్రమ గురుకుల బాలబాలికల పోషణలో అవస్థపడునప్పుడు, దక్షులైన ఆశ్రమ భక్తులుకూడ ఉపేక్షగాయున్న వారిని తలచిన మనస్సు బాధపడుచుండును. ఇప్పుడు అట్టివారికి గూడ నా వలన శ్రమయుండరాదని తలచుచుంటిని. కాని అనాధ పోషణకై, ఆశ్రమమునగల కొన్ని విలువగల వస్తువులను సరసమైన వెలకు అమ్ముడు పోవుటకు సహాయము చేయుటకై కోరుచుంటిని. మొన్న తెనాలినుండి ఒక భక్తుడు వచ్చి తెలుగు టైపుమిషన్ వాడుక లేక పాడగుచున్నది. దాని వెల 1500/- రు॥లు వరకు యుండునని చెప్పెను. దానితోపాటు డూప్లికేటరుకూడ మంచి ధర వచ్చునట్లు విక్రయించి, ఆ ధనముతో చేతిపనుల కార్యాలయమైనను పూర్తిచేయించవలెనని కోరితిని.

నేను అమెరికా యందుండగా అచ్చటి భక్తులు జన్మదిన కాన్కలుగా కెమేరా మొదలగు విలువగల వస్తువల నిచ్చిరి. వాటినన్నింటిని ఆశ్రమ పోషణకై ఇచ్చినంత మాత్రమున నేనెంతయో ఆనందము పొందుచుంటిని. ఆశ్రమపోషణ, ఆశ్రమాభివృద్ధియే నా జీవిత ధ్యేయము, గమ్యము కావున నన్నుకూడ ఎవ్వరైన కొనదలచిన అమ్ముడు పోవుటకు యీ మనస్సు కోరుచున్నది. హరిశ్చంద్రుడు సత్యము కొరకై ఎన్నో కష్టములు పడి, కడపటికి ఒక కాటికాపరికి తనను విక్రయించుకొనెను. ఆశ్రమావస్థలలో నా మనోవీధిని కదలాడు కొన్ని ఆంతర్య భావనలివియే.

ఒక పర్యాయము ఒక భక్తుడు ఆశ్రమమున జరుగుచుండిన అపారసేవకు

ఆనందించి, మా గ్రామమునకు బండిని, మనుష్యులను తొందరగా పంపుడు. అచ్చట ధాన్యము వగైరా ప్రోగుచేసి పంపు ఏర్పాటు చేయుదును, అని చెప్పగా అట్లు చేసితిమి. ఈ విషయము తెలిసి వారు చెప్పకుండగనే, మరియొక పని మిషతో ఆ గ్రామము విడిచిరట. వెళ్ళిన బండి, మనుష్యులు వ్యర్ధముగా తిరిగి వచ్చిరి. మరొక్క సిరిసంపదలుగల గ్రామమునగూడ ఇట్లే జరిగెను. ఈ అవస్థలన్నియు దైవము మాకు కల్గించెడి పరీక్షలుగా భావించి ఆనందించుచుందుము.

ఇంకను ఇట్టి అవస్థలెన్ని కల్గినను, ఎవ్వరితోడ్పాటు లభించినను, లభించకున్నను, అసంపూర్ణమైన కట్టడములు ముఖ్యముగా ఆధ్యాత్మికముగ రోగనివారణ చేయు కేంద్రము, చేతిపనుల కార్యాలయం మొదలగువాని పరిసమాప్తి గావించవలెనని మా దృఢ సంకల్పము.

క్రిందటి సంవత్సరము, ఈ సంవత్సరము వర్షాభావముచే పంటలు సరిగా పండలేదు, గురుకుల బాలబాలికలను, వృద్ధులను, ఆశ్రమవాసులను పోషించుట చాల కష్టముగా యుండెను. ఆశ్రమమున పనిచేయు తోటమాలీలకు వేతనములు చెల్లించు చుండవలెను. ఈ పోషణా భారమంతయు సక్రమముగా నిర్వర్తించుటకు, మా శాంతి పాఠకులకు, ఆశ్రమాభిమానులకు మరలమరల విజ్ఞప్తులు చేయుటకు నా మనస్సున కెంతయో బాధగా యుండును. ఇప్పుడు ఒక ఆనందకరమైన నిశ్చయమునకు వచ్చుటచే తృప్తిగాయున్నది.

ఆశ్రమ సేవలలో తోడ్పడుచున్న విలువైన వేన్ ఒకటి కలదు దానిని అమ్మి, ఆ సొమ్ముతో ఆధ్యాత్మికముగ రోగనివారణచేయు కేంద్రమును, చేతిపనుల కార్యాలయము మొదలగునవి పూర్తి చేయవలెననెడి భావనయే నాకెంతయో ఆనందమును కలిగిం చుచున్నది. దీనివిలువ చాలనిఎడల ఆశ్రమమునగల తెలుగు మిషను వగైరా విలువగల సామాను అమ్మి అయినను ఆశ్రమావస్థలను తగ్గించవలెనని నామనోభావన, ఏ ధనముచే నైనను, ఏవిధముగా నైనను, ఏదియో ఒక విధముగా దైవకార్యములు నెరవేర్చుటయే ముఖ్యముకదా!

ఆశ్రమపోషణ, ఆశ్రమముల అభివృద్ధి దైవపరితాపము కల్గినవారికి ఆనందము నిచ్చును. అట్టి పరితాపములేని ప్రవృత్తి పరులకు బాధను కల్గించును. స్వర్గధామమునకు, శాంతి సదనమునకు పయనించెడి దారి కంటకావృతమై, రాళ్ళురప్పలతో నిండి, పయనిం చుటకు కష్టముగానుండును. నరకపు బాటయన్ననో, సువిశాలముగా యుండి, ప్రవృత్తి పరులకు భ్రమ కొల్పుచు ఆహ్వానించుచుండును.

ఈ వ్యాసమునకు భక్త చింతామణి యందలి ఒక చక్కని పద్యము తోడను,

శాంతి మంత్రముతోడను పూర్తిచేయుదముగాక!

మనుజుండై పశువౌటకంటె పశుజన్మం బెచ్చు నీవెట్లుదా
నినిబుట్టించితి వట్లుచేయునది హా! నిర్భాగ్యతన్ జ్ఞానమె
ల్లను వ్యత్యస్త ముఁజేసినీ విధులనుల్లంఘించెదన్ నేను దం
డన కర్హుండను బ్రో వేవనను దయన్ సద్భక్త చింతామణీ!
పూర్ణము బ్రహ్మము, జగవిది
పూర్ణము, యాపూర్ణునుండి పూర్ణము వెడలెన్
పూర్ణంబగు నీ జగతికి
పూర్ణత్వము గూర్చియింక పూర్ణమెమిగులున్.

(శాంతి. అక్టోబరు 1972)

## ఆశ్రమ సంపదలు

క్రిందటి నెల శాంతి పత్రికలో ఆశ్రమ అవస్థలు, అనెడి వ్యాసమును మీరు చదివి చింతించియేవుందురు. ఇప్పుడు ఆశ్రమ సంపదలు వ్రాసి, మీ అందరకూ ఆనందమును కలిగించుటకు కోరుచుంటిని. నా అంతర్య భావనలు, నా ఆశయములు ఉత్సాహము, ఆనందము గలిగించెడివైనను, నిరుత్సాహము చింతను కలిగించెడివైనను, మీ అందరితో పంచుకొనుటయే నా స్వభావమైయున్నది. ఆశ్రమ అవస్థల వ్యాసములో అచ్చువేయబడిన చక్కని పద్యము నా కెంతయో ఆనందమును, ఉత్సాహమునేగాక బలమును నూతన శక్తిని గలిగించుచుండునుగాన, మరల ఇచ్చట ప్రచురించుటకు నా మనస్సు కోరుచున్నది.

గీ॥ వచ్చునాపదలవ్వి యాపదలుగావు.
వచ్చు సంపదలవ్వి సంపదలుగావు
పరమ పురషు మరచుటే, యాపదలుసుమ్ము
పరమ పురుషు దలచుటయే సంపదలుసుమ్ము.

తత్కాలికముగా వచ్చుచు, పోయెడి మేఘములను గుర్తించుచు బాధపడుటకంటె స్థిరమైన శాశ్వతమైన సూర్యభగవానునే గుర్తించి తేజస్సును స్థిరము జేసుకొని,శరీరమును, మనస్సును, హృదయమును నూతనమైన దివ్యతేజస్సుతో నింపుకొనుచు తరించెదముగాక, గమ్యస్థానమును చేరెదముగాక!

మాయ యొక్క ప్రభావముచే, తెల్లని వస్త్రముమీద, చిన్న సిరా మచ్చబడిన, వస్త్రము మీదనున్న స్వచ్ఛమైన తెల్లదనము నంతను మరచి, అల్పమైన చిన్నసిరా చుక్కనే

గుర్తించును. వెర్రిమానవుడు బాధపడుచుండును.

నీలగిరిలో నూతనముగా కట్టబడిన ప్రార్ధనాలయమును జూచుచు, అందు కూర్చొని, ధ్యానించుచుండ, దైవకృపకు కృతజ్ఞతతో తలవనితలంపుగా ఆనంద భాష్ప ములు వచ్చుచుండును. ఈ ప్రార్ధనమందిరమే దగ్గర దగ్గర లక్షరూపాయలు విలువ వుండును. సిమ్మెంటుతో చేయబడిన విశ్వమత చిహ్నము శ్రీకృష్ణ, శ్రీబుద్ధ, శ్రీక్రీస్తు, గాంధీజీ మొదలైన మహాత్ముల విగ్రములు, (ఆల్టరు) దైవపీఠము ఎలక్ట్రిక్ బల్బులతో, అలంకరింపబడినది. ఆ విశ్వమతపీఠము స్వయముగా జూచి ఆనందించ వలసినదేగాని, యీ చిన్నమాటలతో వర్ణించుటకు వీలులేదు. దాని చెంతనేవున్న పేరితోట (Pear Garden) ప్రతీ సంవత్సరము 1500 రూ॥లు ఆదాయము నిచ్చుచు, శాంతినిలయమును, పోషిం చుచున్నది. శాంతి నిలయములోనె, చక్కని ఆరోగ్యము నిచ్చెడి ధార ప్రవహించుచుండెను. చల్లని మాధుర్యమైన ఆరోగ్యము నిచ్చెడి జలముతో వక బావి గూడ కట్టబడెను. కొదువ ఆశ్రమ భూమి, విలువైన పాత ప్రార్ధనాలయము, తదితర కట్టడములు, పుష్పతోటలు, ఇతర పండ్లచెట్లు, వేదికలు వగైరాలు మరొక లక్ష రూపాయలు విలువ యుండును. ఇది ఒక గొప్ప సంపద గాదా!

ఇక మాతృ స్థానమైన తోటపల్లి ఆశ్రమము 58 సంవత్సరముల క్రిందట స్థాపించబడి, గురుకులము, అనాధులగు వృద్ధుల గృహము, అచ్చుఆఫీసు, ఆసుపత్రి మొదలైన కార్యకలాపములతో వివిధమైన భవనములతో, యోగులు స్వాములు ధ్యానము జేయుటకు రెండు గుహలతో, భక్తులందరికి తోడ్పడెడి శివాలయము, దానిని చేరుటకు మెట్లుతో, యింకను అనేక విధములైన రామతీర్ధ కళాశాలవంటి భవనములతో, నలుబది మంది అవతార పురుషులు, మహాత్ముల శిలావిగ్రహములతో కొన్ని లక్షల రూపాయల విలువ యుండునని ఆశ్రమ సందర్శకులు అంచనా వేయుచుందురు. ఇవన్నీయు సంపదలు గావా?

ఇంకను వాల్టేరు ఆశ్రమం వున్నది. అదిగూడ 200 మంది బాలబాలికలతో 15 మంది గురుకుల విద్యార్ధులతో వృద్ధి అగుచున్నది. దాని విలువగూడ లక్ష రూపాయలు పైగా వివిధ భవనములతో కొబ్బరి మొదలైన వృక్షములతో వుండునని ఆశ్రమ భక్తులు చెప్పుచుందురు. వాల్టేరుఆశ్రమం చెంత పర్వతము మీదయున్న శిధిలమగుచున్న భవనము లతో కైలాస ఆశ్రమము మాటయేమి? యుద్ధపురోజులలో కొన్నిలక్షలు వ్యయముజేసి కట్టబడిన, భవనములు, రెండుమైళ్ళరోడ్డు యున్నది. ఆ విలువైన భవనములు యుద్ధము పూర్తికాగానే, శిధిలము చేయబోవుచుండ, శాంతి స్థాపనకై దైవము శాంతి ఆశ్రమమునకు యేర్పర్చెను.

ఆశ్రమాభిమానులైన డాక్టరు శ్రీ చెన్నారెడ్డిగారు కైలాస ఆశ్రమంలో, కుటుంబ

సహితముగా నాలుగురోజులు వుండి, అచ్చట నీటి వసతి లేనందున 40 వేల రూపాయలు పైపులు ద్వార జలము వచ్చుటకై ప్రేమతో యేర్పర్చినను, విశాలదృష్టిలేని, దైవ పరితాపము లేని City father of Viskhapatnam. –విశాఖపట్టణం వృద్ధిని కోరుచున్న, పట్టణ యజమానులు, ఆ పెద్దమొత్తమును వేరుగా వినియోగించి దైవ పనికి శాశ్వతమైన హాని జేస్తిరనే జెప్పవలసి వచ్చుట విచారకరము.

ప్రపంచమంతయు నాలుగు సార్లు శాంతి ప్రచారము చేయుచు తిరిగితినిగాని లోకములో యెచ్చటను, ఏదేశములోను అట్టి సౌందర్యమైన, ఆత్మవుత్తేజము నిచ్చెడి, ఏకాంతమైన తావును నేను చూడలేనదే తలంతును. కైలాసముయొక్క శిధిలావస్థకు కండ్లు వుండియు చూడజాలని, విశాఖపట్నము, పెద్దల అల్పదృష్టిని తలంచి విచారించుచుందును. ఎప్పటికైనా దైవపరితాపం, లోక శాంతిని కోరెడి కొందరి భక్తుల హృదయములలో దైవము ప్రవేశించి, శిధిల మౌచున్నకైలాసమును–కైలాసముగా, విశ్వనాధుని నిలయముగా జేయుగాక! ప్రస్తుతము కైలాసము శిధిలావస్థలోయున్నను శిధిలమౌచున్న యీ విలువైన భవనములన్నియు పర్వతముమీద సముద్రముచే మూడువైపులు, పర్వతములచే నాల్గవ వైపు చుట్టుబడియున్న యీ కైలాసముగూడ గొప్ప సందయేగదా! విజయనగరం మహారాజావారు యీ కైలాసమును తమకు వ్రాసి యివ్వమని 10, 15 వేల రూపాయలు యిచ్చెదనని రెండు సంవత్సరములు తిరిగిరి. దానికై తోటపల్లి ఆశ్రమం గూడ రెండుసార్లు వచ్చిరి. ఆశ్రమ సంపదలు దైవ పరితాపముతోయున్న మానవుల హక్కు అని, ఒక్క వ్యక్తికి ఇచ్చుట యెన్నడూ జరుగదని చెప్పగా వారు నిరాశను పొందిరి.

ప్రియమైన ఆత్మసోదరీ, సోదరస్వరూపులారా! శ్రమ తీసుకొని కైలాసమును ఒకసారి మీరు దర్శించిన,కైలాసముయొక్క గొప్పదనమును నేను వ్రాయువ్రాతల యధార్ధము మీరుగూడ గ్రహించగలరు. అచ్చట ఏ ప్రార్ధన, ధ్యానము చేయకుండగనే, మీరు దైవ సన్నిధిని అనుభవించెదరు. కైలాసమిప్పుడు శిధిలావస్థలో యున్నను, నేనచ్చట ఆరు సంవత్సరములు మౌన వ్రతములో యుండి తపస్సు జేయుచుండ ఎంతోమంది మహారాజులు,రాణీలు, జమీందార్లు, ధనవంతులైన లక్షాధికార్లు గొప్పగొప్ప వుద్యోగస్తులు, స్వాములు, సన్యాసులు, యోగులు, హిందూదేశము నుండియేగాక వివిధ దేశముల నుండిగూడ వచ్చి, ఆ వాతావరణమును అనుభవించి ఆనందించిరి.

కీర్తిశేషులైన సోదరి అమృతకౌర్ గూడ కైలాసమునకు వచ్చి ఎంతయో ఆనందించిరి. ఒక్కమారు పోస్టుమేష్టరు జెనరల్, గూడ పెద్దపెద్ద వుద్యోగస్తులతో కైలాసమును దర్శించి, ప్రార్ధన, ధ్యానాదులతో గడిపి అట్టి ఏకాంతమైన కైలాసమును చూచి ఆనందించిరి. శాంతి ఆశ్రమ అధ్యక్షులు, ఆదర్శనీయులైన, భక్తులు శ్రీ తెన్నేటి విశ్వనాధంగారుగూడ చాలాసార్లు కైలాసమునకు గొప్ప భక్తులతో మినిస్టర్లు, జిల్లాకలెక్టర్లతో

వచ్చి కొనియాడిరి. కాని కైలాసముయొక్క దురదృష్టము చేతనో లేక విశాఖపట్టణ ప్రజల ప్రవృత్తికర్మ చేతనో అనేకమంది దేశభక్తులు, లోకప్రసిద్ధి చెందిన మహానీయులు కైలాసమును దర్శించినను, కైలాసమును వృద్ధిజేయుటకు, దానిని లోకమునంతకు అంతర్జాతీయ శాంతికేంద్రముగా (International Center of Peace) శాంతి పిపాసకులకు శాంతినిలయముగా జేయుటకు, యింతవరకు వక్కరికైనను దైవపరితాపము శాంతి స్థాపనకై దైవానుభవమునకై అత్యుత్తమ మైన, పట్టుదల లేనందున కైలాసము స్వర్గ తుల్యమైన కైలాసము, రోజురోజుకు శిధిలావ స్థలోయుండి అధోగతిపాలగుట విషాదకరము. లోకములోనున్న ధనమునంతను, పొందగలిగి తనకు ఆత్మశాంతి నిచ్చెడి కైలాసమును పోగొట్టుకున్న ఏమి లాభము?

What is the use of gaining the whole world losing your own SOUL-PEACE?

సంపదలకెల్ల గొప్పసంపద దైవమే! ఏకాంతములో దైవమును చేరుటకుతోడ్పడెడి, కైలాసము దైవము చేరుటకు తోడ్పడెడి గొప్ప సంపదయేగదా! **పరోపకారార్ధ మిదం శరీరమ్** అని శాస్త్రములు పల్కును. ఈ శరీరము ఇతరులసేవ జేయుటకే యివ్వబడెనని గుర్తించి, స్వార్ధమును తగ్గించి మన తోడి సోదరీ సోదరులకు మన శక్తికొలది సేవజేయుచు తరించెదముగాక!

HEAVY IS THE HEAD THAT WEARS THE CROWN కిరీటము ధరించిన శిరస్సు చాలా బరువుగా నుండునట. ఆశ్రమ బాధ్యతలు–వాటి అవస్థలనైనను, సంపద లలో నైనను స్వార్ధరహితముగా నిర్వహించుట, అంత సులభముకాదు. మనకున్నదానిని ఇతరులతో పంచుకొనుట దేశవృద్ధికి, లోకశాంతికి పాటుబడుటలోనే నిజమైన ఆనందము గలదు. ఆశ్రమ వృద్ధికి లోక కళ్యాణమునకు భక్తులు, ఆశ్రమ శ్రేయస్సును కోరుచు హిందూదేశము నుండియేగాక చైనా నుండి, అమెరికా మొదలైన దేశముల నుండి తోడ్పడుచుండ, ఆ ధనమును ఒక బ్యాంకులో వేయగా పన్నెండువేల రూపాయల వరకు అయ్యెను. అది తలచినప్పుడెల్లను, ఇంత పెద్ద మొత్తమును సేవలో వినియోగించకుండ తుప్పుపట్టుచు నిరుపయోగముగా వుండరాదని హృదయము బరువుగా నుండగా ఆ మొత్తము నంతను వివిధ ఆశ్రమముల వృద్ధికి, గురుకుల బాలబాలికల పోషణకు,సర్వము అర్పించి అర్హత గలిగిన, ఆశ్రమ సేవ జేయుచున్న స్వార్ధరహితులకు, నిరుపేదలకు, రోగుల మందులకు వాడగా, ఇంక బ్యాంకులో ఏమి లేనప్పుడు నాకు ఎంతయో తృప్తి ఆనందమును గలిగెను. హృదయ బాధ, తలబరువు అంతయు తగ్గెను. మనము దైవమును పూర్తిగ నమ్మిన ఏ రోజుకు కావలసినది ఆరోజే దైవమిచ్చును. **"లక్షాధికారియైన**

**లవణాన్నమేగాని మెఱుగు బంగారము మ్రింగబోడు"** అనెడి పద్యము చక్కనైన గుణపాఠమును బోధించుచున్ననూ ఇంకను స్వార్థులు తుప్పుపట్టెడి, దొంగలు అపహరించెడి, అశాంతినికలిగించెడి ధనమునే, దైవమునుగూడ మరచి, రాత్రిం పగళ్లు యింకను ధనసేకరణ కొరకే తమ ఆత్మలను అమ్ముకొనుచుండుట చాలా విషాదకరము.

భక్తి, ప్రేమ, స్వరూపులైన, సోదరి సుసేనాగారు అమెరికా నుండి వచ్చి, స్వార్థ రహితమైన సేవ అహర్నిశములుజేయుచు, ఆమె సర్వస్వమును ఆశ్రమవృద్ధికి అర్పించి, నిరాడంబరమైన సేవ జేయుచుండుట ఇది ఒక గొప్ప సంపదయేగదా! ఆమె తెలుగులో శాంతి ప్రార్థన వర్ణించి ఇతర భక్తులచేగూడ ఆ ప్రార్థనను స్మరింపజేయుచుండుట, ఆమె జీవితము సంపదలకు సంపదయేగాక, గొప్ప మహత్తుగా తలంచి ఆనందించుచుండును.

అపారమైన సేవను, అహర్నిశములు, నిరాడంబరముగా చేయుచున్న శ్రీరామా రావుగారు, శ్రీరాజాజీ, కె.ఎస్.ఆర్. జ్ఞానేశ్వరి, శాంతి, శేషమాంబ, సీతాదేవి, లక్ష్మి, సీత, వగైరాల స్వార్థరహితమైన జీవితములన్నియు గొప్ప అమూల్యమైన సంపదలుగానే భావించి దైవకృపకు ఆనందించుచు కృతజ్ఞత జూపుచుందును. గీతలో బోధించునట్లు అవస్థలలో, సంపదలలో సమభావనతో యుండెడివారే ధన్యులు.

సీ. తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వండు
వెడలి పొయ్యేనాడు వెంటరాదు
లక్షాధికారైనఁ లవణమన్నఁమె కాని
మెరుఁగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జమానఁచేసి విఱ్ఱఁవీగుటె కాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు
పొందుగా మరుగైన భూమిలోనఁబెట్టి
దాన ధర్మములేకఁ దాఁచి దాఁచి
తే. తుదకు దొంగల కితురో దొరలకౌనో?
తేనెజుంటీగ లియ్యవే తెరువరులకు భూ.

సంపదలకు గొప్ప సంపద దైవమేగాన, దైవమును పొందుటకు ఈ దుర్లభమైన మానవజన్మలను వినియోగించుచు, దైవము నుండి పిలుపు మనకు రాకుండగనే అనగా మృత్యువు హఠాత్తుగా రాకుండగనే మన శక్తికొలది జాతి, మత, కుల వివక్షత లేకుండగా, దైవబిడ్డలందరకు స్వార్థరహితమైన సేవ జేయుచు మనము తరించి, యితరుల

తరింపునకు తోడ్పడెదముగాక! నీలగిరి శాంతి కేంద్రములో, యీ మధ్యను జయప్రదముగా, దైవకృపచే జరిగిన నెలరోజులు వేదాంత సత్సంగములో, శిక్షార్ధులకు అనుభవమైన వేదాంతసారమైన యీ క్రింద వ్రాయబడిన అమృత తుల్యమైన, ఉత్తర గీతలోని శ్లోకముతో, వేదాంత క్లాసు ఆనందముగా పూర్తి జేయబడెను. ఈ ఉత్తేజకరమైన శ్లోకము సంపదలకు సంపదగా వేదాంతసారము నంతను, చిన్న మాటలతో సూటిగా, బోధించుచున్నదిగాన ప్రియమైన శాంతిపాఠకులతో, మీ అందరితో పంచుకొనుటకు నా అంతరాత్మ తీవ్రముగా కోరుచున్నది. కావున అద్దాని నిచ్చట వ్రాయుటకు కోరుచు, యీ వ్యాసమును శాంతితో, ఆనందముగా ముగించుచుంటిని.

శ్లో॥ దేహో దేవాలయప్రోక్తో
జీవో దేవ స్సనాతనః
త్యజేదజ్ఞాన నిర్మాల్యం
సోహంభావేన పూజయేత్॥

తాత్పర్యము : దేహమే దేవాలయము,జీవుడే సనాతనముగా దైవమై యుండెను. గాన, దేహభావనను, ద్వంద్వము అజ్ఞానమును, విడచి సోహం-విశ్వప్రేమ భావనచే మహాపూజను, సోహం భావనతో నిరంతము జేయుచు తరించెదముగాక!

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు।
ఓం సర్వేషాం శాంతిర్భవతు।
ఓం సర్వేషాం పూర్ణంభవతు।
ఓం సర్వేషాం మంగళంభవతు।
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు!

(శాంతి నవంబరు & డిశంబరు 1972)

# ఆత్మీయులకు ప్రత్యేక లేఖ

ప్రియ నారాయణస్వరూపా!

సాక్షాత్ దైవస్వరూపా! సత్యస్వరూపా!

నేను నిన్ను ప్రేమించుచున్నాను. కారణమేమన, ప్రేమయే దైవము కావున, నేను ప్రేమించుచున్నాను. ఏలనన ప్రేమించకుండా నేను జీవించలేను.

నేను నిన్ను ప్రేమించుచున్నాను. ఎందుచేతనన, నీలోను ఆ దైవమే, అంతటా ఆ దైవమే, లోపలను, వెలుపలను కన్నులు మూసినపుడు అంతర్యమున, కన్నులు తెరచినపుడు బాహ్యమున ఆ దైవమే నిండియున్నాడు. నేను ఇప్పుడు ఈ అమూల్య లేఖను వ్రాయుచున్న స్థలములో ఎదురుగానున్న గోడమీద ఈ క్రింది చక్కనైన సూక్తి పెద్ద అక్షరములతో వ్రాయబడియున్నది.

దైవము నీలోపలనే యుండ
బాహ్యమున వెదకెదవేల?

అచ్చుటనే, వెనకగాగల గోడమీద ఈ క్రింది సూక్తికూడా వ్రాయబడియున్నది.

దైవము బాహ్యమున నుండ
అంతర్యమున వెదకెదవేల?

ఈ రెండు ప్రాణాధారమైన ఉత్సాహపూరితమైన సూక్తులు వినుటకు పరస్పర విరుద్ధముగా కనబడినను, అవి ఉత్కృష్టమైన సత్యమును కలిగియున్నవి. అవి మన నిత్య జీవితములో ఇప్పుడే, ఇచ్చుటనే ఆచరించదగినవి.

మీ నేత్రములు తెరచినపుడు అంతటా అన్ని నామరూపములలోను, పుష్పముల లోను, పక్షులలోను, మొక్కలలోను, జంతువులలోను, ప్రతి జీవరాశిలోకూడ ఆ దైవస్వ రూపమునే చూడుడు. మీ నేత్రములు మూసినపుడు, మీ శరీరములో ప్రతి అణువు నందును, నఖశిఖపర్యంతము అంతర్యములో ఆ దైవమునే గాంచుడు.

ఆ పరమాత్మ అంతటను, లోపలను, వెలుపలనుకూడ ఆవరించియున్నాడు. ఆతడు లేని కాలముకాని స్థలముకాని భూతభవిష్యత్, వర్తమానకాలములలో యెన్నడును లేదు. అదేవిధముగా ప్రతి నామరూపములలోను ఆ దైవమే నిభిడీకృతమైయున్నాడు. అతడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తివంతుడు.

నేత్రములు కలిగికూడ ఆతనిని గుర్తించలేరా? ఇప్పుడైనను గుర్తించి నిశ్శబ్దములో ఉండి ఇంక ఎంతమాత్రము ఒక్క క్షణమైనను మరువక ఆ దివ్యతేజస్సును అనుభవించె దరుగాక.

మీ నేత్రములు బాహ్యమున ఏమి చూచినను ఆ దైవమునే గాంచుగాక! ఎందుచేతనన దైవము అంతటా నిండియున్నాడు. మీ నేత్రములు మూసినపుడు ఆంతర్యమున ఆయననే గాంతురుగాక! దైవమును ప్రవృత్తిలో-బాహ్య ప్రపంచమున మీ నేత్రములు తెరచినపుడును, నివృత్తిలో-ఆంతర్యమున మీ నేత్రములు మూసినపుడును గాంతురుగాక!

బాహ్య ప్రపంచములో ఆయనను గాంచి, మీరు ప్రార్థన, ధ్యానాదులు చేయునపుడు, నిశ్శబ్దములో ఆంతర్యమున ఆదివ్య తేజస్సును అనుభవించుడు-దైవము ఆంతర్యమున గలడా లేక బాహ్యమున గలడా అను సందేహములను వదలుడు, ఆతడే మీ శరీరములో ప్రతి అణువునందును ప్రకాశించుచున్నాడు. ప్రపంచమంతటా అన్ని నామ రూపములలో ఆతడే ప్రకాశించుచున్నాడు.

కావున మనము చేయవలసినది ఒకటే ఎల్లప్పుడు ఎడతెగకుండగా, నిరంతరము తైలధారవలె ఆ దైవమును మరువకుండగా ఆ తేజస్సును సదా అనుభవించుటయే మన కర్తవ్యము.

ఇప్పుడు ఆ దైవమును ప్రతిశ్వాసతో అనుభవింతముగాక! ఎందుచేతననగా దైవము మన శ్వాసలకు శ్వాసగా ప్రకాశించుచున్నాడు. ఆయనే '**సోఽహం**' శ్వాస, విశ్వమంతటా ఆవరించి యున్న శ్వాస, ఒకే ఒక అద్వితీయమైన శ్వాస-పరమ శ్రేష్ఠమైన శక్తి, అనంతమైన శాశ్వతమైన నిశ్శబ్ద స్వరూపము.

అటువంటి చిన్న **"సోఽహం"** శ్వాసను, నిరంతరము, శాంతముగా, అవిచ్ఛిన్నముగా, ఎడతెగకుండా అనుసరించుటకు శక్తిని పొందుదముగాక! నేనే అది-అదియే **'సోహ'** మని ప్రతి శ్వాసతో అనుభవించుచు, ప్రకాశవంతమైన ఆ కోటిసూర్య ప్రభాభాసమానమగు జ్యోతిని లోపల, వెలుపల, అంతటా అనుభవించెదముగాక!

**'తత్త్వమసి**-అదియే నేను'

ప్రియమైన దైవస్వరూపా!

ఇప్పుడు నిశ్శబ్దముగా, పరమశ్రేష్ఠమైన, అనంతమైన నిశ్శబ్దములో ఆ పరమాత్మను, ఆ సోహం శ్వాసను అనుభవించెదముగాక!

ఓం ఓం ఓం

(శాంతి. డిశంబరు 1977)

# ఆనంద వార్త

శాంతి పత్రికకు వేలకొలది చందాదార్లు కలరు. ఆ సోదర సోదరీమణులందరను నా స్వంతముగా భావించి వారిని ప్రేమించి వారి వృద్ధిని కోరుట నా అదృష్టము. వీరందరిచేతను శాంతి ప్రార్ధన ప్రతిదినము చేయించుట నా జీవితాశయము.

ఇప్పుడు శాంతిపాఠకులకేగాక, నాస్థికులకు దైవపరితాపనలేని వారికి సహితము నేను వ్రాయబోయెడి ఆనందవార్త యేమన–మీరెవ్వరైనను సరియే దైవమును మరచుట అసాధ్యము. మీరు నాస్థికులైనను, ఆస్థికులైనను దైవమును గుర్తించినను, గుర్తింపకున్నను,మీకు దైవపరితాపనవున్నను లేకున్నను నిత్యమై, సత్యమై, పరిపూర్ణమైన శాశ్వత జ్యోతిని, మీ జన్మహక్కైన దైవమును మరచి ఒక్క క్షణమైనను జీవించజాలరు అనునదియే ఆనందవార్త. కావున అది పరిపూర్ణమైన సత్యము.

మీరు ఎంత ప్రవృత్తిపరులైనను, చంచలమనస్కులైనను, దైవమును మరచి ఒక్క క్షణమైన జీవింపజాలరు. ఆ విషయము మీరు గుర్తించినను లేకున్నను ఎన్ని విషయ భోగములకు బానిసలై జీవించుచున్నను సాగరమునుండి తరంగమెన్నడును వేరుకానట్లు దైవమునుండి ఎన్నడును భిన్నముగా లేరు. నీటినుండి బుద్బుదము వేరుగా నుండుట సాధ్యమా? అటులనే దైవము నుండి మీరు భిన్నముగా నుండుట అనునది అసంభవము.

ఈ సత్యమును మీరు గుర్తించిన ఇంక దైవమును మరచుచుంటిమని పరితపించ నవసరములేదు. మరుపులోగూడ మీరు యెవ్వరైనను, యెచ్చటనున్నను, స్వర్గములో యున్నను, నరకములోయున్నను, పురుషులైనను, స్త్రీలైనను, వృద్ధులైనను, పసివారైనను మీరందరు దైవము నుండియే వచ్చి, దైవమునందే జీవించుచు, ఆ దైవములోనే లయించుచుండిరి. భూత భవిష్యద్వర్తమాన కాలములలో దైవములో మీరు లేని కాలము ఒక్క క్షణమైనను యెన్నడును లేదు. ఈ గొప్ప సత్యమును, పరిపూర్ణమైన దైవత్వమును గుర్తించి, ఆనందముగా యుండుడు.

మీరుదైవ నామస్మరణ చేయుచున్న మీరు దైవములోనే యుండిరి. మాయా ప్రభావముచేత, ప్రవృత్తిపరులై దైవమును మరచి, ద్విపాదపశువులై దైవమును విస్మరించినను మీరుకూడ ఆ దైవములోనే యుండిరి. ఏలనన దైవము సర్వవ్యాపి. సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. ఈ నిత్యమైన, పరిపూర్ణమైన సత్యమును గ్రహించిన వారు,కోటిసూర్య ప్రభాభాసమానమగు ఆ దివ్యతేజస్సును యీ క్షణమునందే గుర్తించి ఎట్టి చింతలు, బాధలు, తాపత్రయములు లేక నిర్విచారముగా, ఆనందముగా యుందురు. అట్టి మహనీయులు నిరంతరము ఆ శాశ్వత జ్యోతిలోనే జీవించుచు, ఇతరులకు ఆదర్శనీయముగా మార్గజ్యోతులై, తాము తరించుచు, ఇతరులనుతరింపజేయుదురు. అట్టివారు దేశమునకేగాక లోకమునకే శాంతి నొసగు ధన్యజీవులు.

చెప్పినదే మరల మరలచెప్పుచు, వ్రాసినదే మరల మరల వ్రాయుచు, మీ విలువైన కాలమును నా విలువైన కాలమునుకూడా వ్యర్థమొనర్చుచుంటినేయని విచారించు చుంటిని. నేను చెప్పవలసిన ఆనంద వార్తను, ఈ గొప్ప సత్యముయొక్క సారాంశమును సంక్షిప్తముగా మీతోపంచుకొని యీ ఆనందవార్తను ముగింతునుగాక!

దైవము అని స్మరించినంత మాత్రమున, కోటిసూర్యప్రభాభాసమానమగు ఆ దివ్యతేజస్సును, ఇప్పుడుఇచ్చటనే, యీ క్షణమునందే గుర్తించి అనుభవించవలెను. ఒక్కక్షణములో ఆ దైవతేజస్సును గుర్తించి, ఆచరణలో యుంచిన, మరుక్షణములోగూడా ఆ దివ్య తేజస్సును అనుభవించగలరు. ఇదియే అనుష్ఠాన వేదాంతము. ఇదియెప్పుడోగాక దైవము కావలసినవారందరూ యీ క్షణమునందే ఆచరణలోనుంచవలెను. ఆచరణలో ఉంచుటకు ఇదియే సరియగు సమయము. పవిత్రమగు స్థలముకూడ ఇదియే.

మనము ఆనందముగ నుండుటకు ఇతరులను ఆనందపరచుటయే సూక్ష్మమైన, సరళమైన మార్గము. కావున మనము సదా శాంతి ప్రార్థన ను చేయుచు, ఇతరులచేత స్మరింపజేయుదముగాక! ఇదియే సూక్ష్మములో మోక్షము బడయుటకు రాజమార్గము. ఈ ఆనందవార్తను గ్రహించి, ఆచరణలో పెట్టిన యెవ్వరైనను, పాపాత్ములైనను, దుర్మార్గులై నను, దుర్బలత్వముతో చంచలస్వభావముతో నిండియున్నవారుకూడ మాకు దైవపరి తాపన లేదనిగాని, మేము దైవమును అనుభవించుట లేదనిగాని భయపడవలసిన అవసర మెంతమాత్రములేదు. ఇది యెంతటి సత్యమైన, ధైర్యమైన ఆనంద వార్త. ఈ చిన్న ఆనందవార్తనే అందరి హృదయములలోను నాటుచు, దేశవృద్ధిని, లోకశాంతిని, మానవ కల్యాణమును యీ విశాలవిశ్వములో ప్రతిష్ఠించుటకు కోరుచుంటిని.

ప్రియపాఠకులారా! ఇక పెక్కుమాటలేల?

నీవుదైవములో నుంటివి.
నీలోనే ఆ దైవముండెను.
నీవే ఆ దైవమై యుంటివి.
తత్త్వమసి – అదియే నీవు.
అహంబ్రహ్మాస్మి.
ప్రజ్ఞానం బ్రహ్మ.
అయమాత్మాబ్రహ్మ
లోకా స్సమస్తా స్సుఖినోభవన్తు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి మార్చి 1978)

# ఆనందము

సుఖసంతోషములు యీ ప్రపంచములో చాలా అరుదు,

ఎవ్వరైనను అన్ని విధములగు విమర్శలకు దూరముగా నుండవలెనన్న

**(To be free of criticism of every kind)**

ఏమియు చెప్పవలదు – SAY NOTHING
ఏమియు చేయరాదు – DO NOTHING
ఏమియుగ వుండవలదు – BE NOTHING

నీ గురించి ఎవరైనను చెడుగామాట్లాడిన నీవు సంతోషించుము. ఏలనన అరుదగు సంతోషమును వారికి ఏదోవిధముగ నీవు కల్గించుచుంటివిగనుక, నీనడతయందుగాని, నీ పనులయందుగాని, నీ మాటలయందుగాని చెడునే గాంచుచు, నిన్ను నిందించుచు, ఆనందించుటలో సంతోషమునుపొందిన, నీ జీవితము వలన ఎవరికో ఒకరికి ఏదో ఒక విధమగు ఆనందము కల్గించుచున్నందుకు సంతోషించుము.

ప్రజాసేవ, సంఘసేవ చేయువారి జీవితములు చాల కష్టనిష్ఠూరములతో నిండి యుండును. మద్దెల ఇటునటుకూడ వాయించబడునట్లు వారు మంచివారిచేతను, చెడ్డ వారిచేతను, స్వార్థులచేతను, నిస్వార్థులచేతనుగూడ విమర్శింపబడుచునే యుందురు.

ఆనందము

ఆనందమొక్కటే దుఃఖకరమగు జగతిలోమేల్ బంతి సుమ్ము
ఆనందమొంద నిదియెతగినతావని గుర్తించు టొప్పు
ఆనందమొంద నిదియె తగిన సమయమని గ్రహియించు టొప్పు
ఆనందమొందుట కితరుల ఆనందపరుచు టేకైక మార్గమ్ము సుమ్ము

ఎవ్వరైనను నాగురించి చెడుగా మాట్లాడినను లేక నేను చేసిన పనులను చెడ్డవిగా భావించి నన్ను విమర్శించినను అది నా అదృష్టముగా భావించుచుందును. అది నా గత జన్మసుకృతముగా తలంచుచుందును. నిరంతర పరిణామాన్వితమగు యీ దుఃఖ పూరిత జగతిలో, సుఖసంతోషములే లేనట్టి యీ కాలములో ఏదోఒక విధముగ ఇతరు లకు ఆనందము కలుగుజేయుట ఎంత అదృష్టము?

నన్ను గురించి ఎవ్వరైనను మంచిగాగాని చెడుగాగాని మాట్లాడి ఆనందించిన నేను చాల సంతోషించెదను.

"మనలో ఏది గలదో దానినే వెలుపలగూడకాంతుము" అనునదియే ధర్మచట్టము.

దైవము మానవాళి నంతను సుఖశాంతులతో బ్రోచుగాక, ప్రాక్పశ్చిమములందలి ప్రజావళి అంతయు సుఖమునందుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః (శాంతి మార్చి 1978)

# ఆత్మజ్యోతి

ప్రియమైన ఆత్మస్వరూపా! ఆత్మసోదరా! ఆత్మసోదరీ! నీవెన్నడైనను అనిత్యజ్యోతిని గురించి వినియుంటివా? దానిని ధ్యానించితివా? అద్దాని నెప్పుడైన అనుభవించితివా? ఇప్పుడనుభవించుచుంటివా?

లెమ్ము! నీ నిద్రనుండి మేల్కొనుము. నీ గాఢ నిద్రలో గూడ, అనిత్యజ్యోతి నిరంతరము వెలుంగుచున్నది సుమా!

ప్రశ్న :– ఎన్నడును ఆరిపోవని హెచ్చుతగ్గులులేని ఆ జ్యోతి యెద్ది?

జవాబు :– నీ హృదయమునకు హృదయమై, నీ శ్వాసకుశ్వాసయై, నీ ఆత్మకు ఆత్మయై, అఖండకోటి జ్యోతిస్వరూపముతో సదా నీలో నిరంతరము వెలుంగుచున్నదే–ఆ జ్యోతిస్వరూపము.

ప్రశ్న :– నిరంతరము ప్రకాశించెడి ఆ ఆత్మజ్యోతి ఎచ్చట ఉన్నది?

జవాబు :– ఆ ఆత్మజ్యోతి, నీలోపలనే యున్నది. ఆ జ్యోతియే నీ జన్మహక్కు. అదియే నీవుదానిని అపరోక్షముగా అనుభవించుటకే దుర్లభమైన ఈ మానవ జన్మ నీ కివ్వబడెను. ఆ జ్యోతి ననుభవింపని జన్మలన్నియు భూభారమే!

ప్రశ్న:– మనుజుని జన్మ–జీవితమంతయు చింతలతో, బాధలతో, రోగములతో వర్ణనాతీతమైన అవస్థలతో నిండియుండుటకు కారణమేమి?

జవాబు :– ఆ నిత్యజ్యోతి మరుగైయుండుట మూల కారణము. దీపము లేనిచోట వెలుగెటుల యుండును? సూర్యుడు మరుగైయుండ, ప్రకాశమెటుల గలుగును? అంతయు అంధకారమేగదా!

మనుజుడు తన యమయాతనల నుండి, నరక బాధల నుండి విముక్తుడై ఆనందముగా నుండుటకు వాంఛించినచో, తనలో నిరంతరము ప్రకాశించుచున్న నిత్యమైన ఆత్మజ్యోతిని గుర్తించి దానిని అనుభవించుటే సూక్ష్మమైన, సులభమైన దగ్గఱ మార్గము. ఆ నిత్యజ్యోతి యెచ్చటనో హిమాలయముల యందు, తిరుపతియందు, కైలాసములోను యున్నదనెడి భ్రమను విడువవలెను. నిజమే! కైలాసము మొదలైన, ఏకాంత తావులలో ఆ నిత్యజ్యోతి స్వప్రకాశమానముతో నిరంతరము వెలుంగుచున్నది. భూలోకములో గూడ ఆ జ్యోతి వెలుంగుచున్నది. నరకలోకములోను ఆ జ్యోతి వెలుంగుచున్నది. గాని అది మరుగైయున్నది.

ఏలనన ఆ దివ్యజ్యోతి లేనితావు సూదిమొన మోపుటకైనను లేదు. నరకములో విషయలోలురచే ఆ జ్యోతి పాతాళమునకు త్రొక్కబడి మరుగైయున్నది. ఆ నిత్యజ్యోతి

మహాత్ములయొక్క, స్వాముల, యోగుల యొక్క సొత్తే యనియు, మనకు అందనిదనెడు భ్రమనుగూడ వదలవలెను. ఆ నిత్యజ్యోతి ప్రతిమానవుని, ప్రతి జీవియొక్క జన్మహక్కై యున్నది. అది మీలోను, నాలోను, అందరిలోను నిరంతరము వెలుంగుచున్నది. దానిని గుర్తించిన వారదృష్టవంతులు. వారు ఆత్మానందములో సదా జీవించుచున్నారు. దానిని మరచినవారు, అంధకారములో యమయాతనలను పడుచున్నారు.

జ్యోతిని మరచిన జీవితము శ్లేష్మములో బడిన, ఈగ జీవితము వంటిది. నిత్య జ్యోతిని వదలిన జీవితము పొడినేల మీద వుంచబడిన మత్స్యముయొక్క జీవితము వంటిది. దివ్య జ్యోతిని మరుగుపరచిన జీవితము ప్రాణములేని శరీరము వంటిది అది కేవలము శవజీవితము.

ఆత్మీయులారా! ఇదిగో శ్రీకైలాసము మీకు స్వాగతము ఇచ్చుచున్నది. ఏకాంత ములో నివృత్తిలో, సౌందర్యమైన యీ నిర్జన ప్రదేశములో మీ జన్మ హక్కైన దివ్యజ్యోతి ననుభవించుటకు రండు! ఆకలిచే మలమలమాడుచు బాధపడెడి వానికి, పాకశాస్త్రము మీద ఉపన్యాసములు, ఉపదేశములు తోడ్పడవుగదా! దైవపరితాపనతోయున్న మీకీ వ్యాసములు ఉపన్యాసములు యేల? రండు! రండు! దైవపరితాపన యున్నచోట వెయ్యి మాటలు అవసరము లేదు.

ఆ నిత్యజ్యోతి, ఆ దివ్యజ్యోతి అఖండకోటి సూర్యప్రకాశమానమై, నిరంతరము వెలుంగుచున్న ఆ ఆత్మజ్యోతి ఇదిగో! దానినిప్పుడే, ఇచ్చటనే, అనుభవింతము.

లోకములోగల పుష్పములన్నింటికంటెను, దైవమునకు హృదయకమలమనెడి పుష్పము ప్రీతికరమని మహనీయులు నుడివియుండిరి.

అట్టి అమూల్యమైన హృదయపుష్పమును దైవమునకు అర్పింపజాలక, పామరులు, అమాయకమైన, సుకుమారమైన చిన్నపుష్పము లన్నింటిని, నిర్దాక్షిణ్యముగా చెట్లనుండి కోసి, దైవమునకు అర్పించుటకు ప్రయత్నించుచుందురు.

ప్రపంచములోనున్న పుష్పములన్నిటిని, కోసి తెచ్చి దైవమునకర్పించినను, హృద యమనే పుష్పమును అర్పించనియెడల, ఇసుమంతయు లాభముగాని, పుణ్యముగాని యుండజాలదు.

దైవమునకు హృదయకమలమును అర్పించిన వారిదే పుణ్యమంతయును. హృదయమ కమలమునే దైవమున కర్పించినవారు మరియితర, ఐహిక పుష్పములు అర్పించ నవసరములేదు. అట్టివారు లోకములోనున్న పుష్పములన్నింటితో నిరంతరము దైవపూజ చేయుచున్నట్లే భావించవలెను.

అదియుగాక, అమాయకముగా, జీవకళలు ఉట్టిపడుచు, ఎవ్వరికిని హానిచేయక,

సర్వులకు సువాసన నిచ్చుచు శృంగారముగా పెరుగుచున్న పుష్పములను కోయుటకు మనకేమి హక్కు కలదు? మనలోవలె, మొక్కలలోగూడ ప్రాణము లేదా? అవియు మానవులవలె, పుట్టుచు, పెరుగుచు, గిట్టుచు నున్నవిగదా!

మన చెవులుగాని, ముక్కుగాని, కండ్లుగాని, యెవరైన పెరికినట్లయిన, మనమెంత బాధ పడుదుమో ఆలోచింపుడు. నేజెప్పు భావనలు ప్రవృత్తిపరులకు విపరీతముగా దోచవచ్చును. గాని సున్నితహృదయము, కోమలమైన మనస్సు గలిగినవారికి సర్వములో దైవమును గాంచెడి ప్రేమహృదయులకు నా భావనలు విపరీతముగా తోచుటకు బదులు స్వాభావికముగనే తోచును.

బాలురముగానున్నపుడు, పసితనపు చేష్టలు చేయుదుము. హృదయకమలము వికసించినకొలదియు, సర్వములో దైవమును గాంచెడి అనుభవము కలిగినప్పటి నుండియు, చీమలో, దోమలో, చిన్నపూవులో, చివరకు గడ్డిపరకలోగూడ దైవమహిమ, దైవశక్తి, దైవసాన్నిధ్యమే గానవచ్చును.

ఒకానొకప్పుడు నేను, ఎవ్వరికైన ఇచ్చుటకు, అప్పుడప్పుడు పూవులు కోయుచుండు వాడనని చెప్పుటకు సిగ్గుపడుచున్నాను. ఒక మహానుభావుని జీవితములో జరిగిన చిన్న సంఘటన, సంభాషణ, నేను చదివినప్పటినుండియు, నా హస్తమెన్నడును, వాటిని కోయుటకు, త్రుంచుటకు పుష్పములవైపు వెళ్ళదాయెను. పుష్పముల సౌందర్యము చూచినపుడు ఒక్క చెయ్యియేగాక, ఈసారి రెండు హస్తములును జోడించి, తలవని తలంపుగా, నమస్కరించుటకు ముందుకు వెళ్ళుచుందును.

బెర్నార్డుషా అనునాతడు గొప్ప కవీశ్వరుడు. ఆయనకు పుష్పములయందు చాలా ప్రీతి. ఆయనకు గొప్ప పుష్పతోట కూడ ఉండెడిది. పాశ్చాత్య దేశములలోను, మనదేశములలోనుగూడ కొన్ని ప్రదేశములయందు, కొమ్మలతోనున్న పుష్పములను కోసి "వేసు"లలోను, గాజుసీసాలలోను, నీళ్ళు పోసి, వాటిని అందుంచి శృంగారమునకై వ్రాతబల్లలమీద ఉంచుచు తమ గదులను అలంకరించుకొనుట అలవాటై యున్నది.

బెర్నార్డుషాకు గొప్ప పుష్పవనముండినప్పటికి, వారి గదిలో ఒకకొమ్మ అయినను, ఒక పుష్పమైనను వారి బల్లమీద లేకుండుటజూచి ఆశ్చర్యముతో ఒక సోదరీమణి వారితో నిట్లనెను.

"అయ్యా! కొన్ని అందమైన పుష్పములు గలిగిన కొమ్మలుకోసి మీ బల్లమీద ఉంచినచో, శృంగారముగా నుండునుగదా!" "సోదరీ! ప్రతి చెట్టును దైవముయొక్క ఆకారమే-అదియు మనవలె ఒకజీవమే. ఒక బిడ్డవంటిదే. నీవు నీ బిడ్డల శిరస్సులను త్రుంచి, నీ ఆనందముకొరకు, సీసాలలో నీ బల్లమీద ఉంచెదవా?" అని అడిగెనట.

అప్పటి నుండియు ఈపైన వ్రాయబడిన అనుభవనీయమైన విషయమును చదివినప్పటి నుండియు, ఈ నా హస్తములు, ఏ పుష్పములు కోయుటకును సాహసించుటలేదు. ఇంతియేగాక ఇతరులెవ్వరైనను, నిర్దాక్షిణ్యముగా, పుష్పములను,కొమ్మలను త్రుంచుచుం డుట జూచిన నా మనస్సున కెంతయో బాధగా నుండును. వాల్తేరు ఆశ్రమమునకు నేను వచ్చిన పిమ్మటనుగూడ ఒకనాడు ఉదయమున జాలరిబాలురు చేతికందిన పుష్పములతో నున్న కొమ్మలనన్నింటిని, వారికి ఏ పూజకు అవసరము లేకున్నను కోసివేసి వారి ఇండ్లకు తీసికొనిపోవుచుండుట,కొన్ని పుష్పములను దారిలోనే పారవేయుటజూచి చింతించితిని.

భక్తులైన స్త్రీలుగూడ, పుష్పములలోదైవము ప్రకాశించుచుండుననెడి అనుభవజ్ఞా నము లేక, వాటిని కొమ్మలతో సహితముగాకోసి, వారి తలలో పెట్టుకొనుచుందురు. ఆ కోమలమైన పూవులు హృదయరహితమైన మానవుని హస్తముతగులగానే, వాడిపోవును. ఒక్కొక్క భక్తురాలు, సంచి పట్టుకొని వెళ్ళి వేలానవేల పుష్పములు, నిర్దాక్షిణ్యముగా త్రుంచి వేసి తన సంచి నింపుచుండ, అమాయకమైనయెన్ని శాఖల తలలు ఆ సంచిలో పడు చున్నవోగదా అని నేను బాధపడుచుందును.

హృదయమునకు "జాలి–అంతఃకరణ" అనునవి అంకురించినకొలదియు దైవసన్నిధిని సర్వములో దర్శించుచున్నపుడే నేనిదివరకే వ్రాసినట్లు, మన చెవులకుగాని, కండ్లనుగాని పీకుటకు ఎవ్వరికినీ ఏవిధముగా హక్కులేదో, అటులనే, మనకుకూడ అమాయకమైన పుష్పములను కోయుటకు వాటిని చెట్లనుండి వేరుచేసి, త్రుంచి పారవేయుటకు హక్కులేదు.

అతిగూఢమైన, ఔన్నత్యమైన, ఇట్టి ప్రేమ భావనలు, మను ఆత్మానుభవము కలిగినపుడే, సర్వములోను దైవమును గాంచగలిగినపుడే అనుభవమగుచుండును. ఇంతకూ అమూల్యమైన హృదయకమలములను, దైవమునకు అర్పించనవసరము లేదు. అర్పించుదమన్నను అట్టివారు పువ్వులను త్రుంచి దైవమున కర్పింపజాలరు.

**"మానసభజరే"** అని బ్రహ్మవేత్తలు నుడివియుండిరి. దైవమును మనస్సు చేతనే పూజింపుము. బాహ్యామైనట్టి అన్ని భజనలలోను మానస భజనయే ఉత్కృష్టమైనది. మనస్సు చేతనేదైవమును భజింపుము.

మానసికారాధనయే, ఆరాధనలలోకెల్ల గొప్పపూజ.

మానసపూజయొక్క ఆధిక్యతను బోధించుటకు, భారతములో ఒక చక్కనైన దృష్టాంతముతో కథ రూఢిగా జెప్పబడెను.

అర్జునుడు, తాను ప్రతిదినము తట్టలకొలది పుష్పములను తెప్పించి పూజ

చేయుచుంటిననియు, తలచుచు భీముడు ఏ పూజయుచేయని తిండిపోతనియు, తాను గర్వపడుచుండెడివాడట. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణపరమాత్ముడు అతనికి గర్వభంగము గావించుటకు ఒకనాడు కొండలలోనికి అతనిని తీసికొనివెళ్ళి అచ్చట కొన్ని తట్టతలకొలది వడలిన పుష్పములు పడియుండగా, అవి అర్జునుడు పూజచేసిన పుష్పములే అని చెప్పెనట. కొండల ఎత్తున పడియున్న మానసిక పుష్పములను జూచి, అవి యెవ్వరి పుష్పములని అర్జునుడు అడగగా–ఆ కోట్లకొలది–కొండల యెత్తునపడియున్న మానసిక పుష్పములన్నియు భీమసేనుని మానసికారాధన పుష్పమలని కృష్ణుడు బదులు చెప్పగా–అర్జునుడు తాను పుష్పములతో చేసిన బాహ్య పూజలకు సిగ్గుపడెనట.

పసిబిడ్డలు ప్రారంభ స్థితిలో, ఒకటి, రెండుపూవులు కోసి దైవమును పూజించుట తప్పుకాదు. వారి బాల్యావస్థను బట్టి అట్టిపని పిల్లలభక్తికి తోడ్పడవచ్చును. కాని విజ్ఞులైనవారు కూడ, సర్వము తెలిసియున్నట్లు ప్రసంగించుచు, బాలురవలె క్రూర మనస్సులతో ప్రేమశూన్యమైన, పూజ పేరున, అందమైన చెట్లనన్నిటిని బోడిగా జేయుట హానికరమైనట్టు, పుణ్యమునకు బదులు పాపహేతువనియే చెప్పవలసియుండును.

ఇదివరలో నేనుకూడ అప్పుడప్పుడు పూవులు కోసిన దినములలో పూవులు కోయుటకు నా చేతిని చాచగా, ఆ పుష్పములు నాతో "నీవు నా తల్లి నుండి, అనగా చెట్టు నుండి, నన్ను వేరు చేసెదవా? నన్ను త్రుంచివేసిన ఒక్క నిమిషములో వాడి పోయెదనుగదా! నా తల్లివద్దనే ఉన్నట్లయిన ఎంతో మనోహరముగా నుందునుగదా! నీకు కమ్మని సువాసనను వెదజల్లుదునుగదా! అని జాలిగా ఆ పుష్పము నాతో దీనముతో చెప్పుకొనుచుండునట్లుండ, నేను బిడియముచే, త్రెంపుటకు ముందుకు చాచిన హస్త మును, తక్షణమే వెనుకకు లాగుకొనెడివాడను!

దైవవాక్కును పుష్పములలో,బాలునిలో, నక్షత్రములలో చివరకు సముద్రపు కెరటములలో అన్ని శబ్దములలో వినెడి వారి జీవితములు పావనమైనవి.

సర్వహృదయ నివాసియైన దైవమునకు హృదయ పద్మమునే అర్పించినవారి జీవితములు ఆదర్శనీయమైనవి. అట్టి మహనీయులకు ధన్యవాదములు. అట్టి ఆత్మవేత్తల అడుగుజాడలలో మనముగూడ సదా నడచుచు, సర్వములో దైవమును దర్శించుచు తరించెదముగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# ఆదివరాహము

ఆదివరాహము అనగా నేనిప్పుడు వరాహావతారము గురించి ఆలోచించి వ్రాయుటలేదు.

నేనిప్పుడు తన స్వస్వరూపమును మరచి సంసార సముద్రములో మునిగి వూబిలో దొర్లుచు అహంకార మమకారములతో నిండి యీ సృష్టినంతయు తామే నడిపించు చున్నట్లు జీవించుచున్న ప్రవృత్తి మానవుల దుస్థితిని తలచి, నా భావనలను అందరి వృద్ధిని కోరుచు వ్రాయుచుంటిని.

అందరి వృద్ధిని అన్నప్పుడు నేనుగూడ అందరిలో జేరియే యుంటిని. ప్రతి సంసారమునకు ఒక్కొక్క గృహమునకు ఒక్కొక్క వ్యక్తి ఆదివరాహముగా, మూలవిరాట్టుగా యుండి సంసార నిత్యకృత్యములను జరిపించుచుండును.

ఆశ్రమస్థాపకులైనవారుగూడ, దానికి అధ్యక్షులుగా యుండి ఆశ్రమ కార్యక్రమ ములను అహర్నిశములు జేయుచుందురు. ఆశ్రమ బాధ్యతలు, సంసార తాపత్రయ ములలో మానవులకు జన్మహక్కుయైన, ఆధారమైన, గమ్యస్థానమైన బ్రహ్మసాక్షాత్కార మును, స్వస్వరూపానందమును మరుగుపరచి జీవించుట విచారకరము. పూర్తిగా మాయను మీరుటకు, బ్రహ్మదేవునికైనా శక్యముగాదని చెప్పబడెను.

ఒక ఋషిపుంగవుడు "తాను మాయను జయించితి" నని గర్వించుచుండ శ్రీకృష్ణ భగవానుడు, మాయయొక్క ప్రాబల్యమును, గట్టిదనమును తెలియజేయుటకు ఆ ఋషిని వరాహముగా మార్చెనట. ఆ ఋషివరాహము, మరియొక వరాహమును పెండ్లియాడి, సంసారమును నడుప ప్రారంభించెను. కొన్నాళ్ళకు చిన్నచిన్న వరాహములను సృష్టించెను.

తన స్వరూప (బ్రహ్మస్థితిని) జ్ఞానమునంతయు మట్టిపాలుజేసి మాయయొక్క ప్రభావముచేతను తన నిజస్వరూపమును మరచి, మన ఋషిపుంగవుడు తన భార్య పిల్లలతో, ఊబిలో దొర్లుచు, తన భార్యను పిల్లపందులను జూచియెంతో ఆనందమును పొందుచుండెను. ఇటుల మాయలో జిక్కి, మన ఋషి చాలా సంవత్సరములు, తన వరాహసంతతితో తృప్తిపడుచుండ, దైవము అతని కండ్లను తెరచుటకు వరదలను కల్పించెను. ఆ వరదలలో ఒక్కొక్క పందిపిల్ల కొట్టుకొని పోవుచుండ లబోదిబోయని మన ఋషి పంది విలపించుచుండెను. చివరకు భార్యయైన మిగిలి వుండిన చాలునని, దుఃఖముతో భార్యను కాపాడుకొనుటకు యెంత ప్రయత్నించినా ఆ వరాహముగూడ వరదలో కొట్టుకొని పోవుటచే హృదయవిచ్ఛేదనము గలిగేలాగున బాధపడుచు విలపించుచుండెను.

అప్పుడు భగవానుడు, దయార్ద్రహృదయుడై, ఆ పంది శరీరమునుండి, ఆ ఋషిపుంగవుని విడిపించగా, విముక్తినివ్వగా తన గాఢమైన అజ్ఞానమునకు, దుస్థితికి సిగ్గుపడి మాయను జయించుటకు తనకే గాక బ్రహ్మకుకూడా శక్యముగాదని అనుభవముగా గ్రహించెనట!

ప్రియమైన శాంతి పాఠకులారా! మనమిప్పుడే అమూల్యమైన దృష్టాంతమును,మన జీవితములలో యిముడ్చుకొని, ఇది మనకు ఏయే రీతులుగా తోడ్పడుచున్నదో, ఎవ్వరి జీవితములను వారే పరీక్షించుకొని వరాహ జ్ఞప్తినుండి దైవజ్ఞప్తికి ఆత్మానుభవమునకు మేల్కొనవలెను. నేను ఒక్కొక్కసారి, యీ శాంతి ఆశ్రమములకు ఆదివరాహముగా యున్నట్లు ఆశ్రమవాసులు ఆశ్రమభక్తులు శ్రేయస్సును కోరుచు వీరందరి వృద్ధికై తాపత్రయ పడుచుందును.

విలువైన కాలమును, వ్యర్థమైన మాటలతో గడుపుచున్నవారిని జూచి విచారించుచుందును. అమూల్యమైన కాలమును వ్యర్థముజేయువారిని జూచిన, నాకు జ్వరము వచ్చుచున్నట్లుండును. అన్ని జన్మలలో ఉత్తమమైన, దుర్లభమైన మానవజన్మను పొందియు, తమ గమ్యస్థానము ఆధారమునే మరచి వరాహములవలె, మాయలో జిక్కి జీవించుచున్నవారి దుస్థితిని జూచి నేను బాధపడుచుందును. ఈ మాయ చాలదా అన్నట్లు అహంకార మమకారములతో నిండి, తానే ఈ స్థూలపంజరము అన్నట్లు నిరంతరము ఆత్మస్తుతి పరనిందలతో, జీవించెడివారిని జూచి బాధపడుచు ఇటుల బాధపడుట గూడ మాయయొక్క ప్రభావమేగదా అని నాలో నేను తలంచుచుందును.

పరిపూర్ణములో, ఆత్మస్థితిలో, దివ్యతేజస్సులో అద్వితీయమైన సద్వస్తువులో "ఇతరులు" అనెడిది యెక్కడ వున్నది? అచ్చట సన్నిహితులని, శిష్యులని, అనుచరులని, సేవకులనెడివారు లేరుగదా అంతా కోటిసూర్యప్రకాశవంతమైన తేజస్సేగదా, అందరూ దైవాకారులే కదా!

EVERY MAN IS A GOD PLAYING THE PART OF A FOOL

ప్రతిమానవుడు తెలివితక్కువవాని అజ్ఞానావేశము ధరించి ఆడుచున్న దైవమే, అని కవీశ్వరుడు Emerson జెప్పియుండెను.

THOU ART THAT – తత్త్వమసి

అదియే నీవు, అని వేదములు ఘోషించుచున్నవి. అదియే నీవైయుండి వరాహముగా జీవించనేల? ఇదియే మాయ! ఈ మాయను అతిక్రమించుటకు, జయించుటకు, బ్రహ్మాస్త్రము ఒక్కటే–ఆత్మజ్ఞానమే గలదు. ఆ అపరోక్షానుభవమే, స్వస్వరూపానందమే మన జన్మహక్కు.

ప్రియమైన, ఆత్మసోదరీ సోదర స్వరూపములారా! లెండుమేల్కొనుడు, నేడే మనది రేపు మనదిగాదు. ఈ మట్టి శరీరములను, అంటిపెట్టుకొని, ఇవి శాశ్వతముగా యుండు నని భ్రమపడవలదు. జీవితము అతిచంచలమైనది. తామరాకును అంటియున్న నీటి బిందువంటిదని పెద్దలు జెప్పిరి. వరాహజ్ఞప్తికి స్వస్తి చెప్పుదము. దైవజ్ఞప్తికి మేల్కొనుట కిదియే క్షణము.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన దైవము,మన హృదయమునకు హృదయ ముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా మనలోనే మనకై వేచియుండెను. బాహ్యమున ప్రవృత్తిగా పరుగెత్తుచున్న మనస్సులను ఆంతర్యమునకు లాగి, నివృత్తిగాజేసి, కోటిసూర్యప్రకాశవంతమైన దివ్యతేజస్సునందు ఇప్పుడే, ఇచ్చటనే విలీనము జేయుదముగాక!

"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూన్ 1999)

# ఇసుక మేడలు

ఇందిర, జ్యోతి యేడెనిమిది సంవత్సరముల బాలికలు, నేనెచ్చటకు వెళ్లిన అచ్చటకు నాతో వచ్చుచుందురు. నేను గుహలోనికి ధ్యానము జేయుటకు వెళ్లిన అచ్చటకు వచ్చి, శాంతి ప్రార్ధన చేసి ముమ్మారు ఓంకారమును ఉచ్చరించి గుహనుండి వచ్చి వేయుచుందురు, నూతన భవనములు, బావి మొదలగునవి కట్టుచుండుటచే సాయంసమయమున నేను కొండవారకు తఱుచుగా వెళ్లుచుందును. ఈ బాలికలుగూడ నాతో అప్పుడు షికారుగా వచ్చుచుందురు. అచ్చట కట్టబడుచున్న భవనము, నుయ్యి మొదలైనవి జూచుచు మన బాలికలు అచ్చట నున్న ఇసుకగుట్టలమీద భవనములు కట్టుటకు ప్రారంభింతురు. వారు కట్టెడి భవనములకు మొదట ఇసుకలో వక నూతిని త్రవ్వెదరు. తరువాత నీరు పడినదని చెప్పుకొనుచు చిన్నతోట వేయుటకు ప్రారంభిం చెదరు. ఆ వననిర్మాణమునకు చిన్న చిన్న కొమ్మలు తెచ్చి ఇసుకలో వరుసలు తీర్చి నాటుచుందురు. అప్పుడప్పుడు నేనుగూడ వారికి తోటలు వేయుటలో కొన్ని కొమ్మలను తెచ్చి యిచ్చుచు తోడ్పడుచుందును. నీరు లేక వారు వేసిన మొక్కలు యెండిపోవచున్నవని బాధపడుచుందురు. ఒక్కొక్కసారి వారి మొక్కలు గాలిచే క్రింద పడిపోవుచున్నవని విచారించుచుండ నా శక్తికొలది నేనుగూడ ఆ మొక్కలు పడకుండగ నిలువబెట్టుటలో తోడ్పడుచుందును.

చిరంజీవి జ్ఞానేశ్వరి గూడ వారి ఆటపాటలను జూచి ఆనందించుచు వారిని అహర్నిశములు కంటికి రెప్పపోలికను కాపాడుచు వారిని వృద్ధి జేయుచుందును.

ఇక చీకటిపడుచున్నప్పుడు ఇందిర, జ్యోతులు వారి భవనములు, తోట నిర్మాణములను పూర్తిజేసి "బ్రహ్మానందం, హరేరామ, రఘుపతి రాఘవరాజారామ్" పాడి శాంతి ప్రార్ధనను స్మరించి, ముమ్మారు ప్రణవోచ్ఛారణతో అచ్చటనుండి బయలుదేరి ఆశ్రమము వైపునకు "భజగోవిందం, భజగోవిందం, భజగోవిందం మూఢమతే, హరి నారాయణ, హరినారాయణ" అని అందరును భజన చేయుచు ఆశ్రమమునకు చేరుచుందురు.

ఆశ్రమము చేరగనే వారు శ్రమపడి ఇసుకలో కట్టిన భవనములు, త్రవ్విన నూతులు, వారు వేసిన తోటలు అన్నియు పూర్తిగా మరచిపోయెదరుగదా! ఏ రోజునకు ఆ రోజే వారు వెళ్లినప్పుడెల్లను ఉత్సాహముతో పాత భవనములను, నూతులను మరచి, క్రొత్తవాటిని ఆనందముతో నిర్మించుచుందురు.

ఇందిర, జ్యోతి ఇసుకలో భవనములను కట్టుచున్నట్లే, నేను గూడ నేలమీద, తఱచు భవనములను కట్టించుచు, నూతులను త్రవ్వించుచు, తోటలను వేయించుచుంటిని గదా అని నాలో నేను ఆశ్చర్యపడసాగితిని.

ఆ బాలికల భవనములకును, నేను కల్పించి కట్టుచున్న భవనములకును, ఏమి భేదము గలదు? అవియు నామరూపములు గలిగియున్నవి; నేను కట్టెడివిగూడ నామ రూపములు గలిగియున్నవి. వారు కట్టినవి కొద్ది రోజులే యుండవచ్చును. నేను కట్టించుచున్నవి చాల సంవత్సరము లుండవచ్చును. వారు ఇసుకలో కట్టుచుండిరి. నేను భూమిమీద కట్టించుచుంటిని. వారు కట్టుటకు ఇసుక, రాయి మొదలైన వాటికి ఏమియు లోటు లేదు. నేను యేది సంకల్పించినను ఇసుకకు లోటు లేనట్లే, దైవము నా భవనములకుగూడ ధనలోపము రాకుండ చేయుచుండుట ఆశ్చర్యమును కలిగించెడి సత్య విషయము.

ఆనందముతో స్వార్ధరహితముగా జేయుపనులు సదా ఉత్సాహము నిచ్చును. జయప్రదముగనే ముగియుచుండును. ఆ బాలికలకు ఆ భవనములు నిర్మించుటలో ఉత్సాహము తప్ప స్వార్ధము లేదుగదా!

పనినే ఆటగా జేసికొనెడి వారి జీవితములు ధన్యవంతములు!

ఆ బాలికలయొక్క భవన నిర్మాణములను జూచి నేను గూడ పూర్వము అనేక చోటులలో కొన్ని భవనములను నిర్మించి యీ బాలికలవలె వాటిని మరచిపోతినిగదా అని నాలో నేను ఆనందించసాగితిని.

మన శరీరమే ఒక భవనము. మన శరీరమే మనది గానప్పుడు అది అనిత్యము. అశాశ్వతమమై యుండ ఇక ఇసుకలోను, భూమి మీదను కట్టిన భవనములు శాశ్వతములా!

ఇందిర, జ్యోతి రోజూ ఇసుకలో కట్టడములు కట్టుచుండ, నా అంతరాత్మ,

"నీవు గూడ వారివలె-పసిపిల్లల వలె-భూమిమీద కట్టడములు కట్టుచుంటివి. వారి ఆట పూర్తిజేసి ఆశ్రమమునకు వెళ్లుచున్నారు. నీ ఆట యెంతలో పూర్తి జేసి దైవము దగ్గరకు వెళ్లెద"వని ప్రశ్నించుచున్నటుల నాకుతోచుచుండును.

నేర్చుకొనవలె ననెడి జిజ్ఞాస యున్నవారందరికి ప్రతి చిన్న విషయము నుండియు ఏదో ఒక గుణపాఠము నేర్చుకొనవచ్చును. చిన్న బాలబాలికలను గూడ మన గురువులుగా జేసుకొని, వారినుండి అమాయకత్వము,పవిత్రత, ప్రేమ, విరాగము మొదలగునవెన్నియో దివ్యగుణములను నేర్చుకొనవచ్చును. పసిబిడ్డల కుండు పవిత్రతతో కూడిన అమాయకత్వమును గలిగిన వారిదే స్వర్గము" అని క్రీస్తు ప్రభువు నుడివియుండెను. అంతియెగాక పవిత్రవంతులగు పసిబిడ్డలదే స్వర్గరాజ్యమని గూడ నుడివియుండెను. మరియు, కండ్లుండియు చూడరేల? చెవులుండియు వినరేల? అనియు ఆ మహనీయుడు జెప్పియుండెను.

బాలబాలికలలోనేగాక, పిపీలికాది బ్రహ్మపర్యంతము లోకమంతటిలో దైవ వ్యాపకత్వమునే గుర్తించుటకు మన నేత్రములను వాడుదుముగాక! మన కర్ణములను దైవనామామృతమును వినుటకే వాడెదముగాక! మన మనస్సులను దైవము గురించి చింతించుచు ధ్యానించుచు, దైవతేజస్సులో లీనమై అమనస్కుల మగుటకే వినియోగించెదముగాక! మన హృదయములు దైవానుభవములో, దైవహృదయములో లీనమగుగాక! మన శ్వాస, విశ్వ శ్వాసలో ఐక్యమై నిరంతరము **'సోऽహం'** భావనతో తేజరిల్లుగాక!

ఇసుకలోను, భూమిమీదను,ఆకాశమునందును, మనస్సులలోను, విశాల ప్రపంచములోను నిరంతరము కట్టబడుచున్న భవనము లన్నింటికి సృష్టికర్తయు, మూలాధారుడునై సర్వాంతర్యామిగా వెలుంగుచున్న దేహధారికి-ఆత్మస్వరూపునికి ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు, హరిః ఓం తత్సత్ ।

**అర్పణ**

ఈ చిన్న వ్యాసము వ్రాయుటకు కారకులైన చి॥ ఇందిర, జ్యోతులకు ఆయురారోగ్య ములను, శాంతిమయ జీవితములను వాంఛించుచు, దీనిని వారికి ప్రేమపూర్వకముగా అర్పింతము

సర్వేజనా స్సుఖినో భవంతు, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః॥

(శాంతి ఫిబ్రవరి 1955)

# ఇదియును వెళ్ళిపోవునదే

ఒకానొకప్పుడు ధనికుడొకడుండెను అతడు విశేష ధనవంతుడు. పూర్వజన్మ సుకృతం వల్లను అతడొనరించిన సత్కర్మల ఫలితం వల్లను అతనికి భగవంతుని దివ్యమగు భక్తి ప్రసాదింపబడెను. ఉపదేశమిచ్చిన సద్గురువుకూడ లభించెను. కాని ఐహికమైన పదార్థములయందే అభిలాష లగ్నమయి ఇంద్రియ లోలుడై తనయొక్క మర్యాదను ఆరోగ్యమును గోల్పోయెను. అత్యధికముగా కోట్లాది ధనమున్నను, తినుటకు, శక్తిలేని వాడాయెను. ఐశ్వర్యము నశించినచో నష్టము రాదు, ఆరోగ్యము చెడినచో, కొంత నష్టము శీలము నశించినచో అంతయు నశించినట్లే అను వాక్యములెంత యదార్థములు! అటులనే ఈ ధనికునకు ఆరోగ్యము, సత్ప్రవర్తనయు కూడ చెడెను. డాంబిక జీవనము నీచ ప్రవర్తన దుర్వ్యసనమువల్ల ఆరోగ్యము ధ్వంసమై జఠరాగ్ని పూర్తిగా చెడిపోయెను.

కొన్నిరోజులపాటు, తినుటకే అన్న హితవు లేదు. క్రమేణ శుష్కించిపోయి నిద్రాహారములు అనునవి లేక నిస్సహాయుడై దుర్బలుడాయెను. అతనికి అప్పట్లో గురువు స్మరణకు వచ్చి ఈ దుర్భమయిన బాధనుండి తప్పించుమని వేడుచూ గురువుగారికొక లేఖ వ్రాసెను. గురువుగారు దీర్ఘముగా యోచించి, ప్రతి నిత్యము పఠించుమని, యెదుట గోడమీద వ్రాసి పఠింపుమని దివ్యమంత్రము నొకదానిని కాగితముమీద వ్రాసియిచ్చి తొందరగా, తన శిష్యునకు పంపెను. ఆ కాగితము విప్పి చదువుకొనగా అందలి పదములను "ఇదియును నశించునదియే" యని.

అనారోగ్యము, దౌర్బల్యము, దేహమందలి అమిత వ్యాకులత ఇవన్నియు క్షణభంగురములే; త్వరలో నశించునవియే గాలిచే నెగరకొట్టబడిన మేఘములవలె ఎంత ప్రోత్సాహకరము ఎంత అద్భుతము! నాకు ఈ స్థితిలో కాలు చెయ్యి సిమెంటు పట్టీలతోను (Plaster) కట్లతోను బంధింపబడియు, వ్యాకులత జెందక, చిరునవ్వుతో ఆ వాక్యములనే "ఇదియును మాయమగునదియే" అని తరుచు స్మరింతును.

ఈ దేహముపై నున్న కట్లు (Bandages) అన్నియు నా దేహము మీద శాశ్వతముగా నుండునవి యాపై కట్లేకాదు. దేహము మాట యేమిటి? అదిమాత్రం శాశ్వతమా! దేహమే అంతరించునన్నచో అందుపైని Bandages సంగతి చెప్పనేల? నామము రూపము గల ప్రతి వస్తువు నశించునదియే, Bandages పోవును. దేహము ననుసరించి రుగ్మతలు నశించును. ఐహికమైన ఎట్టి బాధలు, దురవస్థలు అన్నియు నశించునవియే, నిత్యము మన స్వంత వస్తువని శ్రద్ధగా గాపాడి పోషించు, శరీరముకూడ క్షరమే నశించునదియే. ఇక నశించలేనిదేది! లోనున్న స్వయంభువైన, నిష్క్రమణలేని

తేజస్సే. నిత్యమును, అనంతము అగు ఆ తేజ మొకటియే.

ఆ వాక్యములు "ఇదియూ వెళ్ళిపోవునదే" అనునవి స్మరించుచూ ఆనందము పొందువాడను.

ప్రేమాస్పదులగు నో చదువురులారా! ఏ విషయము తెలిసినట్లయితే సర్వము తెలిసినట్లగునో, అన్నియు నశించిపోయినను, మానవ జాతికి బ్రహ్మాండమయిన జ్యోతివలె నిలచునదెద్దియో? అదియే ఆనందము. శాశ్వతము, సర్వవ్యాప్తమగుతేజస్సు, అది సర్వ మును తనలో నిలుపుకొనును. దేనిని విడిచిపెట్టదు. అది నీ జన్మహక్కు **"తత్త్వమసి"** ఆ తేజమే నీవు. **"ఆత్మ"** యనునది దక్క మిగిలినదంతయు క్షరమే.

శాంతి ఆశ్రమములో ఒకచోట ఉత్తేజవంతమగు నీ వ్యాకములు ఉల్లేఖింప బడినవి. "జీవితము వట్టి పొగ గాదు అగ్నిహోత్రమే".

మీ జీవితము పొగతో సదృశమా? లేక నిప్పేనా? చదువరులారా నీ జన్మహక్కు వట్టి ధూమముగాదు. అగ్నిజ్వాలయే. అందువల్లనే, వెంటనే అదృశ్యమగును అందరిని కనుగప్పెడి పొగవలెగాక, ప్రతాపవంతమగు అంతయును లయము చేయగల సర్వభక్షకు నిగా చేయుము. జీవితము అగ్నిహోత్రముగాని, వట్టి ధూమముగాదు. దానిని స్థిరీకరిం పుము (అదియే శాంతికొఱకు, ప్రపంచ శాంతికొరకు) ఇక్కడనే ఇప్పుడే, ఉద్దీపింపుము, పొగ గాలివలన ఎగరగొట్టబడును. అనంతకోటి సూర్యులవలె ప్రజ్వరిల్లు స్వయంప్రకాశ మగు ఆ జ్యోతి మాత్రము చనునదిగాదు.

నా Plaster తో కట్టిన కట్లునూ పోవునవియే. తాత్కాలికమగు అనారోగ్యము, నిద్రలేమి, ఇదియూ అంతరించునవియే. కాని **"సోఽహం బ్రహ్మ"** యను సర్వవ్యాప్తమగు తేజస్సు మాత్రము అంతరించునదిగాదు. ఎప్పుడున్ను వృద్ధిగాని, తగ్గుగాని, క్షయములేని ఆ ఏకపదార్థము వినాశము నొందినపుడును, జీవనమునందును నాశనము, ఉత్పత్తిలేని, వృద్ధిక్షయములేని ఆ తేజోమయ లోకమున సంచరించుట నాయభిమతము అచ్చటనే మహాజ్యోతి సర్వాంతర్యామి, సర్వశక్తి గలిగిన, సర్వవ్యాప్తమగుజ్యోతి! అందే మన మనస్సును దృఢీకరించుము. బుద్బుదప్రాయములగు కష్టనిష్టురములు నశించి శాంతి, సౌహార్ధము, ప్రేమ ఆయన బిడ్డలమగు అందరి హృదయములయందును నెలకొల్పును.

ఇదియే నా ప్రార్థన. **ఏకమేవాద్వితీయం బ్రహ్మ.** అనుటకు మీ యందరిని నాలోను, అందరిలోను నేనును యున్నటులనే అద్వితీయమగు ఆ సత్యము, జ్యోతి వెలుంగు చుండును గాక!

(శాంతి డిశంబరు 1965)

# ఇతరమార్గమేదియు లేదు

మీరు ఈ ప్రపంచమునగల సమస్త శాస్త్రములను, వేదములను, బైబిల్ మొదలగు వాటినన్నింటిని చదివి యుండవచ్చు. ప్రాక్పశ్చిమమునగల ఋషుల, మౌనుల, మహా ప్రవక్తల ఉపదేశము లన్నింటిని విని యుండవచ్చును. ప్రపంచమున గల ఆధ్యాత్మిక సాధనలన్నింటిని అభ్యసించి యుండ వచ్చును. కాని ఎంతవరకు మీ పవిత్ర హృదయ ములో దైవనామమును స్మరింపరో, ఎంతవరకు మీ ప్రత్యణువు దైవనామముచే సంతృప్తి కాదో, అంతవరకు మీ కేమియి సహాయకారి కాజాలదు.

అవిరళమగు దైవనామస్మరణ కష్టములు, దుఃఖములు అను మేఘము లన్నింటిని పటాపంచలు గావించును. ఈ కలియుగమున, యాంత్రిక యుగము దైవనామస్మరణ ఒక్కటియే స్వేచ్ఛను, శాంతిని కలిగించును.

ఆ విధముగ మీరు నఖశిఖపర్యంతము దైవనామముచే నిండవలయును. ఆ విధమగు దైవానుభూతి అవిరళముగ పొందుటయే వాస్తవమగు మేలు చేకూర్చునది. మీ ప్రత్యణువు నందును ఆ అనంతుని యొక్క దివ్య చైతన్యమును గుర్తించుటకు సూటియైన, సరళమైన, సులభమైన మార్గము కాక మరెద్దియులేదు.

ఈ సాధన ఇప్పుడు, అప్పుడు, ఎప్పుడో ప్రార్థన ధ్యానాదులయందే చేయవలసినది కాదు. మీ జీవితకాల పర్యంతము ప్రతి హృదయ స్పందనమునందును ప్రతిశ్వాస యందును "అజప" సంస్మరణగా మారువరకును గావింపవలెను. అది రామనామమే కానిండు, సోహం భావనయే కానిండు, 'ఓం' కారోచ్ఛారణయే కానిండు లేక "శ్రీరామ జైరామ జైజైరామ ఓం" అనెడి మహా మంత్రమేకానిండు ఏదైనను ఆచరణ ముఖ్యా వశ్యకము.

ఈ సాధనను యీ క్షణము నుండియే ఆరంభించుడు. మీ ప్రతి శ్వాసతోడను దైవనామ సంస్మరణ గావించుడు. మీ శరీరమునందలి రోమరోమమును దైవనామామృత ముచే నింపివేయుడు. తైల ధారవలె, అవిచ్ఛిన్నముగ దైవనామము మీ నుండి ప్రసరించు గాక! ఇవియే శ్రవణ, మనన, నిధి ధ్యాస (వినుట, ఆలోచించుట,ధ్యానించుట)ల యొక్క సారమైయున్నది. నిశ్శబ్దముగ యీ విధముగ గావించు సాధనయే అమూల్యమగు మానవజన్మయొక్క గమ్యము, ధ్యేయమైయున్నది.

మనమందరము ఆ దైవముయొక్క సర్వజ్ఞత్వమునందును సర్వ వ్యాపకత్వము నందును, సర్వశక్తిత్వము నందును యుంటిమి.

మనమందరము తేజస్సులో నుంటిమి.

మనలోనే తేజస్సు కలదు.

మనమే తేజస్సై యుంటిమి.

ఓం తత్సత్ ఓం !

చిన్న ఏమరుపాటుకూడ అధిక నష్టమును కలిగించును.

ఆధ్యాత్మిక జీవితమున చిన్నచిన్న పొరపాటులు, ఏమరుపాటులుకూడ అధిక నష్టము కలిగించును.

దైవమును లేక ధర్మమును జీవితమున ఒక్క క్షణమైననుమరచుటయే మృత్యువు.

ఒకానోక కాలమున ఒక భక్తుడు అనేకవేల సంవత్సరములు స్వర్గద్వారములకడ ప్రార్ధనలు సల్పుచు తలుపులు తెరువబడినప్పుడు లోనికి వెళ్ళుటకై నిరీక్షించెనట. అతడు అలసి, విసిగి చిన్న కునుకు తీసెను. ఆ సమయముననే ఆ ద్వారములు తెరువబడి తిరిగి మూసివేయబడెను. అతడచ్చటనే యుండిపోయెను. అదియెంతటి విచారకరము? క్షణ మాత్రము ఏమరుపాటుకూడ అనర్ధములకు దారితీయునుకదా!

సత్యపథము సంకుచితము కష్టభూయిష్టము. ఆధ్యాత్మిక జీవితమనగా వాడికత్తిమీద నడచుటవంటిది.

ప్రశ్న : మృత్యు ప్రాయమైన దుఃఖముల నుండి కష్టముల నుండి తప్పించు కొనుటకు మనమేమి చేయవలయును?

జవాబు : జ్ఞానపూరితమగు యీ మాటలు జ్ఞప్తియందుంచుకొనుము.

దైవమును మరచుట యనగా సత్యమును, ధర్మమును మరచుటయే మృత్యువు. సత్యవ్రతులమై మన జీవితమున అనుక్షణము దైవమును స్మరించుచు జీవించుట అలవరచుకొందుము గాక! మనోవాక్కర్మలచే ఆ దైవ సాన్నిధ్యము ననుభవింతుముగాక!

ఎంతటి తిమిరాంధకారమునైనను తేజస్సు మటుమాయము చేయునట్లు తరతరముల పాపములనుకూడ దైవనామ సంస్మరణ హరింపజేయును.

కలలోనైనను "అహం" కారమనెడి సర్పమునోట చిక్కకుందుముగాక! మన ప్రతి శ్వాస దైవము వైపునకు, "సోహం" ధ్యానము వైపునకు మనలను నడుపుగాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

ఓం తత్సత్ ఓం !

(శాంతి జూన్ & జులై 1974)

# ఈ శరీరమును వదలిన తర్వాత

## (AFTER LEAVING THIS BODY)

ఇది ఏమి విచిత్రమైన శీర్షికయని ప్రప్రథముననే పాఠకులు తలచవచ్చును. గాని ఈ మనస్సు దేనిని గురించి ఆలోచించుచుండునో దానిని గురించి వ్రాయుట పరి పాటైయున్నది. మనలో లేనిది, మనకు తెలియనిది, మనము ఆలోచింపజాలనిది మనమెటుల వ్రాయగలము?

కొందరు ఈ ప్రపంచ మంతయు వారితోనే యున్నట్లు, యీ సృష్టినంతయు వారే నడపుచున్నట్లు, దైవ ధ్యానమైనను జేయుటకు సావకాశము లేకుండగ, అహర్ని శములు, అశాంతితో, తాపత్రయముతో, విలువైన జీవితమును వ్యర్థబుచ్చుచు ఆశాపాశ ములకు బానిసలై గడుపుచుండుట విచారకరము. అట్టి అశాంతితో నిండియున్న ప్రవృత్తి జీవితములెన్నియో లెక్కకు మీరి యున్నవిగదా!

ఈ విశ్వమంతకు దైవమే సృష్టి, స్థితి, లయ కారకుడైయుండ, ఒక్క మానవ మాత్రుడు, ప్రపంచమున జన్మించినను, వీడినను ఒక్కటియే! ఈ క్రింది పద్యములు ముఖ్యముగా, ప్రవృత్తి పరులకు, జీవితముయొక్క ముఖ్యోద్దేశమును మరచినవారికి వర్తించుచున్నవి.

మనుజుండై పశువౌటకంటెఁ
బశుజన్మంబెచ్చు నీవెట్లు దా
నిని బుట్టించితి వట్లు చేయునది
హా! నిర్భాగ్యతఁ జానమె
ల్లను వ్యత్యస్తముఁజేసి నీ విధుల
నుల్లంఘించెదన్ నేను దం
డన కర్హుండను బ్రోవవే
నను దయఁ సద్భక్త చింతామణి.

గీ॥ చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు, సత్యంబులోనుగా దలపడేని,
గలుగనేటికి తల్లుల కడుపుచేటు.

మనుజుడు ప్రవృత్తిపరుడై, ప్రపంచమంతయు తనవల్లనే యుద్ధరింపబడుచున్నది; తనతోనే యున్నదుకొనుట, వెఱ్ఱిభ్రమ, ఒకటి రెండు ఈగలు, దోమలు చనిపోయినంత

మాత్రమున సృష్టికి లోటు ఉండునా! ప్రతి క్షణములో నెంతమంది, యెన్ని జీవరాసులు పుట్టుటలేదు. గిట్టుట లేదు? పుట్టువారు పుట్టుచున్నను, గిట్టువారు గిట్టుచున్నను, మహానదీ ప్రవాహమువలె సృష్టి, స్థితి, లయములు నిరంతరము హెచ్చుతగ్గులు లేకుండగా ప్రవహించుచునే యుండును.

ఈ ప్రవాహములో బడి కొట్టుకొని పోకుండగా, నేదో యెకదరిని జేరి, గట్టునెక్కగలిగినవారి జీవితములు ధన్యవంతములు.

ప్రశ్న : ఈ శరీరము పోయిన తర్వాత ప్రపంచ స్థితి యెటల నుండును?

జవాబు : శరీరమున్నప్పు డెటులనున్నదో, పోయినను అటులనే యుండును. ఒక్కటి రెండు శరీరములు పోయెను గదాయని, ప్రపంచ స్థితి మారదు.

స్వార్ధరహితులు, నివృత్తిపరులు, బ్రహ్మవిదులు, పరోపకార పరాయణులు శరీరములు విడిచినప్పుడు, లోకులు విచారపడెదరు. స్వార్ధపరులు, లోక కంటకులు, దుర్మార్గులు నశించిన, అందరును ఆనందించెదరు.

ఒక్కొక్కరు పోయినప్పుడు, అందరూ ఆనందించెదరనిగాని, విచారించెదరనిగాని జెప్పుటకు వీలులేదు. **"యద్భావం, తద్భవతి"** యన్నట్లు, వారివారి మనస్సును బట్టి మనః పరిపక్వము ననుసరించియే, ముక్తపురుషులను, బద్దులనుగూడ లోకము విమర్శించుచుండును.

దేశపితయైన హిందూ జననికి ప్రియపుత్రుడైన లోకోత్తర మహాపురుషుండైన యీ యుగమునకు అవతారమూర్తిగా బరిగియున్న శ్రీ గాంధ మహాత్ముని శరీరము పోయినప్పుడు కోటానుకోట్లు జనులు దుఃఖించి, విచార సముద్రములో మునిగియుండ, ప్రజోపకారిగా తలపడుచున్న యొకవ్యక్తి "పీడయే వదిలిపోయెను" అనెడి బాధాకరమైన, కౄరమైన మాటలను, అల్పబుద్ధితో, ఆ పితామహుని మరణవార్త వినగానే పలికెనని, విని చాలా విచారించితిని.

అట్టి అవతారమూర్తుల శరీరములు పోయినప్పుడే కౄరమైన ఖండనలు, విమర్శనలు, జేయుచుండ నిక సామాన్యుల శరీరములు పోయినప్పుడెట్టి విమర్శనలు వచ్చునో వేరుగా వ్రాయనవసరములేదు.

మంచివారు మంచినే జూచుచు, చనిపోయినవారిని గురించి, వారెవ్వరైనను మంచిగానే తలచెదరు. ఇక తామసులు, వారిలోనున్న తామస గుణమునే, ఇతరులలో గూడ గాంచుచు, చనిపోయినను, బ్రతికియున్నను, అమాయకులను విమర్శించుచు, నిందించుచునే యుందురు.

కాని ముఖ్యముగా మనమిప్పుడు గ్రహించవలసినది, యీ విమర్శనలు,

మంచివైనను, చెడ్డవైనను, చనిపోయినవారిని అంటజాలవు చనిపోయినవారిని అంటజాలనప్పుడు బ్రతికియున్నవారిని మాత్రము అంటగలవా? దానిని విమర్శింతము.

స్వార్థరహితమైన జీవితమును గడుపుచు శరీరమునకు విలక్షణముగా నున్నవారిని, ఏ విమర్శనలుగూడ తాకజాలవు.

కొన్ని కుళ్ళిన పండ్లను, మనకెవ్వరైన తెచ్చి యిచ్చిన, "నాయనా ఇవి మాకు అవసరములేదు నీవే తీసుకొనుము." అని మనము వాటిని తీసికొనుటకు నిరాకరించిన అవి తెచ్చినవారే తీసికొనివెళ్ళి తినవలసియుండును.

అటులనే ఎన్ని విమర్శనలు వచ్చినను, అవి మంచివైనను, చెడ్డవైనను, మన దగ్గరకే రానీయకుండగ, విలక్షణముగా నున్నచో, ఏ విమర్శలును మనలను తాకజాలవు.

ఈ ఆరు అడుగుల పొడవుగల, నశించెడి, సదా మార్పులతో నిండిన మట్టి శరీరమునకు అంటిపెట్టుకొని, జీవించుటకంటె, అశరీరిగా నుండుటే ఆనందకరమేమో! అన్న విషయమును మనము ఆలోచించి తెలుసుకొనవలసి యున్నది.

మొన్ననొక యుత్తరములో, జర్మనీలో శాంతి ఆశ్రమ శాఖను స్థాపించి జర్మనీ బాషలో "పీసు" పత్రికకు సంపాదకులుగా నున్న ఆత్మానంద సోదరుడు నాకీ క్రింది విధమున వ్రాసెను.

ప్రియమైన స్వామీజీ,

నాకీ శరీరమును, ప్రపంచమును త్వరలో విడువలెనని కోరుచుంటిని. ఏలనన, యీ శరీరమునకు అతీతముగానున్న, యీ ప్రపంచముకంటె ఆనందకరమైన ప్రపంచ ములో జీవించుటకు నా మనస్సు కోరుచున్నది. కాని, "పీసు" సంపాదకత్వముచే నేను బంధింపబడి యుంటిని.

అప్పుడు నేను యీ క్రింది రీతిగా పీసు పత్రిక సంపాదకులైన శ్రీ ఆత్మానందులకు (జర్మనీ సోదరునకు) జవాబు వ్రాస్తిని.

ప్రియమైన సోదరా,

మీరు అశరీరిగా సుఖదుఃఖములతో, నిందా స్తుతులతో, శీతోష్ణములతో అనేకమైన ద్వంద్వగుణములతో నిండియున్న ఈ ప్రపంచమును వీడి, శరీరమును వదలి, ఆత్మప్రపంచములో జీవించుటకు కోరుచుండుట ఆనందమేగాని, మన మనస్సే; యీ ప్రపంచమును దుఃఖకరముగానో, ఆనందకరముగానో, శాంతిగానో జేయుచున్నది. అహంభావముతో నిండియున్న వారికి సృష్టి అంతయు, భేదభావనతో, అహంకార మయముగానే గానవచ్చును.

ఆత్మ భావనతో నిండియున్నవారికి కోటిసూర్య ప్రకాశవంతమైన దివ్యతేజస్సును

నిరంతరము, ధ్యానించుచున్నవారికి; యీ ప్రపంచమే భగవంతుని లీలగా, సర్వము దైవ చిహ్నముగా గనిపించుచు బ్రహ్మానందము నిచ్చుటనే గలిగించును.

మనలో ఏమియున్న, దానినే బైటప్రపంచములో గాంచెదము, మనలో నిరంతరము ఆత్మజ్యోతి వెలుగుచున్న ఆ ఆత్మయే ప్రపంచమంతలో వెలుంగుచుండుట గానవచ్చును.

మీ నామమే ఆత్మానందులు గాన మీ స్వస్వరూపమునే, ఆంతర్యమున అనుభవించుచు, బాహ్యప్రపంచమునగూడ దర్శించుచు నిరంతరము ఆత్మానందమును గ్రోలుచుందురుగాక! అని జవాబు వ్రాయబడెను.

ప్రియమైన పాఠకులార! సముద్రములో కెరటమును గాంచుచు విమర్శించుడు, కెరటము సముద్రము నుండియే వచ్చి, సముద్రమునందే యుండి, మరల అందే లీనమగుచున్నది. అది పైకిలేచినప్పుడు క్రిందకు వెళ్ళెడి సమయమందును గూడ అది జలమే.

లోపలనున్నదే, బైటనున్నది, ఒక పాత్రలోనున్న ఆకాశమే, ఆ పాత్రకు బైటను చుట్టునున్నది. ఘటాకాశమే మహాకాశమని బ్రహ్మవిదులు నుడివియుండిరి.

అష్టావక్ర మునీంద్రుడు :-

గీ॥ కల్పపర్యంత ముండుగాక
దేహమిప్పుడే పోవుగాక
ఇందేమి హాని, వృద్ధి నాశములు లేని
చిన్మాత్ర రూపుడనునేను.

అని నుడివియుండిరి.

వృద్ధి నాశములులేని ఆ చిన్మాత్రావస్థయే మానవుని జన్మహక్కు. ఆ చిన్మయత్వమును అనుభవించెడి వారికి శరీరములో నున్నను శరీరమునకు వెలుపలనున్నను ఒక్కటియే! అట్టి మహనీయులకు శరీరమే లేదు. వారే అశరీరులు, జీవన్ముక్తులు.

ఏ విధమైన స్వార్థముగాని, మరియొక గుణముగాని, శరీరముండగా నున్నదో, అదే శరీరము పోయినను, వెంబడించును. అటులనే శరీరముండగా తామనుభవించెడి స్వార్థరహితమైన ప్రేమ జీవితము, విశ్వశాంతికి శరీరము పోయినను, ఆధారమై యుండును.

చిన్నతనమునందు ప్రతి గ్రామమునందును, పట్టణమునందును ఒక్కొక్క శాంతి ఆశ్రమమును నెలకొల్పవలయుననియు గురుకులములు స్థాపించవలెననియు విశ్వమత నిశ్శబ్ద శాంతి దేవాలయమును కట్టించవలెననియు ఆసుపత్రులను నిర్మించవలెననియు

బ్రహ్మాండమైన పనులు జేయించవలెననియు నెన్నియో గాలిలో మేడలను నిర్మించు చుండెడివాడను.

ఈశ్వరాజ్ఞ లేనిదే చిన్న గడ్డిపరక యైనను కదల్పజాలము గాన, ఆ సంకల్పము లన్నింటిని విడచి స్వేచ్ఛగా శరీరమునకు విలక్షణముగా నుండెడి రోజులు దైవము ప్రసాదించి నందులకు కృతజ్ఞుండను.

గీ॥ దేహి దేహము విడదీసి దేహియైన
చిత్తునందున విశ్రాంతి చెందుదేని
క్షణములోపల శాంతి సౌఖ్యముల నంది
అఖిలబంధ విముక్తుడ వగుదువీవు.

అని ఈ రోజులలో ఆనందముగా స్మరించుచుంటిని.

ఎటులనైన సామాన్యముగా, ప్రపంచములో శరీరమున్నప్పుడు కంటె శరీరములు వదలినవారినే, ప్రపంచము అంత కఠినముగా గాక, కొంచెము మృదువుగా ప్రేమతో విమర్శించుట జూచుచుంటిమి. అందుచేతనే చనిపోయినవారికి, చేరడేసి కండ్లుండి యున్నవన్న సామెత మనమెరింగియున్నదే.

ఇప్పుడు ఆశ్రమము పేరున దైవపనికి తోడ్పడమని, దాన ధర్మములు చేయమని ఏదోయొక పనిని కల్పించి మాకు శ్రమ గల్పించుచున్నారని, తలంచెడివారుగూడ యీ శరీరమును వదలిన తర్వాతను ఆహా ఆయన కాలముయొక్క విలువను గ్రహించినవారు ఒక్క క్షణమైనను కాలమును వారు వ్యర్థబుచ్చకుండుటేగాక; మాయందరిచేతను సదా ఏదోయొక విధమైన సేవను జేయించుచు, మా కాలమును మా తను మనోధనములను సద్వినియోగము చేయించుచుండెడివారు. అవి భవిష్యత్తులో వారే జెప్పుదురు.

బ్రతికియుండగా, యే దానధర్మములు చెయ్యనివారుగూడ వ్యక్తులు చనిపోవగనే, అనేకమైన స్మారకవిధులు, చనిపోయినవారి పేర నేర్పర్చుట మనము జూచుచునే యుంటిమి.

నేను వ్రాయునది విచిత్రముగా తోచినను నొక్కసారి నా వెఱ్ఱి మనస్సిట్లు తలపోయు చుండును.

“నీవు చనిపోయిన తర్వాత, అనగా నీ శరీరమును హఠాత్తుగా విడిచినయెడల, స్మారక చిహ్నము నెటుల యుండుటకు కోరుచుంటివి?” అని ప్రశ్నించుచు, నీ క్రింది సమాధానము నా మనస్సునకు నేను జెప్పుకొనుచు, తృప్తి జెందుచుందును.

ఈ జీవితములో నాకు సన్నిహితమైనది, నా ఆత్మవృద్ధికి తోడ్పడినది శాంతి

ప్రార్ధనయే గాన, ఓంకారస్వామి స్మారక చిహ్నముగా నీ చిన్న శాంతి ప్రార్ధనను, అన్ని భాషలలోను, తర్జుమాజేసి అన్ని దేశములలో నీ ప్రార్ధనను భక్తకోటియంతయు స్మరించుచు తరించుటే నా స్మారక చిహ్నము.

భక్త కోటికి, లోకశాంతికి తోడ్పడెడిది, మరొక్కటి నేను కోరుచుంటిని. అది యెద్దియనగా; నీ శాంతి ప్రార్ధననే, ఏకాహముగా జేసికొని గంటలకొలది, భక్తుల భక్తి శ్రద్ధలను, పట్టుదలను బట్టి నిరంతరము స్మరించుచున్న మనశ్శాంతి తప్పక కలుగును.

లోకములో అనేకమైన ప్రార్ధన లున్నవిగాని, యీ శాంతి ప్రార్ధనలోనున్న రహస్యము, మహాత్యము ఏమనగా, దీనిని హృదయపూర్వకముగా స్మరించినంత మాత్రముననే–కాదు కాదు–స్మరించుచుండగనే, దైవసన్నిధిని అనుభవించుటకు తోడ్పడును.

ఆశ్రమాభిమానియైన ఒక భక్తుడు, చిరకాలము క్రిందను ఆశ్రమంలో కొంత కాలము కుటుంబ సహితముగా, ఆశ్రమ సేవజేసి యుండెను. తర్వాతను కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేసెను. నన్ను ఆయన ఒక రోజున యీ రీతిగా కోరెను.

"స్వామీజీ! మీరు దయార్ధ్రహృదయులు, అవస్తలోయున్న బాలికకు శల్యదానమిచ్చితిరి. నేను అంధత్వముచే బాధపడుచుంటిని, నాకు నేత్రదానమిచ్చి నా జీవితమును కాపాడుడు."

నేను :– "నాయనా! నా మనస్సు సదా అందరుకును తోడ్పడుకే కోరుచుండును. నేను ప్రస్తుతము జేయుచున్న ఆశ్రమ పనులకు, నాకు రెండు నేత్రములు అవసరములేదు. ఒక నేత్రముతోనే, నా వ్రాత మొదలైన పనులన్నిటిని జేసుకొనగలను. గాన నేత్ర చికిత్సల యందు నిపుణులైన డాక్టర్లను సంప్రదించి ఒక నేత్రమును తీసికొనుడు. ఈ సేవ మీకును, నాకును గూడ ఆనందముగాయుండును. అన్ని యేర్పాట్లు జేసిన తర్వాతను, ఏ ఆసుపత్రిలోనకు రమ్మనమనిన అచ్చటకు వచ్చెదను." ఎవ్వరూ తెలియకుండగనే, నిరాడంబరముగా, దీనిని జరిగించుడు" అని జెప్పితిని.

ఆయన, నేనుగూడ, నేత్ర చికిత్సయందు వుత్తీర్ణులైన డాక్టర్లకు వుత్తరములు వ్రాసి, సంప్రదించగా, అట్టి పని సాధ్యము కాదని, నిరుపయోగమని జెప్పుచు, నిరుత్సాహము గల్గించితిరి.

శ్రీ మహాత్మా గాంధీగారి "హరిజన" పత్రికలో బ్రతికియుండగా గాకున్నను, చనిపోయిన తర్వాతనైనను, నేత్రదానము, అంధులకు చేయవచ్చునని, బొంబాయినుండి EYE BANK "నేత్ర దానము బేంకు" అనే సంస్థను ప్రారంభించినవారు వ్రాయగా, వారికిగూడ ఒక వుత్తరము వ్రాయబడెను.

**"పరోపకారార్థ మిదం శరీరము"** అని శాస్త్రములు, మహనీయులు జెప్పుచుండిరి. యీ శరీరము జీవించియుండగనేగాక, చనిపోయిన తర్వాతనుగూడను, యీ నేత్రములై నను ఏదోరీతిగా ఉపయోగించుగాక, యనియే నా మనస్సు కోరుచుండును.

ఈశ్వరేచ్ఛయున్న ఈ శరీరము పోయినప్పుడు, యీ రెండు నేత్రములను, ఏ అంధునికైన నుపయోగించునట్లు వాడుటకు, ఆశ్రమవాసులను కోరుచుంటిని. ఈ నేత్రములు శరీరము పోయినను,యే దురదృష్టవంతుడైన అంధునికైనను జూచుటకు వినియోగించిన, నా జీవితము ధన్యవంతమైనదని, యిప్పుడేగాక అశరీరిగా నుండు నప్పుడుగూడ ఆనందించెదను.

ప్రియమైన శాంతి పాఠకులారా!

నాకు స్మారక విధిగా, గుడులు, గోపురములు కోరను. పూజ పునస్కారములుగూడ కోరను నాకు కావలసినది మీరంతా శాంతి ప్రార్థనను నిరంతరము స్మరించుచుతరిం చుటయే, నాకు కావలసిన ముఖ్యమైన స్మారక చిహ్నము దైవసన్నిధిని ఎప్పుడోగాక, శాంతి ప్రార్థనను స్మరించునప్పుడే అనుభవించుచూ, మీరంతా తరించుటయే కోరుదు. నా ఆంతర్యభావనలను ముందుగనే మీతో పంచుకొనుచుంటిని.

ఈ శరీరము జీవించియుండగనే, యీ స్మారక చిహ్నమును మీ హృదయములలో స్థిరముజేసి, వ్యక్తుల శాంతియే లోకశాంతిగాన, శాంతి ప్రార్థనను నిరంతరము స్మరించుచు, మీరు మీ సన్నిహితులు, అన్ని మతములలో, అన్ని దేశములలోనున్న భక్త వరేణ్యులందరను తరించెదరుగాక!

దైవము మీయందరను ఆయురారోగ్యములతో పూర్ణశాంతితో బ్రోచుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

ఓమ్ శాంతిః శ్శాంతిః శ్శాంతిః॥

(శాంతి ఆగష్టు & నవంబరు 1959)

# ఈ విశ్వమంతా నా గృహము

ఈ విశ్వమంతా నా విద్యాలయము అని రేడియోలో చక్కనైన పాట ఒక్కటి పిల్లల కార్యక్రమములో, బాలబాలికలకు నేర్పుచుందురు. బావిలో కప్పలవలె, మా నూతిని మించినది లోకములోలేదు. సముద్రముగూడ మా నూతికంటె చిన్నదే అని కించజ్ఞత్వమైన భావనలతో ఒక జాతికి, మతమునకు, దేశమునక బానిసలై, తమ జాతియే జాతులన్నింటిలో గొప్పదని, తమ మతమే మతములన్నింటిలో ఉత్కృష్టమైనదని, తమ దేశమును మించిన దేశము లేదని కూపస్థమండూకములవలె, వాదించుచు జీవించుచున్నవారిని జూచిన చింతగా నుండును.

ఈ విశ్వమంతా నా గృహమని పాడుటకు నా మనస్సు సదా కోరుచుండును. కోమలమైన బాల, బాలికల హృదయములలో చిన్నతనములోనె, విశ్వప్రేమ, విశ్వశాంతి, విశ్వమత బీజములను, నాటుచున్న వారి జీవితములు ధన్యవంతములు, ఎన్నటికైనను లోకశాంతి స్థిరము కావలెనన్న, యీ విశ్వభావనలే లోకకళ్యాణమునకు స్థిరమైన పునాదులై యుండవలెను. వ్యక్తుల శాంతియే దేశవృద్ధికి, మానవ కళ్యాణమునకు దారి జూపుచున్నదని, శ్రీ శాంత్యాశ్రమము ఏబది సంవత్సరముల నుండియు చాటుచున్నది.

**యద్భావం తద్భవతి** –నీ భావనలు యెటులయున్న అటులనే సర్వము జరుగు చుండునని పెద్దలు జెప్పెదరు. నీ గృహమే నీ సర్వముగా భావించుచు, అహంకార మమకారములతో నిండి అల్పమైన జీవితమును జీవించుచున్న, నీ గృహము దరికైనను యెవ్వరూ రారు. లోకమే నీ గృహముగా భావించుచు, విశ్వప్రేమతో జీవించుచున్నచో, అన్ని మతముల నుండియు, అన్ని దేశముల నుండియ, భక్తులు నీ గృహమునకు వచ్చె దరు. అటులనే శ్రీశాంత్యాశ్రమము లోకమంతకు, వివిధ దేశములలోయున్న వారందరకు శాంతి నిలయమై వెలుంగుచున్నదిగాన, భక్తులు అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, డెన్‌మార్కు, రష్యా, మలయా, చైనా, ఆస్ట్రేలియా, కెనడా, జపాను, మొదలైన దేశముల నుండి గూడవచ్చి ఆశ్రమములో శాంతిగా, గడుపుచు వృద్ధిచెందుదురు.

కెనడా సోదరి ఒక ఆమె వాల్తేరు ఆశ్రమములో శాంతిగా తన జీవితమును గడుపుచుండెను. ఈమధ్యను స్విడ్జంర్లెండు (Switzerland) నుండి, శాంతిదేవి అనే ఒక సోదరీమణి, భక్తురాలు ఆశ్రమమునకు వచ్చి యుండెను. ఆమె మరల ఒక సంవత్సరంలో తన దేశమునకు వెళ్ళి వచ్చెదననుచుండుటచే, ఆమె యిచ్చట వుండగా శాంతి ఆశ్రమ శాఖలలో కొంత కాలము శాంతిగా, శాంతిదేవి గడపవలెనని నిశ్చయించి –నీలగిరి శాంతి నిలయము లక్ష్మీవిహార్‌కు వచ్చియుంటిమి. ఇచ్చటకు వచ్చుచుండ, ఈ మధ్యను నాకు వచ్చిన హృదయజబ్బు, దైవకృపచే కుదిరినను, చాలమంది

ఆశ్రమభక్తులు, డాక్టర్లుగూడ అంత యెత్తయిన తావునకు వెళ్లుట మంచిది గాదని, కొండలమీద యింతకాలము గడుపరాదని, శతపోరి జెప్పిరి. డాక్టర్లకు డాక్టరైన దైవము నా హృదయములో ప్రకాశించుచు, నన్ను నీలగిరివైపు పిలచుచున్నాడని జెప్పుచు, మొండిగా నీలగిరి ప్రయాణము స్థిరముజేసి వచ్చితిమి. అందరి మాటయు త్రోసివేసి వచ్చినందుకు దైవకృపవల్ల క్రింద వుండినప్పుడుకంటె, మీదకు వచ్చిన తర్వాతనే నా ఆరోగ్యము తృప్తిగా వున్నది. మనస్సు ఆనందముగా వున్నది. ఆత్మ శాంతిగాయున్నది.

**ఆత్మోయం శాంతిః**

విశ్వమంతయు తన గృహముగా భావించుచు, విశ్వప్రేమతో జీవించుచున్న శాంతిదేవిని గురించి వ్రాయుటకు యీ వ్యాసము ప్రారంభించితిని. ఆమె వయస్సు 72 సంవత్సరములున్నను, ఆమె గురుకుల బాలికలతో ఎగురుచు, ఆడుచు ఆనందముగా నాట్యము జేయుచుండును. ఈ మధ్యనే ఆమె 72వ జన్మదినోత్సవము తోటపల్లిలో చేయబడెను. ఆ రోజున ఆమె బాలబాలికలను, ఆశ్రమవాసులను, ఆశ్రమ భక్తులు, అతిథులను యెన్నోరీతులుగా ఆదరించుచు, అందరికీ బహుమతులిచ్చుచూ, ప్రార్ధన, భజన, ధ్యానాదులతో ఉత్సాహముగా జరుపబడెను. నాకుగూడ నూరు రూపాయలు–ఆమె జన్మదినము జ్ఞాపకార్ధముగా బహుమతి యివ్వగా, నూతనముగా స్థాపింపబడిన మైత్రేయి ఆశ్రమంలో త్రవ్వబోయే నూతికి అర్పించితిని.

శాంతిదేవి దినచర్యలలో మనము నేర్చుకొనవలసినవి, మనము వృద్ధి అగుటకు, ఆశ్రమం వృద్ధియగుటకు యెన్నో పాఠములు గలవు. ఆమె ఉదయమేలేచి, ప్రార్ధన ధ్యానాదులు, ఆధ్యాత్మిక మెఱుపులు, నిశ్శబ్ద గడియలలో మూడేసి అధ్యాయములు పారాయణజేసి, తర్వాత ఒక చిన్న తట్ట తీసుకొని బయలుదేరును. మొదటలో ఆ తట్ట ఎందుకొరకో, నాకును బోధపడలేదు. ఆమెను అనుసరించి పరీక్షించగా, ఆమె యెండి పోయిన పువ్వులు, ఆకులు, చెట్ల నుండి తీసి, ఆ తట్టలో వేసి, దూరముగా పారవేయుచుం డును. బలవంతముగా మొక్కలను వంచి, అవి కదలిపోకుండగా ఒక్కొక్కసారి కత్తెరతో యెండిన కొమ్మలను కత్తిరించుచుండును.

కండ్లు వుండియు చూడరేల? అని ఏసుప్రభువు జెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చు చుండును. శాంత్యాశ్రమంలో 150 మందిపైగా బాలబాలికలు, పనివాండ్రు, సభ్యులు వున్నను ఇందులో ఒక్కరికైనా, యీ ఎండిపోయిన పువ్వులుగాని, ఆకులుగాని, ఏరిపార వేయవలెనని యెందుకు తోచలేదో ఎవ్వరికి వారే వారి జీవితములను పరీక్ష జేసుకొన వలెను. మనమంతా కండ్లు వుండియు అంధులముగా వుంటిమి. ఒక్కొక్కసారి స్వార్ధపు జీవితములో మొక్కలున్నట్లే కనిపించవు.కొందరు మాది పెద్దవయస్సు మేమెంతో

చదువరులము. ధనికులము, మేము తోటపని జేయుదమా? అని తలంచుచుందురు. మరికొందరు అన్నియు వదలి, ఆశ్రమంలో జేరి తోటపని జేసేగతి మాకేల? అని తలచెదరు! శాంతిదేవి మాత్రము చిన్నవయస్సులో యున్నదా? 72 సంవత్సరములు గలిగియుండియు, అన్నియు వదలి ఆరువేల మైళ్ళు నుండి వచ్చి మొక్కల సేవ, ఆశ్రమసేవ జేయుటలేదా?

**పనిచేయని సోమరునికి తినుటకు హక్కులేదు.** అనెడి సూక్తిని, మన శాంతిదేవి, ఆశ్రమవాసులకేగాక, ఆంధ్రులకేగాక, తాను స్వయముగా **పనియే ఆరాధన** అన్నట్లు నిత్యము సేవజేయుచు, మన అందరకు లోకమంతకూ మార్గదర్శిగా వెలయుచున్నది.

దుర్లభమైన మానవజన్మ పొందినందుకు దైవము, నేత్ర దృష్టి యిచ్చినందుకు, దైవబిడ్డలమై యున్నందుకైనను, మనముగూడ, మానవ సేవయేగాక, పశుపక్ష్యాది జంతువులకు, వృక్షములకు, మొక్కలకుగూడ సేవజేయుచు మనము దినదినాభివృద్ధి గాంచుచు మానవకోటికి ఆదర్శనీయముగా, జీవించుట ముఖ్యము. యిప్పుడు నా మనస్సు ఆశ్రమవాసులందరకూ 150 చిన్న బుట్టలు కొని యివ్వవలెనని కోరుచున్నది. ఒక్కొక్కరు తీరికగా వున్నప్పుడే, 10, 15 నిముషములైనను, ప్రతీరోజును నియమముగా తోటపని జేయుచున్న మొక్కలు సౌందర్యముగా వుండి, ఆశ్రమవాసులకు, సందర్శకులకు ఆనందము నిచ్చుటయేగాక తోటపని వ్యాయామమవల్ల మనము ఆరోగ్యముగా గూడ యుందుము.

నీలగిరి శాంతి కేంద్రము ఎంతో శాంతిగా, ఏకాంతముగా పరవశత్వమును గల్గించుచు, తనకు ఆరోగ్యమును దైవానుభవమును గల్గించుచున్నదని తన ఆనంద మునకు మేరయేలేదని, తన కొదువ జీవితము యీసారి మరల హిందూదేశము వచ్చిన ప్పుడు యిచ్చటనే గడుపుటకు నిశ్చయించితినని శాంతిదేవి తరుచు జెప్పుచుండ, నా మనస్సునకు, యిచ్చట యీ రమ్యమైన ఏకాంతమైన కొండలలో ఆశ్రమస్థాపన దైవకృపచే చేయగల్గినందుకు నేనుగూడ ఎంతయో తృప్తి పడుచుందును. యిచ్చట సర్వమత శాంతి ప్రార్థనాలయమునకు శ్రీమతి లలితాదేవి శంఖుస్థాపన జేసి, ఆరు సంవత్సరములు అగుచున్ననూ, యింకను పునాదులైనా కట్టించజాలనందుకు మనస్సు కొంత చింతగా యున్ననూ, యిప్పుడు శాంతిదేవి పేరున, దైవము యీ ప్రార్థనాలయము ప్రారంభించి త్వరలో ముగించుటకు నన్ను యిచ్చటకు తీసుకొని వచ్చెదరుగదాయని ఆనందించుచు, త్వరలో ప్రార్థనాలయం కట్టు ప్రారంభించుటకు ప్రయత్నించుచుంటిమి.

ప్రాక్ పశ్చిమ దేశములలోయున్న శాంతి, పీసు పాఠకులందరూ యీ విశ్వమత ప్రార్థనాలయము పూర్తి అగుటకు వారి వారి శక్తికొలది వుడతా భక్తితో, ఏ తృణమైనను

అర్పించి తోడ్పడుచు, యిచ్చట యీ విశ్వమత ప్రార్థనాలయము చాల ముఖ్యావసరము గాన, త్వరలో పూర్తి అగుటకు తోడ్పడెదరుగాక!

దైవపరితాపనతో నిండియున్న ఆశ్రమ భక్తులందకూ స్వాగతము.

ఈ విశ్వమంతా నా గృహము.

ఈ విశ్వమంతా నా విద్యాలయము.

ఈ విశ్వమంతా నా దేవాలయమని మనమందరము యిప్పుడు గీర్తించుచూ, విశ్వప్రేమ, విశ్వశాంతి, విశ్వమతములో విలీనమయ్యెదముగాక!

లోకా సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః

(శాంతి అక్టోబరు 1964)

## ఊరేగింపులు

ఎన్నికల విజయములచే దేశమంతయు ఊరేగింపులతో నిండియున్నది. పెద్దవారైనచో పెద్ద ఊరేగింపులు, చిన్నవారైనచో చిన్న ఊరేగింపులు వారి వారి యొక్క హోదాలను బట్టి జరుగుచుండుట మనము చూచుచుంటిమి. దినపత్రికలలో గూడ చదువుచుంటిమి.

పెద్ద పెద్ద హోదాలు గలవారు విమానములమీద, ఏనుగులమీద, మోటారుకార్లు, బస్సుల మీద ఊరేగించబడుచుండిరి. చిన్న చిన్న హోదాలు గలవారు రెండెద్దుల బండ్లమీదను, వంటెద్దు బండ్లమీదను కొందరు కాలినడకను చిన్న చిన్న గ్రామములలో గూడ ఊరేగించుచుంటిరి.

ఈ జయమునకు, అఖండవిజయములకు మూలకారణము ఎవ్వరో అని వూహించగల్గినవారు లేకుండుట విచారకరము. ఈశ్వర ఆజ్ఞలేనిదే గడ్డిపరకయైనను కదలజాలనపుడు, యీ అఖండ విజయములకు మనమే కారణమా? ఖండమైన మానవుని ప్రయత్నము శక్తియే కారణమా?

ఎవ్వరిని ఊరేగించుటయో, జయమునకు ఆధారము, మూలకారకుడు యెవ్వరో ఆ దైవమును గుర్తించి ఊరేగించుట సమంజసముగదా! అనేకమందిలో జీవితాధారుడైన ఆ మూలవిరాట్టుని జ్ఞప్తియే లేకుండుట చాల విచారకరము.

పాటకజనులు కొందరు వివాహములలో గుఱ్ఱములమీద, గాడిదలమీద ఊరేగు చుందురన్న విషయము మీ రెన్నడైనను వినియుంటిరా? నేను వినుటయేగాక

నాచిన్నతనములో అరువది సంవత్సరముల క్రితము అట్టి ఊరేగింపులు జూచినట్లుగూడ జ్ఞాపకమున్నది. ఈ అరువది డెబ్బది సంవత్సరములలో మనము మన దేశము ఎంతగా ఏ ఏ రంగములలో వృద్ధి అయ్యెనని దేశభక్తులు, దేశనాయకులు దేశవృద్ధిని వారి ఆంతర్యభావనలను విమర్శించుకొనుచు స్వీయపరీక్ష చేసుకొనుట చాల సహాయముగా నుండును.

మనము ఓటులకై వ్యయప్రయాసలతో చేయు ప్రయత్నములు, ప్రచారము చేయుచున్నప్పుడు బీదసాదలకు చేసిన వాగ్దానములను, నెరవేర్చుటయే నిజమైన సేవ. అనాథలకు, బీదసాదలకు ఆహార కొరత లేకుండ తోడ్పడుచు, నరుని రూపముగా నారాయణుడే మనవద్దకు వచ్చుచుండెననెడి ప్రేమభావనతో చేయు సేవయే. దైవమునకు ప్రీతికరమైన సేవ. ఏ ఫలితమును కోరకుండగా, బీదలకు, రోగులకు ప్రేమతో చేయు సేవయే నిజమైన సేవ. బీదసాదలను, రోగులను ప్రేమించుచు, వారిసేవ జేయుటయే నిజమైన ఊరేగింపు గొప్ప సేవగా పరిగణింపబడును.

పూర్వము దేవతలకు, రాక్షసులకు గొప్ప యుద్ధము జరిగెనట. ఆ యుద్ధములో దేవతలు అఖండమైన విజయమును పొందిరి. వారి శక్తిసామర్థ్యములకు విజయమునకు విర్రవీగుచుండ దైవము వారికి పాఠము నేర్పుటకు అగ్నిదేవుని సమీపించి:

ప్రశ్న : నీవు ఎవ్వరవు? ఏమి చేయుదువు అని అడుగగా

జవాబు : నేను అగ్నిదేవుడను లోకమంతయు కాల్చివేయగలను. అని చెప్పెనట.

అప్పుడు దైవము గడ్డిపరకను అతనిముందు వుంచి, దీనిని కాల్చుమని చెప్పగా, అగ్నిదేవుడు ఎంత ప్రయత్నించినను, చిన్న గడ్డిపరకైనను కాల్చజాలక సిగ్గుతో తల వంచుకొనెను.

అటులనే దైవము వాయుదేవతను, జలదేవత వగైరాలను పరీక్షించగా, వాయుదేవత తనశక్తినంతను ఉపయోగించియు గడ్డిపరకను కదపజాలకపోయెను.

జలదేవతగూడ చిన్న గడ్డిపరకను తడపజాలకపోయెను. ఈ కథ యింకను చాల కలదు. మనకు కావలసినది దేవతలు గ్రహించిన సత్యమునే మనలో ఏమియు లేదనియు, మనముగూడ గడ్డిపరకనైనను కదల్చజాలమనియు, ఏపనిలోనైనను విజయమంతకు దైవమే మూలకారకుడనియు,మన ఆధారము. గమ్యస్థానము అని ఎంతలో మనము గ్రహించగల్గిన, అంత త్వరలో మనము శాంతిని పొంది, దేశవృద్ధికి, లోకకళ్యాణమునకు తోడ్పడిన వారమయ్యెదము.

నేను వ్రాయు భావనలు కొందరు ప్రవృత్తిపరులకు విపరీతముగా తోచినను, సత్యాన్వేషకులు, నివృత్తిపరులు నూరుపాళ్ళు సత్యమే అని గ్రహించగలరు. ఈ విజయములలో కొందరు గుళ్ళలో దైవములకు మొక్కులు చెల్లించెదరు. అన్ని మొక్కులలో

తేలికయైనది, ఏ ఖర్చును లేనిది. శిరోజములను అనగా వారి తలవెంట్రుకలను దైవమునకు అర్పించుట.

నామరూపముల వెంట, క్రీనీడల వెంట పరుగెత్తెడి అపరిశుద్ధమైన మనస్సును, దైవమునకు, ఆంతర్యస్వరూపునకు అర్పించుట ముఖ్యముగాని, నామరూపములకు బానిసలై, బాహ్యాపొగడ్తలు, ఊరేగింపులతో మురియుట, తృప్తి పొందుట అముఖ్యములని, ఎంత త్వరలో గ్రహించిన అంత హెచ్చుగా దేశవృద్ధికి తోడ్పడును.

శ్రీ శాంతి ఆశ్రమము మీరు తరించుటకు స్థాపితమాయెను. శాంతి మీ జన్మహక్కు, ఆశ్రమము మీ జ్ఞానగృహము. ఇచటకు త్వరితముగా వచ్చి, ఏకాంతములో, దైవసన్నిధిలో ఊరేగుటకు ప్రయత్నించుడు.

**నేడే మనది రేపు మనది గాదన్న సత్యమును మరువకుడు.**

ఎన్నికలలో విషాదకరమైన వార్త విని హఠాత్తుగా చనిపోయిరనియు, ఆనందమైన వార్తను వినియు, విజయము పొందియు మరొకరు చనిపోయిరనియు మనము విని యుంటిమి.

మృత్యువు హఠాత్తుగా రావచ్చును. మనముందును, చుట్టును ఆడుచున్నది. మన కండ్లముందే, వయస్సులో నున్నవారు, ఏ జబ్బును లేక ఆరోగ్యముగా నున్నవారు గూడ హఠాత్తుగా వారి కాలము సమీపించినపుడు తీసుకొని పోవుచున్నది.

ఈ నామరూపములు స్థిరాస్థులు, ఇండ్లు, మేడలు, మిద్దెలు, ధనధాన్యములు చివరకు మనబంధు స్నేహితులు, మన సంతతిగూడ మనలను వెంబడించజాలదు. స్థిరాస్థులు, చరాస్థులు, స్మశానము వరకైనా రాజాలవు. బంధుస్నేహితులు, మన వార సులు, స్మశానము వరకు మాత్రమే రాగలరు.

అచ్చుట మన తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు, సర్వాధారుడు, సర్వజ్ఞుండైన దైవము మాత్రము మనకై ఆతృతతో మన పుణ్యపాపములను బట్టి స్వర్గమునకో, నరకమునకో, మీదకో, క్రిందకో, తీసుకొని వెళ్ళుటకు వేచియుండును. ఎవ్వరు జల్లిన విత్తనముల ఫలమును వారే అనుభవించి తీరవలెనుగదా!

ప్రియమైన శాంతిపాఠకులారా! ప్రేమ విత్తులను, శాంతి విత్తులను ఆత్మవిత్తన ములను విరివిగా జల్లి దైములో నేడే లీనమయ్యెదరుగాక! ప్రియమైన శాంతి పిపాస కులారా, యిక హెచ్చు మాటలేల? అశుద్ధమైన, అనిత్యమైన కీనీడల వెంట పరుగెత్తుటకు బదులు, శుద్ధమైన నిత్యమైన శాశ్వతమైన, మన జన్మహక్కు, ఆధారము గమ్యస్థానమైన

దైవమువైపే మన మనస్సులను, పరుగెత్తించి, యీ ఎన్నికల పేరున వీటి జ్ఞాపకార్థము, లోకశాంతిని కోరుచు ఈ క్రింది శాంతి గీతమును స్మరించుటలో నాకు తోడ్పడగోరెదను.

**శాంతి గీతము**

ఆకసంబున శాంతి వెలుగుగాక!

స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక!

జలములందు శాంతి సుస్థిరం బగుగాక!

పృథ్వియందున శాంతి కీర్తింప బడునుగాక!

సకల వృక్ష లతాగుల్మములయందు శాంతి సతతము ప్రవహించుగాక!

సమస్త చరాచరములు శాంతితో నింపబడునుగాక!

సర్వగృహముల శాంతి వ్యాపింపబడునుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఏప్రిల్ 1967)

## ఉపదేశములు

1. ఎంతవరకు శరీరాభిమాన ముండునో అంతవరకు హింసకుఁ బ్రతిహింస చేయవలయుననియే తోచుచుండును. దురభిమాన పిశాచ భావము వదలిపోవుట తోడనే క్షమాదేవీ ప్రసన్నము కాగలదు. ఓర్పు గలవాడు యెప్పటికైనను విజయము గాంచి తీరును.

2. ఈ శరీరము నాది, అను భావమును విడిచి, నీలో నున్న అంతరాత్మయే నీవు అని నిశ్చయబుద్ధి కలిగి, ఆ నిశ్చయాత్మక జ్ఞానముతో సకల చరాచరములందు నిండి నిబిడీకృతమై యున్న నీ తేజమునే (ఆ పరమాత్మ స్వరూపమునే) చూచుచుండుము.

3. ప్ర : పూర్ణానంద మెచ్చట నున్నది?

జ : శాంతిలో నున్నది. శాంతి యెచ్చట నున్నది? తృప్తిలో నున్నది.

4. మనస్సునకు బానిసలగువా రెప్పుడును శాంతి సౌఖ్య మనుభవింపజాలరు. ఎవరు చిత్తమును, యింద్రియములను నిరోధింతురో వారే శాంతి లాభమును బడయగలరు.

5. ఎవరు తమ ఆత్మయందే క్రీడించుచుందురో వారికి శరీరాభిమానము శరీర

జ్ఞప్తి యుండదు. ఎవరికి దురభిమాన మున్నదో వారికి ఆత్మజ్ఞానము కడు దవ్వుగా నుండును.

6. దేవుఁడొక్కఁడే. అదే పరమ సత్యము. ఆ సత్య దేవతనే అనేకులు అనేక నామరూపములతో ప్రార్థించుచుందురు. మార్గములు వేరువేరుగా నున్నను గమ్యస్థాన మొక్కటే.

7. నీ వేమతస్థుఁడ వైనను, ఏ నామరూపములు గల్పించుకొన నీ దేవుని ఆరాధించుచున్నను, ఇంద్రియ నిగ్రహము, సత్యము, భూతదయ, ఓర్పు, సహనములు లేకున్నచో నీ యిష్టదైవము నీ యెడ ప్రసన్నుడుకాడు.

8. సముద్రములోనికి యెక నది అత్యంత వేగముతో బోయి చేరుచున్నది. ఆ వేగము సముద్రములో మైలు దూరము వరకు ఉన్నది. ఎంత దూరము వరకు నదీ ప్రవాహమున్నదో అంతవరకు ఆ నీరు తీయగా నుండుట సహజమే గదా!

కొందరు యాత్రీకులు సముద్రము మీద ప్రయాణము చేయుచుండిరి. అది వేసవికాలము. ఓడలో నున్న మంచినీరు అయిపోయినది. వారికి అపరిమిత దాహముగా నుండెను. నాలుకలు పిడచగట్టికొని పోయినవి. వారుదాహము దాహమని యరచఁ జొచ్చిరి. నదీ భాగముమీద సముద్రములోనికి పడవపైఁ బోవుచున్నవారు వారి యార్త నాదములు విని నవ్వసాగిరి. ఆ పిపాసకుల పడవలోఁ బోవుచున్న వారిని జూచి మీ యొద్ద మంచినీళ్ళున్నవా, యని యడిగిరి. వీరందులకు సమాధానముగా నదీ యుదక మును పాత్రలతో ముంచి త్రాగజొచ్చిరి. "ఈ మాత్రము మాకుఁదెలియకపోలేదు. ఇది యుప్పు నీరు, ఎట్లు త్రాగగలము! మా దప్పిక యెట్లు తీరును? మాతోఁబరియాచక ములాడుట కిది సమయమా? యని యసహ్య భావముతోఁదిరుగ కేకలు వైచిరి. "ఆర్పులవలన వ్యర్థపు మాటలవలన ప్రయోజన మేమి? అదే మంచినీరు త్రాగి ఆనందింపుడు." అని చెప్పుచు పడవలోని వారు ముందునకు సాగిపోవుచుండిరి. ఓడలో నున్నవారిలోఁ గొందరు "చూత" మని చెంబుతో నీరు తోడుకొని త్రాగిరి. అది మధురోదకమైయుండెను. అప్పుడు వారు మిగిలివారి వంకఁజూచి "ఆహా! మనమెంత మూర్ఖులము? మంచినీరు దగ్గర నుండియు దాహముచే పీడింపఁబడుచు, మంచినీరు మంచినీరని యితరులను పీడింప సాగితిమే," యని పలికెను. వారు తమ యజ్ఞానమునకు లజ్జపడిరి. కడుపార ఆ యుదకపానము జేసి, తృప్తులైరి.

అట్లే ఆ పరమాత్మ లోపల బైట అంతట నిండి యుండగా ఎచ్చటనో యున్నాడని యేల తిరిగెదవు? ఏల యరచెదవు? నీ యజ్ఞానమును నశింపు జేసుకొందువేని, ఆ సత్య స్వరూపమును నీలోనే గాంచగలవు.

9. మార్పుఁజెందుట స్వాభావికము. జగత్తులోని సమస్త జీవరాసులు నిరంతరము మార్పుఁ జెందుచునే యుండును. శరీరములో మార్పు ఐశ్వర్యములలో మార్పు, ఆనందములో మార్పు, కష్టసుఖములలో మార్పు, బుద్ధిలో మార్పు, రూపములో మార్పు, మార్పులో మార్పు, మార్పే సహజమైనప్పుడు, అందుండి తప్పించుకొనుటకు సాధ్యముగా నప్పుడు, నీకు విచార మెందులకు? నీవు కోరినది సిద్ధింపలేదనియు నీవద్ద నున్నది పోయినదనియు, ఆప్తబంధువుల కళేబరములు దగ్ధము లైనవనియు, ఇత్యాది మనో వికారములతో ఏల పరితపించెదవు? అన్నియు నీ ప్రాప్తానుసారము జరుగుచుండు ననియు నీ తలంపులు నీ పురుషకారము కొరగావనియు నమ్ముము. జరిగిపోయిన దానిని గురించిగాని జరుగనున్న దానిని గురించిగాని యెన్నఁడును తలపోయకుము.

10. నీవు వెంటనే దీక్షితుఁడవు గమ్ము. దీక్షలేనివా డెన్నఁడును, ఏ కార్యము నందును కృతకృత్యుఁడు కాఁజాలఁడు. పట్టుదల గల వానికి సమస్త కార్యములు సిద్ధించి తీరును. సద్భావముతోఁ గూడినది, సత్ఫల మొసంగునది, అయిన కార్యదీక్ష సహనముతోఁ గూడి యుండవలెను.

11. సముద్రతీరమున, ఇసుకగూటిలో పక్షి మిధునమొకటి నివసించుచుండెను. ఆడుపక్షి ప్రతి సంవత్సరము గ్రుడ్లు పెట్టుచుండుటయు, సముద్రుఁడు వాటిని తన పొట్టను పెట్టుకొను చుండుటయు, ఆ మిధునమునకు తమ బంగారు గ్రడ్లు పోయినం దులకు క్రోధద్వేషములు పెరుగుచుండుటయు, తటస్థించుచుండెను. ఆ ప్రకారమె ఆ సంవత్సరము గూడ తటస్థించెను. ఆ జంటపక్షులిఁక నోపిక పట్టఁజాలక “ఓ సముద్రుడా నీకింత యోర్వలేనితనము గూడదు. ప్రతి సంవత్సరము మమ్మిట్లేల యేడిపించెదవు. మేము అల్పజంతువులమనియా? చూడుము. నీ పొగరణఁచెదము. నీ నీరింకఁజేసి నీకు బుద్ధివచ్చునట్లు చేయుదుము. చూచుచుండుమని తమ చిన్న నోళ్ళతో సముద్రజల బిందువులు తీసికొనిపోయి దూరము విడువసాగెను. ఈ అల్ప పక్షుల పరిహాస ప్రయత్న మునకు సముద్రుఁడు పక్కున నవ్వెను. దానితో వాటికి పట్టుదల అధికమయ్యెను. రాత్రిం బగళ్ళు అట్లు నిద్రాహారములు, అన్యచింత మాని, ఓపికతో పట్టుదలతో ఆ పక్షిద్వయ మీ విధముగాఁ జేయుచుండినఁ జూచి యితర పక్షులుగూడ సాహాయ్యము చేయసాగెను. ఈ విధముగా పక్షులు తండోపతండములుగా వచ్చి చేరి సముద్ర జలములు గొంపోవుచుండెను. ఖగేంద్రుఁడైన గరుత్మతుండుగూడ యీ కార్యమునందే ప్రవేశించెను. దినదినము సముద్రజలము తఱగిపోవుచుండెను. తుదకు సముద్రుడు వెఱగంది, వాటి గ్రుడ్ల నిచ్చివైచి క్షమింప వేడికొనియెను.

ఈ కథ మీకేమి బోధించుచున్నది. ఎన్నఁడును నీచ తలంపులు చేయకుఁడు. మహోత్కృష్ట ఆశయములనే గలిగి యుండుఁడు. ఆశయ సిద్ధికై అమిత పట్టుదలతో,

ఓర్పుతో నిరంతరము పాటుపడుఁడు. మీ కోరిక మీ పూనిక జయము గాంచి తీరును. ఈ పవిత్ర కార్యములో మీకొకవేళ మరణమే తటస్థిచినను తటస్థింప నిండు. తిరిగి జన్మయెత్తియో లేక మరొక విధముగానో, తత్ఫలసిద్ధిని పొంది తీరుదురు.

12. గ్రంథ పఠనము కట్టిపెట్టుడు. నిరంతరము చదువుచుండుటకూడ ఒక వ్యసనమే. ఏదోకొంత చదివినారు. కొంత తెలిసికొనినారు. తెలిసికొనిన ప్రతి విషయ మును ఆచరణలోఁబెట్టకుండ ముందునకుఁ బోకుడు. ఆచరణలేని నీతి గ్రంథపఠనము, అనుభవములేని వేదాంత విచారణ నిష్ఫలము. మనకు పనియే (క్రియయే) కావలెను. చదువుట, తర్కించుట విడిచిపెట్టుము. నీ తత్త్వమును నీవు గ్రహించుటలోనే నీ జీవిత మును వినియోగింపుము.

13. నీ మనస్సును ఎల్లప్పుడు ఆత్మయందే నిలుపుము. దానిని చెదరిపోవ నీయకుము. అది నిరంతరము చలించు స్వభావముగలది. నీవు దైవధ్యానమునకుఁ గూర్చున్నప్పుడు, అనేక బాహ్య విషయములలోనికి నిన్నీడ్చుకొని పోవును. సాధనా భ్యాసమువలన ఆయా విషయముల నుండి నీ మనస్సును మరల్చి ఆ యద్వితీయ పర బ్రహ్మమునందే దానిని నెలకొల్పుచుండుము. అభ్యాసము కష్టమైనదైనను విడువక పట్టు దలతో సాగించుచుండువేని సులభసాధ్యము కాగఁలదు.

14. నిశ్శబ్దమైన ఏకాంత ప్రదేశమున, స్థిరచిత్తముతో సుఖాసనమునఁ గూర్చుండి యీశ్వర స్వరూపమును చింతించుటకు ప్రారంభింపుము. నీ శత్రువైన నీ మనస్సే, నిన్ను వంచించి విషయాంతరములపైకి పోవును. అప్పుడు నీవు వివేకము తెచ్చుకొని, దానిని మొదటనే బిగపట్టుటకు ప్రయత్నించక స్వేచ్ఛగా విడిచి పెట్టివేయుము. నీ మనస్సుతో నీ బుద్ధిని నీ యింద్రియములను పోనివ్వక సాక్షిమాత్రుఁడవై నీవొక ప్రక్కనుండి దాని మర్కట చర్యలను పరీక్షించుచుండుము. చిత్తమును యింద్రియములును తనతోఁ గలిసి రానప్పుడు మనస్సేమియు చేయఁజాలదు. అది క్రమముగా వెనుకకు మరలి నీకు స్వాధీనమై పోవును. నీ మనస్సు నీకు స్వాధీనమైన పిమ్మట సమస్తము నీకు స్వాధీనమే.

15. ఓ ఆత్మ విద్యాభ్యాస సాధకుఁడా! ఎన్నఁడును బాహ్య విషయములను గుఱించి యోచింపకు. జీవితమే అస్థిర మైనప్పుడు దీనికి సంబంధించిన విక్షయములు శాశ్వతములగునా? కాలము సత్యమైనది. అమూల్యమైనది. నీ కొసంగబడిన కాలము మిక్కిలి తక్కువ పరిమితము గలది. సాధింపవలసిన కార్యమా మహోత్కృష్టమైనది. ఆ కార్య సాధనయందే, నీ చిత్తమును లగ్నము చేసి పాటుపడుట వివేక లక్షణము. తినినదే తినుచు, చేసినదే చేయుచు, చెప్పినదే చెప్పుచు వ్యర్థములైన ఆలోచనలతో నీ కొసంగఁబడిన ఆయుష్కాలమును వమ్ము జేసికొనుట మానవ ధర్మము గాదు.

16. ఒక తండ్రి కిద్దరు కొడుకు లుండిరి. ఒకడు ఏపనియుఁ జేయక, ఊరక తండ్రిని స్తోత్రము చేయుచుండువాడు. రెండవవాఁడు నిరంతరము తండ్రికిఁ బ్రీతిదాయకములగు పనులు చేయుచుండువాడు, ఈ యిద్దరిలోఁ దండ్రిక్రి బ్రియు లెవరో చెప్పుడు? సోమరియై వ్యర్థముగ స్తోత్రములు చేయువానికన్న ప్రియమైన పనులు చేసి మెప్పించువానినిగదా యాతఁడు ప్రేమించును. అట్లే దేవుఁడును తన్ను స్తుతించు వానికంటె వానికిఁ బ్రియతమములగు స్వధర్మకార్యములు చేయుచుండు వానినే ఎక్కువగాఁ బ్రేమించును.

17. నీ వేపని చేయుచున్నను దేవుని మరచి చేయకుము. ఆయనను మరచుటే మరణము. ఆయనను జ్ఞప్తియందుంచుకొనియే నీవు కార్యములు నెరవేర్చుకొను చుండుము.

18. దేవుఁడు నీవు సత్కర్మ నిరతుఁడవు గావలెననియే కోరుచున్నాఁడు. ఆ కర్మలోనే ఆ దివ్య పురుషుని సత్యస్వరూపమును, సర్వత్ర చూచుచుండును. ఆయన సర్వత్ర నిండియున్నాడని నీవు నమ్మినప్పుడు నీవు చేయు ప్రతి పనియు ఆయన ప్రీతికే యనుభావముతో చేయుదువేని నీకు బంధమెక్కడ? నీ వెప్పుడును ప్రతిఫలమును మాత్రము కోరకుము. కర్మలో నకర్మను జూచుటయన నిదియే. ఎవఁడు ప్రతిఫలాపేక్షతోఁ గర్మఁ జేయునో వాడు కర్మబద్ధుఁడగును.

19. దైవస్వరూపముగూడ నీ బుద్ధి యెంత విశాలమైనదో, ఎంత అనుభవము గలదో దానిని బట్టియే యుండును.

20. నామరూపముల విభేదములలోఁబడి యేల కొట్లాడెదరు? ఆ పరబ్రహ్మము నామరూప రహితమైనది. ఎవరి కిష్టము వచ్చిన నామ రూపములు వారు గల్పించుకొని పూజించునప్పుడు మత తగవులెందులకు? సర్వమతములవారు తుదకు ఆ యేకేశ్వరునే ఆ దేవదేవునే చేరుచున్నప్పుడు మార్గములను గురించిన పోరాటము లెందులకు? నామరూపము లెక్కడివి? మధ్య వచ్చినవి మధ్యనే పోవుచున్నవి. సర్వ సమభావము అభ్యాసము చేయుము. ఏమతస్థునిగాని ఏవర్ణస్థునిగాని యే దేవతోపాసకునిగాని ద్వేషింపకుము. ఆ దేవుని యెదుట అందరును సమానులే.

21. ఎవరు పవిత్ర హృదయులో, ఎవరు ప్రేమపూరితులో, ఎవరు అనన్యభక్తులో వారే పరమేశ్వరునకుఁ బ్రియులు.

22. సోమరితనమే మరణము. ఎప్పుడే పనినిఁ జేయవలెనో దానినిఁ జేయు కుండుట కంటె మహాపరాధ మేమున్నది? గడచిపోయిన తెప్పపాటు కాలమైనను తిరిగి వచ్చునది కాదు. మనో వాక్కాయ కర్మలు మూటిలో దేనిచేతనో యొకదానిచేత నిరంత

రము పాటుపడుచునే యుందుము. నీ కొసంగబడిన ప్రతి నిమిషము నీ ఆత్మాభివృద్ధికో పరమేశ్వర ప్రీతికో, పరోపకారమునకో ఉపయోగపడుచున్నదో లేదో చూడుము. ఏ తెప్పపాటు కాలమునైన దుర్వినియోగము చేసితివేని దేవునియెడ మహాపరాధము చేసినవాడవగుదువు. మానవ సేవయే యీశ్వర సేవగాఁభావించి పాటుపడుము. సోమరి హృదయమే సైతాను మందిరము నీవేపనినిఁ జేయుచున్నను, నీ యింద్రియములన్నియుఁ జెదరిపోవక యేకాగ్రములై యుండవలెను. క్షణకాలమైన వ్యర్ధ పుచ్చకుము. అల్పములైన క్షణికములై నిరుపయోగములైన యోచనలు చేయకుము. అవి నీశక్తిని పాడుచేయును. కాలము అమూల్యమైనది. కాలమును వ్యర్ధము చేయు వానిని దేవుఁడు మెచ్చక పోవుటయే గాక శిక్షించును. నేటి పనిని రేపటి వరకు యెన్నడు నిలువయుంచకుము. ఈ గంటలోఁ జేయవలసిన దానిని ముందు గంటవరకు నిలువ యుంచకుము. ఈ నిమిషమును దుర్వినియోగము చేసినప్పుడు, ముందు నిమిషము నీదని చెప్పుటకు నీవు కర్తవా?

23. సర్వవ్యాపియైన పరబ్రహ్మమును అనుభవింపలేకుండుట మిగుల విచార కరము. ఆ యనుభవమునకైదు ముఖ్య సాధనములు గలవు. వానినిటఁ బొందుపరచెదను.

అ. ఆత్మ నిశ్చయము :- ఇదివరలో ననేక దినములు వ్యర్ధముగాఁ గడచిపోయినవి. ఇఁక నావిధముగా వ్యర్ధ పుచ్చను. నిరంతరము జ్ఞప్తితోనే యెల్లకార్యములు చేయుదును. క్షణమైనను వానిని మరువను. అని నిశ్చయించుకొనుము.

ఆ. ప్రాతఃకాలమున సమస్త ఆలోచనలు విడిచి పరబ్రహ్మమునందే నీ చిత్తమును నియమింపుము. నీ గమ్యస్థానమును చేరవలెను. ఆ పరిపూర్ణతలోఁ గొంతవరకైన అనుభవింపకుండ యీ ఆసనమునుండి లేవనని నిశ్చితుఁడవై యుండి దాని ననుభవింప వలెను.

ఇ. సాయంకాలమున తిరగి ధ్యానము ఉదయమునకంటె మధ్యాహ్నము కంటె బ్రహ్మానుభవము హెచ్చుగా ననుభవించినగాని లేవకుము.

ఈ. ఆత్మ పరీక్ష :- నిత్యము ఆధ్యాత్మిక దినచర్యను వ్రాయుచుండుము. రాత్రి పరుండునప్పుడు ఆత్మపరీక్ష చేసుకొనుము. నీ పగటి నిశ్చయము లెంతవరకు నెరవేరినది చూచుకొనుము. నీ దుర్బలత్వమును గ్రహించి నీ యింద్రియములను కఠినముగా శాసింపుము. ఎన్నఁడును ఆత్మ వంచితుఁడవుగాకుము. నీ నియమిత కార్యములు సరిగా నిర్వర్తింపఁబడునట్లు చూడుము. నీ జయము నీ దృఢ చిత్తములో నున్నది. దేనినైనను నిశ్చయించుకొనుటయుఁ దేలికయే. మరచుటయు సులభమే.

ఉ. నిమిష నిమిషము నీవు దైవజ్ఞప్తిలో నుంటివో లేవో నిరంతరము పరీక్ష చేసు కొనుచుండుము. నీ వేపనినిఁ జేయుచున్నను నీ చిత్త మాతనియందే యుండవలెను. ప్రతి గంటలోను నీ యభివృద్ధిని గమనించుచుండుము. ఏనాడు యీశ్వరానందము నను

భవింపవో, ఆనాడు అప్పుడే గూర్చుండి ఆ యానందము ననుభవింపకుండ ఆసనము నుండి లేవకుము. మరియొక యోచన సేయకుము. అమృతమునే పొందుము కేవలము బాహ్య నామరూపములతోఁ దృష్టిపడి యుండకుము.

24. నీవు పరిపూర్ణానంద మనుభవింపఁ గోరుదువేని మాట్లాడుచుండినను, ఆటలాడుచుండినను చూచుచుండినను, వినుచుండినను పనులు చేయుచున్నను, నీ చిత్తమున ఆ పరమాత్మయందే స్థిరముగా నెలకొల్పుట కభ్యాసము చేయము. ఎల్లయెడల ఆ పరమాత్మ స్వరూపమునే మననము చేయుచుండము. నీవు మహానందమును శాంతిని పొందగలవు.

(శాంతి మార్చి & ఏప్రిల్ 1959)

## ఉపవాసము నుండి విందు

ఆధ్యాత్మికపు విందు ననుభవించెడివారు ఏ లక్షకో కోటికో, ఒక్కరుందురు. ఇడ్లీ, సాంబారులు మొదలైన వానితో విందులు అందరకు నిత్యము అనుభవవేద్యమే. నిరహారము నుండి విందు చేయుట ఎటులు? ఉపవాసమును ఆధ్యాత్మికపు విందుగా మార్చుట ఎటులు? ఇవి తెలిసికొన తగినవి.

నా 76వ జన్మదినము ప్రతి సంవత్సరమునందువలె దొర్లి వచ్చుచున్నది. ఈ జన్మదినము నాటికి అర్హతను పొందుటకు ఉపవాసము ప్రారంభించితిని. అంతరాత్మ సూచించినట్లు చేయుటకు నేను సదా కోరుచుందును. నా ఆంతర్య భావనలను, ఆధ్యాత్మికపు విందును గురించిన నా భావములను 'శాంతి' పాఠకులతో పంచుకొనుటకు తలవనితలంపుగా అనుకొని, వ్రాయుచుంటిని.

"Man shall not live by bread alone but by the Spiritual Food".

అని మహనీయులు నుడివి యున్నారు. ప్రాక్పశ్చిమదేశములలో, లోక మంతటిలో రొట్టె అన్నములతో ప్రజలు తమ శరీర పోషణమును జరుపుకొనుచున్నారు. దీనికై, దుర్లభమైన మానవజన్మయొక్క సార్థకతను గమ్యస్థానమును మరచి, ప్రవృత్తి మార్గమున జీవించుచు, శరీర పోషణమునకు, ధనసంపాదనకు తమ జీవితమును అమ్ముకొని, అమూల్యమైన తమ కాలమును వ్యర్థము చేసికొనుచు, జీవించుట చూడ, చాలవిషాద కరము. ఇట్టి ప్రవృత్తిపరులకు ఆధ్యాత్మిక విందుయొక్క వాసనయైనను గ్రహించుట దుర్ఘటము గదా!

మానవుడు రొట్టె, అన్నములతోనే జీవింపరాదు. ఆధ్యాత్మికపు విందులతో గూడిన దివ్యజీవనము ముఖ్యావసరము. అని పెద్దలు నుడివిరి. రుచికరమైన లౌకికాహారము

లేకుండ ఒక్కరోజైనను ఉండ జాలని మానవుడు, ఉత్తమమును దుర్లభమును అయిన మానవ జన్మకే ఆధారమును గమ్యస్థానమును అయిన ఆధ్యాత్మికపు ఆహారమును దివ్యజీవనమును మరచి, నెలలు, సంవత్సరములేగాక, యావజ్జీవితమును వ్యర్థపుచ్చు చుండుట చాల విచారకరము. ఆధ్యాత్మికపు ఆహారము రుచి అమృతమువలె మిగిలిన అన్ని రుచులకంటెను శ్రేష్ఠము. దానిని రుచి చూచిన అదృష్టవంతులకు ఏ ఇతర రుచులైనను విషతుల్యములు.

అనుభవము కావలసినది అనుభవము ఆత్మానుభవమే ముఖ్యావసరము–నే నిప్పుడీవ్యాసమును పూజామందిరము ముందు వరండాలో, సూర్యరశ్మిలో మునిగియుండి, మీ యందరి శ్రేయస్సును అభిలషించుచు, వ్రాయుచున్నాను.సూర్యరశ్మి నుండి గూడ మనము శక్తిని గ్రహించి, ఆరోగ్యము పొందగలము. ప్రతికిరణము ఆరోగ్యకరము. గదులలో, చీకటికొట్లలో ఇది సాధ్యముకాదు. రండు, వెలుపలికి రండు–ప్రతిదినము, దినమునకు 10, 15 నిముషములైనను సూర్యరశ్మిలో కూర్చుండి, ధ్యానము చేయుడు. ఇది మీ మీ ఆధ్యాత్మిక శక్తిని వృద్ధిచేయును–మీ అజీర్ణరోగములను గూడ నిర్మూలించును –సూర్యభగవానుడు మనకు స్థిరముగ ఆయురారోగ్యములను ప్రసాదించెడి నిజమైన గురువు.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః,
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః॥

అమృతము మీకై వేచియున్నది; మిమ్ము ఆహ్వానించుచున్నది.

పరుగుపరుగున రండు;
కోటికిరణములతో,
కోటి కంఠములతో,

సూర్యభగవానుడు మిమ్ము ఆహ్వానించుచున్నాడు–ఎడతెగని ఆధ్యాత్మిక శక్తిని ఒసగుచున్నాడు; మీ తేజస్సును ఎన్ని మడుంగులో పెంపొందించుచున్నాడు.

ఇక జలము చూడుడు. ఇదికూడ ఎప్పుడును, ఎన్నివిధములనో, మీకు ఆధ్యాత్మిక శక్తిని కలిగించుచునే ఉన్నది. కన్నులున్న ఫలముగ చూడుడు. చెవులున్న ఫలముగ వినుడు, హృదయము లున్నఫలముగ అనుభూతి పొందుడు. మనస్సు లున్నఫలముగ యోజింపుడు.

నేను స్నానము చేయుచున్నపుడెల్ల, అవతారమూర్తులు అందరు నాలోనే కలరన్న భావనతో స్నానము చేయుదును. ఇది నాకు అత్యంత శక్తివంతమై, ఆనందము కలిగిం

చును. ప్రతి చెంబెడు నీళ్లతో, స్నానము చేసినపుడెల్ల, ప్రాతజన్మ తొలగిపోయినట్లు అగును; క్రొత్త జన్మ కలిగినట్లు ఆనందింతును. ఆధ్యాత్మిక శక్తిని అనుభవింతును. నాకు కలిగెడి ఉత్తేజమును వర్ణించుటకు మాటలు చాలవు. సూర్యరశ్మి మాత్రమే కాదు. జలము మాత్రమేకాదు. గాలి గూడ, పృథ్వి గూడ ఈ శక్తిని పుట్టించును.

రోజూ, అలవాటు చొప్పున, ఆకలి ఉన్నను, లేకున్నను, భుజించుచుందుము. మధ్యమధ్య అల్పాహారములు కూడ, మిత్రులను సన్నిహితులను సంతోషపెట్టుటకై ఆరగించుదుము. సంవత్సరముల తరబడి తినుచున్న యీ పదార్థములలో కొంత మన శరీరములలో మిగిలి యుండును. దీనినే ప్రకృతివైద్యులు మలిన పదార్థము (Foreign Matter) అందురు. ఈ మంచి పదార్థము హరించుటకు ఉపవాసమే గురువు, నెలకు ఒకటి రెండుసారు లైనను, ఏ ఏకాదశి నాడైనను ఉపవాసము చేసిన యెడల, ఈ మలిన పదార్థము హరించి, ఆరోగ్యము, దానిచే శాంతి కలుగును. పూర్తిగా ఉపవసింప లేనివారు పండ్లుగాని, పాలుగాని, మజ్జిగ గాని, ఏ ద్రవపదార్థమునుగాని పుచ్చుకొనవచ్చును.

అచ్చటచ్చట యోగులు, యోగినులు స్థూలమైన ఆహారము లేకుండగనే, ప్రకృతి నుండి కలిగిన ఆధ్యాత్మికశక్తి వలననే జీవింతురని మనము విందుము. హిమాలయ ప్రాంతములలో కొందరు మహనీయులు నిరాహారులైకూడ ఇట్టి శక్తివలననే జీవింతురని చెప్పుదురు. ముమ్మిడివరము నందలి శ్రీబాలయోగి కొన్ని సంవత్సరముల నుండి పాలైనను పుచ్చుకొనుట లేదట.

యోగిపుంగవు లెంతకాలమయినను సజీవులై యుండుటకు వారి నుండియే అమృతము లభించు నందురు. దీనిని గ్రోలువారికి ఆకలి దప్పులు ఉండవు. అపరోక్ష ముగా ఆధ్యాత్మిక ఆహారము లభించుటకు, మూలసూత్రము **"సోఽహమ్"** భావనమే. ఇది మంత్రములకెల్ల మహామంత్రము. ఈ మంత్రము మననము చేయుచుచేయు శ్వాస విశ్వశ్వాస. ఈ విశ్వశ్వాసలో అనంతమైన శక్తి ఇమిడి ఉన్నది. ఉపవాసము చేయజాల కున్నను, వేద సారమైన ఈ క్రింది శ్లోకమును నిరంతరము పఠించుచున్నయెడల, ఒక నూతనమైన విలక్షణ శక్తిని, శాంతిని, ఆనందమును బడయగలరు.

శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో
జీవో దేవసనాతనః
త్యజే దజ్ఞాననిర్మాల్యం
సోహం భావేన పూజయేత్॥

దేహమే దేవాలయము. జీవుడే దైవము. భేదభావమను అజ్ఞానమును నిర్మూలముచేసి, సోహం భావముతో పూజింపుము. నీ ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలలో శాంతిని

పూరింపుము. ప్రతిశ్వాసతో, రేచకపూరములలో నీవు శాంతినే అనుభవించుచున్న యెడల,అదియే నీ ఆధ్యాతిక ఆహారమై పరగును.

EAT TO LIVE, BUT DO NOT LIVE TO EAT

జీవించుటకు మాత్రమే తినుము ; తినుటకే జీవించకుము.

**ఆత్మోయం శాంతి,**
**నిత్యశాంతి యే ఆత్మ.**

భక్తులు రామనామ మనెడి మిఠాయి తినుచు, ఆధ్యాత్మిక అమృతమునుగ్రోలు చుందురు.

ప్రియమైన శాంతి పాఠకులారా! ఇక వేయి మాటలేల? వేయి వ్రాతలేల? నిమీలిత నేత్రులమై, సోహం భావనతో, విశ్వ ప్రేమ వెల్లివిరియు సుశాంతి ప్రసరింప, దివ్య తేజస్సులో విలీనమై, నిరంతర ఆధ్యాత్మిక అమృతమును గ్రోలుచు, జన్మము రహితముకాగా, శాశ్వతమైన బ్రహ్మపదమును పొందెదముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

(శాంతి ఫిబ్రవరి 1970)

# ఎన్నికల సంరంభము

ఎన్నికలలో నున్న యుద్రేకము, పట్టుదల, హడావుడి, గడబిడ, వ్యయప్రయాసలు పెండ్లిండ్లలోను, చివరకు కోడిపందెములలో కూడ నుండవని తలచెదను. నిన్న మా తోట మాలీలు పదిమంది, పండుగ చేసికొని త్వరగ వచ్చెదమని చెప్పి పోయి, కోడిపందె ముల హడావుడిలో పడి ఆశ్రమమును, 'త్వరగ వచ్చెదమనిన వాగ్దానమును, ఎండిపోవు చున్న మొక్కలను–అన్నిటిని మరచిపోయిరి.

ఎన్నికలు కూడ నటులనే సర్వమును మరపించును. మన ఆశ్రమాభిమాని, మన ఆశ్రమ కార్యనిర్వాహక సంఘసభ్యులు, నిరాడంబరజీవి, మిక్కిలి పలుకుబడి, గౌరవ ముగల యొకరిని ఎన్నికల దాసులు కొందరు పట్టుకొని, "అయ్యా! మీరు మాకు తోడ్పడక తప్పదు." అని ప్రాధేయపడుచు, ప్రార్ధన పూర్వకముగ కోరుటచే ఆయన ఏమియు ననలేక, ఎన్నడునెరుగని సందిగ్ధములో పడి "సరే" యనెను. "సరే" అనెడి రెండక్షర ములతో, ఆయన దురవస్థ ప్రారంభమయ్యెను. రాత్రింబవళ్లు నిద్రాహారములు మాని, నూటయిరువది గ్రామములలో ప్రచారము చేయసాగెను. తన సొంత డబ్బుకూడ కొన్ని వందలు ఖర్చుపెట్టెను. అయనకా రోజులలో ఆశ్రమమువైపు వచ్చుటకు కూడ తీరిక

లేకుండెను. పడరాని పాట్లు పడి, ఎన్నడును ఎవరినీ, ఏమియు నడుగని ఆ వ్యక్తి అందరి సహాయమును కోరుచు, చాల ప్రాధేయపడి, ఓట్లు అన్నియు తాను వాగ్దానము చేసినవారికి వేయించినను, తుదకు ఆయన అభ్యర్ధి ఓడిపోయెను.

చాల విచారమైన స్థితి! నేను ఎన్నికలలో నిలబడిన వ్యక్తి అపజయము పొందెనని అంతగా విచారించుటలేదు; గాని అట్టి పని నెన్నడు నెరుంగని మన ఆశ్రమ భక్తవరేణ్యుడు నెల రోజులు పడిన పాట్లు, వ్యయప్రయాసలు అన్నియు బూడిద పాలయ్యెనే అని విచారించసాగితిని. అర్జునుడు శ్రీకృష్ణ భగవానునిట్లడిగెను.

శ్లో॥ అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి॥ గీత. 6-37

అర్జునుడు : ఓ కృష్ణా! ఎవడు శ్రద్ధగలవాడయ్యును, యత్నమున మందముగ నుండుటచే, యోగభ్రష్టు డగుచున్నాడో, వాడు సఫలతను బడయకయే గతిని బడయుచున్నాడు.

శ్లో॥ కచ్చిన్నో భయ విభ్రష్టశ్చిన్నాభ్రమివ నశ్యతి।
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రాహ్మణః పథి ॥ గీత : 6-38

"ఓ మహాబాహో! యోగమునుండి భ్రష్టుడయి బ్రహ్మమార్గమున దారి తప్పి తిరుగు నతడు, చిన్నా భిన్నములయిన మేఘములవలె నుభయభ్రష్టుడయి నశించిపోడు గదా?"

ఈ ఎన్నికలలో, నిద్రాహారములు మానుకొని, రాత్రింబవళ్లు పాటుబడినను, ఓడిపోయిన వారి గతి ఏమగును? వారు ఇందుకు అందుకు కూడ పనికిరాక, ఏ ఆధా రము లేక మేఘమువలె, చెదరి యోగభ్రష్టులై నశింతురా యని అడుగుచున్నాడు.

అప్పుడు శ్రీకృష్ణభగవానుడు : "మంచి చేసినవానికి ఈ లోకమునగాని, పరలోకమునగాని యెప్పుడును నాశనము, హాని కలుగదను నానందకరమగు విషయ మును చెప్పెను. ఈ ఎన్నికలలో నిపుడు పరాజితులయినవారు, ఈ జన్మలో గాకున్నను, వచ్చెడి జన్మలో నైనను గెలిచెదరు. ఈ ఎన్నికలలో పాటుబడినవారి వ్యయప్రయాస లన్నియు యీ ఎన్నికలలో గాకపోయినను, మరియొక ఎన్నికలలోనైన నుపయోగించును. అన్నిటికంటె నాశ్చర్యమైన సంగతి, ఎన్నికల రోజులలో వారు సంపాదించిన డబ్బును నీటివలె పట్టుదలచే పదులు, వందలేగాక, వేలుకూడ ఖర్చు పెట్టుచుందురట. కొందరు ధనవంతులు లక్షలుకూడ ఖర్చుపెట్టెదరని వినియుంటిమి. మొన్నటి ఎన్నికల రోజులలో

ఆశ్రమములో కూడ చాల హడావుడిగా నుండెడిది. రాత్రింబవళ్లు కార్లు, లారీలు, బస్సులు వచ్చుచు, పోవుచుండెడివి. ఆశ్రమమున కెన్నడును వచ్చుటకు తీరికి లేనివారు కూడ ఎన్నికల పేరున ఆశ్రమమునకు వచ్చి మాకు దర్శనమిచ్చుట జరిగెడిది.

ఎన్నికల పుణ్యమా యని ఆశ్రమమునకు కూడ తాము చేయు ఖర్చులలో నిది యొకటి యనుకొని, ధైర్యముచేసి యెకరు రెండు రూపాయలును, మరియొకరొక రూప్య మును ధర్మముకూడ చేసిరి. ఎన్నికల దాసులు, ఎన్నికల పాటలు పాడుచు, ఎన్నికల ప్రచారము చేయుచుండ, మాశాంతి ఆశ్రమవాసులు వారికి శాంతి ప్రార్థన కాగితముల నిచ్చి, శాంతి ప్రార్థన చేయించుచు, ఆదరించి పంపుట యానందము నిచ్చుచుండెను. మా శాంతి ప్రార్థన పత్రముల నిటనే వదలిపోయిరో, వారి వెంట తీసికొనిపోయి వానిని స్మరించుచు దైవీ ఎన్నికలలో నిలుచుటకు ప్రయత్నించుచుండిరో లేదో వారికే తెలియవలయును.

ఈ నూట యిరువది గ్రామములలో ఎన్నికలవారు ఎన్నికలను గురించి అహర్ని శలు అనేకమైన వ్యయప్రయాసలతో నిద్రాహారములను మాని పాటుబడినట్లు, దైవనామ సంకీర్తనమును ప్రతి గ్రామములో చేయించుచు పాటుబడిన, చేయించినవారు, గ్రామస్థ లును-అందరు దైవమునకు చాల సన్నిహితులై యుండియుందురు గదా అని నేను విచారించసాగితిని. నూటయిరువది గ్రామములలో నూటయిరువది భజన కేంద్రములను, సంకీర్తన స్థానములను ఏర్పరచి స్త్రీ పురుష, బాలబాలికలచే-గ్రామస్థులందరిచే అఖండ నామ సంకీర్తనమును చేయించిన, దేశవృద్ధికి, లోకకళ్యాణమునకు తోడ్పడియుండును గదా! నూట యిరవుది గ్రామములలో అననేల? ఎన్నికలవారు దేశమంతటను, ప్రచారము చేసినట్లు దైవభక్తులు దేశమంతటా-అన్ని గ్రామములలో, అన్నిపట్టణములలో కూడ ప్రచారము జేసి, నామసంకీర్తనమును ఆబాలగోపాలముచే అనగ నందరిచే స్మరింపజే యుచు తరించుట ముఖ్యావసరము. ఎన్నికలలో నోడినను, గెలిచినను మనకు మోక్షము రానేరదు. కాని దుర్లభమైన నరజన్మను పూర్వ జన్మ సుకృతముచే బడసియు, దైవీ ఎన్ని కలలో పాల్గొని యందుత్తీర్ణులు కాని యెడల మానవులు అధోగతి పాలగుచు, అత్యుత్కృష్ట మైన మానవ జన్మనే దుర్వినియోగము చేసిన వారగుదురు.

ప్రియమైన పాఠకులారా! శ్రీకృష్ణభగవానుడు గీతలో నరకమునకు మూడు (Gates) ద్వారము లున్నవని బోధించియున్నాడు.

శ్లో॥ త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।

కామః క్రోదస్తథాలోభస్తస్మాదే తత్త్రయం త్యజేత్॥ గీత : 16–21

"కామము, క్రోధము, లోభము నను మూడును ఆత్మను నాశన మొనరించు త్రివిధములగు నరకద్వారములు. కాబట్టి మనుష్యు డీ మూడింటిని పరిత్యజింపవల యును."

మీరు గాఢమైన నిద్రనుండి మేల్కొనుడు. మీ జన్మహక్కైన ఆత్మ ఎన్నికలను గుర్తింపుడు. దానిలో గెలుపును పొందుటకు ప్రయత్నింపుడు. నామరూపములను పూజిం చుట మానుడు. పేరు ప్రతిష్ఠల వ్యామోహములలో పడకుడు. పట్టుదల అనెడి యూబి నుండి వెలుపలికి రండు. దీప ముండగనే మేల్కొనుడు.

ఈ ఎన్నికల పట్టుదలలు, తీవ్రమైన కక్షలలో ధర్మము, న్యాయము, సత్యము పూర్తిగ నడుగునబడి యుండును. కొన్ని గ్రామములలో కొందరు దేవతారాధనపరులు ఎన్నికల పేరున కొంత డబ్బు సంపాదించుట కిదియే సమయమని, అభ్యర్థులకు ఓట్లు నాశ పెట్టుచు, పెద్ద పెద్ద మొత్తములను తీసికొని, ఓట్లన్నియు రెండవ పార్టీవారికి వేయించితిమని, నవ్వుచు, చంకలు కొట్టుచుందురు. "నా ఓటును మీకే ఇచ్చెదను" అని చెప్పుచు, డబ్బు కూడ తీసికొని, లోపల నెవరును జూచుటలేదనుకొని మరియొకరికి ఆ ఓటును వాగ్దానము తప్పి ఇచ్చుట అసత్యము, పాపము కాదా? ఎవరును చూడజాల కున్నను సర్వసాక్షి స్వరూపుడగు దైవము జూచుటలేదా? దైవము కన్నులలో నిసుక చల్లుటకు ప్రయత్నించుచున్నవారు తమ కన్నులనే యెప్పటికైనను పోగొట్టుకొందురు.

అమెరికా దేశపు ప్రెసిడెంటు, ఆదర్శపురుషుడు నయిన లింకను మహనీయుడు, తన ఎన్నికల ప్రచారములో ప్రజల ఓట్లను తన కిమ్మని నెన్నడు నడిగియుండలేదట, "మీ కెవరియందు నమ్మకమున్న వారికే మీ ఓటు నిమ్మని" చెప్పెడివారట. అట్టి మహ నీయులు చనిపోయినను, ఇంకను జీవించియున్నట్లు యుందురు. ఇక పాపభీతియైనను లేకుండ, నాలుగు డబ్బులు యెటులనైనను సంపాదించుచు యెన్ని అబద్ధములైనను ఆడి, యెందరికైనను హాని గల్గించి యెంతమంది అమాయకుల నయినను అణచివేసి జయమునే పొందవలె నన్నవారే బ్రతికియుండియు చనిపోయినవారి వలె జీవన్మృతులయి భూమికి భారముగ జీవించుచుందురు. కాని, దైవీ న్యాయము ననుసరించి యెవరు చల్లిన విత్తనముల ఫలితమును వారే అనుభవించ వలసియుండును.

నేను వ్రాయు వ్రాతలు ఇపుడు కొందరికి కష్టముగ తోచవచ్చును. కాని, దైవసన్నిధిని చేరుచున్నపుడు, మానవావధిని పొందినపుడు, ఈ కఠినమైన సత్యములే

అమృతతుల్యముగ నుండును. దైవీ ఎన్నికలు సంవత్సరమునకో, మూడు సంవత్సరములకో రావు. ఈ ఎన్నికలు మీకెపుడు ఉంటూయున్నవి. ఈ ఎన్నికలలో మీరు సైతానుతో, కించిజ్ఞత్వమైన గుణములతో, హోరా హోరీగా నహర్నిశములు పోరాడి, చివరకు తామసగుణములను సాత్విక గుణములచే జయించి, ఆత్మస్థానమును ఒడసి, విముక్తులయ్యెదరు. అమూల్యమైన మీ కాలమును పసిబిడ్డలవలె ఆటవస్తువులను పూజించుచు, కీనీడల వెనుక పరుగెత్తుచు, వ్యర్థము చేయవలదు.

కృపామయుడైన, మీ అంతర్య హృదయవాసియైన దైవము మీ ఆధ్యాత్మిక జీవితములలో అఖండమైన జయము నొంసగుచు బ్రోచుగాక! ఇదియే మీ శ్రేయస్సును, వృద్ధిని, శాంతిని కోరుచు మిమ్ము ప్రేమించెడి మీ సోదరుని ప్రార్ధన!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః।

(శాంతి ఏప్రిల్ 1955)

# ఏమని పిలుతునురా !

ఈమధ్య నేలనో, తలవని తలంపుగా, అప్రయత్నముగా, నా అంతరాత్మ, దైవసన్నిధిని ఆంతర్యమున, బాహ్యమున, అన్నివైపులను, అంతటా అనుభవించుచు "తరుచు ఏమని పిలుతునురా" అని ఆంతర్యమున ప్రశ్నించుచుండుట నా అంతట నాకే ఆశ్చర్యముగా దోచుచుండును.

ఈ సందర్భములో శ్రీ త్యాగరాజులవారి యీ క్రింది వ్రాయబడిన కృతి జ్ఞప్తికి వచ్చుచుండును.

**ఎవరని నిర్ణయించేదిరా ! నిన్నెట్లా ఆరాధించేదిరా !**

దేవామృతవర్షిణి రాగము – అదితాళము

ప॥ ఎవరని నిర్ణయించేదిరా ! నిన్నెట్లారాధించేదిరా ! నరవరా ॥ఎవ॥

అ॥ శివుడవో? మాధవుడవో? – కమలభవుండవో పరబ్రహ్మావో ॥ఎవ॥

చ॥ శివమంత్రమునకు మాజీవము
మాధవమంత్రమునకు రాజీవము
యీవివరము తెలిసిన ఘనులకు మ్రొక్కెద
వితరణగుణ శ్రీత్యాగరాజవినుత ॥ఎవ॥

ఓ శ్రీకృష్ణభగవానుడా అని పిలిచిన ఆయన, బృందావనము నుండియో ద్వారకనుండియో వచ్చుటకు కొంత ఆలస్యమవ్వచ్చును.

ఓ యేసు ప్రభువా అని పిలిచిన, ఆయన జరూసలం నుండియో బెతలహాం నుండియో వచ్చుటకు కొంతకాలము పట్టవచ్చును.

ఓ అల్లాదైవమా మహమ్మదు ప్రవక్తా అని ప్రార్థించిన ఆయన అరేబియాలో యున్న మక్కానుండియో మదీనా నుండియో వచ్చుటకు కొంతకాలము పట్టును.

"ఓ బుద్ధభగవానుడా, అనిపిలచిన ఆయన" సారనాథు నుండియో గయ నుండియో వచ్చుటకు కొంత ఆలస్య మవవచ్చును.

ఓదీన బాంధవా, భక్తశరణాగతా ఆశ్రితరక్షకా అని పిలచిన, ఏ భక్తులనో రక్షిం చుచు, ఏ దీనులనో గాపాడుచు మన వద్దకు వచ్చుటకు కొంత కాలము పట్టవచ్చును.

దైవము సర్వాంతర్యామియైనను, దైవభక్తులు వివిధ మతములవారు, వారి వారి సాంప్రదాయములను, భక్తిశ్రద్ధలను, నమ్మకమును బట్టి ఏ ఏ నామములతో పిలిచినను దైవము భిన్నముగా అన్యముగాయున్న పిలుపును వినుటకు, దూరముగాయున్న వచ్చుటకు కొంచమైనను కాలము పట్టుచుండును.

దైవము ఎంత దూరముగా యుండెనని భావించి,భక్తులు పిలిచిన ఆయన వచ్చుటకు అంత ఆలస్యమగుచుండును. విష్ణులోకములో యున్న నారాయణమూర్తిని పిలచిన, ఆయన అచ్చట నుండి రావలెనుగదా.

దూరముగా యుండెనని భావించి పిలిచిన, దైవము దూరము నుండి రావలెను. దగ్గరలో యుండెనని భావనతో పిలువబడిన దైవము దగ్గరనుండియే వచ్చును.

### మన లోకశాంతి ప్రార్థనను విమర్శింతము

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా ! మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటనూ నిండియున్న ఓ సర్వాంతర్యామీ మా లోపల ప్రతి అణువునందు యిమిడి యుండి మా హృదయములకు హృదయము మనస్సులకు, మనస్సు, శ్వాసలకు శ్వాస, జీవనములకు జీవనము, ఆత్మ లకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా, ప్రేమైకమూర్తీ నిన్ను తెలుసుకొను భాగ్యమిప్పుడు ఇచ్చుటనే ప్రసాదింపుడు.

ఈ చిన్న ప్రార్థనలో దైవమిదివరకే, మన హృదయమునకు హృదయముగా మనస్సునకు మనస్సుగా శ్వాసకు శ్వాసగా బరగుచుండెను గాన ఆయన యే స్వర్గలోకము నుండియు, రానవసరములేదు. దైవమిదివరకు వచ్చి మన హృదయ పీఠమును అధిష్టించి యుండెను. మనమా దివ్య తేజస్సును ఆ తేజోమయమూర్తిని గుర్తించుటే తరువాయి మన మాయనను పిలువనవసరముగూడ లేదు. ఆయనయే, మనలను నిరంతరము పిలుచుచుండెను. దైవము సర్వాంతర్యామియై సర్వహృదయవాసియై తన బిడ్డలను తాను, సదా పిలుచుచుండెను.

దైవ పిలుపును వినగలిగినవారు ధన్యులు! చెవులుండియు వినరేల? కండ్లు వుండియు చూడరేల? అని ఒక అవతారమూర్తి అడుగుచుండెను, ఇప్పుడు గూడ ఆయన అడుగుచునే యుండెను. ఆయన దివ్యవాక్కు మీకు వినిపించుట లేదా?

దైవమునుగుర్తించుటకు ఇదియే పరమ పావనమైన క్షణము. ఆయనను పొందుటకు ఇదియే మహదవకాశము. స్వర్గరాజ్యము సామీప్యముననే యున్నది దైవము చెయ్యిచాచిన అందెడిలాగున యుండెనని జెప్పబడెను.

ఆగుడు అటుల భిన్నముగా భావించి చేతికందినంత దగ్గరలో యుండెననుటగూడ అంతసరిగా లేదు.

స్వర్గరాజ్యము, సమాధిస్థితి, దగ్గరగానేగాక లోపలనే యున్నది.

**"స్వర్గము నీలోనె యున్నది"**

ఏలనన **"అదియే నీవు" తత్త్వమసి,** వాడేవీడు, వీడు, వాడు అననేల? అందరినీ ఆ దివ్యస్వరూపము గాంచెడివారి జీవితములే ధన్యవంతములైనవి.

శుకమహర్షి తపస్సు జేయుటకు వెళ్ళిపోవుచుండ ఆయన తండ్రి వ్యాసుడు శుకా శుకా అని పిలువగా చెట్లు చేమలు పర్వతములుగూడ పలికినవట!

ప్రశ్న : ఎందుచేతను జడాజడములు, చేతనాచేతనములు శుకా శుకా అని పిలువగనే జవాబిచ్చెను.

జవాబు : శుకమహర్షి సర్వాంతర్యామి సర్వవ్యాపకుడు జీవనముక్తుడు నిన్నగాక మొన్నవచ్చిన మట్టిముద్దయే తానని తలచిన బాహ్యశరీరరమునకు కట్టుబడియుండక విశ్వాత్మగా సర్వాంతర్యామిగా, శుఖదేవునిగా, భక్తప్రహ్లాదునిగా సర్వములో దైవమును గాంచుచు దైవానుభవముతో జీవించుచున్న వారి జీవితములు పరమపావనమైనవిగదా!

అన్ని నదులును ఒకే సముద్రమును చేరుచున్నట్లు, భక్తిశ్రద్ధలతో, ఏ నామముతో పిలిచినను, ఏ సాంప్రదాయమునకు చెందియున్నను, భక్తులు, నేడుగాకున్న రేపైనను దైవమునే చేరెదరన్న శుభవార్త ఆనందకరమైనదే!

గజేంద్రుడు, ద్రౌపది, ప్రహ్లాదుడు మొదలైన భక్తవరేణ్యులును దైవము వారివారి అవస్థలలో పిలువగనే కాపాడియుండెనని మనము వినియుంటిమి.

ప్రియమైన శాంతిపాఠకా! నీవు దైవమును ఏమని పిలుచుచుంటివి. ఎటుల ఆరాధించుచుంటివో యిప్పుడు, నీ జీవితమును నీ మనస్సును నీలోయున్న వాంఛలను సంకల్పములను విమర్శించుకొని రక్షించుకొనుట నీ భావిస్థితికి నీ వృద్ధికి దైవ సన్నిధిని యెప్పుడోగాక యిప్పుడే అనుభవించుటకు తోడ్పడును.

నిశ్శబ్ధ ఘడియలలో, దైవము ముఖాముఖిగా, ఆగుడు, అభిన్నముగా యున్నప్పుడు,

నా అంతరాత్మ, దైవమునకు ప్రీతికరమైన నామధేయము, పేరు ఎద్ది అని నాలో నేను విమర్శించుకొనుచుందును.

అపరోక్షానుభవమైన, ఆంతర్య విమర్శనా ఫలితముగా, ఒక్కొక్కసారి దైవమునకు ప్రీతికరమైన నామము, సూక్ష్మమైన నామము ప్రత్యక్షముగా యున్న నామము "సోహం" యే యని తలచి నాలో నేను యెంతయో ఆనందపడుచు పరవశత్వమును పొందు చుందును.

ఉచ్ఛ్వాస నిశ్వాసములలో **"సోహ"** మే కాగా, సోహం అనగానే, దైవమెచ్చట నుండియో రానవసరము లేదు. దైవతేజస్సు శరీరమంతయు నిండియుండును.

దైవముయొక్క ప్రీతికరమైన, ప్రేమపూర్వకమైన పేరు నామము సోహమే "సోహం" అనుకొన్నంతనే, సోహం శక్తి శరీరమునంతను ఆపాదమస్తకము నింపుచున్నది. అటులనే సోహము ధ్యానం చేయగా ఖండమైన సోహంగా విశ్వాత్మగా, అద్వితీయమై పరబ్రహ్మ స్వరూపముగా గుర్తింపబడుచున్నది.

సొహం మంత్రమును, మన నోటితో ఉచ్చరించనవసరములేదు. అందుచేతనే, దానిని అజప గాయత్రి మంత్రమని బ్రహ్మవేత్తలు జెప్పితిరి. అది మనము స్మరించ కుండగనే, నిరంతరము మన శ్వాసలు వ్యక్తమగుచున్నది.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మధ్యేయం స ముముక్షభిః

అద్వితీయమైన ఓంకారమనే ఏకాక్షరమును ధ్యానము జేయువారు ముముక్షుత్వ మును బడయుచున్నారు.

ఓంకారమే దైవముయొక్క ముద్దుపేరు

ప్రణవమే దైవమునకు పరిపూర్ణమైన నామము.

శ్లో॥ ప్రణవో ధనుః శ్శరోహ్యాత్మా
బ్రహ్మతలక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం
శరవతన్మయో భవేత్॥

"ఓం" అను ప్రణవము ధనస్సు–ఆత్మ బాణము. ఆ బాణమునకు లక్ష్యము బ్రహ్మము. ఆత్మ నిగ్రహపరునిచే నది కొట్టబడవలయును, లక్ష్యవస్తువుతో బాణమెట్లు కలియునో బ్రహ్మములో ఆత్మ అట్లు సమైక్యతను జెందును.

శ్లో॥ ఓంకారస్సర్వ వేదానాం, నారత్తత్త్వప్రకాశకః
తేనచిత్త సమాధానం ముముక్షాణం ప్రకాశ్యతే ॥

తా॥ సర్వవేదములకు సారము ప్రణవమైయున్నది. అదియే బ్రహ్మతత్వమును

బోధించుచున్నది. ఆ ఓంకారాలంబనముచే, మనశ్శాంతి గలుగుచున్నది. కాన ముముక్షువులకై ఓంకారము ప్రకాశింప జేయబడుచున్నది.

శ్లో॥ ఓమిత్యేకాక్షరం బ్రహ్మాత్యాహరమామను స్మర౯
యః ప్రయాతిత్యజన్ దేహం నయాతిపరమం గతిమ్॥

తా॥ ఎవడు "ఓం" అను ఏకాక్షరమును ఉచ్ఛరించుచు పరమాత్మను ధ్యానించుచున్నవాడై దేహమును వదలిపోవునో అతడు సర్వోత్కృష్టమైన మోక్షపదవిని పొందుచున్నాడు.

ఓమ్ సర్వేషాం స్వస్తిర్భవతు
ఓమ్ సర్వేషాం శాన్తిర్భవతు
ఓమ్ సర్వేషాం పూర్ణంభవతు
ఓమ్ శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

(శాంతి జనవరి 1957)

## ఏబది రూపాయలు

శ్రీయుత పరమాత్మ ప్రకాశ్‌గారు ఉత్తరదేశపువాసులు, చిరపరిచితులు, ఆశ్రమ భక్తులు, ఆశ్రమాభిమానులు, నేను కైలాస ఆశ్రమములో, ఆరు సంవత్సరములు మౌనముగా యున్నప్పుడు అహ్మదాబాదు నుండి వచ్చి నావద్ద నెల రోజులుండి ఆశ్రమ సేవచేయుచు ప్రార్ధన ధ్యానాదులలో వృద్ధి అయ్యెడి వారు. ఆరోజులలో 'ప్రణవ జపము' OM JAPA అనెడి చిన్న పొత్తమునకు వారు పీఠిక వ్రాసి, దానిని అచ్చు వేయించుటలో తోడ్పడిరి.

తరువాత విదేశములకు వెళ్ళి రష్యా, ఇంగ్లండు మొదలగు తావులలో గవర్నమెంటు ఉద్యోగిగా నియమింపబడి మాతృదేశమునకు సేవ చేయుచుండిరి. ఈమధ్యనే జర్మనీలో యుండి స్వర్ణోత్సవమునకు విలువైన టేపురికార్డరు యంత్రమును, మేము కోరకుండగనే ఆశ్రమమునకు యిది చాల ముఖ్యావసరమని ప్రేమతో పంపిరి. దాని సహాయముతోనే, నీలగిరి శాంతి కేంద్రములో భజనలు, ఉపన్యాసములు, అన్ని మతస్థుల ప్రార్ధనలు గూడ తీసి ఇపుడు శాంతి ఆశ్రమంలో అందరకు వినిపించుట జరగుచున్నది. శ్రీ పరమాత్మ ప్రకాశ్‌గారి భక్తి ప్రేమలను, వారికియున్న ఆశ్రమాభి మానమును తెలియచేయుటకైవారి గురించి యింతగా పీఠిక వ్రాయవలసివచ్చెను.

ఆకాశములో ప్రకాశించుచున్న నవగ్రహముల గురించి వినియేయున్నాము.

హఠాత్తుగా ఒక గ్రహము (Planet) ఆకాశము నుండి తోటపల్లి కొండలలోనికి దిగినట్లు శ్రీ ప్రకాశ్‌గారు జర్మనీ నుండి ఆశ్రమములో పడిరి–అనగా యిచ్చటకు వచ్చుచున్నట్లు మాకు తెలియపర్చకుండగనే వారి స్వగృహమునకైనా వెళ్ళకుండగా సరాసరి ఆశ్రమమునకే ముందుగా వచ్చిరి. వారున్న రెండు రోజులు ఆశ్రమ ప్రార్ధనలలో పాల్గొని చక్కనైన ఉపన్యాసములిచ్చి గురుకుల బాలబాలికలకు, అనువైన బోధలు చేసిరి. శ్రీ రామతీర్ధకాలేజి వారికిగూడ వారి సందేశము నొసంగిరి.

చి॥ జ్ఞానేశ్వరి చేయు అఖండమైన స్వార్ధరహిత సేవకు చాల ఆనందించుచు ఆమెకు ఏబది రూపాయలు ఒక నియమముతో అర్పించితిరి. గాని చి॥ జ్ఞానశ్వరికి ఎవ్వరెవ్వరేమి అర్పించినను అది ఆశ్రమమునకే యివ్వమని వారిని కోరుచుండును. గాన ఈ ఏబది రూపాయలు మాత్రము, ఆశ్రమమునకు వాడవలదనియు, ఆమె స్వంత ఖర్చులకే వాడవలసినదనియు వారు ప్రార్ధన పూర్వకముగా కోరుచు అర్పించితిరి. ఇక వేరు గత్యంతరములేక, ఆయనకు నిరాశ కలుగుకుండ ఆ విరాళమును ఆమె తీసుకొని, నా వద్దకు తీసుకొని వచ్చి నాకు అర్పించి శ్రీ ప్రకాశ్‌గారు వెళ్ళిన తరువాతను చి॥ జ్ఞానేశ్వరి నాకు ఒక ఉత్తరము వ్రాసెను.

దానిలో తనకు చిన్న కోరిక యున్నదనియు, దానిని తప్పక నేను నెరవేర్చెదనని నమ్ముచు ఈ క్రింది ఆనందమైన విషయమును విపులముగా తెలియచేసెను. ఆమె కోరికి ఏదియనగా–తనకు స్వవుపయోగార్ధమై యీయబడిన ఏబది రూపాయలు, నోరులేని మూగజంతువుల సేవలో వాటి ఆహారమైన నూకలు, తౌడు మొదలైనవి తెప్పించుటకు అనుజ్ఞ యివ్వమని కోరుచు ఆ వుత్తరములో వ్రాయబడెను.

ఆ ఉత్తరం చూచి చి॥ జ్ఞానేశ్వరికి తోటి మానవులయందే గాక, మూగజంతువుల యందున్న అపార ప్రేమకు ముగ్ధుడనైతిని. ఇతరుల గురించి జీవించెడివారి జీవితములు ధన్యవంతములు. అంతా దైవమైయుండ–దైవము తప్ప మరి అన్యమైనది, ఎచ్చటను, ఎప్పుడును లేనపుడు "ఇతరులు" అనెడిది యెచ్చట యున్నది? దైవమె అందరి రూపముగా, అన్నింటి రూపముగా, వివిధ నామరూపములలో మనము ప్రేమించి, సేవచేయుచు, తరించుటకు మనముందు అనుక్షణము ప్రత్యక్షమవుచుండెను. అందరి యొక్క ఆనందసుఖములే తనవిగా భావించి, ఎంత శారీరక శ్రమనైనను ఓర్చి, నిత్యానం దములో తృప్తిగా జీవించెడి చి॥ జ్ఞానేశ్వరి–నిత్య జీవితానుష్టానమును గుర్తించెడివారికి ఈ రహస్యము తెలియును.

అందరిలో సర్వాంతర్యామియై దైవమును గాంచుచు, విశ్వప్రేమతో జీవించెడివారి జీవితములు మహోత్కృష్టమైనవిగదా! చీమలో, దోమలో గూడ దైవమేయని శ్రీత్యాగ

రాజులు కీర్తించి యుండిరి. ఆకాశమున ప్రతి నక్షత్రము యొక్క ప్రకాశములోను, పృథ్వియందు ప్రతి పుష్పము యొక్క సువాసనలోను, దైవసన్నిధిని, గుర్తించెడి వారె జ్ఞానమూర్తులు, వారె నిజమైన దైవబిడ్డలు, దైవము సకల చరాచరములను శాంతితో బ్రోచుగాక!

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

(శాంతి జూలై 1968)

## ఏమని పిలుతునురా?

శ్రీ త్యాగరాజులవారు, సంగీత విద్వాంసులేగాక, మహాభక్తులని అదరూ యెరింగి యున్నదే. వారి కీర్తనలు, కృతులు అన్నియు తెలుగులో వ్రాయబడినను, తెలుగు అక్షరము లైననూ యెరుగని తమిళులు, కన్నడులు, మళయాళీలు గూడ శ్రీ త్యాగరాజులవారి కృతులు చిన్నచిన్న తప్పులతో నైనను, పాడుచుండుట చాల ఆనందకరముగా యుండును.

ఆశ్రమ భక్తులైన, శ్రీబాలమురళీ కృష్ణులను, వారి జన్మ దినము జ్ఞాపకార్ధముగా ఒక చిన్న కృతి చేసి పంపమనగా, యీ క్రింది కీర్తన ప్రేమతో వ్రాసి పంపిరి.

రాగం : రాగవర్ధిని, తాళం : రూకమ్

ప॥ గానసుధారనమే పరమానందదాయకమో మనసా

అ. ప॥ ఆ నారద హనుమదాదులు అనవరతముపాసించే ॥గా॥

చ :- గోవర్ధన గిరిపై, గోపీమనోహరు డాల మేపుచు

మురియుచు, గో, గోపలకులను ముగ్ధులజేయు

మురళి - గానసుధారసమే పరమానంద దాయక మోమనసా ।

ఈ పై కీర్తనను, కూని రాగములతో తరచు, ఏకాంతముగా యున్నప్పుడు, నిశ్శబ్ద ఘడియలలో పాడుచుండ -తలవని తలంపుగా, శ్రీ త్యాగరాజులవారి “ఏమని పిలుతు నురా” అనెడి మధురమైన కీర్తన జ్ఞప్తికి వచ్చుచు, నన్ను ముగ్ధునిగా జేయుచుండును.

దైవము, శివుడా, మాధవుడా, రాముడా, కృష్ణుడా, బుద్ధుడా, ఏసుక్రీస్తా, జోరాష్టరా, గురునానక్కా, కబీరుసాహెబా? ఏమని పిలుతునురా?

నిన్ను, ఏమని పిలువమందువు?

అని, నేను ఒక్కొక్కసారి, నిశ్శబ్ధఘడియలలో, ఎవ్వరూ నా చెంత లేనప్పుడు, అతనితో ముఖాముఖిగా యుండి ఏమని పిలుతునురా. అని ఆయననే అడుగుచుందును.

ఇది కొందరకు ఆశ్చర్యముగా తోచినను, ఆ నిశ్శబ్ధ ఘడియలలో అంతర్యవాణి యిటుల చెప్పుచున్నట్లుండును.

నా ప్రియమైన బిడ్డా! నీవు పిలిచినా, పిలువకున్ననూ నేను సదా నీ హృదయ మునకు హృదయముగా, అహర్నిశలు అంతర్యజ్యోతిగా, నీ హృదయ కుహరమునందే వెలుగుచుంటిని. గాన నిశ్శబ్ధములో నా సన్నిధిని అనుభవించుచు ఆనందముగా, శాంతిగా యుండుము, నివృత్తి నుండి ప్రవృత్తిలోనికి రాగానే, వేషభాషలు, తాళవాయిద్యములు, భజనలు, ఉపాన్యాసములు, బోధలతో, భక్తులనేక నామములతో నృత్యగానములు చేయుచుండ "ఏమని పిలుతునురా!" అని అప్రయత్నముగా, అంతర్యమునుండి ప్రశ్న వచ్చుచుండును.

రామా! యని పిలచిన రాముడు అయోధ్య నుండియో దండకారణ్యము నుండియో పరుగెత్తుకొని వచ్చును. కృష్ణా! యని పిలచిన కృష్ణుడు-బృందావనము నుండి తన రాసక్రీడలను, గోవులను మేపుటగూడను మాని పిల్లనగ్రోవితో పరుగెత్తికొని వచ్చును.

బుద్ధా! యని పిలిచిన బుద్ధుడు కపిలవస్తు నుండి వచ్చును.

ఏసుప్రభువా! యని పిలిచిన క్రీస్తు బెతులహాం, జర్సులేం నుండి పరుగెత్తుకు వచ్చును.

నేను వ్యాసమును, నీలగిరి శాంతి కేంద్రములో తెల్లవారుఝామున వ్రాయుచుండ, మసీదు నుండి "అల్లాహో అక్బరు! అందరు నిద్రనుండి మేల్కొనుడు. ప్రార్ధనకు రండు" అనెడి దైవ పిలుపు వినవచ్చుచున్నది. అప్పుడు మహమ్మదు ప్రవక్త జ్ఞప్తికి వచ్చి, ఓమహమ్మదా! యని పిలువగనే. మహమ్మదు అరేబియా నుండి పరుగెత్తుకొని వచ్చుచున్న ట్లుండును. ఎవ్వరిని ఏ నామముతో సంభోదించినా అందరు నా పిలుపును గౌరవించి నావైపునకు ప్రేమతో వచ్చుచున్నట్లే యుండి, వారి సన్నిధిని అనుభవించుచు తృప్తిని బడయుచుందును. కొందరు అల్పజ్ఞులు రాముని, కృష్ణుని ముందుగా ఏల పిలచుచుం టివి. మా క్రీస్తు నేల పిలువవు అని యెగ్గుపట్టుచు శంకించి వచ్చును. పార్శీమత స్థాప కులైన జారాస్టరుని ఏల పిలువలేదని తలచవచ్చును. మీరాబాయి, సక్కుబాయి, శారదా దేవి, పాండురంగ, పురందరదాసు, రామకృష్ణ వివేకానంద, రామతీర్థ వగైరాలు మమ్మిం కను ఏల పిలువలేదని తలచుచు వేచియుండవచ్చును.

ఈ అవతారమూర్తులందరిని తృప్తి పరచుటకు, నాకు ఒక్కటే చక్కనైన రాజ మార్గము. చిన్నతనము నుండియు తట్టుచుండుటచే, అందరిని ప్రణవము, ఓంకార ముతోనే పిలచుచుందును. అందరు మహాత్ములు, మహనీయులు, అవతార మూర్తులు ప్రాక్-పశ్చిమములలోయున్న భక్తులందరూ - ఓంకారములోనే యిమిడియుండిరగదా!

విశ్వప్రాణమే 'సోహం' మంత్రము, ఓంకారము 'సోహం' లోనె. విశ్వశక్తిలోనె యిమిడియున్నది. కృష్ణుని పిల్లనగ్రోవివలె, యీ శరీరమును గూడ పైనుండి క్రిందవరకు పూర్తిగా, స్వార్ధరహితముగ ఖాళీచేసి, ప్రణవగానము 'ఓం' అని పిలచిన, లోకములో యున్న ప్రవక్తలు, అవతారమూర్తులు, గానసుధాకరులు, జ్ఞానులు, భక్తులు అందరు నావైపే వచ్చుచున్నట్లు, ఆనంద పరవశత్వముతో నిండి, ఒక్కొక్కసారి యీ మహాత్ములం దరినీ, ఒకేసారి దర్శించుటచే, వుక్కిరిబిక్కిరి యైనట్లు, కొద్దిగా కంగారు పడచుందును. కించజ్ఞత్వముతో, బావిలోని కప్పవలె, కూపస్థమండూకమువలె జీవించక, విశాలమైన హృదయముతో, విశ్వప్రేమతో, సర్వములో దైవమును గాంచుచు అద్వితీయుడైన, ఆ పరమాత్మనే చీమలో, దోమలో మానవకోటి అంతలో దర్శించుచు జీవించుట ఎంతో అదృష్టము!

ఈ సందర్భములోనే, సర్వవ్యాపకత్వము, సర్వశక్తి, సర్వజ్ఞత విశ్వప్రేమను వ్యక్తపరచెడి–ఒకచిన్న అనుభవనీయమైన పూర్వగాధ జ్ఞప్తికి వచ్చుచున్నది.

శ్రీ శుకదేవులు, శ్రీ వ్యాసమహర్షి పుత్రులు. ఆయన తండ్రిని విడచి, సర్వమును సన్యసించి, అడవుల వెంట వెళ్లుచుండ, శ్రీవ్యాసులు, సర్వము తెలసియున్న పెద్దలైనను, పుత్రవ్యామోహముచే, శ్రీ శుకుని వెదకుచు, ఆయన వెళ్లిన దారిని పరుగెత్తుచు ఓశు కా! శుకా!శుకా! యని పిలుచు చుండ చెట్లు, పుట్టలు విశ్వమంతయు వ్యాసుని పిలుపునకు –శుకుడు అచ్చటనే, అన్నింటిలో, అందరిలో సర్వాంతర్యామిగా యున్నట్లు సమాధానము వచ్చెనట.

సర్వములో, సర్వకాల సర్వావస్థలలో అద్వితీయుండైన ఆ దైవమునే. ఆంతర్య జ్యోతిస్వరూపునే, అఖండ సచ్చిదానంద మూర్తినే గీర్తించుచు జీవించుట ఎంతటి అదృష్టము!

విశ్వగాన సుధారసమే పరమానంద కరము! ప్రియమైన శాంతి పాఠకులారా! రండు! రండు! నేడే మనది రేపు మనదిగాదు.

ఈ పావనమైన, పవిత్రమైన క్షణమునందే ఆ విశ్వప్రభువును, ప్రణవ స్వరూపుని, హృదయపూర్వకముగా పిలచుచు యిప్పుడే, యిచ్చటనే బ్రహ్మసాక్షాత్కారమును, నిర్వికల్పమును, పూర్ణశాంతిని పొందెదముగాక!

లోకాస్సస్తా స్సుఖినో భవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

(శాంతి ఏప్రిల్ 1969)

# ఏకాదశి

ఏకాదశి పరమ పవిత్రమైన రోజు. ఆ పావనమైన రోజున శారీరకముగా, మానసికముగా, ఆధ్యాత్మికముగా వృద్ధిచెందుచు తరించవచ్చును.

చి॥ జ్ఞానేశ్వరి, చి॥ శాంతి నియమముగా ప్రతి ఏకాదశి ఉపవాసము చేయుచుండ, నాకుగూడ ఏకాదశి చేయవలయునని యుండును. గాని వారు నేను యిదివరకే అన్ని ఏకాదశి వ్రతములేగాక, 40రోజులు ఉపవాసముగూడ జేసియుంటిని గాన నేనిప్పుడు ఏ ఏకాదశి ఉపవాసములు చేయనవసరము లేదనిచెప్పి నన్ను తృప్తి పరచుచుందురు.

పూజ్యశ్రీ సనకా రామావుగారు, అనారోగ్యముగా నున్నను యీ పెద్ద వయస్సులో గూడ, చాల నియమముగా, ఏకాదశి రోజున, మంచినీరైనను తీసుకొనకుండ, కటిక ఉపవాసము జేయుచు భక్తులందరకు ఆదర్శనీయముగా, వారి పవిత్రమైన జీవితమును, ఆశ్రమములో, మానవసేవలో గుడుపుచుండుట చాల అదృష్టవంతము. ఎంత ఉపవాస దీక్షలో యున్నను యితరుల సేవచేయుటయే వారికి ఆనందముగా, ముఖ్యమైనదిగా యుండి, ప్రతి క్షణము ఏదో యొక విధమైన సేవచేయుచు వారి కాలమును సద్విని యోగము చేయుచుందురు.

ముఖ్యముగా మనమిప్పుడు ఏకాదశి గురించి తెలుసుకొనవలసిన అంశములు రెండు గలవు.

I ఏకాదశిరోజున ముఖ్యముగా చేయవలసినది. దైవములో ఏకమై ఏకాంతముగా ప్రతిక్షణమును, ప్రార్ధన ధ్యానాదులలో గడుపుట. ఏకాంతముగా గడుపజాలని, దైవములో ఏకమవ్వని ఏకాదశి నిజముగా ఏకాదశి కానేరదు. ఏకాదశికి ముఖ్యమైన అంగము లేక నియమము నివృత్తియే, మనస్సును దైవములో లీనముచేసి, దినదినాభివృద్ధిని గాంచుటయే.

నివృత్తిలేని ఏకాదశి, ప్రవృత్తిమాటలతో గడిపెడి ఏకాదశి. ఉపవాసము చేయు చున్నను యెన్నడును ఏకాదశి కానేరదు.

II ప్రపంచములో సాధారణముగా ఏకాదశి యనగా ఉవవాసము చేయుటే, నిరాహార దీక్ష బూనుటయనియేయని చాలమంది భక్తులు తలచుచు కటిక ఉపవాసములు నియ యముగా, పట్టుదలగా చేయుచుందురు.

ఏకాదశి రోజున బాహ్య పనులు తగ్గించుకొని, నివృత్తిగా ప్రార్ధన ధ్యానాదులతో, సద్గ్రంధపఠనలో గీతాపారాయణము, వేదాధ్యయనములో గడుపుటకు బదులు, కొందరు ప్రవృత్తిపరులు మాటలలో వారి అమూల్యమైన కాలమును వ్యర్ధబుచ్చుట విచారకరము. మాసమునకు ఒక్కసారియైనను దైవములో ఏకమై, మానవజన్మయొక్క గమ్యస్థానమును,

బ్రహ్మసాక్షాత్కారమును అనుభవించుటకు ప్రయత్నించెడి వారి జీవితములు ధన్య వంతము.

ఏకాదశి రోజున కోపతాపములతో నిండి పొడుగు ముఖములతో యుండరాదు. ఏకాదశి మనలోయున్న అహంకార మమకారములను రూపుమాపవలెను. ఏకాదశి జ్ఞాప కార్ధముగా కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములను జయించి, ఆత్మవిదులుగా బరగవలెను.

నిరాహారముచే, ఏమియు ఆహారము తీసుకొననందున, నీర్సముగా యుండి, ఆకలిచే వారి కోపమును, ఇతరులమీద యెంతమాత్రము చూపరాదు. ముఖ్యముగా ఏకాదశిరోజున యెన్ని పరీక్షలు వచ్చినను, శాంతముగా యుండి, ప్రేమనే విశ్వమంతకు ప్రవహింపజేయవలెను.

ఏకాదశి పేరు దలచిన, రుక్మాంగద మహారాజు ఏకాదశి వ్రతము జ్ఞప్తికి తెచ్చును. ఆయన పరిపాలనలో, ప్రజలేగాక, మూగజంతువులుగూడ ఏకాదశి వ్రతమును జేసెడివట! ఆయన ప్రేమను , దీక్షను, శాంతిని జ్ఞప్తిదెచ్చుచు, ఏకాదశి వ్రతమును చేయు వారందరకు నూతనశక్తిని, ఉత్తేజమును శాంతి నొంసగవలెను.

శాంతి ఆశ్రమములో పురాణపండితులగు శ్రీసూర్యనారాయణగారు, ఏకాదశి రోజున, శ్రీవిశ్వనాధాలయములో శాస్త్రోక్తముగా, దేశవృద్ధిని, లోకశాంతిని గోరుచు పూజలు చేయుచుందురు.

ఆశ్రమ ప్రార్ధనాలయములో ఆ పుణ్యదినమున, భక్తులచే భగవద్గీత 18 అధ్యాయ ములు పారాయణ చేయబడుచుండుట ఆనందకరమైన విషయము.

ప్రతి ఏకాదశి ఏదో ఒకరీతిగా మన ఆంతర్యవృద్ధిని, ఆత్మానభవమును గల్గించుచు, ముఖ్యముగా మనలో దాగియున్న తామస గుణములను పూర్తిగా కాల్చి వేయుటకు తోడ్ప డవలెను.

ఏకాదశి గమ్యస్థానము మనోజయమె! దాని హృదయము నిత్యశాంతియే. విశ్వ ప్రేమయే! ఏకాదశియొక్క ఔన్నత్యమైన భావనలు, దాని నియమములు, ప్రవృత్తిపరుల జీవితముల తారుమారై యుండుట విషాదకరము. ఆ మరునాడు రానున్న ద్వాదశి పిండివంటల వైపు మనస్సులను పోనీరాదు. దైవభక్తుల జీవితములలో ముఖ్యములు అముఖ్యములుగా, అముఖ్యములు ముఖ్యముగా తారుమారై యుండరాదు.

నిరాహారదీక్షతో మంచినీరైనను తీసుకొనకుండ, ఏకాదశి రోజున కఠినమైన ఉపవాసము చేయుట చాల ప్రశంసనీయమైన విషయమేగాని, దీనికంటెను ముఖ్యమైనది దైవముతో ఏకమై ప్రార్ధన ధ్యానాదులతో, శాంతిప్రార్ధన, శాంతిమంత్ర పఠనములతో, చంచలమైన మనస్సును అరికట్టి,దైవములో విలీనముచేసి తరించుట–గమ్యస్థానమును

చేరుట, ఏకాదశి ముఖ్యమైన ఆశయము.

ప్రవృత్తిపరులు ఏకాదశి యనగా ఉపవాసము చేయుటయే అని తలచెడివారు చాలమంది గలరు. నిజమైన ఏకాదశి యనగా, ఆనాడు నివృత్తిపరులై, దైవములో విలీనమై, బ్రహ్మసాక్షాత్కారమును బడయుటయే యని గ్రహించిన అనుభవనీయులు అరుదై యుండుట విచారకరము.

**'గతంనాస్తి'** వలకిపోయిన పాలకై విచారించుట అనగా, గడచిన కాలమును గురించి ఆలోచించుటవలన, విలువైన కాలమును వ్యర్థపుచ్చుటయేగాన-ఇకముందు ఏకాదశి వ్రతములు, మనకు బ్రహ్మసాక్షాత్కారమును, అపరోక్షానుభవమునే గల్గించుచు, మనజన్మ హక్కైన బ్రహ్మానందమును గల్గించుచు, దేశవృద్ధికి, లోక కళ్యాణమునకు తోడ్పడుగాక.

ఏకాదశి రోజునైనను, దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలను జయించిన వారమై, మానవకోటికి ఆదర్శముగా, నివృత్తి పరులమై, యీ శరీరములను ఇతరుల సేవలోనో, **"పరోపకారార్థ మిదం శరీరం"** అని శాస్త్రములు నుడువుచున్నట్లు మన జీవితములను సద్వినియోగము చేయుదముగాక!

శ్లో॥ ఏకోవశీ సర్వభూతాన్తరాత్మా
ఏకంరూపం బహుధా యః కరోతి।
తమాత్మస్థం యేను పశ్యన్తి ధీరాః।
తేషాంశాన్తి శాశ్వతీ నేతరేషాం ।

పరమపావనమైన ఏకాదశి జ్ఞాపకార్థముగా, వివిధ నామ రూపములలో-నామరూప రహితమైన సచ్చిదానంద రూపమును గాంచవలెను. అనేకములో ఏకమునే గుర్తించుచు, విశ్వప్రేమతో నిండి, నిరంతరము లోక కళ్యాణమును కోరుచున్న వారి జీవితములు ఆదర్శనీయములేకాక, భక్తికోటికి, నూతనమైన ఉత్తేజమును, అఖండమైన శక్తిని, శాంతిని గల్గించుచు.

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

అసత్తునుండి సత్తునకు, చీకటినుండి వెలుతురునకు, మృత్యువు నుండి అమృతత్త్వమునకు, జన్మరాహిత్యమునకు తోడ్పడుగాక!

హరి ఓం తత్ సత్ ఓం

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!

(శాంతి జూన్-జులై 1969)

# ఐదు క్షణములలో బ్రహ్మ సాక్షాత్కారము

ప్రియమైన శాంతి పాఠకులారా! యీ డెబ్బది నాల్గవ సంవత్సర ప్రారంభమున, మీకు ఒక్క అనందకరమైన వార్తను తెలియపర్చుటకు యీ మనస్సు ఆతురతగా యున్నది. ఐదునిమిషములు గూడ గాదు, ఐదు క్షణములలోనె బ్రహ్మసాక్షాత్కార మనెడిది ఎంత ఆనందకరమైన వార్త! విజ్ఞులు బ్రహ్మసాక్షాత్కారమును పొందుటకు యుగములు పట్టు ననిరి. కొందరనేక జన్మలు, లేక కొన్ని సంవత్సరములైనా ముఖ్యావసరమనిరి. జ్ఞానులు తరచి, తరచి చివరకు కొన్ని మాసములైనను ఏకాగ్రతగా, నిర్జన ప్రదేశములలో తపస్సు చేయవలెననిరి.

అష్టావక్ర మహాముని జనక మహారాజునకు  గుఱ్ఱము నెక్కునప్పుడు ఒక కాలు రికాబులో పెట్టి మరొక కాలుతో దాని మీద కూర్చొనునంత స్వల్పకాలములో బ్రహ్మ జ్ఞానము పొందవచ్చునని నుడివి యుండెను. ఇప్పుడు ఐదు క్షణములలో పొందగల్గిన బ్రహ్మ సాక్షాత్కారమును విమర్శించి అనుభవముగా తెలుసుకొని, దైవములో విలీనమ య్యెదముగాక! ఏ వస్తువును పొందుటకైనను మూల్యము అనగా ఖరీదు ఇవ్వవలెనుగదా! బ్రహ్మసాక్షాత్కారమును ఐదు క్షణములలో బడయుటకు, సాధకులు మూల్యము నిచ్చుటకు సిద్ధముగా యుండవలెను. ఐదు క్షణములలో ఐదు గొప్ప త్యాగములను జేయుటకు సంసిద్ధులై యుండవలెను.

1. నిరంతరము మాట్లాడుచున్న నోటికి తాళము వెయ్యవలెను. అనగా మౌన ముద్రను వహించవలెను. నిశ్శబ్దో బ్రహ్మ! నిశ్శబ్ధమే బ్రహ్మము గాన, ప్రప్రధమముననే మౌనముద్రను బూనవలెను. ఈ మౌనములో యిరువది వంతుల ప్రపంచమును సాధకులు జయించెదరు.

2. ప్రపంచ వ్యామోహమునకు అంధులై యుండవలెను. అనగా నామరూప అకర్షణలకు నేత్రములు అంధత్వమును వహించవలెను. నేత్రములు బాహ్యప్రపంచ మునకు మూతబడి యుండవలెను. నేత్రములు మూయబడినప్పుడు యింక బాహ్యమున జూచుటకు మరెద్దియు నుండదు. అంతయు అంధకారముగా యుండును. దీనితో మరొక్క యిరువది వంతుల ప్రపంచమును జయించుట జరుగుచున్నది.

3. మూడవ మెట్టులో ప్రపంచమునకు చెమిటివారమై యుండుటకు ప్రయత్నించ వలెను. అనగా వినరాని శబ్ధము లేమియు వినిపించరాదు. ఇంతవరకు వాక్కు, దృష్టి, వినికిడి బంధింపబడెను. అరువది పాళ్లు మనస్సు జయించబడెను. ఇంకను నలుబది పాళ్ళు మనస్సు జయింపవలసియున్నది.

4. ఇప్పుడు దుష్ట ఆలోచనలను నిరోధింపవలెను. **"యోగః చిత్తవృత్తి నిరోధః"** అని యోగసారమంతయు క్లుప్తముగా జెప్పబడెను. చిత్తవృత్తులను జయించినవాడే లోకమునంతను జయించగల్గిన వీరుడు. ఇంకను పరిపూర్ణమైన విజయమునకు యిరువది పాళ్ళు మనస్సు, నూరు పాళ్ళలో మిగిలియున్నది. ఇంతవరకు ఒక క్షణములో వాక్కును, దృష్టిని, వినికిడిని, మనస్సును అనగా ఆలోచనలను జయించిన, యిరువది పాళ్ళు ప్రపంచమే యింక మిగిలియుండెను.

5. ఇచ్చట సోహం భావనయే విశ్వశ్వాసయే! ఆత్మజ్యోతియే మిగిలియుండును. సాధకులు తమ శ్వాసనే ఏకాగ్రతగా వెంబడించిన అఖండమైన శ్వాసయే అఖండమైన సోహంలో లీనము జేయును. అదియే "ఓం శక్తి" ప్రణవ స్వరూపము.

నేనీ వ్యాసము వ్రాయుచుండ, నా బల్లమీద చక్కనైన మూడు మర్కటముల విగ్రహము యున్నది. ఈ చిన్న కోతుల విగ్రహము నాకు బ్రహ్మాండమైన పాఠమును సదా నేర్పుచుండును.

1. ఒక కోతి తన చేతులతో నోరును మూసికొని, దైవవాక్కును తప్ప అన్యమును మాట్లాడననుచున్నది. తన నోరును దైవము గురించి మాట్లాడగలిగినప్పుడే తెరుచునట.

2. రెండవ కోతి తన నేత్రములను మూసికొని యున్నది. దానికి బాహ్య ప్రపంచ మంతయును మరుగైయున్నది. దైవమును జూడగలిగినప్పుడే అది నేత్రములను తెరచును.

3. ఇక మూడవ కోతిని గాంచుడు. అది తన రెండు చేతులతో రెండు చెవులను మూసుకొనియున్నది. అది చెడు శబ్దములకు, ప్రవృత్తి మాటలకు దూరమై యున్నది. దైవము గురించి వినగల్గినప్పుడే తన కర్ణములను వాడును.

**"అంతా రామ మయం బీ జగమంతా రామమయం"** గాన మాట్లాడవలసినచో దైవమును గురించియే మాట్లాడవలెను. చూడవలసిన దైవమును జూచుటకే నేత్రములను విప్పవలెను. వినవలసిన దైవ శబ్దములను వినుటకే చెవులను తెరవవలెను. తరించుటకు ఎన్నో సులభమైన, సూక్ష్మమైన మార్గములు గలవు. కాని స్వర్గమునకు పోవు దారి రాళ్ళు, రప్పలు, ముళ్ళతో, నిండియుండును. ఎంత పెద్ద వస్తువైన అద్దానిని పొందుటకు అంత గొప్ప మూల్యమును అర్పించుటకు సత్యాన్వేషణపరులు సిద్ధముగా యుండవలెను.

ఐదు లక్షణములలో ఐదు ఇంద్రియములు జయించి, బ్రహ్మ సాక్షాత్కారమును పొందుట ఎంత అదృష్టము! అంతయు పరిపూర్ణమైయుండ బ్రహ్మసాక్షాత్కారమును పొందుటకు ఐదు క్షణములు కావలెనా అని, బ్రహ్మవేత్తల మనస్సులో సంకల్పము రావచ్చును. ఆ పరిపూర్ణమునకు కలుపుటకు ఏమియు లేదు. తీసివేయుటకుగూడ ఏమియు లేదు. అంతయు బ్రహ్మమే! పరబ్రహ్మము తప్ప అన్యమైనది భూత

భవిష్యద్వర్తమాన కాలములలో యెప్పుడును లేదు. ఆ పరిపూర్ణమందు కాలమనెడిది మాత్రమున్నదా! అందుచేతనే దానిని కాలాతీతమని పెద్దలు నుడివియుండిరి.

ఆ పరమాత్మ స్వరూపము కాలమునకేగాక, ఆలోచనలకు, భావనలకుగూడ అతీతమైనది. అవాంగ్మానసగోచరము, వాక్కునకు, మనస్సునకు గూడ అందనిదని జెప్పబడెను. కాన బ్రహ్మసాక్షాత్కారమును బడయుటకు ఐదు క్షణముల గడువేల? ఒక్క క్షణము చాలదా! ఒక్క క్షణము గడువేల? వున్నదొక్కటే అదియే నీవు 'తత్త్వమసి'!

క్షణకాలములోనె మోక్షమని యోగవాసిష్టములో యీ క్రింది శ్లోకము చెప్పబడియున్నది.

శ్లో॥ యది సర్వం పరిత్యజ్య తిష్ఠస్యుత్క్రాన్త వాసనః।
అమునైవ నిమేషేణ తన్ముక్తోఽసిన సంశయః॥

తా॥ సమస్త సంకల్పములను పరిత్యజించి వాసనా రహితుడవై యున్నచో, ఈ నిమిషమందే నీవుముక్తుడవు కాగలవు. ఇందెలాంటి సంశయమున్నులేదు.

ఇప్పుడే, ఇచ్చటనే దానిని గుర్తించి నిశ్శబ్ధముగా యుండుడు. ఆ మహత్తరమైన సద్వస్తువును పరమాత్మ స్వరూపమును గుర్తించినవారు నిశ్శబ్దములో లీనమై యుందురు. Knowing that they melt in Silence, Recognise and be Silent. అద్దానిని గుర్తించి నిశ్శబ్దముగా యుండుము.

బ్రహ్మసాక్షాత్కారము ఇప్పుడే, ఇచ్చటనే ఈ ప్రత్యక్ష క్షణమునందే! ఐదు క్షణముల వ్యవధిగూడ అవసరము లేదు. ఈ ప్రత్యక్ష క్షణమునందు కాలాతీతులై ఆ సద్వస్తువును, జ్యోతి స్వరూపమును గుర్తించుచున్న మహానుభావులకు దన్యవాదములు.

లోకాస్సస్తా స్సుఖినో భవంతు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

(శాంతి మార్చి 1968)

# ఒకే కాలము - ఒకే పని

"ఒక కాలమునందు ఒకేపని" ఇది సహజమైన సూక్ష్మమైన ప్రకృతి ధర్మము. ఇది ప్రతివారికి తెలివిగల వారికి, తెలివి తక్కువ వారికికూడ వర్తించు ధర్మము. ఎవ్వరును రెండు కార్యములను ఒకే సమయమున సమర్ధవంతముగా చేయజాలరు. ఒక్క వరయందు రెండు కత్తులిముడునా? దక్షిణాదిని గల రామేశ్వరమునకు ఉత్తరాదినిగల హరిద్వార మునకు ఒక సమయమున ఎవరైన పోగలరా? మా బాల్యము నందు చదువుకొనెడి రోజులలో మేమిది నేర్చితిమి.

పని చేయునపుడు పనియే
ఆటలాడునపుడు ఆటయే

పైన చెప్పబడిన రెండు వాక్యములకు మరి రెండు ఉపయుక్తమగు వాక్యములను చేర్చవలెనని నా కనిపించుచున్నది.

ప్రార్ధన సల్పునపుడు ప్రార్ధనయే
ధ్యానము సల్పునపుడు ధ్యానమే

ఇది ఎంత చక్కని భావము? ఎంతటి వూరట చేకూర్చకలదు? మనస్సు ఒక సమయమున ఒక్కదానిని గూర్చియే ఆలోచింపగలదు. రెండు చెవులపిల్లుల వెనుక ఎవరూ పరుగెత్తజాలరు. కాని అజ్ఞానముచే మానవుడు రెంటి వెనుకే కాదు, అనేకమైన చెవులపిల్లులు వెనుక పర్వులెత్తుచుండెను. నిత్యము శాశ్వతము అయిన మూలసిద్ధాం తములను అర్ధము చేసికొనిన వారికి మాత్రమే శాంతి లభించగలదు.

మీరు దైవమును గూర్చి చింతించుచుండినచో, దెయ్యమును గూర్చిగాని మరెద్దా నిని గూర్చి కాని తలపోయజాలరు. మీరు దైవమును విస్మరించినపుడు మాత్రమే తక్షణము మరియొకటి మస్తిష్కమున ప్రవేశించును. చీకటిని వెలుతురును ఒకేచోట ఎవరును వుంచజాలరు. ఎచ్చట తేజస్సు కలదో అచ్చట అంధకార ముండదు. జ్యోతి లేని చోటనే అంధకారముండును.

"వాస్తవమునకు ఉన్నది ఒక్కటియే. దేశకాల పాత్రల కతీతమైనది. ఎవ్వరే నామములతో పిల్చినను సత్యమొక్కటియే."

రజ్జువును, సర్పమును ఒకే పర్యాయము కాంచుట అసంభవము. ఎంతకాలము రజ్జువును చూతుమో అంతకాలము సర్పభావన యుండదు కాని తాడును మరచి, సర్పభావన కలుగగనే భయభ్రాంతులము కాక తప్పదు.కాని ఎల్లప్పుడు అది త్రాడైయుండ ఏల యీ భయము? ఈ సర్ప భావన ఏల? విషాదమేల? మాయా స్వభావమేగద!

ప్రార్థింపుడు! ఎల్లప్పుడు దైవభావనతో యుండి, ప్రతివారిలో దైవమును గాంచుడు. మీ శాంతి, ముక్తి మీ మనస్సును ఆంతర్యజ్యోతియందు కేంద్రీకరించుటలోనే యున్నది. దైవమే మీ సర్వస్వమైనయెడల, దైవమునే నమ్మియున్నయెడల, తను మనుజగత్తులన్నియు ఆ దైవమే అయిన క్షణములో కోట్యంశమైనను మీరు దైవమును మరువజాలరు. **“ఒక కాలమునందొకేపని”** ఆ పని దైవీకృతమైన యెడల, మీ కష్ట నిష్ఠూరములయందు ఆదినుండి, అంతమువరకు ఆ దైవ భావన అయిన యెడల దుఃఖమెచ్చట? ఆ దైవత్వముతోడనే మనము పూర్ణులము లేనియెడల శూన్యము. లోపల వెలుపల, క్రింద, పైన, సర్వత్ర దైవభావన కల్గియున్న యెడల మన జీవితములు మానవాళికి ఆశీర్వాదమై వరలగలవు. ఆంతర్యజ్యోతిని విస్మరింతుమేని మన జీవితములు భూభారము కాగలవు.

“భగవత్ సాక్షాత్కారము ఇపుడే, ఇక్కడనే” ఇదియే నాటి, నేటి, ఎప్పటి జీవసూత్రము. “తరువాత” అనెడిది ఎన్నడును రాబోదు. అది జీవ సూత్రము కారాదు. మహాసముద్రమున పయనించు ఓడ తెరచాపకొయ్యపై కూర్చొనిన పక్షి, మరియొక తావుకై అన్వేషించి, అన్వేషించి మరెద్దియు కనలేక తిరిగి ఆ కొయ్యపైకే వచ్చిచేరును. అటులనే సామాన్య మానవ హృదయము ఆనందాన్వేషణలో ఎచ్చటెచ్చటకో ప్రాపంచిక నామరూపముల వెనుక తిరుగాడుచు, అచ్చట శాశ్వతానందమును గాంచజాలక తిరిగి, తిరిగి, విసిగి వేసారి కడకు తనలో వెల్గొందు దివ్యజ్యోతికడకే వచ్చి చేరును. ఇది నిరాశాపూరితులగు వారికి ఆశాజ్యోతి నొసంగు ప్రేమ సందేశము. మనోదాసులై దుఃఖభాజనులైన వారికి ఆశాకిరణము. మీ దుఃఖములకు, విచారములకు పరిష్కారములు సూచించు సత్యమొక్కటియే, “ఒక కాలమునందు ఒకే పని” అది నిరంతర దైవసంధాన మనస్కులగుటయే. మీరు ఏ నామమునైనను చేకొనుడు లేక పవిత్ర “ఓంకార” స్మరణతో శాంతి బడయుడు.

“ఒక సమయమందు ఒకే పని” అనెడి సూత్రము సులభము సూక్ష్మము అయియుండ, అనేక విషయముల వెనుక తిరుగాడుచు అశాంతిని పొందనేల? విషాదములను, కష్టములను దుఃఖములను పొందనేల? సర్వత్ర వ్యాపించి యున్న దివ్యజ్యోతిని గుర్తించి, సర్వశక్తియుతమగుదానితో తాదాత్మ్యము నొందుడు.

నిత్యసత్యమగు ఆ దివ్యజ్యోతిని నిశ్శబ్దముగా గ్రహించుడు. అదియే సార్థకజన్మ, జీవిత ధ్యేయము. దివ్య వారసత్వము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

(శాంతి మే 1975)

# ఓ యువకుడా ! ముదుసలివలె నడచుచుంటివి అదియేల?

ఉషఃకాలమునందు ఉదయభాస్కరుని ఎదురుగా తడబడు అడుగులతో నేను నడచున్నపుడు, నాలోనుండి ఒక స్వరము నా చెవిలో యీ క్రింది విధముగా చెప్పినట్లు తోచును.

" ఓ యువకుడా! ముదుసలివలె నడచుచుంటివి. అది యేల?" వెంటనే నేను దీర్ఘమైన శ్వాస తీసుకొని తల, మెడ, వెన్నెముక, భుజములు, సమముగా, నిటారుగా నుంచి నడువ మొదలిడుదును. ముదుసలి వెంటనే డెబ్బదియెనిమిది సంవత్సరముల యువకునిగా మారిపోవును. సూర్యులకు సూర్యుడే ఉదయభాస్కరుడు. ఉదయభాస్కరునికి శ్రద్ధాంజలి ఘటించుచు, సంతతముతో, అత్యానందముతో దివ్యావారసత్వమును జ్ఞప్తికి తెచ్చుకొనుచుందును.

జనకునియొక్క ఆస్తి కుమారునిదేకదా! అందువలన నా మొదటి యడుగు ఆ దైవ సాన్నిధ్యములో పడును. రెండవ యడుగు ఆ దైవశక్తి మత్వములో పడును. నా మూడవ యడుగు ఆ దైవ సర్వజ్ఞత్వములో పడును. అడుగులు వేయుకొలది దైవమునకు దగ్గరయగు చుందును. నిశ్చయముగా నా పాదములకన్నను, హస్తములకన్నను సన్నిహితముగనున్నది ఆ దైవమే నా శ్వాసకంటె సన్నిహితుడు, వాస్తవమునకు శ్వాసలకు శ్వాసయే ఆ దైవము, ఆ దైవము నేను ఒక్కటియే. అవిభాజ్యులము గతములో నట్లే యుంటిమి; భవిష్యత్తున నట్లే యుందుము; వర్తమానమున నట్లే యుందుము. అనాది నుండియు అట్లే యుంటిమి. అంతమనునది కలదేని అప్పటివరకు అట్లే యుండుట తథ్యము.

ఓ యువకుడా! నీ శరీర జననకాలము ననుసరించి నీ వయస్సును నిర్ణయించు కొనకుము. ఎన్ని క్షణములు దైవచింతన గావించితివో దానిని బట్టి నీ వయస్సును నిర్ణ యించుకొనుము. బహిఃరంతరముల దైవసాన్నిధ్యము ననుభవించిన క్షణములే జీవిత మున లెక్కించదగిన క్షణములు.

సందేహములతో భయములతోగూడిన పాతబ్రతుకునకు స్వస్తి చెప్పుచుంటిని. ఆశ్రమము పేరిట, గురుకుల బాలబాలికల పేరిట, వయోవృద్ధుల పేరిట, సుశీలా వైద్యశాలకు వచ్చు రోగుల పేరిట, మూగజంతువులపేరిట, సుందర సుగంధ తరులతా నికుంజములపేరిట, ఇన్ని దినములనుండి చేయుచున్న యాచనకు స్వస్తి చెప్పుచుంటిని.

వీటి యోగక్షేమముల నారయువాడా సృష్టికర్తయే, వాస్తవమునకు ఈ శాంతి ఆశ్రమముకూడా ఆ దైవసృష్టిలోని భాగమే కావున దీని భారముకూడా ఆ దైవమునదే మానవ, జంతు, వృక్ష, ఖనిజ ప్రపంచములందు ప్రతివారియొక్క యోగక్షేమముల గాంచునది ఆ సృష్టికర్తగాక మరి యెవ్వరు?

సుస్థిరమగు హిమాలయముగ నున్నది ఆ దైవమే. పవిత్రమగు గంగామాతవలె నున్నదియు ఆ దైవమే సర్వస్వము ఆ దైవమే వ్యక్తావ్యక్త జీవప్రపంచ మంతయు ఆ దైవమే. స్థావర జంగమ వస్తుసృష్టి యంతయు ఆ దైవమే నిండి నిబిడీకృతమై యుండెను. ఆ దైవము నందే పని చేయుచుంటిమి. కదలుచుంటిమి, ఆలోచనలు చేయుచుంటిమి, అన్ని ఆలోచనలకు మూలమాదైవమే. ఆ దైవమే మన ఉచ్వాస నిశ్వాసలు, మన జాగ్రత సుషుప్తిస్వప్నావస్తలన్నియు ఆ దైవమునందే, వేయిమాటలేల. ఆ దైవమే మనకు నిత్యసాన్నిధ్యము, అంతర్జ్యోతి.

"ప్రేమ" అను పేరిటగల ఈ చిన్న పద్యము నాకెంతయో ఉత్తేజము కలిగించు చుండును.

ఆవని పసుపక్షి గణముల సమతప్రేమింపగలవాడె
స్థిరుడై ప్రేమ పీఠాన లెస్స పూజింప గలవాడు
అధికమల్పమంచు భేదమించుక  లేక చూడగల్గినవాడె
స్థిరుడై ప్రేమపీఠాన లెస్స పూజింపగలవాడు.

ఈపై పద్యమునందు మానవ పశుపక్షి గణములతోబాటు తరులతానికుంజ ములను, మృదుల, మంజుల, మకరంద శోభాన్వితమగు పూసంతతినిగూడ జేర్చియుం డిన ఎంత మధురముగ నుండెడిది? అనంత ప్రేమకడలిలోని తరంగమునై, ముగ్ధసౌం దర్యపు రాసిలోని మధువునై, విస్రుత వినీల ఆకసంబున స్వేచ్ఛయై తిరిగాడు విహంగమునై, అనంత నక్షత్ర గ్రహతారకల యందలి మెఱుపునై ఈ విశ్వమందెల్ల "నేనై" మెలగుటకు హృదయము తహతహ పడుచున్నది.

చదువరులారా! నాలో కదలియాడు రెండు భావములు మీకు తెల్పెదను. ఒకటి "చేయగలిగిన మంచి ఇప్పుడే చేయవలెను" రెండు "నేడు అనెడు మరియొక పద్యము ఈ రెంటినీ నా పునర్జన్మ సందర్భమున మనసు నందుంచుకొనవలెను. ఆ విధముగానే శాంతి ప్రార్ధన" కూడ మీరు స్మరించుండవలెను.

ఇప్పుడే చేయము

ఈ లోకములో నేను నివసించునది ఒక్కమారే ఏదైన చేయవలసిన మంచియున్న యెడల నేడే చేతును. సాటి మానవుల ఎడల చూపించవలసిన కరుణ ఏదైన వున్న ఎడల నేడే చూపింతును అది రేపటికని చెప్పను. బద్ధకించను. నేను ఈ త్రోవను వెళ్ళుట ఒక్కసారియేకదా!"

నేడు

భావింపుమోయి! ప్రతి ఉషఃకాలమందు,
నీదుజీవితనవ్య భాగ్యోదయమ్ముగ,
పూడ్చుమోయి! గతమును గాఢముగను,
దీర్ఘ నిద్రనందునటుల విశ్రాంతితోడ,
గ్రహియించుమోయి! 'నేటి' ప్రాశస్త్యమును,
మలుచుకొమ్ము అద్దాని నీయిచ్చాను సరణి;
తెలుసుకొనుమోయి! అనాదినుండి 'నేడే'
నీదు చిత్తమున రూపుదాల్చి స్నేహమ్ముతోడ నిల్చె;
కూడుమోయి! 'నేడె' 'నీవ' సుమ్ము
అనంతకాల ప్రవాహ ఉత్కృష్ట పిత్రార్జితమ్ము
సాధించుమోయి! సాధించు ధీరహృదయంబుతోడ,
దైవమే ఈ రెంటిని జోడింపగా సాగిపొమ్ము.

ఓం ఓం ఓం

శాంతి ప్రార్థన విశ్వశాంతికి, సర్వోపగతమగు ఆత్మదర్శనమునకు తోడ్పడును.

(శాంతి మే & జూన్ 1972)

## ఓంకారుని మనోవేదన

(ఆశ్రమ క్లిష్ట పరిస్థితి)

ఓమ్‌కారము విభజించుటకు వీలులేనిది, అద్వితీయమైనది, ఆ ప్రణవ స్వరూపము, ఓమ్‌కారునిలో నుండి, అందరను ప్రేమించుచు, అందరి మనోవేదన, తన ఆవేదనగా భావించుచుండును.

**గురుకులము – వృద్ధులు :**

గురుకులమునందు సుమారు 120 మంది బాలబాలికలైన బీద విద్యార్థులున్ను, వయోవృద్ధులు, పనిచేయలేని శక్తిహీనులు జీవనోపాధి లేక పసిబిడ్డలతో ఆశ్రయించిన వారు, ఈవిధముగా నిత్యము భోజనము చేయువారు, ప్రస్తుతం 200 మందికిపై దాటి యుండిరి. ప్రతి నిత్యము కొలదిమందైన, సందర్శకులకు ఆతిధ్యము యియ్యవలెనుగదా! ఇక ఆశ్రమ కార్యకర్తలు, వంటశాల పనివారలు వగైరాలందరి భోజనముల నిమిత్తం రోజునకు ఒక బస్తా బియ్యం ఖర్చు అగుచున్నది. ఈ రోజులలో ఒక బస్తాబియ్యం ఖరీదు 125రు॥లు దాటియున్నదని ప్రతివారికి తెలిసియున్నదేగదా!

ఈవిధముగా ప్రతిదిన ఆహారమున్న్-రేపటిదినం ఎట్లు బియ్యం సమకూర్చ గలమో గదా అను మనోవేదనతోనే, కార్యదర్శిని యగు కుమారి జ్ఞానేశ్వరి, కోశాధిపతి, కేదారిశెట్టి సుబ్బారాయుడుగారు బాధపడుచుందురు, ధనాగారమందు ఋణమేగాని, ధనమేమియులేదు. ఏరోజునకారోజు దైవమే భక్తులద్వారా ఆహారము సమకూర్చు చుండెను. అయినను పైన చెప్పిన ఆశ్రమవాసులు నిత్యభోజనమునకు అవస్థలుపడుచుండ నేనెట్లు (నాకు సంబంధించినట్లు) విలక్షణముగా నుండగలను?

రెండు సంవత్సరముల నుండి వర్షములు లేనందున కరువు పరిస్థితులు మరింత క్లిష్టమైనవి. ఆశ్రమపోషణ నిమిత్తము ధనికులకు యాచనపూర్వకమైన జాబులు వ్రాయుటలో కాలమును వ్యర్థము చేయుట జరుగుచున్నది. అయినను స్వార్థపరమైన, యాచన కాకపోవుటచే మరల, మరల, ఒక్కొక్కసారి తోడ్పడినవారినే యాచింపక తప్పుటలేదు.

**ఆశ్రమ పరిసరములు - భాగ్యవంతులైన భక్తులు :**

నాకుగల మనోవేదనను, ఆశ్రమ పరిసరములందుగల ధనికులైన భక్తులు గ్రహించి, ప్రస్తుత అవాంతర క్లిష్టపరిస్థితులలోనైనను సహాయపడ తలచరే అని భావించుట నా దుర్బలత్వమై యుండవచ్చును. కాని ఆశ్రమవాసులు పడుచున్న అవస్థలు, ఆహారము నకై పడుచున్న ఇక్కట్లు వారి హృదయము నెంతమాత్రము కదల్చుటలేదనియు, అట్టి కనికరము వారికి లేనట్లును కనుపించుచుండును, వారే తలచినచో, ఈ బీదల దుఃఖితుల కొరకు, రోగులువగైరాల కొరకు ఈ పరిసరప్రాంత భాగ్యవంతులలో ఒక్కొక్కరే ఆశ్రమ భారమును భరించగల సమర్థులైయున్నారు. కానివారు, తమకొరకై తాముజీవించుచు, ఎన్నియో వేల రూపాయలను, ఎన్నికలయందు, వివాహాది వినోదముల యందును, యాత్రలయందును, వ్యయముచేయుటలో ఆనందించుచున్నారుగాని, వారి పరిసర ప్రాంతములలోను, వారి ద్వారముల చెంతనుండు, దుఃఖితులగు బీదబాలబాలికల దీన స్థితిని గూర్చి తలంచక అనిత్యమైన పేరు ప్రతిష్ఠలవెంట పరుగులెత్తుచుండుట ఎంత విచారము! యాచించువారిని కలిగినవారు, తప్పించుకు తిరుగుచుండుట విచారము.

ఈ ఆశ్రమము భక్తులందరకు చెందిన సామాన్య సొత్తు అయియున్నది. అందచేత ప్రతివారి సానుభూతి, ప్రేమ ఎంతైన అవసరమైయున్నది. దైవము ప్రేమస్వరూపుడు. ప్రేమయే దైవస్వరూపము.

**ఇతరులను బాధించుటకంటే దేహత్యాగమే మేలు :**

ఒక్కొక్కప్పుడు పైని చెప్పిన మనోవేదన అతిగాఢమై మనస్సునకు చింతను కలిగిం చుచుండును. ఆ సమయమందు, భాగ్యవంతులను, భక్తులను, యాచించి వారిని బాధిం చుటకంటె దేహత్యాగమే మేలని నాకు తోచుచుండును. అయితే దేహమున్నపుడే, ఈ

శరీరముతో ఆశ్రయించియున్న అనాధబిడ్డలకు ఆశ్రమవాసులకు వారి అవస్థలలో తోడ్పడజాలకుండ, దేహత్యాగము చేసినయెడల వారికి నేనే విధముగ తోడ్పడగలననెడి భావముతో ఈ విజ్ఞప్తిని, హృదయాంతరాళము నుండి వచ్చు ఆవేదనతో ఈ అర్ధరాత్రి సమయమున వ్రాయుచుంటిని, దైవము కరుణామయుడు, దైవమే ధనిక భక్తుల హృదయ ములలో ప్రవేశించి ఈ ఆర్తనాదమును విని ఆశ్రమ బాలబాలికలకు, వృద్ధులకు తోడ్పడు గాక!

**ఆశారేఖ (ఉదారహృదయులు) :**

ప్రతి మేఘమునకు అంచున ఒక కాంతిరేఖ అనగా మెఱుపు వుండుననెదరు. ఆ విధముగానే ఆశ్రమ శ్రేయోభిలాషులలో పూజ్యులగు స్వాములు, మాతాజీలు కొందరు కలరు. ఓంకార్ ఆవేదన తెలిసికొని, ఆశ్రమవాసుల పోషణ నిమిత్తం వారంతటవారే, అప్పుడప్పుడు, సహాయము చేయుచుందురు. అట్టి ఉదార హృదయులగు ఆశ్రమ శ్రేయోభిలాషులు, మిత్రులు, భక్తులు, బొబ్బిలి, తుని, పిఠాపురం, కాకినాడ, రాజమహేం ద్రవరము, లక్కవరం, చెన్నపట్టణం, బెంగుళూరు, హైదరాబాదు, బొంబాయి మొదలగు తావులందేగాక, దక్షిణాఫ్రికాలోని డర్బన్ పట్టణముల నుండియు చైనా దేశములోని హాంగ్‌కాంగ్ మొదలగు పట్టణముల నుండియి ఇంగ్లండు, అమెరికా మొదలగు విదేశములందుగల వారికిని నా హృదయపూర్వక కృతజ్ఞతను తెలియజేయుచున్నాను.

**శల్యదానము :**

ఒక బాలికకు శల్యచికిత్సలో తోడ్పడుటకు నా కాలి ఎముక ఒకటి ఆ బిడ్డ ఆరోగ్యమునకై ఇచ్చినపుడు, ఈ జీవితము ఆ ఒక్క ప్రాణికైనను ఉపయోగకరమై, భూమాతకు, నేను అనవసరమైన భారముగా వుండలేదన్న సంగతి నాకు ఈ అవస్థలలో తృప్తిని కలిగించుచుండెను. అట్లే ఈ ఆవేదనా పూర్వకమైన యీ కడసారి విజ్ఞప్తి మరల సహాయముచేయుచున్న, మిత్రులకు, భక్తులకు, శ్రేయోభిలాషులకు, యధావిధిగా పూర్వము వలెనే, తమ ఆశీర్వాద సహాయసంపత్తులను, యధాశక్తి ననుసరించి, గురుకుల బిడ్డలకు తోడ్పడమని ఈ విజ్ఞప్తి చేయుచున్నాను.

**విజ్ఞులకు హెచ్చు మాటలు వ్రాయనవసరము లేదు :**

రానున్న జన్మదినము 21-1-74 తేదీని ఈ శరీరమునకు 80 వ సంవత్సరం ప్రారంభమగును. ఆ దినమునుండి ప్రాపంచిక కార్యకలాపములకు, స్వస్తి చెప్పి మౌనం ద్వారా యింకను హెచ్చుగా మిమ్ములనందరను సేవించగలనని ఆశించుచున్నాను.

ప్రత్యణువునందును నిండియున్న ఆ ప్రణవజ్యోతి ప్రకాశము ఆశ్రమ సందర్శకులను, భక్తవరేణ్యులను తృప్తిపరచుగాక.

**ధ్యానము**

ఇప్పుడు–ఓమ్‌కారుని ఆవేదనను మరచి, హృదయాంతరవర్తియగు, పరంజ్యోతిని, ధ్యానింతముగాక!

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
అసత్తునుండి సత్తునకు చేర్చుగాక
తమస్సునుండి ప్రకాశమునకు చేర్చుగాక
మృత్యువునుండి అమృత పదవికి చేర్చుగాక.)

ఓం! తత్సత్! ఓం!

(శాంతి నవంబర్ & డిశంబర్ 1973)

# ఆకాశయానము

ఆకాశయానము. ఇది ఊహాగానముగా కొందరు భావింతురు. నిరంతర పరిణా మాన్వితమగు ఈ జగత్తునందు ఊహాగానముకాని దేమికలదు? వాస్తవమునకు ఈజగత్తంతయు ఊహాజనితము. అఖండ సచ్చిదానంద సాగరమునందలి ఒక బుద్బుదము వంటిది.

నా ఊహలు వాస్తవమైనను పిచ్చిగా కానవచ్చినను అవి నాకు ఆనందమును ఉత్తేజమును కలిగించును. వేకువజామున ఎట్టిపనులు చేయక మనస్సు చాల ప్రశాంతముగ నుండి "ఓం శ్రీరామ జైరామ జైజైరామ ఓం" అనెడి నామ కుసుమములతో మాలలు తయారు చేయుచుందును. ఆ మాలలను గతించిన మహాత్ములకును, సజీవులైయున్న సాధుసన్యాసులకును అర్పించుచుందును.

నేను నా కన్నులను మూసికొని క్షణములో ఆనందాశ్రమమును దర్శించి ఒక మాలను పూజ్య పప్పాజీ (రామదాస్‌జీ) కంఠసీమ నలంకరింతును. మరియొక్కమాలచే మాతాజీ, స్వామి సచ్చిదానందజీ కంఠసీమలుకూడ అలంకరింతును. మరియొక క్షణములో పవిత్ర ధవళ హిమసీమలో గురుమహారాజ్ శివానందజీకి అర్పింతును. స్వామి చిదానందజీకి, కృష్ణానందజీకికూడ చెరియొకటి అర్పించుచుందును. ఇంకను ఎన్నియో మాలలు అచ్చటి మహాత్ములకును అచ్చట గంగాతీరమున ధ్యానముచేయు వారికిని అర్పించుచుందును. మహోన్నత ధవళ హిమ శృంగములకు, మహోత్తుంగ తరంగ సమన్వితయగు గంగామాతకు కూడ ఆ పూజా మాలలచే అలంరింప జేయు

చుందును. నా దృష్టిలో చరాచరములని గాని, చేతనా చేతనములని గాని, సజీవ నిర్జీవములనిగాని భేదభావ మెన్నడు నుండదు. ఇవన్నియు అవిచ్ఛిన్నమగు ఏకైక రూపుని భిన్నభిన్న రూప విశేషములేకదా!

మహోన్నతమగు హిమశృంగమునుండి శాంతినిలయమగు శాంతి ఆశ్రమమునకు వత్తును. అచ్చట నిరంతరము ఇతరుల యోగక్షేమములకై కృషి సల్పుచుండెడి శ్రీరామా రావుగారికిని, కుమారి జ్ఞానేశ్వరికిని చెరియొక మాలను అర్పించుచుందును. దివా రాత్రములు ఆశ్రమాభివృద్ధియందును ఆశ్రమ భక్తుల సేవయందును, వారు కాలము సద్వినియోగము చేయుచుందురు.

తిరిగి నేను దూరతీరములకు చనిచని దక్షిణాఫ్రికా యందలి దర్బన్‌చేరి ఒక మాలచే పూజ్యస్వామి సహజానందజీకిని, సోదరులు శ్రీ కేపిటన్, తదితర భక్తులకు కూడ మాలలు అర్పించుచుందును. వారెంతయో భక్తులేగాక, తోటపల్లి శాంతి ఆశ్రమ మున కెంతయో సహాయము గావించుచుండిరి. అచ్చటనుండి యు.ఎస్.ఏ కు చని సోదరులు బ్రహ్మానందజీకి, మాతా సరస్వతీదేవికికూడా మాలలు అర్పించుచుందును. అచ్చట డా॥ జైకేల్‌కును, మిష్టర్ హైడ్‌కును కూడ ప్రేమపూర్వకముగా మాలలు అర్పించుచుందును. ఎవరు ఏయే గుణగణములు కలిగియున్నను ఒకే తేజోరూపుని బింబాంశములే. ఒకే విశ్వ స్పందనమునందలి తరంగములే. అనుక్షణము ఒకే సర్వజ్ఞత్వము, సర్వశక్తివంతము, సర్వాంతరత్వము.

చంచల స్వభావులగు ఈ మానవులకు అర్పించుటలో విసిగి వేసారినపుడు గగనసీమలలోని కెగసి నక్షత్ర గ్రహతారకలకు మాలలు సమర్పించుచుందును. అతి బాల్యమునుండియు చంద్రమండలమునకేగి పరమ పవిత్రము, పరమాత్మ సంభూతము నగు "ఓం" కారమును గాంచుట నా అభ్యాసము.

ఊహాగానము సృజనాత్మకము, విధ్వంసకారియుగూడ కావచ్చును. నేను అచ్చటనుండి తేజోమండల రాసీభూతమగు సూర్యుని చేరనెంతును. ఆశ్చర్యము! అద్భుతము! ఆ జ్యోతి స్వరూపుని నా నామ కుసుమాలంకృతుని చేయబోవ, కోటిసూర్యప్రభా భాసమానమగు ఆ దివ్యజ్యోతియందు నా నామ కుసుమమాల లన్నింటితో సహా అందు లయించితిని. మహిమ! మహిమ! భగవన్మహిమ!

నమ్మవలదు మనుజు నెన్నడు
నమ్మ దాన కలుగు నిరాశ ఎపుడు
నమ్ము మెపుడు శ్రీమన్నారాయణుని
నమ్మ నిరాశకల్గ దెన్నడు నిజము.

దుఃఖపు జలధిలో గ్రూలనెంతువేని
చనుము! అల్పమానవుని వెన్నంటి
ఆనందరాశిలో ఓలలాడ నెంచి తేని
చనుము! పరమాత్మ చరణముల్ హృదినమ్మి.